సోమవారం
03•6•2019
కరీంనగర్
• వెల. రూ. 6.50
• సంపుటి 8 • సంచిక 339
• పేజీలు : 16 + 16

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD







తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గన్‌పార్క్‌లోని అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు



రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా తెలంగాణభవన్‌లో తెలంగాణతల్లి విగ్రహానికి పూలమాల వేస్తున్న టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు



తెలంగాణభవన్‌లో జాతీయజెండాను ఎగురవేసిన అనంతరం వందనం చేస్తున్న టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో ఎమ్మెల్సీ ఎం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు కూడా ఉన్నారు.

# ఘనంగా రాష్ట్ర అవతరణ దినోత్సవం

## తెలంగాణభవన్‌లో మువ్వన్నెల జెండాను ఆవిష్కరించిన కేటీఆర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం తెలంగాణభవన్‌లో టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు జాతీయజెండాను ఎగురవేశారు. అంతకుముందు తెలంగాణతల్లి విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు బాల్క సుమన్, దానం నాగేందర్, ఎమ్మెల్సీలు మాదిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కర్నె ప్రభాకర్, కే నారాయణరెడ్డి, టీఎస్‌టీఎస్సీ చైర్మన్ రాకేశ్, మాజీ ఎమ్మెల్యే సుధాకర్‌రావు, టీఆర్‌ఎస్కేవీ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## బంగారు తెలంగాణకు పునాది ఈరోజు




### ట్విట్టర్‌లో కేటీఆర్

60 ఏండ్ల తెలంగాణ ప్రజల చిరకాలవాంఛ నెరవేరినరోజు, స్వపరిపాలనలో బంగారు తెలంగాణ పునాది పడినరోజు జూన్ 2 అని టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు ట్విట్టర్ ద్వారా స్పందించారు. రాష్ట్ర ప్రజలందరికీ అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

# వెల్లివిరిసిన స్నేహవారధి

## ప్రముఖుల శుభాకాంక్షల వెల్లువ

ప్రజలు ఆనందంగా ఉండాలని కోరుకొన్న రాష్ట్రపతి కోవింద్

అన్నిరంగాల్లో తెలంగాణ వృద్ధిచెందాలి: వెంకయ్యనాయుడు

తెలంగాణ అద్భుత రాష్ట్రం: నరేంద్రమోదీ

ట్విట్టర్ ద్వారా శుభాకాంక్షలు తెలిపిన కల్వకుంట్ల కవిత, చంద్రబాబు









**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ప్రధాని నరేంద్రమోదీతోపాటు పలువురు ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ట్విట్టర్ ద్వారా రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ప్రజలు ఆనందమయంగా ఉండాలని కోరుకొంటున్నట్టు తెలిపారు. రాష్ట్రం అన్నిరంగాల్లో సర్వతోముఖాభివృద్ధి చెంది ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా ముందుకు సాగాలని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ట్విట్టర్ ద్వారా ఆకాంక్షించారు. ప్రధాని నరేంద్రమోదీ కూడా తెలంగాణ ప్రజలకు అవతరణ దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం అద్భుతమైన రాష్ట్రమని కొనియాడారు. రాష్ట్రం మరెంతో అభివృద్ధి చెందాలని ప్రార్థిస్తున్నానన్నారు. రాష్ట్ర ప్రజలు ఎంతో కష్టపడుతారని, దేశాభివృద్ధిలో భాగస్వాములు అవుతున్నారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ రాష్ట్ర ప్రజలకు ట్విట్టర్ ద్వారా అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ఆవిర్భావం సందర్భంగా నిజామాబాద్ మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత ట్విట్టర్ ద్వారా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఏపీ మాజీ సీఎం చంద్రబాబు ప్రజలకు రాష్ట్ర ఆవిర్భావ శుభాకాంక్షలు తెలిపారు.

## ఇరు రాష్ట్రాల మధ్య దోస్తీకి బీజం

నాడు కంచె వేయించిన చంద్రబాబు.. నేడు తొలిగించిన వైఎస్ జగన్

తెలంగాణతో ఇచ్చిపుచ్చుకొనే ధోరణిలో ఏపీ కొత్త సీఎం

**నమస్తే తెలంగాణ, హైదరాబాద్:**

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ చరిత్రలో కీలకమైన ముందడుగు పడింది. 'అన్నదమ్ములుగా విడిపోదాం.. ఆత్మీయులుగా కలిసుందాం' అన్న నినాదం నిజమయ్యే క్షణం వచ్చింది. గడిచిన అయిదేండ్లుగా రెండు రాష్ట్రాల మధ్య అపరిష్కృతంగా ఉన్న విభజన సమస్యల పరిష్కారానికి నాంది పడింది. నిన్నటివరకు ఏపీ సీఎంగా ఉన్న చంద్రబాబు విభజన సమస్యలు పరిష్కారానికి నోచుకోకుండా మడతపేచీలు పెట్టగా, కొత్తగా సీఎం బాధ్యతలు చేపట్టిన వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిపుచ్చుకొనే ధోరణితో వ్యవహరించడం శుభపరిణామం. ఇందులో భాగంగా ఐదేండ్ల కిందట ఏపీ ప్రభుత్వ నిర్వహణ కోసం రాజధానిలో కేటాయించిన భవనాలను తిరిగి తెలంగాణకు అప్పగించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతున్నది. విభజన జరిగినా హైదరాబాద్‌లో నిరుపయోగంగా ఉన్న భవనాలను తెలంగాణ ప్రభుత్వానికి ఇచ్చేందుకు నాటి చంద్రబాబునాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం మీనమేషాలు లెక్కపెట్టింది. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ సహా అనేకమంది చెప్పినా.. హైదరాబాద్‌లోని భవనాలను తెలంగాణకు అప్పగించడంపై మడతపేచీలు పెట్టింది. నాడు చంద్రబాబు సంకుచిత మనస్తత్వంతో వ్యవహరించాడు. తెలంగాణ ఏర్పడ్డ మరుక్షణం నుంచి తెలంగాణ పరిపాలన సవ్యంగా సాగకుండా అనేక ఇబ్బందులకు గురిచేసే ప్రయత్నం చేశాడు. ఏకంగా తెలంగాణ సచివాలయంలో కంచె పాతించాడు. అంతేకాదు.. తాను వాడకపోయినా భవనాలను తన ఆధీనంలోనే పెట్టుకున్నాడు. చివరకు తెలంగాణలో ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన భవనాలు శిథిలావస్థకు చేరుకొనే పరిస్థితికి వచ్చాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మొత్తంగా అమరావతికి తరలిపోవడంతో కనీసం అయిదేండ్లలో ఏనాడూ తలుపులు తెరువని భవనాలు కోకొల్లలు ఉన్నాయి. చివరకు శాసనసభ, శాసనమండలి భవనాలు కూడా అలాగే తెరుచుకోకుండా మూతపడ్డాయి. మరోపక్క తెలంగాణ ప్రభుత్వానికి కేటాయించిన భవనాలు సరిపోని పరిస్థితి. ఇల్లు ఇరకటం.. హాలు మరకటంలా తెలంగాణ పరిస్థితి నెలకొన్నది. చంద్రబాబునాయుడు నేతృత్వంలోని నాటి ప్రభుత్వం కేవలం ఉద్దేశపూర్వకంగానే 2014-రాష్ట్ర విభజన చట్టాన్ని సంపూర్ణంగా అమలుచేయలేదు.



గవర్నర్ నరసింహన్ అనేకసార్లు చంద్రబాబుతో చర్చించేందుకు ప్రయత్నించారు. ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులను రెండుమూడుసార్లు సమావేశపరిచారు కూడా. సమస్యలను సామరస్యపూర్వక ధోరణిలో పరిష్కరించుకొనేందుకు సిద్ధంగా ఉన్నట్టు తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక సందర్భాల్లో ప్రకటించారు. ఈ విషయాన్ని గవర్నర్, చంద్రబాబుతో కూడా చెప్పారు. కానీ, చంద్రబాబు కాలికివేస్తే మెడకు.. మెడకు వేస్తే కాలికి వేసే చందంగా వ్యవహరించాడు. 9, 10వ షెడ్యూల్ ఆస్తుల పంపిణీని గుదిబండగా మార్చాడు. ఉద్యోగుల పంపిణీని కొలిక్కి రాకుండా చేశాడు. తెలంగాణలో పాలన పడకేయాలని కుట్రపన్నాడు. విభజన కాకుండా ఉన్న లక్షా 97 వేలకోట్ల విలువైన ఆస్తులపై కూడా పేచీపెట్టి ఇబ్బందికలిగించేలా ప్రయత్నించాడు. ఇక ఢిల్లీ సహా ఇతర రాష్ట్రాల్లోని తెలంగాణ ఆస్తులను విభజన కాకుండా అడ్డుకొనే పన్నాగాలు పన్నాడు. ఒకరకంగా చెప్పాలంటే తెలంగాణ పాలన జరుగకుండా ఉండేందుకు కాళ్లలో కట్టె పెట్టేందుకు ప్రయత్నించాడు. కానీ, ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా జగన్మోహన్‌రెడ్డి నేతృత్వంలో ఏర్పడ్డ ప్రభుత్వం రాజనీతిజ్ఞతను ప్రదర్శించింది. పక్కరాష్ట్రాలతో సత్సంబంధాలు నెలకొల్పడంతోపాటు ఇచ్చిపుచ్చుకునే ధోరణితో ఉండాలన్న విజ్ఞతను చాటింది.

### ఇరు రాష్ట్రాల సత్సంబంధాలకు తొలి అడుగు

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తెలంగాణలో ఉన్న ఆంధ్రప్రదేశ్ భవనాల అప్పగింతపై గవర్నర్ నరసింహన్ జారీచేసిన ప్రొసీడింగ్ అత్యంత కీలకమైనది. రెండు రాష్ట్రాల మధ్య సత్సంబంధాల దిశగా పడ్డ తొలిఅడుగు ఇది. భవనాల అప్పగింతపై జగన్మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ఏపీ సర్కారు పెద్ద మనసుతో స్పందించగా.. తెలంగాణ ప్రభుత్వం కూడా అంతేభారీగా స్పందించి ఇక్కడ ఆయా భవనాలపై ఉన్న పన్నులన్నింటినీ మాఫీచేయాలని నిర్ణయించింది. ఇద్దరు ముఖ్యమంత్రులు విశాల హృదయంతో తీసుకున్న నిర్ణయమిది. ఈ చర్యతో రెండు రాష్ట్రాల మధ్య స్నేహబంధం విస్తరించినట్టయింది. ఇటీవల ఏపీ ముఖ్యమంత్రిగా జగన్మోహన్‌రెడ్డి ప్రమాణస్వీకార కార్యక్రమానికి అతిథిగా హాజరైన తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్.. రెండు రాష్ట్రాల మధ్య ఉన్న విభేదాలను పరిష్కరించుకుందామని, సమస్యలన్నింటినీ ఒక్కొక్కటిగా కొలిక్కి తెచ్చుకుందామని ప్రతిపాదించిన విషయం తెలిసిందే. శనివారం హైదరాబాద్‌లో గవర్నర్ ఇచ్చిన ఇఫ్తార్ విందుకు వచ్చిన ఏపీ సీఎం జగన్మోహన్‌రెడ్డి సుమారు గంటన్నరపాటు గవర్నర్ నరసింహన్, తెలంగాణ సీఎం కేసీఆర్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కూడా విభజన అంశాలపై చర్చ జరిగినట్టు తెలిసింది. దీనికి కొనసాగింపుగా తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గం.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముందు తమ ప్రతిపాదనలు ఉంచింది. వీటికి అనుగుణంగా గవర్నర్ నరసింహన్ ఆదివారమే భవనాలను తెలంగాణకు కేటాయిస్తూ ప్రొసీడింగ్ కూడా ఇచ్చారు. గవర్నర్ ఇచ్చిన ఉత్తర్వులపై తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ హర్షం వ్యక్తంచేశారు. జగన్మోహన్‌రెడ్డి నిర్ణయాలను స్వాగతించారు. ఇరు రాష్ట్రాలు భవిష్యత్తులో కూడా ఇదేవిధంగా ముందుకు వెళ్తే దేశంలోనే అన్నిరంగాల్లో ఉత్తమమైన రాష్ట్రాలుగా గుర్తింపు పొందడం ఖాయమని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు.

### ముహూర్తం

సూర్యోదయం: 5.45 గంటలకు

సూర్యాస్తమయం: 6.44 గంటలకు

వికారినామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, కృష్ణపక్షం అమావాస్య మధ్యాహ్నం 3.33 వరకు, తదుపరి గ్రీష్మ రుతువు, జ్యేష్ఠ మాసం, శుక్లపక్షం, పాడ్యమి, నక్షత్రం: రోహిణి, అమృతఘడియలు: ఉదయం 10.25 నుంచి మధ్యాహ్నం 12.01 వరకు, రాహుకాలం: ఉదయం 7.22 నుంచి 9.00 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 11.48 నుంచి 12.40 వరకు, తిరిగి మధ్యాహ్నం 3.16 నుంచి సాయంత్రం 4.08 వరకు, వర్జ్యం: సాయంత్రం 4.17 నుంచి 5.53 వరకు.

హైకోర్టు



హైకోర్టు ఆవరణలో జాతీయజెండాను ఎగురవేసి వందనం చేస్తున్న తాత్కాలిక ప్రధానన్యాయమూర్తి జస్టిస్ ఆర్‌ఎస్ చౌహాన్

అసెంబ్లీ



అసెంబ్లీ ఆవరణలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వందనం చేస్తున్న అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

మండలి



శాసనమండలి ఆవరణలో మువ్వన్నెల జెండాను ఆవిష్కరించి వందనం చేస్తున్న మండలి డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్

## కిషన్‌రెడ్డి వ్యాఖ్యలను ఖండిస్తున్నా

ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి వేణుగోపాలాచారి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హైదరాబాద్ ఉగ్రస్థావరాలకు అడ్డాగా మారిందని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి కిషన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నట్టు ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి వేణుగోపాలాచారి చెప్పారు. టీఆర్‌ఎస్ పాలనలో మత సామరస్యానికి ఒక్క విఘాతమైనా కలిగిందా అని ప్రశ్నించారు. ఆదివారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో జరిగిన రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు వేణుగోపాలచారి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ రాష్ట్రం దేశంలో అగ్రగామిగా నిలిచిందని చెప్పారు. అన్నివర్గాలు ప్రశంసించేలా పాలన కొనసాగుతుందన్నారు.

## కొలువుదీరిన గ్రామీణ ఆవిష్కరణలు

- ఇన్నోవేషన్ స్టేట్‌గా తెలంగాణ
- టీ ఉత్సవం ప్రారంభోత్సవంలో ఐటీశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్



ఆదివారం హైదరాబాద్ పీపుల్స్‌ప్లాజాలో టీఎస్‌ఐసీ ఆధ్వర్యంలో గ్రామీణ ఆవిష్కరణల ప్రదర్శనను ప్రారంభించిన అనంతరం పరిశీలిస్తున్న ఐటీశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ ఇన్నోవేషన్ రాష్ట్రంగా ఎదుగుతున్నదని ఐటీశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్ అభినందించారు. టీహబ్ ద్వారా అంతర్జాతీయస్థాయిలో ఆదరణ పొందే ఆవిష్కరణలు వస్తుండగా.. తెలంగాణ రాష్ట్ర ఇన్నోవేషన్ సెల్ (టీఎస్‌ఐసీ) నుంచి గ్రామీణ ప్రాంతాల్లోని ఆవిష్కరణలు గుర్తింపు పొందుతున్నాయని పేర్కొన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని పీపుల్స్ ప్లాజాలో టీ ఉత్సవం పేరుతో టీఎస్‌ఐసీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఆవిష్కరణల ప్రదర్శనను జయేశ్‌రంజన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆవిష్కరణలు టీహబ్ నుంచి మాత్రమే రావని భావించిన ప్రభుత్వం క్షేత్రస్థాయిలో యువతను ప్రోత్సహించేందుకు రెండేండ్ల కిందట టీఎస్‌ఐసీని ప్రారంభించిందన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమం ద్వారా ఆవిష్కర్తలను వెలుగులోకి తెచ్చిందని తెలిపారు. ప్రతిభావంతులను రాష్ట్ర ప్రభుత్వం వివిధ రూపాల్లో ప్రోత్సహిస్తుండటం ద్వారా తెలంగాణ ఇన్నోవేషన్ స్టేట్‌గా ఎదిగిందన్నారు. ఆసుయంత్రం ఆవిష్కర్త చింతకింది మల్లేశంకు రూ.కోటి ఆర్థికసాయం ప్రభుత్వం చేసిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్, టీఎస్‌ఐసీ సీఈవో సామ ఫణీంద్ర, ఐటీశాఖ డైరెక్టర్ దిలీప్ కొణతం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు ఆవిష్కరణలు ఆహుతులను ఆకట్టుకున్నాయి.

### లోకం పోకడ




## అన్ని మోటర్లకు ఒకేసారి వెట్‌రన్

కన్నెపల్లి పంపుహౌస్‌లో నీటిపారుదలశాఖ కసరత్తు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా కన్నెపల్లి పంపుహౌస్‌లో మోటర్ల వెట్‌రన్‌కు ఇంజినీర్లు కసరత్తు చేస్తున్నారు. తొలుత ఆరు మోటర్ల ఎత్తిపోతలను పరీక్షించాలని యోచించినా.. సర్కారు ఆదేశంతో అన్నింటికీ ఒకేదఫాలో పరీక్షించాలని తాజాగా నిర్ణయించారు. ఇంజినీర్లు ఇప్పటికే నందిమేడారం పంపుహౌస్‌లో 124.4 మెగావాట్ల సామర్థ్యం ఉన్న మోటర్ల వెట్‌రన్‌ను పూర్తిచేశారు. ఆ తరువాత కన్నెపల్లి పంపుహౌస్‌లో మోటర్ల ఎత్తిపోతలపై దృష్టి సారించారు. ఇక్కడ 40 మెగావాట్ల సామర్థ్యం ఉన్న 11 మోటర్లను అమరుస్తున్నారు. ఒక్కో పంపు నుంచి 2118 క్యూసెక్కుల చొప్పున 11 మోటర్ల ద్వారా 23,166 క్యూసెక్కులు.. అంటే రోజుకు రెండు టీఎంసీల జలాలు విడుదల అవుతాయి. ముందుగా ఆరింటి వెట్‌రన్ చేపట్టాలని యోచించి గోదావరి నుంచి నీటిని మళ్లించి.. కన్నెపల్లి పంపుహౌస్‌లోని సర్జ్‌పూల్‌లోకి వదిలారు. అయితే, దఫాలుగా కాకుండా.. 11 మోటర్ల ఎత్తిపోతలను ఒకేసారి పరీక్షించాలని ఇటీవల ప్రభుత్వం నీటిపారుదలశాఖకు సూచించినట్టు తెలిసింది. దీంతో ప్రస్తుతం ఇంజినీర్లు మిగిలిన ఐదు మోటర్లను అమర్చేపనులను మరింత వేగవంతం చేశారు. కొన్నిరోజుల్లోనే అన్ని మోటర్లను సిద్ధంచేసి.. ఈ నెలలోనే రోజుకు 2-3 మోటర్ల చొప్పున వరుసగా పదకొండు మోటర్ల వెట్‌రన్ చేపట్టాలని కసరత్తు చేస్తున్నారు. తద్వారా కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా అధికారికంగా నీటివిడుదల కార్యక్రమాన్ని చేపట్టేందుకు వీలుగా సాంకేతికంగా మార్గం సుగమం అవుతుంది. నందిమేడారం పంపుహౌస్‌లోని మోటర్లవెట్‌రన్ కంటే ముందు డ్రైరన్ చేపట్టారు. కానీ కన్నెపల్లి పంపుహౌస్‌లోని మోటర్లకు డ్రైరన్ అవసరంలేదని ఇంజినీర్ ఒకరు తెలిపారు.

## రేపు సీఎం కాళేశ్వరం పర్యటన

**హైదరాబాద్, నమస్తేతెలంగాణ:** ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఈనెల 4న కాళేశ్వరం పర్యటిస్తారు. మంగళశారం ఉదయం హైదరాబాద్ నుంచి బయలుదేరి రాంపూర్ చేరుకొంటారు. అక్కడ పంప్‌హౌస్ పనులను పరిశీలిస్తారు. ఆ తర్వాత మేడిగడ్డ బరాజ్ నిర్మాణ ప్రాంతాన్ని సందర్శించి పనులను పరిశీలిస్తారు. అక్కడే అధికారులతో మాట్లాడుతారు.



రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఆదివారం ఢిల్లీలోని తెలంగాణభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాట్లాడుతున్న కేంద్ర మంత్రి జీ కిషన్‌రెడ్డి. చిత్రంలో ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధులు వేణుగోపాలాచారి, మందా జగన్నాథం, రామచంద్రు తేజావత్ తదితరులు



జూబ్లీహాల్‌లో నిర్వహించిన కవి సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్. చిత్రంలో సాంస్కృతికశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం, నందిని సిధారెడ్డి, బీఎస్ రాములు, అయాచితం శ్రీధర్, సుద్దాల అశోక్‌తేజ కూడా ఉన్నారు.

## ఉద్యమంలో కవులపాత్ర మరువలేం

- రాష్ట్ర ఆవిర్భావోత్సవ సంబురాల్లో రాష్ట్ర మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** తెలంగాణ మలిదశ ఉద్యమంలో కవులు, గాయకులు, సాహితీవేత్తల పాత్ర మరువలేదని సాంస్కృతికశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాల్లో భాగంగా ఆదివారం జూబ్లీహాల్‌లో నిర్వహించిన కవిసమ్మేళనానికి హాజరైన మంత్రి మాట్లాడుతూ.. కవులు, కళాకారులు, గాయకులు, సాహితీవేత్తలు అంతా ఒక్కతాటిపైకి వచ్చి ఉద్యమించారని, తెలంగాణ పడుతున్న గోసను గొంతెత్తి చాటారని తెలిపారు. వారిని మరొక్కసారి గుర్తుచేసుకోవాల్సిన సందర్భమిదన్నారు. ఈ సందర్భంగా కవులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సాంస్కృతికశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం, సీఎంవో వోఎస్డీ దేశపతి శ్రీనివాస్, భాషా సాంస్కృతికశాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, సాహిత్య అకాడమీ చైర్మన్ నందిని సిధారెడ్డి, మాజీస్పీకర్ మధుసూదనాచారి, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ అయాచితం శ్రీధర్. సుద్దాల అశోక్‌తేజ పాల్గొన్నారు.

సోమవారం
3•6•2019
కరీంనగర్

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

PUBLISHED FROM KARIMNAGAR | HYDERABAD | WARANGAL | KHAMMAM | NALGONDA | MAHABUBNAGAR | NIZAMABAD

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE




# ఏపీ భవనాల అప్పగింత

విభజన అంశాలపై కీలకమైన ముందడుగు ■ హైదరాబాద్‌లో ఏపీకి కేటాయించిన భవనాలు తిరిగి తెలంగాణకు

ఉత్తర్వులిచ్చిన గవర్నర్ నరసింహన్ ■ ఇచ్చిపుచ్చుకొనే ధోరణిలో పనిచేయాలన్నదే అభిమతమని సీఎం కేసీఆర్ వెల్లడి



ఆదివారం రాజ్‌భవన్‌లో గవర్నర్ నరసింహన్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందిస్తున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు

## స్నేహభావంతో ముందడుగు: సీఎం కేసీఆర్

హైదరాబాద్‌లోని ఏపీ ప్రభుత్వ భవనాలను తెలంగాణ ప్రభుత్వానికి అప్పగించడంపట్ల ముఖ్యమంత్రి కేసీఆర్ హర్షం వ్యక్తంచేశారు. ఏపీ ప్రభుత్వ కార్యకలాపాలన్నీ అమరావతి నుంచే జరుగుతున్నందున హైదరాబాద్‌లోని ఏపీ భవనాలన్నీ ఖాళీగా ఉన్నాయని, అలా ఖాళీగా ఉండే బదులు ఉపయోగంలోకి తీసుకురావాలనే ఆలోచన ఉత్తమమయిందని సీఎం అన్నారు. రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు ప్రజాప్రయోజనాలే పరమావధిగా, స్నేహభావంతో ముందడుగు వేయడం శుభపరిణామని తెలిపారు. ప్రతి విషయంలోనూ రెండు ప్రభుత్వాలు వాస్తవిక దృష్టితో ఆలోచించి ఇచ్చిపుచ్చుకొనే ధోరణిలో పనిచేయాలని సీఎం ఆకాంక్షించారు. రెండు రాష్ట్రాలు అభివృద్ధి చెందాలని, రెండు రాష్ట్రాల ప్రజలు క్షేమంగా ఉండాలని, అపరిష్కృత సమస్యలన్నీ సామరస్యపూర్వకంగా పరిష్కారం కావాలన్నదే తమ అభిమతమని సీఎం తెలిపారు.

**హైదరాబాద్,నమస్తే తెలంగాణ:**

రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం నాడు.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య విభజన అంశాలపై కీలకమైన ముందడుగు పడింది. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు కృషి ఫలించింది. 2014లో రాష్ట్ర విభజన సందర్భంగా ఏపీకి కేటాయించిన సచివాలయం, అసెంబ్లీ, శాఖాధిపతుల కార్యాలయాలన్నింటినీ తెలంగాణ రాష్ట్రానికి అప్పగిస్తూ గవర్నర్ నరసింహన్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు ఆదివారం నాడు గవర్నర్ ఇరు రాష్ట్రాలకు ప్రొసీడింగ్స్ ఇచ్చారు. గవర్నర్ నిర్ణయంపై సీఎం కేసీఆర్ హర్షం వ్యక్తంచేశారు. తాజా ఉత్తర్వుల ప్రకారం రాజధాని హైదరాబాద్‌లో ఇప్పటివరకు ఏపీ ప్రభుత్వ ఆధీనంలో ఉన్న భవనాలు ఇక నుంచి తెలంగాణ ప్రభుత్వం చేతికి తిరిగిరానున్నాయి. ఏపీ ప్రభుత్వ అవసరాలకోసం పోలీస్‌శాఖకు ఒక భవనం, ఇతర శాఖలన్నింటి అవసరాల నిమిత్తం మరో భవనాన్ని కేటాయించాలని గవర్నర్ ప్రొసీడింగ్స్‌లో పేర్కొన్నారు. తనకున్న అధికారాలను ఉపయోగించుకొని హైదరాబాద్‌లోని ఏపీ ప్రభుత్వానికి కార్యాలయాలను నిర్వహించుకోవడానికి కేటాయించిన భవనాలను తిరిగి ఇవ్వాలని కోరుతూ సర్క్యులేషన్ పద్ధతిలో తెలంగాణ మంత్రివర్గం ఆమోదించిన తీర్మానాన్ని ఆదివారం ముఖ్యమంత్రి కేసీఆర్.. గవర్నర్‌కు



గవర్నర్ ఉత్తర్వు ప్రతి

అందజేయగా దానికి ఆయన సానుకూలంగా స్పం దించారు. గత ఐదేండ్లుగా ఏపీ ప్రభుత్వం ఈ భవనాలకు చెల్లించాల్సిన అన్నిరకాల పన్నులను తెలంగాణ ప్రభుత్వం రద్దుచేయాలని చెప్పారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు విభజన సమస్యలు పరిష్కారం కాలేదు. ఏపీ ప్రభుత్వం ఏనాడూ ముందుకు రాలేదు. చివరకు ఖాళీచేసిన భవనాలను సైతం అప్పగించడానికి ససేమిరా అన్నది. ఈ సమస్యను పరిష్కరించాలని సీఎం కేసీఆర్ అనేకసార్లు విజ్ఞప్తి చేస్తూ వచ్చారు. చివరకు కేంద్రానికి కూడా ఫిర్యాదు చేశారు. తెలంగాణపై నిత్యం కుట్రలుసాగించే

మిగతా 8వ పేజీలో

# సఫల తెలంగాణ

ఐదేండ్లలో అపూర్వ విజయాలు.. చరిత్ర సృష్టించనున్న కాళేశ్వరం.. ప్రాజెక్టులు పూర్తయితే రాష్ట్రమంతటా పచ్చని పైర్లే

కాలంచెల్లిన చట్టాలకు చరమగీతం.. సరికొత్తగా మున్సిపల్, రెవెన్యూ చట్టాలు

అవినీతికి ఆస్కారం లేకుండా పారదర్శకమైన పాలన

- జూలై ఒకటి నుంచి ఆసరా పింఛన్ల రెట్టింపు
- రూ.10వేలకు రైతుబంధు సాయం
- ధనిక రైతులున్న రాష్ట్రంగా తెలంగాణ
- రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో సీఎం కేసీఆర్
- గన్‌పార్క్ వద్ద అమరవీరులకు ఘనంగా నివాళులర్పించిన ముఖ్యమంత్రి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

దేశచరిత్రలోనే ఎన్నడగిన మహోద్యమాన్ని సాగించి సాధించుకొన్న తెలంగాణ నేడు ఒక సఫల రాష్ట్రంగా పురోగమిస్తున్నదని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అన్నారు. ఒక రాష్ట్ర చరిత్రలో ఐదేండ్లు చిన్న కాలమే అయినప్పటికీ ప్రభుత్వం సాధించిన అసామాన్య విజయాల రీత్యా ఎంతో విలువైన కాలమని పేర్కొన్నారు. కాళేశ్వరంతోపాటు రాష్ట్రంలో తలపెట్టిన ప్రాజెక్టులన్నీ పూర్తయితే రాష్ట్రంలో కరువు అనే మాట వినిపించదు.. కనిపించదని సీఎం తెలిపారు. రెండున్నరేండ్ల అతి తక్కువ సమయంలో నిర్మిస్తున్న అతి పెద్ద సాగునీటి ప్రాజెక్టుగా కాళేశ్వరం చరిత్ర సృష్టించబోతున్నదన్నారు. వచ్చేనెల చివరినుంచి మేడిగడ్డ బరాజ్ నుంచి ప్రతిరోజు రెండు టీఎంసీల నీళ్లను ఎత్తిపోయనున్నామని వెల్లడించారు. రాష్ట్రంలో అవినీతికి ఎంతమాత్రం చోటులేకుండా కొత్త రెవెన్యూ, మున్సిపల్ చట్టాలను తీసుకొచ్చి పారదర్శకమైన పాలనను అందిస్తామన్నారు. కాలంచెల్లిన చట్టాలకు చరమగీతం పాడుతామని స్పష్టంచేశారు. రాష్ట్రంలో తనకు సంతృప్తినిచ్చిన ఆసరా పింఛన్లను జూలై ఒకటి నుంచి రెట్టింపుచేస్తున్నామని సీఎం ప్రకటించారు. సమీప భవిష్యత్తులో తెలంగాణ ప్రపంచంలోనే ధనిక రైతులకు చిరునామా కాబోతున్నదని, రైతులకు పెట్టుబడి సాయంగా ఇస్తున్న రూ.8 వేలను ఈ ఏడాది నుంచి రూ.10 వేలకు పెంచుతున్నామని తెలిపారు. ప్రజల దీవెనలే కొండంత అండగా తెలంగాణ సర్వతోముఖాభివృద్ధికి పునరంకితమవుతున్నామని సీఎం కేసీఆర్ వెల్లడించారు. హైదరాబాద్ నాంపల్లిలోని పబ్లిక్‌గార్డెన్స్‌లో ఆదివారం ఉదయం జరిగిన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవంలో సీఎం జాతీయపతాకాన్ని ఆవిష్కరించారు. అంతకుముందు గన్‌పార్క్‌వద్ద అమరవీరుల స్తూపానికి పూలమాల వేసి, తెలంగాణ ఉద్యమంలో అమరులైన వారికి నివాళులర్పించారు. తర్వాత పబ్లిక్ గార్డెన్స్‌లో పోలీసుల గౌరవవందనాన్ని స్వీకరించారు. అనంతరం జరిగిన బహిరంగసభలో సీఎం ప్రసంగించారు. దాదాపు అరగంటపాటు సాగిన సీఎం ప్రసంగపాఠం సమగ్రంగా ఆయన మాటల్లోనే..

**అవాక్కయ్యేలా రాష్ట్రాభివృద్ధి**

అనేక అపనమ్మకాలు, అనుమానాల నడుమ ఏర్పడ్డ రాష్ట్రం.. అనతికాలంలోనే వాటన్నింటినీ పటాపంచలుచేసింది. ఎక్కడా తొట్రుపాటు, తడబాటు లేకుండా పాలనలో పరిణతిని ప్రదర్శించింది. నవ్విన నాప చేనే పండిందన్నట్లుగా, తెలంగాణ ప్రగతిపథంలో పరుగులుతీస్తుంటే అపహాస్యం చేసినవాళ్లు అవాక్కవుతున్నారు. ఇది తెలంగాణ ప్రజలు, ప్రభుత్వం ఏకతాటిపై నిలిచి, పట్టుదలతో ప్రయత్నించి సాధించిన సమిష్టి విజయం. రాష్ట్ర సాధన కోసం రాజీలేని పోరాటం చేసినవాళ్లే, కొత్త రాష్ట్రాన్ని ప్రగతి దారుల్లో నడిపిస్తారని తెలంగాణ ప్రజలు మాపై పెట్టుకున్న విశ్వాసాన్ని మేము నూటికి నూరుశాతం నిలబెట్టుకున్నాం. ప్రభుత్వం పనితీరును మెచ్చి ప్రజలు తమ హృదయంలో మాకెంతటి స్థానం ఇచ్చారన్నదానికి గత అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు అద్దం

మిగతా 4వ పేజీలో



పబ్లిక్‌గార్డెన్స్‌లో రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవంలో ప్రసంగిస్తున్న సీఎం కేసీఆర్

> రైతుల జీవితాల్లో వెలుగు నింపడంకోసం శక్తియుక్తులన్నీ ధారపోస్తా

- ఐదేండ్లలో అవాక్కయ్యేలా అభివృద్ధి సాధించాం
- 16.5% తో సుస్థిరంగా వృద్ధిరేటు
- కల్యాణలక్ష్మి, షాదీముబారక్ నా మానసపుత్రికలు
- అట్టడుగువర్గాలకు అంతర్జాతీయ విద్య: కేసీఆర్

• రంజాన్ ముబారక్



ఆదివారం ఎల్బీ స్టేడియంలో ప్రభుత్వ అధికారిక ఇఫ్తార్ విందుకు ముఖ్యఅతిథిగా హాజరైన ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు.. ఎంపీ అసదుద్దీన్ ఒవైసీకి ఖర్జూరం తినిపిస్తున్న దృశ్యం

# మతసామరస్యానికి నిలయం తెలంగాణ

- మైనార్టీల సంక్షేమంలో రాష్ట్రం దేశానికే ఆదర్శం
- అన్నిమతాలనూ సమానంగా గౌరవిస్తున్నం
- బోనాలు, రంజాన్, క్రిస్మస్ పండుగలు అధికారికంగా నిర్వహిస్తున్నం
- ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలి
- ప్రభుత్వ ఇఫ్తార్ విందులో ముఖ్యమంత్రి కేసీఆర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మైనార్టీ సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలను అమలుచేయడంలో తెలంగాణ.. దేశానికే ఆదర్శమని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అన్నారు. అన్నిమతాలను సమానంగా గౌరవిస్తున్నామని.. గంగా జమునా తెహజీబ్‌కు తెలంగాణ రాష్ట్రం నిలయంగా నిలిచిందని చెప్పారు. మతసామరస్యంలో తెలంగాణను చూసి దేశం నేర్చుకోవాలంటూ మహాత్మా గాంధీ చెప్పిన మాటలను కేసీఆర్ గుర్తుచేశారు. ఆదివారం ఎల్బీ స్టేడియంలో ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన ఇఫ్తార్ విందుకు సీఎం కేసీఆర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..

మిగతా 4వ పేజీలో

# ఊరు దాటిన భూమి!

సొమ్ములియ్యలేదని పాస్‌బుక్‌ను దిద్దిన వీఆర్వో.. భూమి శివార్లనే మార్చేసిన వైనం

సర్వే నంబర్లు మూడుసార్లు తప్పుగా నమోదు.. ఇదేమని ప్రశ్నిస్తే భూమే లేదంటూ బుకాయింపు

19 ఏండ్లుగా మంచిర్యాల జిల్లా చెన్నూరు మహిళ పోరాటం

అడిగినన్ని డబ్బులు ఇవ్వకుంటే.. రెవెన్యూ అధికారులు ఏమైనా చేయగలరు. ఎంతకైనా తెగించగలరు. భూమిని ఒక ఊరి నుంచి మరొక ఊరికి తరలించగలరు. వాళ్లు తలుచుకుంటే రికార్డులు మారుతాయి. సర్వే నంబర్లు మారిపోతాయి. పేర్లు మారిపోతాయి. పట్టాభూమి ఆనువంశికమైపోతుంది. ఇదేమని ఎవరైనా ప్రశ్నిస్తే.. చేతి రాతలో తప్పు జరిగిందని చాలా తేలిగ్గా చెప్పేస్తారు. మంచిర్యాల జిల్లా చెన్నూరులో ఓ మహిళా రైతు.. రెవెన్యూ అధికారుల నుంచి పడుతున్న వెతలు అన్నీ ఇన్నీ కావు. అడిగిన డబ్బులు ఇవ్వలేదన్న ఒకే ఒక్క కారణంతో స్థానిక వీఆర్వో ఆమె భూమిని ఏకంగా మరో ఊళ్లో ఉన్నట్టు రాసేశాడు. మూడుసార్లు సర్వే నంబర్లు మార్చాడు. ఎక్కేగడప.. దిగే గడప అన్నట్టుగా తాసిల్దార్ కార్యాలయం చుట్టూ పందొమ్మిదేండ్లుగా ఆమె తిరుగుతూనే ఉన్నది. ఏ ఒక్క అధికారీ ఆమె గోడును పట్టించుకోవడంలేదు.

**మంచిర్యాల ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** మంచిర్యాల జిల్లా చెన్నూరులో నివాసముంటున్న జక్కం బుచ్చమ్మ.. పుష్ప పంజ్వాని నుంచి (సేల్ డీడ్ నంబర్ 1464/2000) కత్తెరశాల శివారులో ఉన్న 405/10/2 సర్వేనంబర్‌లో ఎకరం 35 గుంటలు, 405/6 సర్వేనంబర్‌లో ఎకరం 6 గుంటల భూమిని 1999–2000 సంవత్సరంలో కొనుగోలుచేశారు. ఆ వెంటనే రికార్డుల్లోకి ఎక్కించారు. 2004–05 వరకు కత్తెరశాల శివారులోనే భూమి ఉన్నట్టు నమోదుచేశారు. ఇంతవరకు బాగానే ఉన్నది. డబ్బుకు కక్కుర్తిపడ్డ వీఆర్వో.. అడిగినంత సొమ్ము భూ యజమాని ఇవ్వకపోవడంతో రికార్డుల్లో సర్వేనంబర్లను మార్చారు. అప్పటిదాకా కత్తెరశాల శివారులోనే భూమి ఉన్నట్టున్న రికార్డులు.. ఆ తర్వాత మారిపోయాయి. 2005–06 పహాణీలో అంగ్రాజుపల్లి శివారు కింద భూమి ఉన్నట్టు రికార్డులను మార్చేశారు. ఇక్కడితో ఊరుకోలేదు. 2006–07లో 405/10/2 సర్వేనంబర్‌ను 405/2 గా మార్చారు. దీనిని అంగ్రాజ్‌పల్లి శివారుగా పేర్కొన్నారు. 2010–11లో 405/4/2 గా మార్చేశారు. ఇలా అడ్డగోలుగా మూడుసార్లు సర్వేనంబర్లను మార్చేసిన అధికారులు 2011–12లో 405/4/2, 405/6 సర్వేనంబర్లలోని భూమి కత్తెరశాల శివారులో ఉన్నట్టు

మిగతా 5వ పేజీలో

ధర్మగంట



బాధితురాలు బుచ్చమ్మ

# ముందస్తు వెక్కిరింపు!

- దేశవ్యాప్తంగా ముఖం చాటేసిన ముందస్తు వానలు
- 99 మి.మీ. వర్షపాతమే నమోదు..
- గత 65 ఏండ్లలో ఇది రెండోసారి



**న్యూఢిల్లీ, జూన్ 2:** దేశవ్యాప్తంగా ఈసారి 'ముందస్తు' వానలు ముఖం చాటేశాయి. నైరుతి రుతుపవనాల రాకకు సమయం దగ్గరపడుతున్నా.. ఇప్పటివరకు కేవలం 99 మి.మీ వర్షపాతం మాత్రమే నమోదైంది. గత 65 ఏండ్లలో 'ముందస్తు' (మార్చి, ఏప్రిల్, మే) సీజన్‌లో ఈ స్థాయిలో వర్షాభావ పరిస్థితులు నెలకొనడం ఇది రెండోసారి అని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) గణాంకాలు వెల్లడిస్తున్నాయి. 1954లో 93.9 మి.మీ వర్షపాతం నమోదు కాగా, ఆ తర్వాత 2009 (99 మి.మీ.), 2012 (90.5మి.మీ.), 2019 (99 మి.మీ.)లో మాత్రమే వర్షపాతం మూడంకెల మార్క్‌ను చేరలేదు. మధ్య మహారాష్ట్ర, మరాఠ్వాడా, విదర్భ, కొంకణ్–గోవా, గుజరాత్, సౌరాష్ట్ర, కచ్, కర్ణాటక తీర ప్రాంతం, తమిళనాడు, పుదుచ్చేరిలలో అత్యధిక లోటు వర్షపాతం నమోదైంది. తెలంగాణ, రాయలసీమ, ఉత్తర కర్ణాటక, జమ్ము కశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లో కూడా ముందస్తు సీజన్‌లో లోటు వర్షపాతమే రికార్డయింది.

**దక్షిణాదిలోనే అత్యధిక లోటు..**

గత శతాబ్ద కాలంలో ముందస్తు వానల సరళిని పరిశీలిస్తే దక్షిణ భారతదేశంలో ముఖ్యంగా మహారాష్ట్రలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఐఎండీ క్లైమేట్

మిగతా 9వ పేజీలో

# నేడే స్థానిక ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు

8

- రెండు గంటల్లోనే ఫలితాలు
- మొత్తం ఓట్లు 2,799.. పోలైన ఓట్లు 1,958
- మూడు ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో లెక్కింపు

# పరిషత్ ఓట్ల లెక్కింపు రేపు

8

- ఉదయం 8 నుంచే ప్రక్రియ ప్రారంభం
- సాయంత్రం 5 వరకు తేలిపోనున్న ఫలితాలు
- రాష్ట్రవ్యాప్తంగా 123 కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు
- తేలనున్న 2,426 మంది జెడ్పీటీసీ అభ్యర్థులు, 18,930 మంది ఎంపీటీసీ అభ్యర్థుల భవితవ్యం




# లాసెట్ ఫలితాలు విడుదల

ఐదేండ్ల లాసెట్‌లో మొదటిర్యాంకు సాధించిన మెట్ట సూరజ్

4

పీజీ లాసెట్‌లో వేముగంటి తరణి ఫస్ట్ ర్యాంక్



వేముగంటి తరణి



తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ నాంపల్లిలోని పబ్లిక్‌గార్డెన్స్‌లో ఆదివారం ఉదయం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జెండా వందనం చేస్తున్న ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు. చిత్రంలో సీఎస్ ఎస్కే జోషి, డీజీపీ మహేందర్‌రెడ్డి కూడా ఉన్నారు.

# సఫల తెలంగాణ

మూడోపేజీ తరువాయి...

పట్టినయి. పంచాయతీ ఎన్నికల నుంచి పార్ల మెంటు ఎన్నికల దాకా ప్రతి ఎన్నికలో విజయాన్ని కట్టబెడుతూ ప్రజలు మాకు తిరుగులేని బలాన్ని అందిస్తున్నారు.

## 16.5% వృద్ధిరేటు

ప్రభుత్వం ముందుచూపుతో అవలంబించిన సమర్థమైన ఆర్థిక విధానాలు, రాజకీయ అవినీతికి అవకాశం లేకుండాచేయడం వల్ల, ఆర్థిక క్రమశిక్షణను పాటించడంవల్ల తెలంగాణ నేడు ఒక బలమైన ఆర్థికశక్తిగా, పురోగామి రాష్ట్రంగా నిలదొక్కుకున్నది. గడిచిన ఐదేండ్లలో సగటున 16.5 శాతం ఆదాయ వృద్ధిరేటును స్థిరంగా సాధిస్తున్నది. ఈ ధోరణి ఇదేవిధంగా కొనసాగితే భవిష్యత్తులో రాష్ట్ర ఆదాయం మరిన్నిరెట్లు పెరిగే అవకాశాలు కనపడుతున్నాయి.

## కరంట్ సమస్యను అధిగమించినం

అతి తక్కువ కాలంలో కరంటు సమస్యను సంపూర్ణంగా అధిగమించినం. విద్యుత్‌వ్యవస్థను అధ్వాన్న స్థితి నుంచి అద్భుతం అనే స్థాయికి తీసుకురాగలిగినం. తెలంగాణ ఎక్కడి నుంచి ఎక్కడికి చేరుకున్నదో అర్థంచేసుకోవడానికి ఈ ఒక్క విషయం చాలు. దేశంలో వ్యవసాయంతోసహా అన్నిరంగాలకు 24 గంటలపాటు నిరంతరాయ నాణ్యమైన కరంటు సరఫరాచేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమే. విద్యుత్ సరఫరాలో వచ్చిన గుణాత్మకమైన మార్పు వ్యవసాయరంగానికి, పారిశ్రామికరంగానికి నూతనోత్తేజాన్ని కలిగించింది.

## మంచినీటి గోసలేదు

మంచినీటి సమస్య సమగ్ర పరిష్కారం కోసం చేపట్టిన మిషన్ భగీరథ పథకం సఫలం అవుతుండటం ప్రజల కండ్లముందే ఉన్నది. ఇంత భయంకరమైన వేసవి ఎండల్లోనూ ప్రజలు తాగునీటి కోసం గోసపడటం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో మిషన్ భగీరథ పనులు 97 శాతం పూర్తయినయి. జూలై చివరినాటికి వందకు వందశాతం పూర్తయితయి. పట్టణ ప్రాంతాల్లోనూ యుద్ధప్రాతిపదికన పనులు పూర్తిచేయబోతున్నాం.

## ఆసరాతో వృద్ధులకు భరోసా

సమాజం చివరిఅంచున, నిస్సహాయంగా నిలిచిపోయిన నిరుపేదవర్గాలకు నిజమైన చేయూతనందించడమే ప్రథమ ప్రాధాన్యంగా నిర్ణయించుకున్నాం. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, బీడీ కార్మికులు, నేత, గీత కార్మికులు, వృద్ధ కళాకారులు, బోదకాలు బాధితులు, ఎయిడ్స్ వ్యాధిగ్రస్థులు ఒకరేమిటి.. ఎవరైతే పేదరికంతో విలవిల్లాడుతున్నారో వారందరినీ గుర్తించి, కనీస జీవన భద్రత కలిగించేవిధంగా ప్రభుత్వం ఆసరా పింఛన్లు అందిస్తూ ఆదుకొంటున్నది. ఆసరా పింఛన్ల పథకం నాకు అత్యంత, సంతృప్తినీ.. సంతోషాన్ని కలిగిస్తున్నది. తెలంగాణ ఏర్పడిన వెంటనే 200 రూపాయల నుంచి వెయ్యి రూపాయల వరకు పెంచి అందించిన పెన్షన్‌ను ఇప్పుడు 2,016కు పెంచుతున్నాం. వికలాంగుల పెన్షన్‌ను 1500 రూపాయల నుంచి 3,016 రూపాయలకు పెంచుతున్నాం. వృద్ధాప్య పెన్షన్ వయో పరిమితిని 65 ఏండ్ల నుంచి 57 ఏండ్లకు తగ్గించి, కొత్తగా మరో ఆరేడు లక్షల మందికి పెన్షన్ అందించబోతున్నాం. పెంచిన పెన్షన్లను జూలై ఒకటి నుంచి లబ్ధిదారులకు అందిస్తామని చెప్పడానికి సంతోషిస్తున్నాను.

## కల్యాణలక్ష్మి, షాదీముబారక్ నా మానస పుత్రికలు

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు అచ్చంగా నా మానసపుత్రికలు. ప్రభుత్వం అందించే ఒక లక్షా నూట పదహార్ల ఆర్థిక సహాయంతో ఆడపిల్లల పెండ్లిండ్లుచేసిన పేద కుటుంబాల ఆశీస్సులే మా ప్రభుత్వానికి పెట్టనికోటలయ్యాయి. బలహీనవర్గాలవారికి ఆత్మ గౌరవంతో కూడిన నివాసం అందించాలనే పట్టుదలతో రెండు బెడ్‌రూంల ఇండ్లనిర్మాణం కొనసాగుతున్నది. బడుల్లో, హాస్టళ్లలో విద్యార్థులకు పెడుతున్న సన్నబియ్యం అన్నం పరిపాలనలో మానవీయకోణానికి నిదర్శనం. గర్భిణులకు పౌష్టికాహారం అందించే ఆరోగ్యలక్ష్మి, ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాలను ప్రోత్సహించేందుకు ప్రారంభించిన కేసీఆర్ కిట్ పథకాలు మహిళాసంక్షేమానికి నూతన నిర్వచనంగా నిలిచాయి. గ్రామీణ ఆర్థికవ్యవస్థను బలోపేతంచేసే దిశగా బలమైన అడుగులు వేయగలిగాం.



ఆదివారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నాంపల్లి పబ్లిక్‌గార్డెన్స్‌లో గౌరవ వందనం సమర్పిస్తున్న పోలీసులు

## మిషన్ కాకతీయకు అంతర్జాతీయ ప్రశంసలు

శిథిలమైన చెరువులను పునర్జీవింప చేసేందుకు ప్రారంభించిన మిషన్ కాకతీయ సత్ఫలితాలను ఇవ్వడమే కాకుండా ఆదర్శవంతమైన అభివృద్ధి నమూనాకు నిదర్శనంగా అంతర్జాతీయంగా ప్రశంసలను పొందింది. వ్యవసాయ అనుబంధ వృత్తులకు ప్రోత్సాహాన్ని కలిగించే పథకాలను మనం అమలుచేసుకొంటున్నాం. గొర్రెల పంపిణీ గొల్లకుర్మల దగ్గర జీవసంపదను పెంచింది. రాష్ట్రంలోని నీటి వనరుల్లో చేపల పెంపకానికి కావాల్సిన చేపపిల్లలను ప్రభుత్వమే ఉచితంగా సరఫరా చేసింది. రాశులకొద్దీ ఉత్పత్తవుతున్న మంచినీటి చేపలకు మార్కెట్లో మంచి డిమాండ్ ఏర్పడింది. చేనేత, పవర్‌లూం కార్మికుల ఆత్మహత్యలను నివారించడంలో ప్రభుత్వం చాలావరకు సఫలమైంది. బతుకమ్మ చీరెల తయారీని చేనేత కార్మికులకు అప్పగించి వారికి నిరంతరం పని దొరికేలాచేసింది. 50% సబ్సిడీతో రంగులు, రసాయనాలు అందించటంవల్ల నేత కార్మికులకు ఊరట కలిగింది.

## తెలంగాణ గంగా జమునా తెహజీబ్

తెలంగాణ బహుళత్వాన్ని గౌరవించే సమాజం. విభిన్న మతాలు, జాతుల ప్రజలు తమ అస్తిత్వాన్ని నిలబెట్టుకుంటూనే పరస్పరం ఇచ్చిపుచ్చుకొంటూ సహజీవనం సాగిస్తున్నారు. తెలంగాణలోని ఈ సామరస్య సంస్కృతినే మహాత్మా గాంధీ గంగా జమునా తెహజీబ్‌గా ప్రస్తుతించారు. బతుకమ్మ, బోనాలు, రంజాన్, క్రిస్మస్ పండుగలను రాష్ట్ర పండుగలుగా గుర్తించి అధికారికంగా జరుపుతున్నది. ఈ పండుగల సందర్భంగా పేదకుటుంబాలకు ఉచితంగా నూతన వస్త్రాలను పంపిణీచేస్తున్నది. ఆలయాల అర్చకులకు ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా ఒకటో తేదీనే వేతనాలు అందేవిధంగా సంస్కరణ తెచ్చింది. ధూప దీప నైవేద్య పథకం కింద ఆలయాల్లో పూజాదికాలు నిర్వహించేందుకు ఇచ్చే మొత్తాన్ని పెంచింది. మసీదుల్లో ఇమాంలకు, మౌజాన్లకు రూ.5 వేల భృతిని అందిస్తున్నది. ఆయా కులాల విశిష్ట సంస్కృతికి ప్రతీకలుగా ఆత్మగౌరవ భవనాలను రాజధాని నగరమైన హైదరాబాద్‌లో ప్రభుత్వం నిర్మిస్తున్నది. ఇందుకోసం స్థలాలను కేటాయించింది. త్వరలోనే భవనాల నిర్మాణం ప్రారంభమవుతుంది.

## అట్టడుగువర్గాలకు అంతర్జాతీయ స్థాయి విద్య

అట్టడుగువర్గాలకు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్య అనే లక్ష్యంతో ప్రభుత్వంతో నూతనంగా 608 రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేసింది. ఈ ఆవాస పాఠశాలల్లో శిక్షణ పొందిన విద్యార్థులు అంతర్జాతీయస్థాయిలో మన రాష్ట్ర కీర్తి పతాకాన్ని ఎగురవేస్తున్నారు. ప్రజా వైద్యంపై విశ్వాసంపెరిగే విధంగా ప్రభుత్వ దవాఖానల పనితీరును మెరుగుపరిచింది. రాష్ట్రంలో దృష్టి లోపాల నివారణకోసం పెద్ద ఎత్తున చేపట్టిన కంటివెలుగు ద్వారా నేత్ర పరీక్షలు.. వైద్యం, మందులు, కండ్లద్దాలు ఉచితంగా అందించే పథకం దేశంలో మరే రాష్ట్రంలోనూ లేదు. త్వరలో దంత, చెవి, ముక్కు, గొంతు వ్యాధుల నివారణకోసం ప్రత్యేక కార్యక్రమాలను ప్రభుత్వం ప్రారంభిస్తుంది. తెలంగాణ ఆరోగ్యసూచిక (హెల్త్ ప్రొఫైల్) రూపొందించేందుకు ప్రభుత్వం కృషిచేస్తుంది.

## తలాపునే నీళ్లున్నా.. మడి తడిపే నీళ్లు లేవు

తెలంగాణ అనుభవించిన ఇతర దుఃఖాలన్నీ ఒక ఎత్తయితే, ఒక్క సాగునీటి కోసం అనుభవించిన దుఃఖం ఒక్కటే ఇంకో ఎత్తు. తలాపున గోదావరి, పక్కనే కృష్ణమ్మ పారుతున్నా, మడి తడిపే నీళ్లకు నోచుకోక తెలంగాణ గొడగొడ ఏడ్చింది. బీళ్లకు నీళ్లు మళ్లించే గురుతర బాధ్యతను మా భుజస్కంధాల మీద మోపిన్రు. రైతన్నల కలలను నెరవేర్చే ఈ సవాల్‌ను స్వీకరించి, కోటికి పైచిలుకు ఎకరాలకు సాగునీరు ఇచ్చేందుకు గోదావరి, కృష్ణా నదుల మీద ఏకకాలంలో భారీ ప్రాజెక్టుల నిర్మాణానికి పూనుకొన్నాం. మొదటిదశలో పెండింగ్ ప్రాజెక్టులను వాయువేగంతో పూర్తిచేసి, ఒక్క మహబూబ్‌నగర్ జిల్లాలోనే పది లక్షల ఎకరాలకు సాగునీరు అందించగలిగాం.

## ప్రాజెక్టులన్నీ పూర్తయితే ఎటు చూసినా పచ్చనిపైర్లే

తలపెట్టిన ప్రాజెక్టులన్నీ పూర్తయిన తర్వాత తెలంగాణలో ఎటుచూసినా పచ్చనిపైర్లే దర్శనమిస్తాయి. తెలంగాణలో కరువు అనే మాట ఇకముందు కనిపించదు, వినిపించదు. 365 రోజులూ తెలంగాణ చెరువులు, రిజర్వాయర్లు, బరాజ్‌లు నిండుకుండలను తలపిస్తాయి. ఏటా రెండు పంటలు పండి, ధాన్యపు రాశులతో తెలంగాణ అన్నపూర్ణగా అవతరిస్తుంది. పెరిగే వ్యవసాయ ఉత్పత్తులు తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు నూతనోత్తేజాన్ని ఇస్తాయి. నదిపొడవునా నిలిచే నీళ్లు, నిండుగా జలాశయాలు, పెరిగే భూగర్భ జలాలతో తెలంగాణ ఎకానమీ మాత్రమే కాదు, ఎకాలజీ అంటే పర్యావరణం కూడా మారిపోతుంది.

## 'రైతుబంధు' ప్రపంచానికే ఆదర్శం

రైతులకు పంటకాలంలో కావాల్సిన పెట్టుబడిని అందించడంకోసం ప్రవేశపెట్టిన రైతుబంధు పథకం రైతుల హృదయాల్లో హర్షం నింపింది. ఎకరానికి నాలుగువేల చొప్పున రెండు పంటలకు ఏడాదికి రూ.8 వేలు అందించి, పెట్టుబడి కోసం అప్పులుచేయాల్సిన అగత్యాన్ని నివారించగలిగాం. రైతుబంధు పథకం ద్వారా అందించే మొత్తాన్ని ఎకరానికి సంవత్సరానికి రూ.8 వేల నుంచి రూ.10 వేలకు పెంచి, ఈ ఏడాదినుంచే అందిస్తున్నామనే శుభవార్తను రైతులోకానికి తెలియజేస్తున్నాను. ఏ కారణం చేతనైనా రైతు మరణిస్తే, అతని కుటుంబం అగాధంలో పడవద్దని ఎంతో ఆలోచించి రైతుబీమా పథకాన్ని ప్రవేశపెట్టాం. బీమా ప్రీమియంను పూర్తిగా ప్రభుత్వమే చెల్లించి, మరణించిన రైతు కుటుంబానికి రూ.ఐదు లక్షల జీవిత బీమా మొత్తాన్ని సత్వరమే అందించుకోగలుగుతున్నాం. రైతులందరూ ఒకేపంట వేయడం వల్ల, డిమాండ్ తగ్గి తగిన ధర రాకుండాపోయే ప్రమాదాన్ని నివారించేందుకు క్రాప్ కాలనీలను ఏర్పాటు చేయబోతున్నాం. నేను కంటున్న కల ఒకటే. రైతుల తలరాతలు మారాలె. భారతదేశంలో ధనవంతులైన రైతాంగం ఎక్కడున్నారంటే, తెలంగాణలో అని చెప్పుకొనే రోజులు రావాలని నేను ప్రగాఢంగా ఆకాంక్షిస్తున్నాను. ఈ కల నెరవేరేదాకా అవిశ్రాంతంగా పరిశ్రమిస్తాను. అంకితభావంతో కృషిచేస్తాను. భగవంతుడు నాకిచ్చిన శక్తియుక్తులన్నింటినీ ఈ పవిత్ర లక్ష్యం కోసం ధారపోస్తానని మనవిచేస్తున్నాను.

## మొక్కలు నాటుదాం కదలిరండి

**పర్యావరణ** పరిరక్షణ కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన తెలంగాణకు హరితహారం కార్యక్రమం ఎంతో విశిష్టమైనది. పచ్చదనాన్ని 33% పెంచడానికి ప్రారంభించిన హరితహారం కార్యక్రమంలో ప్రతి ఒక్కరు విధిగా పాల్గొని, విరివిగామొక్కలు నాటాలని ఈ సందర్భంగా పిలుపునిస్తున్నాను. లక్ష్యసిద్ధి, చిత్తశుద్ధితో పనిచేసి హరిత తెలంగాణను ఆవిష్కరించుకోవాలె. సస్యశ్యామల, సమశీతల తెలంగాణను నిర్మించుకుందాం. జైహింద్, జై తెలంగాణ.

## చరిత్ర సృష్టించనున్న కాళేశ్వరం

**గోదావరి** మీద నిర్మిస్తున్న కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ తలరాతను మార్చబోతున్నది. ప్రపంచంలోనే అత్యంతవేగంగా నిర్మాణమైన అతిపెద్ద ప్రాజెక్టుగా కాళేశ్వరం చరిత్రలో నిలువబోతున్నది. రెండున్నరేండ్ల అతి తక్కువ సమయంలోనే ఇంత పెద్ద ప్రాజెక్టును నిర్మించగలగడం ప్రభుత్వ సమర్థతకు, సాంకేతిక ప్రతిభకు నిదర్శనం. వచ్చేనెల చివరినుంచి మేడిగడ్డ బరాజ్ ద్వారా ప్రతిరోజు రెండు టీఎంసీల చొప్పున గోదావరి నీటిని ఎత్తిపోయడానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నది. వచ్చే ఏడాది నుంచి మూడు టీఎంసీలను ఎత్తిపోసేందుకు వీలు గా నిర్మాణపనులు కొనసాగుతున్నాయి. జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి, కరీంనగర్, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, జనగామ, మహబూబాబాద్, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి, జగిత్యాల, మేడ్చల్ మల్కాజిగిరి, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాల్లో 45 లక్షల ఎకరాల్లో రెండు పంటలు పండేందుకు చాలినంత సాగునీరు అందించే కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ వరదాయినిగా అవతరించబోతున్నది. సముద్ర మట్టానికి 90 మీటర్ల ఎత్తునుంచి 618 మీటర్ల ఎత్తుదాకా నీళ్లను ఎత్తిపోసే ఇంజినీరింగ్ అద్భుతాన్ని ఆవిష్కరించేందుకు నీటిపారుదలశాఖ సన్నద్ధంగా ఉన్నది. భూగర్భాన్ని తొలిచి నిర్మించిన సొరంగాల గుండా ప్రవహించి వచ్చే, గోదావరి జలాలు తెలంగాణ పొలాలను తడుపుతుంటే రైతుల బతుకులు బాగుపడేరోజు దగ్గరలోనే ఉన్నదని తెలియజేస్తున్నాను. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలు మొత్తం, మహబూబాబాద్ జిల్లాలో కొంతభాగానికి పుష్కలంగా సాగునీరు లభించేవిధంగా సీతారామ ఎత్తిపోతల పథకం యుద్ధప్రాతిపదికన నిర్మాణమవుతున్నది. జయశంకర్ భూపాలపల్లి, ములుగు, వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్, జనగామ, మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాల సాగునీటి అవసరాలు సంపూర్ణంగా తీర్చేందుకు దేవాదుల ప్రాజెక్టు స్థాయిని మరింత పెంచి నిర్మించుకుంటున్నం.





నాంపల్లిలోని పబ్లిక్‌గార్డెన్స్‌లో జరిగిన రాష్ట్ర అవతరణ వేడుకలకు హాజరైన ఎంపీలు సంతోష్‌కుమార్, కే కేశవరావు, మాజీ ఎంపీ వినోద్‌కుమార్, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ దేవిప్రసాద్, సీఎంవో కార్యదర్శి స్మితాసబర్వాల్, హరితహారం ఓఎస్డీ ప్రియాక వర్గీస్, టెన్నిస్ క్రీడాకారిణి సానియా మిర్జా, తదితర ప్రముఖులు

## కాలం చెల్లిన వ్యవస్థలకు చరమగీతం



**దశాబ్దాల** తరబడి తెలంగాణలో సాగిన అస్తవ్యస్త విధానాలవల్ల స్థానిక పాలనావ్యవస్థలు చతికిలపడిపోయాయి. అందుకే ప్రభుత్వం స్థానికసంస్థల పనితీరును పునర్నిర్వచిస్తూ కొత్త పంచాయతీరాజ్ చట్టానికి రూపకల్పనచేసింది. గ్రామీణ స్థానిక పరిపాలనా సంస్థలకు ఏటా మొత్తం 2,458 కోట్ల రూపాయల చొప్పున నిధులు అందుతాయి. నూతన చట్టం పరిధిలో గ్రామ పరిపాలనలో అవినీతికి ఆస్కారం ఉండకూడదు. విధుల నిర్వహణలో విఫలమయినవారిని ఈ చట్టం ఉపేక్షించదు. కఠినమైన శిక్షలు విధిస్తుంది. పదవుల నుంచి తొలిగిస్తుంది.

### చట్టాలను మారుస్తాం

పట్టణీకరణ వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో పరిపాలనలో క్రమబద్ధతను, జవాబుదారీతనాన్ని తీసుకురావడానికి ప్రభుత్వం కొత్త పురపాలకచట్టాన్ని రూపొందిస్తున్నది. ఈ చట్టం ద్వారా పట్టణాలు, నగరాలు అడ్డదిడ్డంగా, అస్తవ్యస్తంగా పెరుగకుండా ఉండేందుకు కావాల్సిన కఠిననియమాలను ఈ చట్టం నిర్దేశిస్తుంది. కాలంచెల్లిన భావనలతో మన వ్యవస్థలు ఇంకా కొనసాగుతుండటం విచారకరం. చేసే పని మారినా, పేరు.. తీరు మారని భావదారిద్ర్యంలో వ్యవస్థలు నడుస్తున్నాయి. ఉదాహరణకు భూమిశిస్తు వసూలుచేసే కాలంలో రెవెన్యూశాఖ ఏర్పడింది. భూమిశిస్తు అనే మాటే ఇప్పుడు లేదు. రెవెన్యూ వసూలుచేసే పనిపోయినా, ఆ శాఖకు రెవెన్యూ అనేపేరు పోలేదు. రెవెన్యూను కలెక్ట్‌చేసే బాధ్యత పోయినా, కలెక్టర్ అనే మాట మారలేదు. ఇటువంటి అసంగతమైన విషయాలు చట్టంలో ఇంకా ఎన్నో ఉన్నాయి. ఫ్యూడల్ కాలంలో రూపొందించిన చట్టంలో అవినీతికి ఆస్కారమిచ్చే లొసుగులు అట్లనే ఉన్నాయి. భూరికార్డుల ప్రక్షాళనకు పూనుకున్న సందర్భంలో ఈ లోపాలన్నీ ప్రభుత్వ సంకల్పానికి అడ్డుగోడలుగా మారినాయి. ఈ నేపథ్యంలోనే రెవెన్యూ చట్టాన్ని పునరావలోకనం చేయడానికి, పునస్సమీక్షించడానికి ప్రభుత్వం ప్రయత్నాలు మొదలుపెట్టింది. రైతులు పడుతున్న ఇబ్బందులను తొలిగించేందుకు కొత్త రెవెన్యూ చట్టాన్ని రూపొందించడంలో ప్రభుత్వం నిమగ్నమైంది. ఈ చట్టం అమలులో ప్రజల విస్తృత భాగస్వామ్యాన్ని ప్రభుత్వం ఆశిస్తున్నది, ఆహ్వానిస్తున్నది. తెలంగాణ ప్రజలకు మొదటినుంచీ సామాజిక లక్ష్యాలను సాధించే చైతన్యం ఉన్నది. సుపరిపాలన కోసం కావాల్సిన మార్పులను సాధించడం పెద్ద కష్టమేమీకాదు. కావాల్సింది సంకల్ప శక్తి, సమన్వయ దృష్టి. ఈ దిశగా మనందరం పట్టుపట్టి, జట్టుకట్టి ముందడుగు వేయాలి. అవినీతికి అడ్డుకట్టలు వేస్తూ, పారదర్శక పరిపాలనలో ఉన్నత ప్రమాణాలను నెలకొల్పాలి.




ఆదివారం ఎల్బీ స్టేడియంలో ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్. చిత్రంలో మంత్రులు మహమూద్ అలీ, తలసాని శ్రీనివాస్‌యాదవ్, కొప్పుల ఈశ్వర్, మల్లారెడ్డి, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, ఎమ్మెల్సీ ఫారూఖ్‌హుస్సేన్, ఎమ్మెల్యే షకీల్ అమీర్, జీహెచ్‌ఎంసీ మేయర్ బొంతు రామ్మోహన్, వక్ఫ్‌బోర్డు చైర్మన్ మహ్మద్ సలీం తదితరులు ఉన్నారు.

# మతసామరస్యానికి నిలయం తెలంగాణ



ఎల్బీ స్టేడియంలో అధికారిక ఇఫ్తార్ విందు కార్యక్రమంలో రంజాన్ గిఫ్ట్ ప్యాక్‌లు చిన్నారులకు అందజేసి పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తున్న సీఎం కేసీఆర్

మూడోపేజీ తరువాయి...

రాష్ట్రం ఏర్పడినప్పుడు అనేక సమస్యలు ఎదురయ్యాయని, ఐదేండ్లుగా ఒక్కొక్కటిగా పరిష్కరించుకుంటూ రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపించామని తెలిపారు. అభివృద్ధి, విద్య, సంక్షేమం, వ్యవసాయరంగాల్లో ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నామన్నారు. తీవ్రంగా వేధించిన కరంటు సమస్యను అధిగమించి.. 24 గంటల నాణ్యమైన, ఉచిత విద్యుత్‌ను ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణేనని స్పష్టంచేశారు. మిషన్ భగీరథ పథకం ద్వారా వేల గ్రామాలకు శుద్ధమైన తాగునీటిని అందించగలుతున్నామని చెప్పారు. ఈ పథకంలో 2 నుంచి 3 శాతం పనులు మాత్రమే మిగిలి ఉన్నాయని, త్వరలోనే వాటిని కూడా పూర్తిచేస్తామని తెలిపారు. సాగునీటి ప్రాజెక్టులన్నీ చకచకా పూర్తవుతున్నాయని, కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా జూలై వరకు 45 లక్షల ఎకరాలకు సాగునీరందుతుందన్నారు. మైనార్టీల సంక్షేమం కోసం బడ్జెట్‌లో నిధులు పెంచామని, మైనార్టీ విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు గురుకుల పాఠశాలలను ఏర్పాటుచేశామని కేసీఆర్ తెలిపారు. మైనార్టీ గురుకులాలు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఫలితాలు సాధిస్తున్నాయన్నారు. గడిచిన ఐదేండ్లలో అన్నిమతాలను గౌరవించామని.. బోనాలు, రంజాన్, క్రిస్మస్ పండుగలను అధికారికంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలోని ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షిస్తూ.. ముస్లింలందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జామియా నిజామియా ఆడిటోరియం చిత్రం గల మెమెంటోను సీఎం కేసీఆర్‌కు ప్రభుత్వ సలహాదారు ఏకే ఖాన్, మైనార్టీ సంక్షేమశాఖ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం బహూకరించారు. కార్యక్రమంలో మంత్రులు మహమూద్ అలీ, కొప్పుల ఈశ్వర్, ఇంద్రకరణ్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, మల్లారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, తలసాని శ్రీనివాస్ యాదవ్, టీఆర్‌ఎస్ సెక్రటరీ జనరల్ కే కేశవరావు, మాజీ మంత్రి నాయిని నర్సింహారెడ్డి, ఎంపీలు అసదుద్దీన్ ఒవైసీ, బీబీ పాటిల్, ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ఎస్కే జోషి, డీజీపీ మహేందర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు అనురాగ్‌శర్మ, మాజీ ఎంపీ వినోద్‌కుమార్, ఎమ్మెల్సీలు ఫరీదుద్దీన్, ఎమ్మెస్ ప్రభాకర్‌రావు, ఫారూఖ్ హుస్సేన్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, షకీల్, మేయర్ బొంతు రామ్మోహన్, వక్ఫ్‌బోర్డు చైర్మన్ మహ్మద్ సలీం, మైనార్టీ కమిషన్ చైర్మన్ ఖమరుద్దీన్, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ అక్బర్ హుస్సేన్, హజ్‌కమిటీ చైర్మన్ మసిఉల్లా ఖాన్, ముస్లిం మత పెద్దలు, అధికారులు పాల్గొన్నారు.

# లాసెట్ ఫలితాలు విడుదల

ఐదేండ్ల లాసెట్‌లో టాప్-3 ర్యాంకులు సాధించిన అభ్యర్థులు



1 మెట్ట సూరజ్ | 2 సుశాంత్ శ్రీరామ్ | 3 సిలివేరు లక్ష్మీ తనూజ

పీజీ లాసెట్‌లో టాప్ ర్యాంకులు సాధించిన అభ్యర్థులు



2 వాసిరెడ్డి వైష్ణవి | 3 ధర్మపురి వాగ్దేవీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** లాసెట్ -2019 ఎంట్రెన్స్ ఫలితాలు విడుదలయ్యాయి. 2019-20 విద్యాసంవత్సరంలో మూడేండ్లు, ఐదేండ్ల ఎల్‌ఎల్‌బీ, రెండేండ్ల ఎల్‌ఎల్‌ఎం కోర్సుల్లో ప్రవేశాలకు ఉస్మానియా యూనివర్సిటీ ఆధ్వర్యంలో టీఎస్ లాసెట్, పీజీలాసెట్-2019 ఈ నెల 20న నిర్వహించారు. ఈ ఎంట్రెన్స్‌కు 24,920 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 19,188 మంది పరీక్షలకు హాజరుకాగా.. 15,504 మంది ఉత్తీర్ణులయ్యారు. మూడేండ్ల కోర్సుకు 13,141 మంది హాజరుకాగా.. 10,539 మంది, ఐదేండ్ల కోర్సుకు 4,179 మంది హాజరవ్వగా, 3,130 మంది ఉత్తీర్ణత సాధించారు. ఎల్‌ఎల్‌ఎం కోర్సుకు 1,868 మంది పరీక్ష రాయగా.. 1,835 మంది అర్హత సాధించారు. మూడేండ్ల ఎల్‌ఎల్‌బీ కోర్సులో ఢిల్లీకి చెందిన వికాస్ వశిష్ఠ మొదటిర్యాంకు సాధించగా.. కేతిరి దిలీప్ (జయశంకర్ భూపాలపల్లి), పాస్కెతి శ్రీనివాస్ (హైదరాబాద్) రెండు, మూడు ర్యాంకుల్లో నిలిచారు. ఐదేండ్ల కోర్సులో శ్రీకాకుళంకు చెందిన సూరజ్ మొదటిస్థానం, సుశాంత్ శ్రీరామ్ (జనగామ), సిలివేరు లక్ష్మి తనూజ (ఖమ్మం) తరువాతి స్థానాలు పొందారు. ఎల్‌ఎల్‌ఎం ఎంట్రన్స్‌లో మేడ్చల్ జిల్లాకు చెందిన వేముగంటి తరణి మొదటిర్యాంకు పొందారు. వాసిరెడ్డి వైష్ణవి (రంగారెడ్డి) రెండు, ధర్మపురి వాగ్దేవి (రంగారెడ్డి) మూడో ర్యాంకులు సాధించారు.

# సివిల్స్ ప్రిలిమ్స్‌కు భారీగా గైర్హాజరు

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్‌కు అభ్యర్థులు భారీగా గైర్హాజరయ్యారు. హైదరాబాద్‌లో 103 పరీక్ష కేంద్రాలను ఏర్పాటుచేయగా, జనరల్ స్టడీస్ పరీక్షకు మొత్తం 49,033 మందికిగాను 23,322 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన సీ- శాట్ పరీక్షకు 23,870 మంది గైర్హాజరయ్యారు. జిల్లా కలెక్టర్, పరీక్షల కోఆర్డినేటింగ్ అధికారి మాణిక్‌రాజ్ కన్నన్ పరీక్షల సమన్వయకర్తగా వ్యవహరించారు. గంటగంటకు పరీక్షల నిర్వహణ అధికారులు, సిబ్బందిని ఆరాతీస్తూ, అప్రమత్తంగా వ్యవహరించేలా చర్యలు తీసుకున్నారు. మొత్తంగా పరీక్ష సజావుగా ముగిసిందని కలెక్టర్ ప్రకటించారు. పరీక్షలు విజయవంతంగా పూర్తికావడంతో సివిల్స్ ప్రిలిమ్స్ పరీక్షల సూపరింటెండెంట్ అరుణ్‌జైశ్వాల్‌సహా ఉద్యోగులను ప్రత్యేకంగా అభినందించారు.

# ఒకే భూమి ఇద్దరికి విక్రయం!

- మొదటి వ్యక్తిని కాదని, రెండో వ్యక్తికి పట్టా ఇచ్చిన అధికారులు
- రెండు రిజిస్ట్రేషన్ల పేరుతో వీఆర్వో తప్పుదోవపట్టిస్తున్నారని బాధితుల నిరసన
- రిజిస్ట్రేషన్ పత్రాలు లేకున్నా పట్టాచేశారని ఇందూరు జిల్లా వడ్డేపల్లివాసి ఆరోపణ
- రెండు రిజిస్ట్రేషన్లు నిజమైతే.. విక్రేతపై క్రిమినల్ కేసు పెడుతామన్న బోధన్ ఆర్డీవో

**ఎడపల్లి:** భూమిని కొన్నది ఒకరైతే పట్టా అయింది ఇంకొకరి పేరున. భూయజమాని ఇద్దరు వ్యక్తులకు రిజిస్ట్రేషన్‌చేసి చేతులు దులుపుకున్నాడని రెవెన్యూ అధికారులు చెప్తుండగా, అదేం లేదని.. ఎలాంటి పత్రాలు లేకున్నా తన భూమిపై ఇతరులకు పట్టా ఇచ్చి అన్యాయంచేశారని, న్యాయంచేయండి అంటూ బాధితులు ఆరునెలలుగా రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండల కేంద్రం శివారులోని 656/6 సర్వేనంబర్‌లో మంగల్‌పాడ్ గ్రామానికి చెందిన మన్నె పోసాని అనే మహిళ ఎకరం భూమికి యజమాని. ఆమె 2007లో నిజామాబాద్‌కు చెందిన వికారుద్దీన్‌కు ఆ భూమిని విక్రయించారు. వికారుద్దీన్ ఎడపల్లి మండలం వడ్డేపల్లికి చెందిన అంబాల సావిత్రికి 2008 ఆగస్టులో ఆ భూమిని అమ్మేశారు. ఇందుకు సంబంధించి రిజిస్ట్రేషన్ కూడా జరిగింది. అనంతరం అంబాల సావిత్రి ఈ భూమికి పట్టా తీసుకోకుండా బతుకుదెరువు కోసం ఇతర ప్రాంతానికి వలసవెళ్లిపోయారు. భూప్రక్షాళన కార్యక్రమంలో భాగంగా కొత్త పట్టాదారు పాస్‌పుస్తకం ఇస్తున్నారని తెలిసి సావిత్రి తిరిగి స్వగ్రామానికి వచ్చారు. రిజిస్ట్రేషన్ పత్రాలతో వీఆర్వో ప్రకాశ్‌ను కలిశారు. పాస్‌పుస్తకం కోసం దరఖాస్తు చేయగా సమయం పడుతుందని చెప్పి కాలయాపనచేశారు. తిరిగి తిరిగి వేసారి వీఆర్వోను గట్టిగా అడిగితే అంబాల సావిత్రికి చెందిన సర్వేనంబర్ 656/6లోని భూమి 2017లో ఎర్రోల్ల సాయమ్మ పేర పట్టా అయిందని తెలిపారు. దీంతో బాధితురాలు ఎడపల్లి తాసిల్దార్ కార్యాలయంలో బోధన్ ఆర్డీవో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఆర్డీవో గోపీరాం వీర్వో ప్రకాశ్‌ను ప్రశ్నించగా, 2017లో మంగల్‌పాడ్ గ్రామానికి చెందిన ఎర్రోల్ల సాయమ్మ పేర రిజిస్ట్రేషన్ అయిందని, దాని ఆధారంగా ఆమె పేర పట్టా అయిందని వివరించారు. బాధితులు 2008 నుంచి తాము భూమిని ఎవరికీ అమ్మలేదని వాదించారు. వికారుద్దీన్ అనే వ్యక్తి ఎర్రోల్ల సాయమ్మకు రిజిస్ట్రేషన్‌చేసి ఇచ్చారని, అందుకే పట్టాచేశామని వీఆర్వో తెలిపారు. ఒకే వ్యక్తి ఇద్దరికి భూమిని ఎలా రిజిస్ట్రేషన్‌చేస్తారని బాధితులు ప్రశ్నించగా, ఈ విషయమై ఆర్డీవో పూర్తి విచారణకు ఆదేశించారు. విచారణ జరిపి ఒకే భూమిని ఇద్దరికి విక్రయించినట్టు తేలితే వికారుద్దీన్‌పై క్రిమినల్ కేసు పెట్టాలని ఆర్డీవో ఆదేశించారు.



### వీఆర్వో తప్పుదోవపట్టిస్తున్నారు..

మేము కొంత కాలంగా గ్రామంలో లేకపోవడంతో అంబాల సావిత్రి కొనుగోలుచేసిన భూమిని మంగల్‌పాడ్‌కు చెందిన ఎర్రోల్ల సాయమ్మ కబ్జాచేశారు. రెవెన్యూ అధికారులను మచ్చిక చేసుకొని దొడ్డిదారిన భూమి పట్టాచేసుకున్నారు. రెవెన్యూ అధికారులు పూర్తిగా సహకరించారు. వీఆర్వోను ప్రశ్నిస్తే ఎర్రోల్ల సాయమ్మకు వికారుద్దీన్ రిజిస్ట్రేషన్‌చేశారని, అందుకే పట్టాచేశామని తప్పుదోవ పట్టిస్తున్నారు. ఎర్రోల్ల సాయమ్మ వద్ద ఎలాంటి రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు లేవు. ఒకే సర్వేనంబర్‌లోని భూమి ఇద్దరికి రిజిస్ట్రేషన్ కాదు. ఈ విషయమై పూర్తి విచారణ జరిపి న్యాయంచేయాలి.

- రత్నం, బాధితురాలు సావిత్రి బావ, వడ్డేపల్లి

### నిజమైన లబ్ధిదారుకు న్యాయంచేస్తాం



ఈ భూవివాదంపై విచారణ జరుపుతాం. వడ్డేపల్లికి చెందిన అంబాల సావిత్రి, మంగల్‌పాడ్‌కు చెందిన ఎర్రోల్ల సాయమ్మ.. ఇద్దరికి వికారుద్దీన్ డబుల్ రిజిస్ట్రేషన్‌చేస్తే ఆయనపై క్రిమినల్ కేసు పెడుతాం. ఈ విషయంలో పూర్తి విచారణ జరిపి నివేదిక ఇవ్వమని వీఆర్వో ప్రకాశ్‌ను ఆదేశించా. డబుల్ రిజిస్ట్రేషన్‌చేస్తే చీటింగ్ కేసు కూడా పెడుతాం. ఎవరు ముందు కొన్నారో.. ఎవరు తర్వాత కొన్నారో.. చూసి నిజమైన లబ్ధిదారుకు న్యాయంచేస్తాం.

- గోపీరాం, ఆర్డీవో, బోధన్

# కాస్తులో ఉన్నా.. రికార్డుల్లో లేదు

- యజమానికి తెలియకుండానే ఇతరులకు పట్టా
- వారసత్వ భూమికి పాస్‌పుస్తకం ఇవ్వని అధికారులు



భూమి పత్రాలు చూపుతున్న పాలమూరు జిల్లా ఈదులబావితండావాసి చంద్రుడు

**మిడ్జిల్:** సాగుచేసుకుంటున్న భూమి రికార్డుల్లో మాయమైంది. యజమానికి తెలియకుండానే ఇతరుల పేరున పట్టా చేసేశారు. వారసత్వంగా వచ్చిన భూమి తమ ఆధీనంలో ఉన్నా యాజమాన్య హక్కు లేదంటున్నారు. కార్యాలయాల చుట్టూ ఏండ్లుగా తిరుగుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు. రెవెన్యూ అధికారుల తీరుతో విసిగివేసారిన బాధితులు తమకు న్యాయం చేయాలని మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలం ఈదులబావితండా (మసిగుండ్లపల్లి) పంచాయతీకి చెందిన రైతు పాత్లవత్ చంద్రుడు 'ధర్మగంట'ను ఆశ్రయించారు. వారసత్వంగా వచ్చిన భూమి వివరాలు రికార్డుల్లో నమోదుచేసి, పాస్‌పుస్తకాలు ఇప్పించాలని మొరపెట్టుకున్నారు. పాత్లవత్ చంద్రుడు తండ్రి రామ్‌సింగ్ పేరు మీద 1971లో 36.4 ఎకరాల భూమి ఉన్నది. చంద్రుడు తాత కొన్న భూమిని వారసులు సాగుచేసుకొంటున్నారు. రామ్‌సింగ్‌తోపాటు అతని ముగ్గురు సోదరులు భూమికి వారసులు. రామ్‌సింగ్‌కు తెలియకుండానే మొత్తం భూమిని అతని తమ్ముళ్లు1975-76లో వారిపేరున పట్టాచేయించుకున్నారు. భూమిని సాగుచేసుకుంటున్న రామ్‌సింగ్ ఇద్దరు కుమారులకు ఈ విషయం తెలియదు. తండ్రి వారసత్వంగా తమకు రావాల్సిన భాగం 9 ఎకరాల భూమిని చంద్రుడు, అతని సోదరుడు లక్ష్మణ్ సాగుచేసుకుంటున్నా రెవెన్యూ రికార్డుల్లో మాత్రం వారిపేరుమీద పొలం లేదు. రైతుబంధు సాయం అందకపోవడంతో రెవెన్యూ అధికారులను అడిగితే అసలు విషయం తెలిసిందని బాధితుడు తెలిపారు. లక్ష్మణ్ చనిపోవడంతో తనకు, తన తమ్ముడి కుటుంబానికి దక్కాల్సిన వారసత్వ భూమి హక్కుల కోసం చంద్రుడు రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకునేవారు లేరు. రామ్‌సింగ్ వాటాకు దక్కాల్సి 9 ఎకరాల్లో చంద్రుడికి, అతని సోదరుడు లక్ష్మణ్ కుటుంబానికి నాలుగున్నర ఎకరాల చొప్పున వారసత్వంగా రావాల్సి ఉండగా, చెరో 13 గుంటల భూమి మాత్రమే వారిపేరున వచ్చిందని చంద్రుడు కుమారుడు తిరుపతి తెలిపారు. మిగతా 8 ఎకరాల 14 గుంటల భూమిని రికార్డుల్లో నుంచి మాయంచేశారని, ఫోర్జరీ సంతకాలతో తమ భూమిని ఇతరులకు పట్టాచేశారని ఆరోపించారు. నేటికీ తామే కాస్తులో ఉన్నా, రెవెన్యూ రికార్డుల్లో తమ పేరున లేదని, పరిశీలించి తమ పేరున చేయాలని కోరినా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని బాధితులు వాపోయారు. భూమి సర్వే చేయించి, తమకు నాయ్యం చేయాలని కోరారు. తమ ప్రమేయం లేకుండా ఇతరులకు పట్టాచేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తిచేశారు.

**సర్వేకు దరఖాస్తు పెట్టుకోవాలి: రాంచంద్రయ్య, తాసిల్దార్**

వారసత్వంగా వచ్చిన భూమిని సాగుచేసుకుంటున్న చంద్రుడు, అతని తమ్ముడి కుటుంబం భూమి సర్వే కోసం ఆర్డీవోకు దరఖాస్తు చేసుకోవాలి. సర్వేచేసిన తర్వాత వారికి చెందిన భూమికి పట్టా ఇచ్చే అవకాశం ఉంటుంది. వెంటనే దరఖాస్తు చేసుకుంటే వారికి తగిన న్యాయంచేస్తాం.

## మా మాట!

### ధర్మగంటతో రైతులకు న్యాయం



ధర్మగంట రైతులకు వరంలా మారింది. ఇన్నాళ్లు భూసమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలిసేది కాదు. 'ధర్మగంట' పేరుతో 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమవుతున్న కథనాలు చూసి వీఆర్వోలు, ఉన్నతాధికారులు బెంబేలెత్తిపోతున్నరు. ఇంటికే వచ్చి మా భూములకు పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇస్తున్నారు. గతంలో లంచం ఇవ్వనిదే పనిచేసేవారు కాదు. ఇప్పుడు మా రైతులందరికీ 'ధర్మగంట' ఎంతో మేలుచేస్తున్నది. పట్టాదారు పాస్‌పుస్తకాల్లో ఉన్న తప్పులు కూడా సరిచేస్తున్నారు. భూముల విషయాలు తెలియని ఎంతో మంది రైతులకు ధర్మగంట న్యాయం చేసింది. ప్రభుత్వ, అసైన్డ్, పట్టా లాంటి భూముల విషయాలను బాగా తెలుసుకున్నాం. మాకు 'ధర్మగంట'తో న్యాయం జరిగింది.

- పురాణం యాదారాజేశ్వరి, రైతు, దుర్గంపేట, వరంగల్ రూరల్ జిల్లా

### అధికారుల్లో మార్పు వస్తున్నది



'ధర్మగంట'తో రెవెన్యూ అధికారుల్లో మార్పు వస్తున్నది. ప్రస్తుతం రెవెన్యూ అధికారులు భూరికార్డుల శుద్ధీకరణ వేగవంతంచేశారు. గతంలో ఏండ్ల తరబడి రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగినా పూర్తికాని పనులు.. ఇప్పుడు ధర్మగంట వల్ల పరిష్కారమవుతున్నాయి. భూరికార్డుల ప్రక్షాళనతో సీఎం కేసీఆర్ రైతులకు ఎంతో మేలు చేశారు. ముఖ్యంగా సర్కారు నిర్ణయానికి తోడు 'ధర్మగంట' వల్ల రెవెన్యూ అధికారుల్లో చలనం వచ్చింది.

- కడారి కుమారస్వామి, మాధన్నపేట, రైతు, వరంగల్ రూరల్ జిల్లా

# స్వాతంత్ర్య సమరయోధుడి భూమిపై కన్ను

- ఆక్రమణకు గురవుతున్నదని మొరపెట్టుకున్నా చర్యలు తీసుకోని అధికారులు
- రాజన్న సిరిసిల్ల జిల్లా అక్కపెల్లికి చెందిన పడమటింటి సత్తయ్య ఆవేదన




సత్తయ్య పాస్‌పుస్తకంలో నమోదైన పదెకరాల భూమి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** స్వాతంత్ర్య సమరయోధులకు ప్రభుత్వం కేటాయించిన భూమికి కూడా రక్షణలేకుండాపోతున్నది. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం అక్కపెల్లికి చెందిన పడమటింటి ఆగయ్యకు స్వాతంత్ర్య సమరయోధుడి కోటాలో ప్రభుత్వం పదెకరాల భూమిని కేటాయించింది. అదేగ్రామంలో సర్వేనంబర్ 190/22/1లో సదరు భూమిని 1978లో ఆగయ్య పేరిట పట్టా మంజూరుచేసింది. 1988లో ఆగయ్య మరణించడంతో ఆయన కొడుకు పడమటింటి సత్తయ్యకు ఆ భూమి విరాసత్ ద్వారా సంక్రమించింది. ఈ భూమి 1990లో ఆగయ్య నుంచి సత్తయ్యకు వారసత్వంగా వచ్చినట్టు పహాణీలో నమోదైంది. సత్తయ్య పేరిట పాస్‌పుస్తకం కూడా మంజూరుచేశారు. సదరు భూమికి రెండు విడుతల్లో రైతుబంధు సాయం కూడా తీసుకున్నామని సత్తయ్య చెప్తున్నారు. ఆ భూమిపై ఇండియన్ ఓవర్సీస్‌బ్యాంకులో తీసుకున్న రూ.లక్ష రుణం కూడా మాఫీ అయిందన్నారు. అయితే సంబంధిత భూమిలోకి కొందరు వ్యక్తులు అక్రమంగా ప్రవేశించి, తమను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని బాధితుడు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. సదరు భూమిని సర్వేచేయించి కొలతలు, హద్దులు నిర్ణయించాలని ఎన్నిసార్లు రెవెన్యూ అధికారులకు మొరపెట్టుకున్నా ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని బాధితుడు ఆరోపిస్తున్నారు.



పడమటింటి సత్తయ్య పాస్‌బుక్

### సర్వేయర్‌కు దరఖాస్తు చేసుకోవాలి

సత్తయ్యకు సంబంధించిన పాస్‌పుస్తకం సరిగానే ఉన్నది. సర్వేచేసి, కొలతలు, హద్దులు నిర్ణయించడం మా పరిధిలోనిది కాదు. మీసేవ కేంద్రంలో సర్వేయర్‌కు దరఖాస్తు చేసుకోవాలి. అప్పుడు సర్వేయర్‌తోపాటు మేం కూడా మోఖా మీదకువెళ్లి పరిశీలిస్తాం. పట్టా, పహాణీల్లో ఏమైనా సమస్యలుంటే మేం పరిష్కరిస్తాం. అలాంటివేమీలేవు కాబట్టి సర్వేయర్‌కు దరఖాస్తు చేసుకోవాలి. భూమి కొలతలు, హద్దులు సర్వేయరే నిర్ణయిస్తారు.

- శ్రీనివాస్, వీఆర్వో

# బాండ్‌పేపర్‌తో చీటింగ్

- పొలానికి దారి అడిగితే.. బదులుగా 32 గుంటలు రాసేసుకున్నారు
- అభ్యంతరాలుచెప్పినా ఆర్వోఆర్ జారీచేసిన రెవెన్యూ అధికారులు
- సిద్దిపేట జిల్లా తొగుట మండలం బండారుపల్లి రైతు ప్రభాకర్‌రెడ్డి ఆవేదన



బాధితుడు ప్రభాకర్‌రెడ్డి

**తొగుట:** సిద్దిపేట జిల్లా తొగుట మండలం బండారుపల్లికి చెందిన అబ్బిడి మల్లారెడ్డికి 153/ఉ సర్వే నంబర్‌లో ఆరెకరాల భూమి ఉన్నది. ఈ పొలానికి దారి లేకపోవడంతో దారి కోసం 9 ఆగస్టు 2010లో తన పొలం పక్కన భూమి ఉన్న అదే గ్రామానికి చెందిన గంగుల నరసింహారెడ్డితో ఒప్పందం చేసుకున్నారు. ఒప్పందం ప్రకారం 4 గజాల వెడల్పుతో నరసింహారెడ్డి పొలం నుంచి మల్లారెడ్డికి తోవ ఇవ్వాలని.. ఎంత భూమి కోల్పోతే యజమానికి మల్లారెడ్డి అంత భూమి ఇవ్వాలని బాండ్‌పేపర్‌లో రాసుకున్నారు. అప్పటి నుంచి ఈ దారి గుండా మల్లారెడ్డి రాకపోకలుసాగిస్తున్నారు. కొంత భూమిలో నరసింహారెడ్డి కాస్తులో ఉంటున్నారు. బాండ్‌పేపర్‌లో ఎవరికి ఎన్ని గుంటలు భూమి ఇవ్వాలో వివరాలు ముందుగా రాసుకోలేదు. కానీ '153 సర్వే నంబర్‌లోని 32 గుంటల భూమిని మల్లారెడ్డి నుంచి చేయించుకోగలవు' అని కొత్తగా జొప్పించారని మల్లారెడ్డి కుమారుడు ప్రభాకర్‌రెడ్డి ఆరోపిస్తున్నారు. ఈ బాండ్‌పేపర్ ఆధారంగా నరసింహారెడ్డి ఈ భూమిని ఆర్వోఆర్ ద్వారా తన కుమారుడు యాదిరెడ్డి పేర చేయాలని దరఖాస్తు చేసుకున్నారు. ఈ క్రమంలో విచారణచేసిన వీఆర్వో రమేశ్ దీని అమలుకు సంబంధించి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నోటీసు అంటించారు. విషయం తెలుసుకున్న మల్లారెడ్డి కుమారులు అభ్యంతరం వ్యక్తంచేశారు. ఈ క్రమంలో నరసింహారెడ్డి కుమారుడు యాదిరెడ్డితో మల్లారెడ్డి కుటుంబీకులు కలిసి పెద్దలు మరోసారి మాట్లాడి 32 గుంటలకు బదులుగా యాదిరెడ్డి తనకు చెందిన సర్వే నంబర్ 146/5, 149/ఆలో గల 16 గుంటల భూమిని ఇస్తాడని ఒప్పందంచేసుకున్నారు. అయితే ఇప్పటివరకు మల్లారెడ్డి భార్య సత్యలక్ష్మి పేరిట కేవలం 4 గుంటల భూమి మాత్రమే అమలు చేశారు. మిగతా 12 గుంటల భూమి అమలు చేయకపోవడంతో మల్లారెడ్డి కుటుంబీకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై సిద్దిపేట ఆర్డీవోకు, తొగుట తాసిల్దార్‌కు వినతిపత్రాలు అందించినా ఇంతవరకు సమస్య పరిష్కారం కాలేదు. ఆర్వోఆర్ అమలుచేయాలి అంటే అందులో ఉన్న వ్యక్తుల పేరనే అమలుచేయాల్సి ఉండగా, గంగుల నరసింహారెడ్డి ఉండగా అతని కుమారుడు యాదిరెడ్డి పేర అమలుచేశారు. అలాగే అభ్యంతరం తెలిపినా అమలుచేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని మల్లారెడ్డి కుమారుడు ప్రభాకర్‌రెడ్డి కోరుతున్నారు. తమకు యాదిరెడ్డి నుంచి రావాల్సిన 12 గుంటల భూమి వచ్చేలా చూడాలని, లేని పక్షంలో దారి అవసరం లేదని.. బాండ్‌పేపర్ ద్వారా అక్రమంగా అమలుచేసుకున్న ఆర్వోఆర్‌ను రద్దుచేసి తమ 32 గుంటల భూమిని ఇప్పించాలని కోరుతున్నారు.

**విచారణ జరిపి న్యాయంచేస్తాం**

బండారుపల్లికి చెందిన అబ్బిడి మల్లారెడ్డి, గంగుల నరసింహారెడ్డికి సంబంధించిన భూసమస్య తమ దృష్టికి వచ్చిందని.. పూర్తిస్థాయిలో విచారణ జరిపి న్యాయంచేస్తామని తాసిల్దార్ వీర్‌సింగ్ చెప్పారు.

# ఊరు దాటిన భూమి!

మూడోపేజీ తరువాయి...

మరోసారి పేర్కొన్నారు. తన భూమికి సంబంధించి సర్వేనంబర్లు, శివారు గ్రామాలను ఇష్టం వచ్చినట్టు మార్చారని, తనకు న్యాయంచేయాలని కోరినా అధికారులు పట్టించుకోలేదని బాధితురాలు జక్కం బుచ్చమ్మ చెప్తున్నారు. తన సర్వే నంబర్ 405/10/2 ఏ కారణం, ఏ ఆధారంగా మార్చుచేశారని ప్రశ్నిస్తూ.. బుచ్చమ్మ 27-07-2018న ఆర్టీఐ ద్వారా దరఖాస్తు చేసుకొంటే.. ఏడునెలల తర్వాత 21-02-2019న అధికారులు స్పందించి విచిత్రమైన సమాధానం ఇచ్చారు. అది చేతిరాత తప్పిదం వల్ల జరిగిన పొరపాటని సర్ది చెప్పుకొన్నారు. సర్వేయర్, గిర్దావర్, రెవెన్యూ అధికారులు మోఖాపైకి వెళ్లి నివేదిక సమర్పించాలని తాసిల్దార్ ఆదేశించారు. కానీ, ఇప్పటివరకు దానికి సంబంధించిన ఎలాంటి చర్యలు తీసుకోలేదు. బుచ్చమ్మ భర్త పేరు కూడా ఈ ఆర్టీఐ సమాధానంలో తప్పుగా పేర్కొనడం గమనార్హం.

**ఆర్డీవో ఇచ్చిన పుస్తకంలో దిద్దిన వీఆర్వో**

బుచ్చమ్మ భూమి కొన్న సమయంలో ఇచ్చిన రెండు పుస్తకాల్లో, ఆర్డీవో నుంచి వచ్చిన పట్టాదారు పాస్‌పుస్తకంలో సర్వే నంబర్లను వీఆర్వో దిద్దారు. 405/10/2 సర్వేనంబర్‌ను 405/4/2గా మార్చేశారు. ఆ విషయం పుస్తకంలో స్పష్టంగా కనిపిస్తున్నది. మరోవైపు మధ్యలో డబ్బు తీసుకొని వేరే మహిళ పేరు ఎక్కించిన రెవెన్యూ అధికారులు.. ఈ విషయమై బుచ్చమ్మ నిలదీయడంతో తిరిగి ఆమె పేరును తొలిగించారు. ఆ మహిళ పేరు ఎక్కించిన సమయంలో భూమికి సంబంధించి అనువంశికం అని పేర్కొన్నారు. బుచ్చమ్మ ఆ భూమిని వేరే మహిళ నుంచి కొనుగోలు చేయగా, ప్రస్తుతం ఆ భూమి అనువంశికం అనే పదంతోనే కొనసాగుతున్నది. ఇలా తప్పుల మీద తప్పులుచేసిన అధికారులు వాటిని దిద్దుకునేందుకు తిరిగి మళ్లీ తప్పులుచేస్తున్నారు. ప్రశ్నిస్తే అసలు నీకు భూమే లేదని అధికారులు బెదిరిస్తున్నారని బుచ్చమ్మ ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఎన్నిమార్లు అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోలేదని, తనకు న్యాయంచేయాలని బాధితురాలు కోరుతున్నారు.




బుచ్చమ్మ భూమికి సంబంధించిన పాత పహాణీ

# ఆన్‌లైన్ తప్పులు.. రైతుకు తిప్పలు!

- రికార్డుల్లో నమోదుచేయాలని ఏడాదిగా వినతి
- వారసత్వ పట్టాలున్నా పట్టించుకోని రెవెన్యూ అధికారులు
- ధర్మగంటను ఆశ్రయించిన వికారాబాద్ జిల్లా కోకట్ గ్రామ రైతు బిచ్చిరెడ్డి



**యాలాల:** అధికారుల తప్పిదం ఆ రైతుకు శాపంగా మారింది. వారసత్వ పట్టా చేసి ఆన్‌లైన్‌లో నమోదుచేయలేదు. దీంతో రైతుబంధు సాయం రెండు విడుతలు అందకుండా పోయింది. రైతుకు తెలియకుండానే పట్టా మార్పిడిచేసి, ఉన్న భూమిని రికార్డుల్లో తగ్గించి తప్పుగా నమోదుచేశారు. సరిచేయాలని కోరుతూ వికారాబాద్ జిల్లా యాలాల మండలం కోకట్ గ్రామానికి చెందిన బాధిత రైతు కయ్యం బిచ్చిరెడ్డి తాసిల్దార్ కార్యాలయం చుట్టూ ఏడాదిగా తిరుగుతున్నా పట్టించుకోవడంలేదు. దీంతో బాధితుడు 'ధర్మగంట'ను ఆశ్రయించారు. రెవెన్యూ అధికారులు రికార్డుల్లో తప్పుగా నమోదు చేయడంతోనే తనకు నష్టం జరిగిందని రైతు వాపోయారు. బిచ్చిరెడ్డికి సర్వే నంబర్ 159లో 8.05 ఎకరాల భూమి ఉండగా, రికార్డుల్లో 6.30 ఎకరాలని, సర్వే నంబర్ 187లోని 7.11 ఎకరాలకు 4.34 ఎకరాలుగా, సర్వే నంబర్ 217లో 21 గుంటలకు 16 గుంటలని రెవెన్యూ అధికారులు తప్పుగా నమోదు చేయడమేగాక, సర్వే నంబర్ 247లోని 2.23 ఎకరాల భూమిని రికార్డుల నుంచి మొత్తానికే తొలిగించారు. సర్వే నంబర్ 339లోని 11 గుంటల భూమికి మాత్రమే రైతుబంధు వర్తించింది. మిగతా సర్వే నంబర్లలోని భూమి ఎక్కడికి వెళ్లిందని రైతు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. మిగతా భూమిని కూడా ఆన్‌లైన్‌లో ఎక్కించాలని కోరుతుంటే కాలయాపనచేస్తూ, ఏడాది కాలంగా కార్యాలయం చుట్టూ తిప్పించుకుంటున్నారని వాపోయారు.

### ఆర్డీవో, కలెక్టర్ సరిచేయాలి

వీఆర్వోచేసిన తప్పిదం వల్ల రికార్డుల్లో తప్పుగా భూమి వివరాలు నమోదయ్యాయి. వాటిని సరిచేయడం ఆర్డీవో, కలెక్టర్ పరిధిలోనే ఉంటుంది. ఆర్డీవో, కలెక్టర్‌కు బాధిత రైతు దరఖాస్తు చేసుకోవాలి.

- మల్లేశ్‌కుమార్, తాసిల్దార్, యాలాల

తెలంగాణ ప్రభుత్వం
సెక్రటరీ కార్యాలయం
తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ, హైదరాబాద్

Rc.No. Acad-II/ 3420 / 2018, నోటిఫికేషన్ తేది: 01-06-2019

ఒకేషనల్ ఇంటర్మీడియట్ కోర్సుల కొరకు గెస్ట్ ఫ్యాకల్టీ కొరకు అర్హత గల అభ్యర్థుల నుండి ఆన్‌లైన్ దరఖాస్తులు కోరబడుచున్నవి.ఆన్‌లైన్ దరఖాస్తు ధర: రూ.300/- దానిని క్రెడిట్ కార్డు/ డెబిట్ కార్డు / నెట్ బ్యాంకింగ్ ద్వారా అభ్యర్థి చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు దాఖలుకు ఆఖరు తేది: 13.06.2019. ప్రాస్పెక్టస్ మరియు అర్హతను సైట్ www.tswreis.in లో 05.06.2019 నుండి చూడవచ్చును.

DIPR R.O.No. 125 PP/CL/Advt/1/2019-20, తేది: 01-06-2019 సం/- జాయింట్ సెక్రటరీ (అకడమిక్)

TELANGANA STATE SCHEDULED CASTES STUDY CIRCLE : HYDERABAD
Road No. 14, Opp: KBR Park, Banjara Hills, Hyderabad-34
(Sponsored by Dept. of Scheduled Castes Development, Government of Telangana) Ph: 040-23546552

Rc.No. TSSCSC/43/2019 Dated: 03-06-2019

NOTIFICATION

FREE COACHING FOR FOUNDATION COURSE FOR STATE SERVICES INCLUDING BANKING, RRB AND SSC

The SCD Dept. is arranging free coaching for ($5^{1/2}$) Months **Foundation Course including Banking, RRB and SSC** in all (10)TSSC Study Circle District branches at **Nalgonda, Warangal, Karimnagar, Mahaboobnagar, Nizamabad, Adilabad, Khammam, Rangareddy, Suryapet and Siddipet Districts for about (100) SC,ST, BC and Minority Candidates, organized between 15th July, 2019 and 31st December, 2019,** through Telangana State Scheduled Castes Study Circle, Hyderabad for which online applications are invited from any General/ Professional Degree Candidates of Telangana (33) Districts from **04-06-2019.** The last date for receipt of applications is **20-06-2019.** The date of entrance test is scheduled on **30-06-2019 between 11.00 AM & 01.00 PM, at all the above mentioned (10) Districts.**
The detailed notification will be uploaded in the website **http://www.tsscstudycircle.telangana.gov.in** and for further details please contact 040-23546552.

Sd/- C. Sridhar
Director, TSSC Study Circle, Hyderabad

# కాల బలం



తెల్లవారు జామిది
మబ్బుల్ని పక్కకు పంపడమే మనపని
తొలి భానోదయం వల్లనే కదా
అస్తిత్వ సంస్కృతులకు అడ్రస్ దొరికింది
మన త్రిలింగ దేశం కోసమేగా..
సమర కపోతాలు కలలు గన్నది

ఎన్నెన్ని జాతి పావురాల భస్మమైతేనేగాని
తల్లినేలకింద రూపం దొరికింది..!

ఇప్పటికీ మనకు
ముందూ వెనక ఉన్న నీడలు మళ్లీ మళ్లీ చిగురిస్తూనే ఉన్నాయి
నీడలు మృగాల ప్రతిరూపాలే కనుక
అక్షరాలకు ఆయుధాలివ్వక తప్పదు!

మన నేల చుట్టూ సముద్రాలు లేవుగానీ
మనో వుప్పెనలకు కొదువేం లేదు
మన గుండెలు గట్టివి కాబట్టే

అమరుల ఆత్మలు బతుకుతున్నాయి
అందువల్లే కదా..!
మనకాళ్లమీద మనం నిల్చోగలిగాం
మనది సేద్యానికి సిద్ధమైన నేలకాబట్టే
పదేళ్లబట్టి..
అక్షరాల అంతర్ స్వరాలిప్పుడు
ఎలుగెత్తి బాహ్య స్వరూపాలుగా నిలువెత్తు నిలుస్తున్నాయి!

మన ఇల్లు మనది కావడానికి
ఇంతటి సమర స్వభావాన్ని నిలిపిందెవరు..!
ఆనాటి పోరాట అస్తిత్వం
మన బుతుకులో బతకబట్టే కదా!
ఈ స్వేచ్ఛా విహంగాలను అలుముకోగలుగుతున్నది!

మనం దహనమైన చోటే సంఘర్షించిన చోటే
మన పూర్వీకుల పునాది రాళ్లను గుర్తించగలుగుతున్నాం..!

మన త్రికాల మన ఫలకాల మీద
భవిష్యత్తును నర్మించే శృతి స్వరాలిప్పుడు
పూలపుప్పొడిలా కురువాల్సేఉంది
రెక్కలు తెగిన పక్షుల్ని సైతం
ప్రాణవాయువులూది ఎగరవేయకపోతే ఎలా?

తప్పదు ఈ ప్రపంచ సంతలో
మనమిప్పుడు మెలుకువతోనే ఉందాం
అవతరణకు ఆధ్యులమైన మనం
అంతర్ ఆధిపత్య దుర్భరులను ఎదుర్కోకతప్పదు
అనునిత్యం మొలిచే మొక్కలు
సూర్యునికి సుప్రభాతం పలుకగలవు..

– డాక్టర్ నాళేశ్వరం శంకరం
94404 51960

## సింగిడి లోకం..



రమణీయ రవికిరణ శోభితంబయినట్టి
ఆ మోము కనినంత
ఆ బాలగోపాల హృదయమొప్పొంగ
వచ్చిందే వచ్చిందే వేల ఆశలతోడ
కోటి కాంతుల వీణ.. నా తెలంగాణ.

దాశరథీ పునర్నవమై, కాళోజీ గొడవతో
జయ్ శంకర్ విరచితమై.. ఆమరుల ఆశయమై
పరుగు పరుగన ఉరికె..
ప్రగతి పథ సాధనమై ప్రతి గడపలోకి..
అవ్వకూ–బిడ్డకూ, అక్కకూ–చెల్లకూ..
అన్నకూ–తమ్ముడికి, అందాల పొదరింటి తెలగాణకీ
వచ్చిందే వచ్చిందే వేల ఆశల తోడ
కోటి కాంతుల వీణ.. నా తెలంగాణ..

గోదారి గంగమ్మ, కృష్ణమ్మ సెలయేళ్ళు
దారితప్పిన బీళ్ళసొద పారదోలంగ
పాలిచ్చే తల్లులై మురిపాలు పంచంగా
వచ్చిందే వచ్చిందే వేల ఆశల తోడ
కోటి కాంతుల వీణ.. నా తెలంగాణ..



కాలుడీ కనికరమో.. ఈశ్వరుడి వేళయో
కాళేశ్వర తీర్థాన.. కైలాస గంగోలె
కదిలింది గోదారి తెలగాణకీ.. నా తెలంగాణకీ
రందొద్దు.. రగడొద్దు.. రండోయ్ పండుగ చేద్దాం.

హలములే మురవంగా..
కరములే మొక్కంగా..
పొలములే నవ్వంగా..
సారథై అండగా.. కేసీఆర్ ఉండగా
రైతుబంధు తెచ్చింది.. రైతు రాజ్యము
తెలంగాణ అయ్యింది సింగిడి లోకము.

అన్నిటినీ అధిగమిస్తూ..
అందరినీ హత్తుకుంటూ..
అభివృద్ధికి ముందరెళ్తు..
ప్రగతికి పచ్చలహారంబేస్తూ...
భరతజాతి నిర్దేశకులమై..
సాగుతోన్న తెలంగాణ.. నిత్య పారిజాతమూ
కోటి అలల గీతమూ.. ఉషోదయపు పరిమళమూ..
ఆనందపు నందనమూ..
అద్భుతపు సోయగము..

– మధు బండి, 96037 96570

# చె లి మె

## పండితారాధ్య చరిత్ర

# ఒక విజ్ఞాన సర్వస్వమే

**భారతీయ సాహిత్య వికాసములు నన్నయ కాలం పరివర్తన శీలం అయింది. పాకృత ప్రాభవం తగ్గి సంస్కృతంలో కావ్యాలు, నాటకాలు గద్యకావ్యాలైన కాదంబరి వంటివి వెలువడుతున్నాయి.** ఆ కాలంలోనే భోజుని చంపూ రామాయణం వచ్చింది. అప్పటికే జైన బౌద్ధాలు వెనుకబడినాయి. పూర్వోత్తర మీమాంసలు ప్రజలను ఆకర్షిస్తున్నాయి. జ్ఞానానికి అద్వైత శాస్త్ర విచారము, అనుష్ఠానానికి పూర్వ మీమాంసలు పాదులైనాయి. పూర్వ మీమాంసలోని పశు హింసా భావానికి ఆదరణ తగ్గి ప్రతీకాత్మకంగా పిష్ఠ పశువధ వంటి రూపాలు ఆచరణలోనికి వసున్నాయి. క్రమంగా శైవము, వైష్ణవము వృద్ధి పొంది అద్వైత విచార స్థానంలో వైరాగ్యానికి బదులు భక్తి అనే ప్రేమ భావం ఉప్పొంగుతున్నది.

**భారతీయ** భాషా సాహిత్యాలు రూపొందటం ప్రారంభం అయింది. ఇప్పుడు ఏర్పడ్డ సాహిత్యాలు ఆధునిక భారతీయ భాషలకు సంబంధించినవి. ఒక్క తమిళంలో సంగం కాలం నుంచే సాహిత్యం కవిత్వం ఒక ప్రత్యేకమైన వస్తువుతో మతాతీతమైన భావనలతో వెలువడింది. తరువాత భక్తి సాహిత్యము సముద్రం వలె ఉప్పొంగింది. కంబన్ వంటి కవులు రామాయణాన్ని రచించారు. తమిళం తర్వాత దక్షిణాదిలో 9వ శతాబ్దంలో సాహిత్యం రూపొందింది. పంప కవి ఆ భాషలో విక్రమార్జున విజయం అనే కావ్యాన్ని–కన్నడ భారతంలో రచించాడు. ఈ కావ్యం తన పోషకుడు అయిన వేములవాడ చాళుక్య రాజు పేర అంకితంగా రచింపబడింది. దీనిలో మరొక విశేషం ఏమిటంటే కావ్య నాయకుడు అర్జునుడు పాండవులందరూ కాదు. పైగా కావ్యంలోని అర్జునిడికి తనకు పోషకుడైన రాజునకు అభేదాన్ని పాటించాడు. పంప భారతం రచనలో, కూర్పులో వృత్తముల నిర్వహణలో, సమాస కల్పనలో నన్నయ భారతానికి ఆదర్శంగా కనిపిస్తుంది. దీనిలోని అనేక పద్యాలు తెలుగు భారతంలోని పద్యాలు పోలికగా అన్నట్లు ఉభయ భాషా పండితులు శ్రీమాన్ పుట్టపర్తి నారాయణాచార్యుల వారు అర్ధ శతాబ్దానికి ముందే నిరూపించారు,.

నన్నయ కవిత్వ నిరూపణకు వాడిన ప్రసన్న కథాకలితార్థయుక్తి అన్నమాట కించిత్ భేదంతో పంప భారతంలోనూ కనిపిస్తుంది. విక్రమార్జున విజయం అనే పంప భారతంలో జైన మత విశ్వాసాలకు ప్రాధాన్యం ఉంటుంది. పంప కవి సోదరుడు వేయించిన కుర్క్యాల శాసనంలో జైన మత ప్రసక్తి ఉన్నది. అయితే నన్నయ నాటికి రాజరాజనరేంద్రుని ప్రేరణతో రచింపబడిన భారతం నాటికి వైదిక మత విశ్వాసాలు ప్రాబల్యం పొందాయి.

'జననుత కృష్ణద్వైపాయన ముని వృషభాభిహిత
మహాభారత బద్ధ నిరూపితార్థమేర్పడ'

తెలుగున రచింపుమని కృతి కర్త అయిన రాజరాజనరేంద్రుడు నన్నయను కోరినాడు. నన్నయ 'అవిరళ జప హోమ తత్పరుడు 'జపము, దైవ ధ్యానము, ఉపాసనము భక్తిమార్గంలో ఒక నిచ్చెన. 'యజ్ఞానాం జపయజ్ఞోస్మి' అని భగవంతుడు గీతలో చెప్పినాడు. హేమ తత్పరత ఆయనకు యజ్ఞయాగాదుల యందు న్న నిష్ఠను తెలియజేస్తుంది. ఆయన భావనావీధిలో పూర్వోత్తర మీమాంసలు సంగమించాయి. భారతాన్ని గూర్చి నన్నయ భట్టు వర్ణించినప్పుడు 'ధర్మ తత్త్వజ్ఞులు ధర్మశాస్త్రంబని, అధ్యాత్మ విధులు వేదాంతమనియె' అని చెప్పిన చోట జైమినీ బాదరాయణులు ప్రతిపాదించిన రెండు మీమాంసలు సంకేతింపబడినాయి. పై పద్యంలో ధర్మం అన్నప్పుడు స్మృతులు అని అర్థం కాదు, అది ధర్మజ్ఞసారూపమైన మీమాంసా శాస్త్రమని ఉద్దేశింపబడినది. ఈ పద్యం పీఠికగా నన్నయ మహాభారతాన్ని అన్ని పరిమితుల ను త్యజించిన విశ్వజనీనమైన ఇతిహాసంగా భావించినాడు. వ్యాసముని ప్రోక్తమైన మహాభారత తాత్పర్యము లక్ష్యమై ఇది వేదార్థ, వేదోబృంహ్మణ లక్షణం కలదిగా తెలియవస్తున్నది. దీనినే తిక్కన వైదికధ్యాయిత అన్నాడు. అందువల్లనే దేనిని వింటే జ్ఞానం సమగ్రం అవుతుందో, దేని శ్రవణం పాపములను హరిస్తుందో దానిని వినదలిచినట్లు భారత శ్రోతలైన శౌనకాదులు పేర్కొన్నారు.

నన్నయ తిక్కనల నడుమ కాలం సుమారు రెండువందల సంవత్సరాలు. ఈ కాలంలో మృగశిర కార్తె తర్వాత నాట్లు పోసినట్లు అపారమైన కావ్య వ్యవసాయం వైవిధ్యభరితంగా కొనసాగింది. నన్నెచోడుని కుమారసంభవం మహాకావ్య లక్షణాలను పొదువుకున్నది. మానవల్లీ వారు నన్నెచోడున్ని నన్నయకు పూర్వపు కవిగానే పేర్కొన్నారు. కాని తరువాత తెలుగు విమర్శకులు తర్వాత వందేండ్లలో నిలబెట్టే ప్రయత్నం చేశారు. సుప్రసిద్ధ చారిత్రకులు బి.యన్ శాస్త్రి గారు నన్నెచోడుని కాలాన్ని తమ సిద్ధాంత గ్రంథంలో నన్నయ్యకు పూర్వ కవిగానే భావించిన ఆయన పర్యవేక్షకులైన ఆచార్య దివాకర్ల వెంకటావధాని ఆయన నిర్ణయాన్ని మార్చుకోమని పట్టు బట్టారు. ఆయన దానికి అంగీకరించిన పీహెచ్‌డీ పట్టానే వదులుకున్నారు. ఈ సందిగ్ధమైన అంశాన్ని ఇక్కడ తేల్చలేరు కాని ఇన్నూరు సంవత్సరాలలో పావులూరి మల్లన గణితసారం వంటి శాస్త్ర గ్రంథం వచ్చింది. కేతన దశకుమార చరిత్ర వంటి కథాకావ్యం వచ్చింది. కేతన విజ్ఞానేశ్వరీయం అనే స్మృతి గ్రంథాన్ని వెలువరించాడు. అంతేకాక ఈయ న ఆంధ్ర భాషా భూషణం అనే వ్యాకరణ గ్రంథా న్ని కూడా రచించాడు. ఈయన తిక్కన శిష్యుడు. తిక్కనను గూర్చి 'చిత్తనిత్యస్థిత శివుడు' అని వర్ణించాడు. 'కవిత చెప్పి ఉభయకవి మిత్రు మెప్పింపనరిది – అట్టివాని మెప్పు పొందిన వాడనని తన్ను తాను ప్రశంసించుకున్నాడు.

తిక్కన శిష్య పరంపరలో ఆయనతో పాటు అనేకమంది పండితులైన శిష్యులు వచ్చి ఉంటారు. ఆనాటి రోజులలో కమలాకరం వంటి సాహిత్య కేంద్రం ఓరుగల్లు నగరం. కొందరు ఆయనతో పాటు నెల్లూరుకు తిరిగి వెళ్లకుండా ఓరుగల్లులోనే ఉండిపోయి ఉంటారు. వారిలో ప్రథమాంధ్ర పురాణాన్ని తెలుగులోకి అనువదించిన మారన ఒకడు కావచ్చు. మారన ప్రారంభించిన పురాణ పరివర్తన మార్గంలో శ్రీనాథుని కాలంలో వృద్ధి పొందింది. తరువాత కాలంలో సమగ్రం కాకపోయిన సమృద్ధతను సంపాదించుకున్నది.

పురాణ అనువాదాల వల్ల తెలుగు కవులకు అనేక నూతన కథాంశాలు లభ్యమయ్యాయి. అల్లసాని పెద్దన మనుచరిత్రకు ఆధారమైన స్వారోచిష మనువు కథ దీనిలోనిదే భారతకథా వాహిని కొనసాగుతూ ఉండగానే సాహిత్యరంగంలో శైవకథల ప్రాచుర్యం పెరుగుతూ వచ్చింది. నన్నెచోడుడు, పాల్కుర్కి సోమన నుంచి శ్రీనాథుని దాకా ఈ సంప్రదాయం ప్రవహిస్తూ వచ్చింది. అనేక భాషా సంప్రదాయాలు, మార్గాలు, పోకడలు నూతన సృజనశీలానికి దోహదం చేశాయి. శైవవాఙ్మయ సృజనలో మహా మకుటధారి అయిన పాల్కుర్కి సోమన భాషా ప్రయోగంలో సంప్రదాయ మత పరిభాషయే కాక, తెలుగు సంస్కృ త పదాలను జోడించడం భాషా పద్ధతికి భిన్నంగా మిశ్ర సమాసాలు, విచిత్ర వ్యాకరణ రూపాలు ప్రయోగించాడు. ఇంతవరకూ కొనసాగించిన భాషా సంప్రదాయం మారిపోవడం వల్ల జానపద వాక్‌ధోరణులు పెరిగిపోవడం వల్ల పాఠకులకు ఇది ఒక కొత్త మార్గమే అయింది. సోమన రచనలో భాషా వేషం ఎంతనో మతావేషమూ అంతదే, భవులు అంటే లింగధారులు కాని శివభక్తులైన ఆయనకు అంగీకారం కాదు. భవి ముఖ దర్శన, స్పర్శణ, ఆలాప శూన్యుడు అని చెప్పుకున్నాడు. భవుల క్షేత్రాలలో నాటిన గింజల ఫలసాయం కూడా తాను ఆహారంగా తీసుకొని తెలియజేస్తాడు. అంత తీవ్ర త కూడా ఆయన సృజనశీలం అక్షతంగానే ఉండిపోయింది. లోక వృత్తానుశీలనలో ఆయనకు సాటి రాగలవారు తెలుగు సాహిత్యంలో ఇద్దరో, ముగ్గురో ఉండవచ్చు. 1955 ప్రాంతాలలో తన అభిమాన కవి అని పాల్కుర్కి సోమనను ప్రశంసిస్తూ సినారె కోడి కూతను సోమన వర్ణించిన ద్విపద భాగాన్ని వినిపించినప్పుడు నేను పులకించిపోయాను. తరువాత మరొక కోడికూత శివ ధనుర్భంగం తరువాత రామాయణ కల్పవృక్షంలో వినబడ్డది. 'ఛిన్న ఛాపస్వన స్థితి మూడు విరుపులై కొక్కొరకో కోయని కోడికూసె'

ఇంత అద్భుతమైన లోకజ్ఞతతో పాటు అగాధమైన పాండిత్యము నింపుకొన్న విశిష్ట మనీషి పాల్కుర్కి సోమనాథుడు పాల్కుర్కి సోమన ఎంత భాషాభిమాని అంటే తెలుగు మాటలు ఏ విధంగానూ తక్కువైనవి కావు. వేదములతో తులతూగదగినవి అని తెలియజేస్తారు. ఆయన సృజనశీలంలోంచి అనేక ప్రక్రియలు తెలుగు సాహిత్యంలో ఉద్భవించాయి. వృషాధిపశతకం బస వా! బసవా! బసవా! వృషాధిపా అన్న మకుటం తో తీర్చబడినవి. తరువాతి సంవత్సరాలలో తెలు గు కవుల కల్పనాశక్తికి ఆత్మ నివేదనకు అది కాణా చి అయింది. తెలుగులో శతకాలు అనేక చంధస్సులలో, అనే విషయాలతో అనేక వేల సంఖ్యలో వెలువడ్డాయి. సంస్కృతములో శతకానికి, తెలుగులో శతకానికి ఉండే మకుటం ఉండదు. ఈ మకుటం జానపదగీతాలలో Refrini లాంటిది. సోమనాథుడు సృష్టించిన ప్రక్రియా విశేషం ఉదాహరణము. ఆయన బసవోదాహరణము, మల్లికార్జున ఉదాహరణము అనే రెండు ఉదాహరణలు నేర్పించాడు, ఉదాహరణముతో ఎనిమిది దళాలు ఉంటాయి.

ఒక్కొక్క దళంలో ఒక్కొక్క విభక్తి చొప్పు సంబోధన విభక్తితో ఇవి ఎనిమిది, మొదటి పద్యమైన వృత్తము క్రియా రూపంలో ఆ విభక్తి నిలిచి ఉంటుంది. తరువాత ఒక రగడ ఆది ప్రాసతో మధ్య యతిలో అంత్యప్రాసతో కూర్చబడుతుంది. దీనిని 'కళిక' అంటారు. దీని తరువాత కళిక నిడివిలో సగం భాగంగా ఆది ప్రాసతో అంత్యప్రాసతో ఉత్కళిక ఉంటుంది. ఈ ఎనిమిది దళాల తరువాత సార్వవిభక్తిక పద్యం అంకితాంక పద్యం ఉంటాయి. ఈ రచన స్తోత్ర కావ్యమే అయినా మార్గ దేశీ ఛందస్సుల సమ్మేళనంతో సంగీత మాధుర్యంతో సమ్మిళితమై ఉంటుంది. ఈ రెండు ప్రక్రియలే కాక సోమన అక్షరాయ గద్య, మొదలైన చిత్రప్రక్రియల రూపాలు సృష్టి చేశాడు.

ఇవికాక అనుభవసారము, చెన్నమల్లు సీసములు మొదలైన అనేక రచనలు ఉన్నాయి. బసవపురాణ పీఠికలో తన లక్షణ ప్రతిభను వెల్లడించాడు. పండితారాధ్య చరిత్ర ఒక విజ్ఞాన సర్వస్వమే.

> పురాణ అనువాదాల వల్ల తెలుగు కవులకు అనేక నూతన కథాంశాలు లభ్యమయ్యాయి. అల్లసాని పెద్దన మనుచరిత్రకు ఆధారమైన స్వారోచిష మనువు కథ దీనిలోనిదే భారతకథా వాహిని కొనసాగుతూ ఉండగానే సాహిత్యరంగంలో శైవకథల ప్రాచుర్యం పెరుగుతూ వచ్చింది. నన్నెచోడుడు, పాల్కుర్కి సోమన నుంచి శ్రీనాథుని దాకా ఈ సంప్రదాయం ప్రవహిస్తూ వచ్చింది.

– కోవెల సుప్రసన్నాచార్య

## తెలంగాణ సాహిత్య చరిత్ర నిర్మాణంలో

# ఆధారాల పునరధ్యయనం

**తెలంగాణ** ప్రాంతీయ అస్తిత్వవాదం ఉద్యమంలో భాగంగా కవులు రచయితలు చరిత్రకారులు ఎన్నో మరుగునపడిన విషయాలను తవ్వితీశా రు. ఆంధ్రుల చరిత్రకు తెలంగాణ పురిటిగడ్డ అని ఎన్నడో ప్రసిద్ధ పరిశోధకుడు కొమర్రాజు లక్ష్మణరావు గారు అన్నారు. ఆ విధంగా శాతవాహనుల మొదటి రాజధాని కోటిలింగాల అని అక్కడ దొరికిన నాణేల ఆధారంగా ప్రతిపాదిస్తున్నాం. దాన్ని మహారాష్ట్రలో మరెవరో అంగీకరించటం లేదని మనం వెనుకడుగు వేయటం లేదు. అదేవిధంగా క్రీ.శ. 1000లో విరియాల కామసాని వేయించిన గూడూరు శాసనం. విరియాల కామసాని వేయించిన గూడూరు శాసనం పద్యాలను రచించిందన్న విషయాన్ని డాక్టర్ భిన్నూరి మనోహరి గారు ఖండిస్తున్నారు. పండరంగు వేయించిన శాసనాలను పండరంగుడే రచించాడని నిడదవోలు వెంకటరామగారు అన్నప్పుడు ఎవరేమి ఎదిరించలేదు. కానీ ఒక స్త్రీ కామసాని గూడూరు శాసనంలోని పద్యాలు రాసిందంటే కాదని అంటున్నారు. అంటే ఒక స్త్రీ అందమైన పద్యాలు రాయలేదనా వాళ్ల అభిప్రాయం! ఇంకొకటి– కామసాని భర్త మనోహరి గారు అన్నట్లు భీమ భూపాలుడు కాదు, అతని కొడుకు ఎర్రభూపతి! ఈ ఎర్రభూపతి ముదిగొండ చాళుక్య రాజయిన బొట్ట బేతని పక్షం వహించి వాని వైరిని చంపి కొరవి దేశ సింహాసనంపై ప్రతిష్ఠించపజేశాడని విరియాల కామసాని గూడూరు శాసనంలోనే ఉన్నది. అంటే బి.ఎస్.ఎల్. హనుమంతరావు తమ ఆంధ్రుల చరిత్రలో అంటారు– త్రివ్వక శాసనం ప్రకారం ఎర్రభూపతి కాకత్య గుండ్యినను వధించి బొట్ట బేతనను కొరవి సింహాసనం మీద ప్రతిష్ఠింపజేశాడు. కామసాని కాకతీయ ప్రభువుల సోదరి అంటుంది మనోహరి గారు. దానికి ఆధారమేమిటి? కాకతీయుల సోదరి అయితే ఆమె భర్త కాకత్య గుండనను చంపి కొరవి వాళ్లకు సహాయం ఎట్లా చేస్తాడు. గుండన కొడుకు బేతన చిన్నవాడని, కామసాని తన భర్త మరణానంతరం చేరదీసి రాజ్యం కోల్పోయి నిస్సహాయుడై ఉన్నాడని 'గరుడ బేతనన్ భూపతిని కాకతి వల్లభు చిన్నవాని తాన్ పరగన్ చేతబట్టి..' కాకతి సింహాసనం మీద నిల్పింది–అని గూడూరు శాసనంలో ఉంది. ఈ శాసనం లో చాలా చరిత్ర ఇమిడి ఉంది. అంతేకాదు కామసాని మంచి రాజకీయ నిపుణురాలు. కాబట్టియే రాష్ట్రకూట తైలపుని ఆశ్రయించి ఆమె ముదిగొండ చాళుక్యుల అంతిమ దశలో తన చాణక్య నీతిని ప్రదర్శించి గరుడ బేతనను కాకతి సింహాసనం మీద కూర్చోబెట్టింది. ఇంత రాజకీయ చాతుర్యం గల కామసానిలో సాహిత్య చాతుర్యం లేదని ఎట్లా చెప్పగలం. అందులో ఆ శాసనాన్ని రచించిన వాళ్ల పేరు లేదు. ఇంత అందమైన పద్యాలు అప్పటికి తెలుగులో అరుదైన పద్యాలు చెప్పిన కవి తన పేరును చెప్పుకోకుండా ఎట్లా ఉంటాడు. కాదు గనుకనే ఆ పద్యాలు రచయిత్రి విరియాల కామసాని అన్న అభిప్రాయం నిడదవోలు వారిని అనుసరిస్తూ నేను ప్రతిపాదించాను. ఇంకో విషయం– ఈ గరుడ బేతన కాకతీయ సింహాసనం ఎక్కింది, పై కల్లోల రాజకీయాలు నడిచింది క్రీ.శ.1000లో. క్రీ.శ 900 ప్రాంతంలో గుండన రాష్ట్ర కూటుల సేనాపతిగా పరాక్రమం చూపాడు. కనుకనే అతన్ని, అతని కుమారుని ఎర్రనను రాష్ట్రకూట కృష్ణుడు కర్రవాడికి అధిపతులుగా చేశాడు. ఆ కుర్రవాడియే తర్వాత కాకతి రాజ్యంగా వర్ధిల్లింది. ఎర్రన కొడుకు బేతయ. ఈ బేతనను ముదిగొండ చాళుక్యులు తరిమివేశారు. బేతన కొడుకు గుండన. గుండన కొడుకు పిన్న వయస్కుడు. బేతనను రాజ్యం కోల్పోయినవాని మీద కరుణించి కామసాని సింహాసనం మీద కూర్చుండబెట్టింది. ఇదంతా నాలుగు తరాల కథ కాబట్టి వేగంగా జరిగిన చరిత్ర కాబట్టి వంద సంవత్సరాల కంటే ఎక్కువ పట్టి ఉండదు. అప్పుడు విరియాల కామసాని గూడూరు శాసనం క్రీ.శ. 1000 నాటి సంఘటనను చెప్తున్నది. శాసన కాలం క్రీ.శ. 1052 అనటమే సమంజసం. కాని ఎప్పుడో జరిగిన సంఘటనను క్రీ.శ. 1124గా పేర్కొనటం సమర్థవంతంగా లేదు. క్రీ.శ. 1124లో రెండో ప్రోలరాజు కాకతిని పరిపాలిస్తున్నారు. బేతన పరిపాలనా కాలం క్రీ.శ. 992–1000. మరి శాసనం క్రీ.శ.1124 ఎట్లా వేస్తారు.

ఇక కుప్పాంబిక రంగనాథ రామాయణ కర్త గోన బుద్ధారెడ్డి కూతురు. అందులో ఏమీ సందేహం లేదు. తండ్రి కవితా ప్రతిభ కూతురులో కన్పించటం ఏమీ నిరాధారం కాదు. ఆమె పద్యం ఒకటి అయ్యలరాజు కూర్చిన పద్య సంకలనంలో దొరుకుతున్నది. దాని ఆధారంగా ఆమె కవయిత్రి అని చెప్పటంలో పెద్ద తప్పులేదు.

మొల్ల రెండో ప్రతాపరుద్రుని కాలంలో అతని ఆస్థానంలో ఉన్నదని, ఆమె శూద్రురాలు కాబట్టి ఆమె రామాయణ కావ్యాన్ని ఆ రాజుకు అంకితంగా ఇయ్యటానికి వీల్లేదని ఆస్థాన పండితులు అడ్డు పలికారని ఏకామ్రనాథుని ప్రతాపరుద్ర చరిత్రములో ఉంది. మొల్ల పోతన లాగానే రామభక్తురాలై పోతన లాగానే రాజుల నిరసిస్తూ పోతన పద్యాలను పోలిన పద్యాలను రాసింది. ఇది 16వ శతాబ్దంలో ఉన్న నెల్లూరులో ఉన్న కవయిత్రి రాసిందంటే ఎంత నిజమో ఆలోచించాలి. తిక్కన, ఎర్రనలు పుర వర్ణనతో కావ్యాలనారంభించారు. మొల్ల అదే పనిచేసింది. అది కేవలం ప్రబంధాలల్లో ఉన్నదే కాదు. అంతేగాక మొల్ల 'చిల్లర రాజలోకము మెచ్చ' అని 'చిల్లర' శబ్దం వాడింది. ఇది దేశ్య పదం. తెలంగాణలో వాడుకలో ఉంది. తెలంగాణ తెలుగు నుంచి ఉర్దూలోకి పోయింది. ఈ తెలంగాణ లక్షణ పదాన్ని వాడిన మొల్ల తెలంగాణ కవయిత్రి కాకుండా ఎట్లా ఉంటుంది. ఇప్పటికి ఒంటిమిట్ట పేరుతో పోతన మావాడు అంటున్నారు. అవునని ఇచ్చేస్తామా?

ఓరుగల్లులో రెండో ప్రతాపరుద్రుని కాలంలో సంస్కృతంలో 74 కావ్యాలు రచించిన గొప్ప సంస్కృత పండితుడు అగస్త్యుడు ఉన్నాడు. అతని మేనల్లుడు విశ్వనాథుడు, అగస్త్యుని దగ్గర విశ్వనాథుని దగ్గర సంస్కృతం పాండిత్యం సంపాదించింది గంగాదేవి. అంటే ఆమె మొదట ఓరుగల్లు నివాసియే. బుక్కరాయల కొడుకు వీర కంపరాయలు గంగాదేవిని వివాహం చేసుకున్నారు. కాబట్టి తర్వాత విజయనగర స్థాపన తర్వాత ఆమె విజయనగరానికి వెళ్లిపోయింది. సంస్కృతంలో మొట్టమొదట మహాకావ్యం రచించిన కవయిత్రి గంగాదేవి.

మన చరిత్రను మనం నిర్మించుకుంటున్న సమయంలో అడుగులు తడబడకూడదు. నిజమే కాని ఇన్నాళ్లు పాతుకుపోయిన వాదనలను ఎదిరించి మన వాళ్లను మనలో కలుపుకోవటంలో తప్పేమి లేదు. ఇంకా పిడివాదాలు నడువవు. చరిత్రను సరిగ్గా అవగాహన చేసుకొని అభిప్రాయాలను నిర్మించుకునే దశలో మనం ఉన్నాం. కాబట్టి మనోహరి గారు చెప్పినట్టుగా ఆధారాలను, ప్రమాణాలను పక్కన పెట్టలేము కాని ఆధారాలను పునరధ్యయనం చేస్తున్నాం! కొత్త ప్రమాణాలను చూపుతున్నాం.

> తిక్కన, ఎర్రనలు పుర వర్ణనతో కావ్యాలనారంభించారు. మొల్ల అదే పనిచేసింది. అది కేవలం ప్రబంధాలల్లో ఉన్నదే కాదు. అంతేగాక మొల్ల 'చిల్లర రాజలోకము మెచ్చ' అని 'చిల్లర' శబ్దం వాడింది. ఇది దేశ్య పదం. తెలంగాణలో వాడుకలో ఉంది. తెలంగాణ తెలుగు నుంచి ఉర్దూలోకి పోయింది. ఈ తెలంగాణ లక్షణ పదాన్ని వాడిన మొల్ల తెలంగాణ కవయిత్రి కాకుండా ఎట్లా ఉంటుంది.

– ముదిగంటి సుజాతారెడ్డి

## మన తెలంగాణ

జై తెలంగాణ జై జై తెలంగాణ
కల్లా కపటం తెల్వని జనసాంద్రపు మా తెలంగాణ
సత్యశీల సహజీవనం సాగించెడి మా తెలంగాణ
రెండు జూన్, ఆరు వసంతాలావిర్భావపు
మా తెలంగాణ
రైతుకు మేలొనెర్చే పరిపాలనొసగే మా తెలంగాణ
జై జై తెలంగాణ.. స్వతంత్ర తెలంగాణా!

కాలేశ్వర మేడిగడ్డ ప్రాజెక్టులే మాకు వరం
ఎత్తిపోతల పాటుకం ఏడేడు తరాల సుఖజీవనం
రైతుబంధు తెలుగు పాలన సుఫల సస్యశామలం
స్వతంత్ర తెలంగాణకు సకల వసతిల సౌకర్యం
జై జై తెలంగాణ.. స్వరాజ్య తెలంగాణా!

సహజ కవి పోతన సాహితి కవుల నిలయం
తెలుగు తల్లి యక్షగాన జావతాల జానపదం
నేతన్నల నైపుణ్యం హస్తకళల కళాకౌశలం
విశ్వమత సహనశీల తెలంగాణ సుసంస్కృతం
జై జై తెలంగాణ.. ప్రగతి ప్రతిభ తెలంగాణా!

– ఉప్పలోజు బ్రహ్మాచారి
98489 17680

## ప్రకటనలు

### దక్షిణాఫ్రికా నానీలు ఆవిష్కరణ సభ

రాపోలు సీతారామరాజు రచించిన 'దక్షిణాఫ్రికా నానీలు' పుస్తకావిష్కరణ సభ 2019, జూన్ 5న సాయంత్రం 6 గంటలకు హైదరాబాద్ రవీంద్రభారతి సమావేశ మందిరంలో జరుగుతుంది. డాక్టర్ సి.భవానీదేవి అద్యక్షతన జరుగు సభలో గౌరవ అతిథులుగా మామిడి హరికృష్ణ, ఆచార్య పిల్లలమర్రి రాములు, డాక్టర్ ఎస్. రఘు, వెన్నెల సత్యం, వి.బాలకృష్ణ మూర్తి, డాక్టర్ పోరెడ్డి రంగయ్య హాజరవుతారు. ముఖ్య అతిథి, ఆవిష్కర్తగా డాక్టర్ ఎన్.గోపి.

– తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, తేజ ఆర్ట్ క్రియేషన్స్

### వేసవి కవితా శిబిరం

2019, జూన్ 8, 9 తేదీల్లో యానాంలోని పల్లిపాలెం ఫౌండేషన్ స్కూల్ ఆడిటోరియంలో వేసవి కవితా శిబిరం ఉంటుంది. ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమయ్యే శిబిరంలో వర్తమాన కవిత్వ స్థితిగతులపై చర్చ ఉంటుంది. మధునాపంతుల, ఎం.వి.చలపతి, దాట్ల దేవదానంరాజు, శిఖామణి సమన్వయకర్తలుగా వ్యవహరిస్తారు.

– కవిసంధ్య, యానాం

### సినారె సాహిత్య సమాలోచన సభ

సినారె ద్వితీయ వర్ధంతి సందర్భంగా.. తెలంగాణ సాహితి ఆధ్వర్యంలో 2019, జూన్ 9న ఉదయం 10 గంటల నుంచి 6 గంటల వరకు హైదరాబాద్ బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఉంటుంది. సినారె కవిత్వం, పాట, గజల్స్‌పై సమగ్రమైన చర్చ ఉంటుంది. అనంతరం కవి సమ్మేళనం ఉంటుంది.

– అనంతోజు మోహన్ కృష్ణ

Printed and Published by Damodar Rao Divakonda, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: Katta Shekar Reddy. Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.



వేములవాడ పార్వతీ రాజరాజేశ్వరస్వామివారి ఆలయం ఆదివారం భక్తులతో రద్దీగా కనిపించింది. సుమారు 4 వేల మంది తరలిరాగా.. వేకువజాము నుంచే ధర్మగుండంలో స్నానమాచరించి, స్వామివారిని దర్శించుకున్నారు. వివిధ ఆర్జిత సేవల ద్వారా రూ.3 లక్షల ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు. -వేములవాడ కల్చరల్



లక్ష్యం నిర్దేశించుకొని, పట్టుదలతో శ్రమిస్తే ఏదైనా సాధించవచ్చని సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. పదోతరగతి ఫలితాల్లో జగిత్యాల జిల్లా మూడోసారి రాష్ట్రంలో నంబర్‌వన్‌గా నిలిచిన సందర్భంగా 10 జీపీఏ సాధించిన విద్యార్థులు, రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ రాజేశంగౌడ్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, కలెక్టర్ శరత్, డీఈవో వెంకటేశ్వర్లుతో కలిసి మంత్రి కొప్పుల ఆదివారం జగిత్యాలలో సహపంక్తి భోజనం చేశారు. - జగిత్యాల, నమస్తే తెలంగాణ

## ఖమ్మంలో పుస్తక మహోత్సవం ప్రారంభం



తెలంగాణ అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ బుక్ ఫెయిర్ ఆధ్వర్యంలో ఖమ్మంలో ఏర్పాటు చేసిన పుస్తక మహోత్సవం ఆదివారం ప్రారంభమైంది. కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్, ఎమ్మెల్యే పువ్వాడ అజయ్‌కుమార్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మణ్, బుక్ ఫెయిర్ అధ్యక్షుడు జూలూరు గౌరీశంకర్, ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్, ఖమ్మం మేయర్ పాపాలాల్, సీపీ తఫ్సీర్ ఇక్బాల్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఖమర్, కవులు పాల్గొన్నారు. -ఖమ్మం కల్చరల్

## పేకాట స్థావరాలపై ఉక్కుపాదం

- ఖనిలో మాజీ మంత్రి మాతంగి నర్సయ్య అరెస్టు
- పెద్దపల్లిలో 62 మంది.. మంచిర్యాలలో 33 మంది..



పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో మాజీ మంత్రి మాతంగి నర్సయ్యను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

**ఫర్టిలైజర్ సిటీ:** పేకాట శిబిరాలపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. రామగుండం సీపీ సత్యనారాయణ ఆదేశాలతో పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో పేకాట శిబిరాలపై దాడులుచేస్తున్నారు. పక్కా సమాచారంతో గోదావరిఖనిలోని మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత మాతంగి నర్సయ్య ఇంట్లో ఆదివారం రాత్రి టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీ చేశారు. ఈ దాడుల్లో రూ.27,170 నగదు, ఆరుగురు జూదరులతోపాటు మాతంగి నర్సయ్యను అదుపులోకి తీసుకున్నామని గోదావరిఖని ఏసీపీ ఉమేందర్ తెలిపారు. పెద్దపల్లిలోని ఓ రీక్రియేషన్ క్లబ్‌పై దాడులు నిర్వహించి 62 మందిని అదుపులోకి తీసుకున్నారు. మంచిర్యాల జిల్లాకేంద్రంలోని హైటెక్‌సిటీ పేకాట క్లబ్‌పై ఆదివారం రాత్రి డీసీపీ రక్షిత కే.మూర్తి ఆధ్వర్యంలో పోలీసులు ఆకస్మిక దాడులు చేసి 33 మందిని అదుపులోకి తీసుకుని, రూ. 6.21 లక్షలు నగదును స్వాధీ నం చేసుకున్నట్లు సమాచారం.





సిద్దిపేటలో జాతీయ జెండాకు వందనం చేస్తున్న స్పీకర్ పోచారం. చిత్రంలో ఎమ్మెల్యే హరీశ్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి



సంగారెడ్డి పరేడ్ గ్రౌండ్‌లో జాతీయ జెండాను ఎగురవేస్తున్న హోంమంత్రి మహమూద్ అలీ



సూర్యాపేటలో జాతీయ జెండాకు వందనం చేస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, కలెక్టర్, ఎస్పీ



కరీంనగర్ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి ఈటల



జగిత్యాలలో జాతీయ జెండాను ఎగురవేస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్



ఖమ్మంలో జాతీయ జెండా ఆవిష్కరించి వందనం చేస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్



వనపర్తిలో జాతీయ జెండాను ఎగురవేస్తున్న మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

# జయహో తెలంగాణ

## అట్టహాసంగా రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు ▪ జాతీయ జెండాలను ఎగురవేసిన మంత్రులు, ప్రజాప్రతినిధులు



వరంగల్‌లో జాతీయ పతాకానికి వందనం చేస్తున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్



నిజామాబాద్‌లో అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తదితరులు

**నమస్తే తెలంగాణ నెట్‌వర్క్:** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను ఆదివారం అట్టహాసంగా నిర్వహించారు. ఆయా జిల్లా కేంద్రాల్లో స్పీకర్, మంత్రులు, మండలి విప్‌లు, ప్రభుత్వ సలహాదారులు, జెడ్పీ చైర్‌పర్సన్లు జాతీయ జెండాను ఎగురవేశారు. అమరవీరులకు నివాళులర్పించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం మంత్రులు మాట్లాడుతూ.. రాష్ట్రం శరవేగంగా అభివృద్ధి సాధిస్తున్నదనీ, సీఎం కేసీఆర్ బంగారు తెలంగాణకు బాటలు వేస్తున్నారని కొనియాడారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు , కలెక్టర్లు, అధికారులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**ఉమ్మడి పాలనలో నిర్లక్ష్యం..**

సిద్దిపేట డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించిన వేడుకల్లో స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కేసీఆర్ తన పాలనలో తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలిపారని పోచారం కొనియాడారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. సంగారెడ్డి పరేడ్ మైదానంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన హోంమంత్రి మహమూద్ అలీ మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో రాష్ట్రం దేశంలోనే నంబర్ స్థానంలో నిలిచిందన్నారు. కరీంనగర్ పోలీసు పరేడ్ మైదానంలో జెండాను ఆవిష్కరించిన అనంతరం వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టుతో తెలంగాణ సస్యశ్యామలమై రాష్ట్ర రూపురేఖలే మారిపోతాయన్నారు. సూర్యాపేటలో జరిగిన వేడుకల్లో విద్యాశాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ.. అనేక పోరాటాలు, ఆత్మ బలిదానాలతో సాధించుకున్న రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా తీర్చిదిద్దేందుకు సీఎం కేసీఆర్ అవిశ్రాంతంగా కృషి చేస్తున్నారని తెలిపారు.

**చెరువులకు పూర్వవైభవం..**

ఖమ్మంలో పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ మాట్లాడుతూ.. మిషన్ భగీరథతో ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు, మిషన్ కాకతీయతో చెరువులకు పూర్వవైభవం కల్పించిందన్నారు. వరంగల్‌లోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించిన పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ.. వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రగతికి ప్రభుత్వం కట్టుబడి ఉన్నదన్నారు.

**నిరంతర ప్రగతి..**

మహబూబ్‌నగర్‌లో ఎక్సైజ్ శాఖ మంత్రి వీ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. నిరంతర ప్రగతిని సాధిస్తూ తెలంగాణ యావత్ ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తున్నదన్నారు. వనపర్తిలో వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఐదేండ్లుగా సీఎం కేసీఆర్ రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి పాటుపడుతున్నారన్నారు. నిజామాబాద్‌లో రవాణా శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ఐదేండ్లలో టీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, కార్యక్రమాలను వివరించారు. నిర్మల్‌లో దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడుతూ.. స్వరాష్ట్రంలో నిర్మల్ జిల్లా ప్రగతిపథంలో దూసుకెళ్తున్నదన్నారు. జగిత్యాలలో నిర్వహించిన ఆవిర్భావ వేడుకల్లో సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ.. కోటి ఎకరాల మాగాణంలా తెలంగాణను మార్చేందుకు సీఎం కేసీఆర్ కాళేశ్వరాన్ని నిర్మిస్తున్నారన్నారు.నల్లగొండలో శాసన మం డలి డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్ జాతీయ జెండా ను ఆవిష్కరించారు. వరంగల్ రూరల్ జిల్లాకు సంబంధించిన వేడుకలను హన్మకొండలో నిర్వహించగా మండలి విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ములుగు జిల్లా కేంద్రంలో మండలి విప్ బోడకుంటి వెంకటేశ్వర్లు జాతీయ జెండాను ఎగురవేశారు.

### కుకుడలో జాతీయ జెండా దగ్ధం

**బెజ్జూర్ :** రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో భాగంగా ఎగురేసిన జాతీయ జెండా దగ్ధమైన ఘటన కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ మండలం కుకుడ గ్రామంలో కలకలం రేపింది. స్థానిక ప్రాథమికోన్నత పాఠశాలలో సర్పంచ్ ఆసియాభాను ఉదయం జాతీయ జెండా ఎగురేశారు. సాయంత్రం జెండా అవనతం చేసేందుకు కామాటి చిన్నన్న వెళ్లి చూడగా జెండా కాలిపోయి ఉంది. వెంటనే విషయం సర్పంచ్‌కు తెలుపగా.. ఆమె బెజ్జూర్ పోలీసులకు సమాచారమిచ్చారు. పరిశీలించిన ఎస్‌ఐ శంకర్‌రావ్ అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



మేడ్చల్‌లో అమరవీరుడి తల్లిని సత్కరిస్తున్న మంత్రి చామకూర మల్లారెడ్డి



రంగారెడ్డి : సరూర్‌నగర్ స్టేడియంలో జెండాను ఎగురవేస్తున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావు



నిర్మల్‌లో జెండా ఎగుర వేసి సెల్యూట్ చేస్తున్న మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి



మహబూబ్‌నగర్ :జాతీయ పతాకానికి వందనం చేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆల



నల్లగొండలో పతాకాన్ని ఆవిష్కరించి సెల్యూట్ చేస్తున్న మండలి డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్



వరంగల్ రూరల్ : పతాకావిష్కరణ చేసి వందనం చేస్తున్న మండలి విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి. కలెక్టర్ హరిత



ములుగులో అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న విప్ బోడకుంటి వెంకటేశ్వర్లు

## చల్లబడ్డ వాతావరణం

- ఉమ్మడి పాలమూరు, భద్రాద్రిలో వాన
- పిడుగుపాటుకు ఇద్దరి మృతి
- ఆదిలాబాద్‌లో అత్యధికంగా 45.3, హైదరాబాద్‌లో 42.7 డిగ్రీలు నమోదు
- రేపు, ఎల్లుండి తేలికపాటి వర్షాలు!



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లిలో పిడుగు పాటుకు కొబ్బరిచెట్టుపై చెలరేగిన మంటలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సూర్య ప్రతాపానికి అగ్నిగుండంగా మారిన రాష్ట్రం రెండురోజులుగా కాస్త చల్లబడింది. ఉత్తర కోస్తాంధ్ర దాని పరిసర ప్రాంతాల్లో సముద్రమట్టానికి 0.9 నుంచి 2.1 కిలోమీటర్ల మధ్య ఏర్పడిన ఉపరితల ఆవర్తనం బలహీనంగా మారి, దీని ప్రభావంతో ఆదివారం రాష్ట్రంలో అక్కడక్కడ తేలికపాటి వానలు కురిశాయి. సోమ, మంగళవారాల్లోనూ పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతోకూడిన వానలు కురిసే అవకాశమున్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారి రాజారావు తెలిపారు. కొన్నిచోట్ల గంటకు 30 నుంచి 40 కి.మీ. వేగంతో ఈదురుగాలులతో కూడిన వానలు కురువొచ్చని చెప్పారు. ఆదివారం మధ్యాహ్నం వరకు చాలాచోట్ల ఎండలు మండిపోగా, సాయంత్రం ఆకాశం మేఘావృతమైంది. అత్యధికంగా ఆదిలాబాద్‌లో 45.3 డిగ్రీలు నమోదుకాగా, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల్లో 45, హైదరాబాద్‌లో 42.7డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదివారం రాష్ట్రంలో వడదెబ్బకు ఏడుగురు మరణించారు.

**పగలు చెమటలు.. సాయంత్రం చినుకులు**

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** గ్రేటర్ హైదరాబాద్‌లో భానుడు నిప్పులు కక్కుతూనే ఉన్నాడు. మధ్యాహ్నం 3.30 వరకు 42.7 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. గాలిలో తేమ 58శాతానికి పెరగడంతో గ్రేటర్‌లోని పలు చోట్ల క్యుములోనింబస్ మేఘాలు ఏర్పడ్డాయి. ఫలితంగా సికింద్రాబాద్, ముషీరాబాద్, బేగంపేట, బంజారాహిల్స్, ఖైరతాబాద్, ఉప్పల్, నాగోల్, వనస్థలిపురం, దిల్‌సుఖ్‌నగర్ తదితర ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. సాయంత్రం 5 వరకు నగరంలో 2.6 మి.మీ. వర్షపాతం నమోదైంది.

**గాలివాన బీభత్సం.. పిడుగుపడి ఇద్దరు మృతి**

భద్రాద్రికొత్తగూడెం జిల్లాలో ఆదివారం గాలివాన బీభత్సం సృష్టించింది. పాల్వంచ, జూలూరుపాడు, టేకులపల్లి, కొత్తగూడెం, లక్ష్మీదేవిపల్లి తదితర మండలాల్లో ఈదురుగాలులకు ఇండ్ల పైకప్పులు లేచిపోయాయి. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం వడ్డెమాన్‌కు చెందిన శ్రీకాంత్(14) పొలం వద్ద ఉండగా పిడుగుపడి మృతిచెందాడు. వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలం సల్కలాపూర్‌లో చెన్నయ్య(45) పిడుగుపడి ప్రాణాలు కోల్పోయాడు.

## జల సమాధి!

- క్వారీ నీటి గుంతలో పడి ముగ్గురు మృతి





తల్లీకొడుకు, అనిత, యశ్వంత్ (ఫైల్)



ముగ్గురి ప్రాణాలను బలిగొన్న బాలయ్యనగర్‌లోని క్వారీ గుంత ఇదే

**జీడిమెట్ల :** శుభకార్యానికి వచ్చిన ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ప్రమాదవశాత్తు క్వారీ నీటి గుంతలో పడి మృత్యువాతపడ్డ పడ్డారు. ఈ విషాద ఘటన గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని గాజుల రామారం బాలయ్యనగర్ బస్తీలో చోటు చేసుకున్నది. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలయ్యనగర్‌లో ఉంటున్న నర్సింహ సొంతింటిని నిర్మించుకుని ఆదివారం గృహప్రవేశం చేశాడు. ఈ కార్యక్రమానికి కర్ణాటకలోని యాద్గిర్ జిల్లాలో ఉంటున్న తల్లి అయ్యమ్మ(65), నారాయణపేట జిల్లా జాజాపూర్‌లో ఉంటున్న సోదరుడు వెంకటేశ్ కుటుంబసభ్యులు హాజరయ్యారు. ఆదివారం ఫంక్షన్ అనంతరం దుస్తులు ఉతికేందుకు సమీపంలోని క్వారీ నీటిగుంత వద్దకు అయ్యమ్మతోపాటు వెంకటేశ్ భార్య అనిత (30), కుమారుడు యశ్వంత్(10) వెళ్లారు. దుస్తులు ఉతికే క్రమంలో యశ్వంత్ నీటి గుంతలో జారిపడ్డాడు. బాలుడిని కాపాడే యత్నంలో తల్లి అనిత సైతం నీటిలో మునిగిపోయింది. ఒడ్డున ఉన్న అయ్యమ్మ చీర సాయంతో కాపాడేందుకు ప్రయత్నించగా ఆమె కూడా గుంతలోకి జారిపడింది. విషయం తెలుసుకున్న నర్సింహ.. గజ ఈతగాళ్ల సాయంతో గాలించగా ముగ్గురి మృతదేహాలు లభించాయి. జగద్గిరిగుట్ట సీఐ కావేటి శ్రీనివాసులు అక్కడికి చేరుకొని మృతదేహాలను గాంధీ దవాఖానకు తరలించారు.

## సిగ్నల్ ట్యాంపరింగ్‌తో రైలు నిలిపివేత

- మహిళ మెడలో నుంచి బంగారు ఆభరణాల అపహరణ
- మణుగూర్ ఎక్స్‌ప్రెస్‌లో ఘటన

**కేసముద్రంటౌన్:** ట్యాంపరింగ్ ద్వారా సిగ్నల్‌ను మార్చిన దుండగులు.. రైలు నిలిచిన వెంటనే ఓ మహిళ మెడలో నుంచి బంగారు ఆభరణాలు దోచుకెళ్లారు.. ఈ ఘటన శనివారం అర్ధరాత్రి తర్వాత మహబూబాబాద్ జిల్లా కేసముద్రం స్టేషన్‌లో మణుగూరు ఎక్స్‌ప్రెస్‌లో కలకలం రేపింది. వరంగల్ జీఆర్‌పీ సీఐ వినయ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. డోర్నకల్-ఖాజీపేట జంక్షన్‌లోని తాళ్లపూసపల్లి-కేసముద్రం స్టేషన్ల మధ్య 427/1కి.మీ. రాయి వద్ద సిగ్నల్ పోల్ ఉన్నది. శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత దుండగులు సిగ్నల్ వ్యవస్థను ట్యాంపర్ చేసి సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్‌ను నిలిపేసేందుకు ప్ర యత్నించారు. డ్రైవర్ గమనించకపోవడంతో ఆ రైలు ముందు కెళ్లిపోయింది. అర్ధరాత్రి 2 గంటల సమయంలో మణుగూర్ నుంచి సికింద్రాబాద్ వెళ్తున్న మణుగూరు ఎక్స్‌ప్రెస్ రెడ్‌సిగ్నల్ పడ టంతో ఆగింది. వెంటనే దుండగులు కిటికీల పక్కన కూర్చున్న ఇద్దరు మహిళల మెడల్లో నుంచి ఆభరణాలు లాక్కనే ప్రయత్నం చేశారు. ఓ మహిళ మెడలోంచి మూడున్నర తులాల బంగారు పుస్తెల తాడు అపహరించారు. బాధితురాలు హైదరాబాద్‌కు చెందిన రాణి ఆదివారం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. ఖాజీపేట జీఆర్పీ డీఎస్పీ విజయ్‌లాల్, ఆర్పీఎఫ్ డీఎస్పీ రాంమూర్తి ఘటనాస్థలాన్ని పరిశీలించారు.

## హాజీపూర్‌లో పోలీసుల అన్వేషణ

- పక్కా ఆధారాల కోసం తనిఖీలు

**బొమ్మలరామారం:** రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మల రామారం మండలం హాజీపూర్ వరుస హత్యల కేసులో పక్కా ఆధారాల కోసం పోలీసులు అన్వేషణ చేపట్టారు. నిందితుడు మర్రి శ్రీనివాస్‌రెడ్డి ఇచ్చిన సమాచారం మేరకు హత్యలు జరిగిన ప్రదేశంలో ఆదివారం ఆధారాల కోసం గాలించారు. హాజీపూర్ నుంచి మైసిరెడ్డిపల్లికి వెళ్లే పిల్లబాట మధ్యలో చెట్ల పొదల్లో కల్పన పాఠశాల గుర్తింపుకార్డును కనుగొన్నారు. హత్య చేసిన ప్రదేశం నుంచి శవాలను పూడ్చిపెట్టిన తెట్టెబావి వరకు దూరాన్ని మ్యాపింగ్ చేశారు. అనంతరం బొమ్మల రామారం పోలీస్ స్టేషన్ సమీపంలోని కర్కలమ్మ కుంటలో డిగ్రీ విద్యార్థిని మనీష ఆధార్‌కార్డు, సెల్‌ఫోన్ కోసం అన్వేషించగా ఆధార్‌కార్డు మాత్రమే లభించింది. సెల్‌ఫోన్ బురదలో కూరుకుపోయిందని క్లూస్ టీం సహాయంతో మెటల్ డిటెక్టర్లతో రెండు గంటలపాటు గాలించినా ఫలితం దక్కలేదు.

## బాకీ డబ్బుల వసూలుకు వినూత్న నిరసన

- బాకీదారుని ఇంటి ఎదుట బైఠాయింపు, వంటావార్పు



బాకీదారు ఇంటి ఎదుట వంట చేస్తూ నిరసనకు దిగిన బాధిత మహిళ బంధువులు

**ఖానాపురం:** బాకీ డబ్బుల వసూలుకు ఓ మహిళ మౌనదీక్షకు దిగింది. బాకీదారుడి ఇంటి ఎదుట గ్రామస్థులతో కలిసి వంటావార్పు చేపట్టింది. వివరాల్లోకి వెళితే.. వరంగల్ రూరల్ జిల్లా ఖానాపురం మండలం అశోక్‌నగర్‌కు చెందిన పిన్నింటి సురేందర్‌రావు, తక్కళ్లపల్లి నారాయణరావు ఇరువురు కలిసి ఎనిమిదేండ్ల క్రితం రైస్‌మిల్లు వ్యాపారం చేయాలని నిర్ణయించుకున్నారు. కొన్ని కారణాలతో సురేందర్‌రావు వ్యాపారం నుంచి తప్పుకుని నారాయణరావుకు రూ.36 లక్షలు ఇచ్చాడు. ఈ క్రమంలో కొద్దినెలల క్రితం సురేందర్‌రావు మరణించారు. దీంతో కుటుంబ ఆర్థిక పరిస్థితి దెబ్బతింది. ఇటీవల పంచాయితీలో జూన్ ఒకటిన సురేందర్‌రావు కు టుంబానికి రూ.36 లక్షలు చెల్లిస్తానని నారాయణరావు అంగీకరించాడు. కానీ ఆ డబ్బులు చెల్లించకపోవడంతో విధిలేని పరిస్థితిలో సురేందర్‌రావు భార్య మంగాదేవి కుటుంబ సభ్యులతో కలిసి నారాయణరావు ఇంటి ఎదుట టెంట్‌వేసి మౌనదీక్ష చేపట్టింది. అక్కడే గ్రామస్థులతో కలిసి వంటావార్పు చేపట్టింది.

# రాముడితో రాజకీయాలా..?

బీజేపీపై మండిపడ్డ మమతాబెనర్జీ • ఆగని హింస.. మరొకరు మృతి

**న్యూఢిల్లీ/కోల్‌కతా:** 'జై శ్రీరాం' నినాదాలపై పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ, బీజేపీ నేతల మధ్య వైరం కొనసాగుతూనే ఉన్నది. ఆదివారం మమతాబెనర్జీ బీజేపీని విమర్శిస్తూ ఫేస్‌బుక్‌లో ఓ పోస్ట్ పెట్టారు. తరుచూ 'జై శ్రీరాం' నినాదాలు ఇవ్వడం ద్వారా మతాన్ని, రాజకీయాలను కలుపుతున్నారంటూ మండిపడ్డారు. 'జై శ్రీరాం, జై రామ్‌జీ కీ, రామ్ నామ్ సత్యా హై వంటి నినాదాలు మతపరమైనవి. వాటిని మేము గౌరవిస్తాం. కానీ.. బీజేపీ ఆ నినాదాన్ని పార్టీ నినాదంగా మార్చివేసింది. మతాన్ని రాజకీయాలతో ముడిపెట్టి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నది' అని మండిపడ్డారు. మరోవైపు ఢిల్లీ బీజేపీ అధికార ప్రతినిధి ప్రవీణ్ శంకర్ కపూర్ ఆమెకు ఓ లేఖ రాశారు. 'దీదీజీ.. మీరు రోజూ శ్రీరాముడిని ధ్యానించండి. రామనామస్మరణ మీలోని దుర్గుణాలను తొలగిస్తుంది' అని పేర్కొన్నారు. 'శ్రీరామ నామ మంత్ర' పుస్తకాన్ని పంపుతున్నానని, దానిని ఆఫీస్ టేబుల్‌పై పెట్టుకోవాలని కోరారు.

**కొనసాగుతున్న హింస**

పశ్చిమబెంగాల్‌లో హింస ఆగడం లేదు. ఆదివారం 24 పరగణా జిల్లాలోని బదురియా ప్రాంతంలో బీజేపీ, టీఎంసీ వర్గాలు ఒకరి ఇండ్లపై ఒకరు దాడులు చేసుకున్నాయి. ఈ ఘటనలో అజయ్ మండోల్ (37) అనే బీజేపీ కార్యకర్త మృతిచెందారు. డైమండ్ హార్బర్ ప్రాంతంలో టీఎంసీ కార్యాలయాన్ని ధ్వంసం చేశారు. ఘోలా ప్రాంతంలో టీఎంసీ కార్యకర్తను చితకబాదారు. పురులియా జిల్లా పిఢ్రా గ్రామంలో, హుగ్లీ జిల్లా ఆరమబాద్‌లో టీఎంసీ-బీజేపీ కార్యకర్తల మధ్య ఘర్షణ జరిగింది. పలువురికి గాయాలయ్యాయి.

అమెరికా వెళ్లాలంటే..

# సోషల్ మీడియా వివరాలు చెప్పాల్సిందే

అమల్లోకి కొత్త వీసా నిబంధనలు

ఉల్లంఘిస్తే కఠిన చర్యలు




**వాషిం గ్టన్, జూన్ 02:** ఇకపై అమెరికా వెళ్లాలంటే సోషల్ మీడియా వివరాలు తప్పక చెప్పాల్సిందే. ఈమేరకు కొత్త వీసా నిబంధనలు అమలులోకి వచ్చాయి. యూఎస్‌కు వచ్చే అత్యధిక విదేశీయుల్లో ఉగ్రవాదులు, ప్రమాదకర వ్యక్తులను గుర్తించేందుకు ఈ కొత్త వీసా విధానాన్ని ఆ దేశ విదేశాంగశాఖ శనివారం ప్రవేశపెట్టింది. దీని ప్రకారం ఇకపై తాత్కాలిక సందర్శకులు కూడా వీసా దరఖాస్తులో తమ వ్యక్తిగత సమాచారంతో పాటు డ్రాప్‌డౌన్ మెనూలో ఉన్న సోషల్ మీడియా వివరాలను తప్పక వెల్లడించాల్సి ఉంటుంది. ఒకవేళ సామాజిక మాధ్యమాలను వినియోగించకపోతే ఆ విషయాన్ని పేర్కొన్నాలి. అయితే సోషల్ మీడియా వినియోగంపై తప్పుడు సమాచారం ఇచ్చినవారు తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవా ల్సివస్తుందని అమెరికా విదేశాంగశాఖ అధికారి హెచ్చరించారు. ప్రస్తుతం అమెరికా ఆన్‌లైన్ వీసా దరఖాస్తులో కొన్ని ప్రముఖ సోషల్ మీడియాలు మాత్రమే ఉన్నాయని, త్వరలో అన్ని సోషల్ మీడియా వివరాలను అందులో పొందుపరుస్తామన్నారు. కొత్త నిబంధనల ప్రకారం ఐదేండ్ల ఈ-మెయిల్స్ రిపోర్ట్, ఫోన్ నెంబర్లను కూడా జత చేయాలన్నారు. వర్క్, స్టడీ వీసాదారులందరికీ ఇది వర్తిస్తుందని, అధికార, ద్వైపాక్షిక వీసాలకు మాత్రం మినహాయింపు ఉంటుందని చెప్పా రు. ప్రపంచవ్యాప్తంగా ఉగ్రవాదులు సోషల్ మీడియాలో క్రియాశీలకంగా ఉంటున్నారని, ఈ వివరాలు తెలుసుకోవడం ద్వారా అమెరికాలో అడుగుపెట్టే విదేశీయులపై మరింత నిఘాపెట్టే అవకాశమున్నదని ఆయన తెలిపారు. ఉగ్రవాదులు, ప్రమాదకర వ్యక్తులను నిరోధించడం తోపాటు ప్రజా రక్షణకు వాటిల్లే ముప్పును నివారించవచ్చని స్పష్టంచేశారు. భవిష్యత్తులో వీసా దరఖాస్తుదారులు తమ ప్రయాణాలకు సంబంధించిన వివరాలు కూడా వెల్లడించాల్సి ఉంటుందన్నారు.

# దెబ్బకు దెబ్బ!

బీజేపీపై ప్రతీకారం తీర్చుకున్న బీహార్ సీఎం నితీశ్‌కుమార్

రాష్ట్ర క్యాబినెట్‌లో ఆ పార్టీకి ఒకే మంత్రిపదవి కేటాయింపు



**పాట్నా, జూన్ 2:** కేంద్రంలో వరుసగా రెండోసారి కొలువుదీరిన మోదీ నేతృత్వంలోని బీజేపీకి మొదటి పంచ్ పడింది. బీహార్ సీఎం, జేడీయూ అధినేత నితీశ్‌కుమార్.. కేంద్ర మంత్రి పదవి పంపకాల విషయంలో తనకు జరిగిన అవమానానికి ప్రతీకారం తీర్చుకున్నారు. ఎన్డీయే భాగస్వామి అయిన జేడీయూకు ఇటీవల కేవలం ఒక్క పదవి మాత్రమే కేటాయించిన సంగతి తెలిసిందే. దీంతో ఆయన మనస్థాపం చెంది మంత్రివర్గంలో చేరలేదు. బీజేపీ చర్యలకు ఆయన ఆదివారం కౌంటర్ ఇచ్చారు. బీహార్ క్యాబినెట్ విస్తరణలో బీజేపీకి కేవలం ఒక్క మంత్రి పదవి మాత్రమే కేటాయించారు. కంగుతిన్న కమలం పార్టీ.. ఆ ప్రతిపాదనను తిరస్కరించింది. ప్రస్తుతం ఆ పదవి స్వీకరించలేమని, భవిష్యత్తులో భర్తీ చేస్తామని చెప్పింది. దీంతో నితీశ్ ఎనిమిది మంది జేడీయూ నేతలకు పదవులు కట్టబెట్టారు. ప్రమాణం అనంతరం నితీశ్ మీడియాతో మాట్లాడుతూ 'బీజేపీకి ఒక క్యాబినెట్ పదవి ఆఫర్ చేశాం. కానీ వారు తీసుకోలేదు' అని పేర్కొన్నారు. బీజేపీకి కౌంటర్ ఇచ్చారా అన్న ప్రశ్నకు.. 'అంతా సవ్యంగా ఉన్నది. సాధారణంగా సంకీర్ణ ప్రభుత్వంలో ఏ పార్టీకి ఎన్ని పదవులు ఇవ్వాలి? ఏ శాఖలు కేటాయించాలి? వంటి అంశాలపై వారితో చర్చించి, ఒక అవగాహనకు వస్తుంటాం' అని పేర్కొన్నారు. డిప్యూటీ సీఎం, బీజేపీ సీనియర్ నేత సుశీల్ కుమార్ మోదీ స్పందిస్తూ 'నితీశ్‌కుమార్ మాకు ఒక మంత్రి పదవిని కేటాయించారు. మేము భవిష్యత్తులో ఆ పదవిని తీసుకుంటామని చెప్పాము' అని ట్వీట్ చేశారు. మోదీ ప్రమాణం చేసిన రెండు రోజులకే జరిగిన ఈ విస్తరణ ద్వారా.. నితీశ్ రెండు సందేశాలు పంపినట్టు అయ్యిందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. మోదీ క్యాబినెట్‌కు దూరంగా ఉన్నా.. ఎన్డీఏ ప్రభుత్వంపై తనకు ఎలాంటి కోపం లేదని చెప్పడంతోపాటు 'ఒక పదవికి-ఒకే పదవి' రూపంలో బీజేపీకి గట్టి కౌంటర్ ఇచ్చారని చెప్తున్నారు.



**జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ తన జన్మదినం సందర్భంగా ఆదివారం ఉదయం ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావును ప్రగతిభవన్‌లో కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాగంటికి సీఎం పుష్పగుచ్ఛం అందజేసి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.**

**-బంజారాహిల్స్, నమస్తే తెలంగాణ**

మానసిక దౌర్బల్య ఖైదీలకు..

# ఉరిశిక్షలపై నిషేధం

సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పు.. అమెరికా, బ్రిటన్ సరసన భారత్



**న్యూఢిల్లీ:** ఘోరమైన నేరాలకు పాల్పడి దోషులుగా నిర్ధారణ అయిన తర్వాత జైలుశిక్ష అనుభవిస్తూ తీవ్రమైన మానసిక రుగ్మతలకు గురై విచక్షణ కోల్పోయిన ఖైదీలకు ఉరిశిక్షను అమలుచేయడంపై సుప్రీంకోర్టు నిషేధం విధించింది. ఈ చరిత్రాత్మక తీర్పుతో భారత్.. తీవ్రమైన మానసిక దౌర్బల్య ఖైదీలకు ఉరిశిక్ష అమలు చేయని దేశాల జాబితాలో చేరింది. మానసిక దౌర్బల్యంతో విచక్షణ కోల్పోయిన వ్యక్తులకు తాము చేస్తున్నది ఏమిటో, దాని పర్యవసానాలు ఏమిటో తెలియదు. కనుక భారత్ సహా ప్రపంచ దేశాల్లోని వివిధ కోర్టులు వారికి మరణ శిక్ష నుంచి మినహాయింపును ఇస్తున్నాయి. అయితే జస్టిస్ ఎన్వీ రమణ, జస్టిస్ ఎంఎం శంతనగౌడర్, జస్టిస్ ఇందిరా బెనర్జీతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం.. నేరం చేసిన వ్యక్తికి తన నేరం వల్ల ఎదురయ్యే పర్యవసానాలేమిటో తెలియజేయడాన్నే శిక్షగా తొలిసారి పరిగణించింది. విచక్షణాశక్తిని కోల్పోయిన ఖైదీకి తన నేరం వల్ల ఎదురయ్యే పరిణామాలు ఏమిటో తెలియజేయడం వల్ల ఫలితం ఉండదని ధర్మాసనం తన తీర్పులో స్పష్టం చేసింది. 'ఘోరమైన నేరాలను నిరోధించడమే మరణశిక్ష ఉద్దేశం. ఇటువంటి నేరానికి పాల్పడినందుకు తాను ఎదుర్కోవాల్సిన పర్యవసానాలు ఏమిటన్న విషయంతోపాటు తనను ఉరితీయడం వల్ల ప్రయోజనం ఏమిటన్న విషయాన్ని నిందితుడు తన మానసిక దౌర్బల్యం వల్ల అర్థం చేసుకోలేకపోతే అతడిని ఉరితీయడం సహేతుకం కాదు. అంతేకాకుండా ఇలాంటి వారిని ఉరితీయడం వల్ల న్యాయ వ్యవస్థ గౌరవం దిగజారుతుంది' అని జస్టిస్ ఎన్వీ రమణ తీర్పును రాస్తూ పేర్కొన్నారు. 1999లో మహారాష్ట్రలోని గులుంబ్‌లో ఇద్దరు మైనర్ బాలికలను లైంగికంగా వేధించి హత్యచేసిన ఓ నిందితునికి బాంబే హైకోర్టు విధించిన మరణశిక్షను సమర్థిస్తూ సుప్రీంకోర్టు 2008లో తీర్పు ఇచ్చింది. దీనిని సమీక్షించాలని కోరుతూ దాఖలైన రివ్యూ పిటిషన్‌పై సర్వోన్నత న్యాయస్థానం విచారణ జరిపి పైవిధంగా తీర్పు ఇచ్చింది. మానసిక రుగ్మతతో బాధపడుతున్న ఆ నిందితుడు ఇప్పటికే 20 ఏండ్లు జైలుశిక్ష అనుభవించినప్పటికీ.. అతడిని మళ్లీ సమాజంలోకి పంపడం మంచిది కాదని, కనుక మరణించే వరకు అతడిని జైలులోనే ఉంచాలని సుప్రీంకోర్టు ఆదేశించింది.

**ఎత్తుగడగా ఉపయోగపడకూడదని హెచ్చరిక**

ఈ తీర్పు దుర్వినియోగం అయ్యే అవకాశం ఉన్నదని, తీవ్రమైన నేరాలకు పాల్పడిన ఖైదీలు మరణశిక్ష నుంచి తప్పించుకునేందుకు ఎత్తుగడ వేసి మానసిక దౌర్బల్యాన్ని ఓ సాకుగా చూపే అవకాశం ఉన్నదని సుప్రీంకోర్టు హెచ్చరించింది. నిజంగానే అత్యంత తీవ్రమైన మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న ఖైదీలకు మాత్రమే ఈ కారణం ఉపయోగపడాలని, సదరు ఖైదీలను అన్ని విధాలుగా పరీక్షించిన తర్వాత తీవ్రమైన మానసిక దౌర్బల్యంతో బాధపడుతున్న వారిని మాత్రమే ఉరితీయరాదని ధర్మాసనం పేర్కొంది. అంతర్జాతీయ న్యాయ ధోరణులతోపాటు ఈ అంశంపై అమెరికా, బ్రిటన్ సుప్రీంకోర్టులు ఇచ్చిన తీర్పులపై క్షుణ్ణంగా చర్చించిన తర్వాత ధర్మాసనం ఈ తీర్పునిచ్చింది.

# 8 మంది పర్వతారోహకుల గల్లంతు

అదృశ్యమైన ఒక భారతీయుడు

**పితోరాగఢ్:** ఉత్తరాఖండ్‌లోని పితోరాగఢ్ జిల్లా నందాదేవి తూర్పు శిఖరాన్ని అధిరోహించడానికి వెళ్లిన ఎనిమిది మంది పర్వతారోహకులు కనిపించకుండా పోయారు. వీరిలో ఏడుగురు విదేశీయులు కాగా, ఒకరు భారత పర్వతారోహణ సంస్థకు చెందిన సహాయ అధికారి ఉన్నారు. విదేశీయుల్లో నలుగురు బ్రిటన్, ఇద్దరు అమెరికా, ఒకరు ఆస్ట్రేలియాకు చెందిన వారు ఉన్నారు. మొత్తం 12 మంది సభ్యుల బృందం మే 13న 24 వేల మీటర్ల ఎత్తయిన, కఠినమైన నందాదేవి తూర్పు శిఖరాన్ని అధిరోహించడానికి మున్సియారి నుంచి బయలుదేరింది. 12 రోజుల తర్వాత వీరిలో నలుగురు మాత్రమే మే 25న బేస్‌క్యాంపునకు చేరుకున్నారు. మిగతా ఎనిమిది మంది కనిపించకుండా పోయారని పితోరాగఢ్ మేజిస్ట్రేట్ వీకే జోగ్‌దాండే ఆదివారం మీడియాకు వెల్లడించారు. మే 31 వరకు గాలించినా ఆచూకీ దొరుకలేదన్నారు. సహాయ చర్యలను మరింత ముమ్మరం చేస్తామని చెప్పారు. అవసరమైతే ఆర్మీ సహాయం కోరతామన్నారు.

# జార్ఖండ్‌లో ఎదురుకాల్పులు.. జవాన్ మృతి

**దుమ్కా (జార్ఖండ్):** జార్ఖండ్‌లోని దుమ్కా జిల్లా తాల్‌దంగల్ అటవీప్రాంతంలో మావోయిస్టులకు, భద్రతా సిబ్బందికి మధ్య ఆదివారం తెల్లవారుజామున ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఘటనలో సశస్త్ర సీమా బల్ (ఎస్ఎస్‌బీ) జవాన్, అస్సాంలోని సోనిత్‌పూర్ జిల్లాకు చెందిన నీరజ్ చెత్రీ మృతిచెందారని దుమ్కా ఎస్పీ వైఎస్ రమేశ్ తెలిపారు. మరో నలుగురు జవాన్లు గాయపడ్డారని, వారిని రాంచీకి తరలించి చికిత్స అందిస్తున్నామని చెప్పారు. ఐదుగురు మావోయిస్టులకు కూడా బుల్లెట్ గాయాలయ్యాయని, వారు అడవిలోకి తప్పించుకు పారిపోయారని వెల్లడించారు. గాలింపు కొనసాగుతున్నదని చెప్పారు.

**ఛత్తీస్‌గఢ్‌లో పోలీస్ ఇన్‌ఫార్మర్ హత్య**

**జగ్‌దల్‌పూర్:** ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ జిల్లాలో నక్సల్స్ ఒక పోలీస్ ఇన్‌ఫార్మర్‌ను హత్యచేశారు. శనివారం రాత్రి కొండెనార్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బస్తానర్ వారాంతపు సంతకు వచ్చిన ఛన్నూ సోది (30)ని నక్సల్స్ బృందం కిడ్నాప్‌చేసి, గొడ్డళ్లతో నరికి చంపేశారు.

# సీఎం కేసీఆర్ నాకు మంచి మిత్రుడు

కేంద్ర సహాయమంత్రి రాందాస్ అథావలె

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ కేంద్ర మంత్రిగా ఉన్న సమయం నుంచి తనకు మంచి మిత్రుడని కేంద్ర సామాజిక న్యాయం, సాధికారతశాఖ సహాయమంత్రి మంత్రి రాందాస్ అథావలె పేర్కొన్నారు. ఆదివారం హైదరాబాద్ హరిత ప్లాజాలో మీడియాతో మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీల సంక్షేమానికి కృషిచేస్తుందని చెప్పారు. కాగా, పదవీ బాధ్యతలు స్వీకరించిన సహాయమంత్రి అథావలెను రాష్ట్ర ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, ఎండీ అలోక్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు.



కేంద్రసహాయమంత్రి రాందాస్ అథావలెకు స్వాగతం పలుకుతున్న ఎంబీసీ చైర్మన్ శ్రీనివాస్

# పక్కా ప్రణాళికతో ఉజ్వల తెలంగాణ

- రాష్ట్ర అవతరణ వేడుకల్లో ట్రాన్స్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావు



విద్యుత్‌సౌధలో జాతీయ పతాకానికి వందనం చేస్తున్న ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావు తదితరులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సమర్థ నాయకుడు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు సారథ్యంలో ప్రభుత్వ సహకారం, పక్కా ప్రణాళికతో విద్యుత్‌రంగంలో రాష్ట్రం ఉజ్వల తెలంగాణగా రూపుదిద్దుకున్నదని ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావు అన్నారు. గడిచిన 54 నెలలకాలంలో ఎలాంటి విద్యుత్ అంతరాయాలు, కరంటు కోతలు లేని తెలంగాణను చూశామని చెప్పారు. రాష్ట్ర ఆవిర్భావ ఉత్సవం సందర్భంగా ఆదివారం విద్యుత్‌సౌధలో జాతీయ పతాకాన్ని ఎగురవేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీఎస్-ఐపాస్, వ్యవసాయం, మిషన్ భగీరథకు నిరంతర విద్యుత్ సరఫరాలో కృషి చేసినట్టు తెలిపారు.

# ఏటా సరికొత్త విద్యుత్ రికార్డులు

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** విద్యుత్ సరఫరాలో ఏటా సరికొత్త రికార్డులు సృష్టిస్తున్నామని, గతేడాది సెప్టెంబర్‌లో 10,818 మెగావాట్ల గరిష్ఠ డిమాండ్‌కు చేరుకున్నామని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్ ఎస్పీడీసీఎల్) సీఎండీ జీ రఘుమారెడ్డి చెప్పారు. సంస్థ ప్రధాన కార్యాలయంలో ఆదివారం రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత 22 లక్షల కొత్త సర్వీసులను మంజూరుచేసినట్టు రఘుమారెడ్డి తెలిపారు.



ఎస్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో జాతీయ జెండా ఎగురవేస్తున్న సీఎండీ రఘుమారెడ్డి

# త్వరలో పెండింగ్ ఉద్యోగాల భర్తీ

- టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలకు 101 నోటిఫికేషన్లు ఇచ్చి ఇప్పటివరకు 26 వేలకుపైగా భర్తీ చేసినట్టు టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి చెప్పారు. ఒకటి రెండు నోటిఫికేషన్లు మాత్రమే కోర్టు కేసులతో పెండింగ్‌లో ఉన్నాయని, పెండింగ్‌లో ఉన్న ఉద్యోగాలను త్వరలో భర్తీచేయనున్నట్టు వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలో ఆదివారం ఘంటా చక్రపాణి జాతీయజెండా ఎగురవేసి వందనం సమర్పించారు. ఈ కార్యక్రమంలో కమిషన్ సభ్యులు సీ విఠల్, చంద్రావతి, కృష్ణారెడ్డి, సాయిలు, సెక్రటరీ వాణిప్రసాద్ పాల్గొన్నారు.



టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలో జాతీయజెండాకు వందనం చేస్తున్న చైర్మన్ ఘంటా చక్రపాణి తదితరులు

# ఉత్తమ సేవలకు దక్కిన 'కాయకల్ప'

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సర్కారు దవాఖానల ద్వారా వైద్యసేవల విస్తరణలో తెలంగాణ రాష్ట్రం ముందంజలో నిలిచేలా కృషిచేయాలని వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఏ శాంతికుమారి సూచించారు. ఉత్తమ వైద్యసేవలందించిన దవాఖానలకు వైద్య, ఆరో గ్య, కుటుంబ సంక్షేమశాఖ, నేషనల్ హెల్త్‌మి షన్ సంయుక్తాధ్వర్యంలో 2018-19కి రాష్ట్రస్థాయి కాయకల్ప అవార్డుల ప్రదానోత్సవం డీఎంఈ కార్యాలయ ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించారు. అవార్డు అందుకొన్న దవాఖానల్లో కామారెడ్డి, సంగారెడ్డి, రంగారెడ్డి జిల్లా కొండాపూర్, ఖమ్మం, జనగామ, రాజన్న సిరిసిల్ల జిల్లాకేంద్ర దవాఖానలు, ఏరియా దవాఖానలు మూడు, కమ్యూనిటీ హెల్త్‌సెంటర్లు 3, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు 28, పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు 20 ఉన్నాయి.

# కాగితరహిత రిజిస్ట్రేషన్లు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర స్టాంపులు, రిజిస్ట్రేషన్లశాఖ కార్యాలయాల్లో ఇకపై కాగితం లేకుండా అన్ని వ్యవహారాలు ఎలక్ట్రానిక్ పద్ధతిలోనే జరుగనున్నాయి. ఆదివారం రిజిస్ట్రేషన్ల శాఖ కేంద్ర కార్యాలయంలో ఈ-విభాగాన్ని రెవెన్యూశాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్‌తివారీ ప్రారంభించారు. ఇకపై కేంద్ర కార్యాలయంతోపాటు రంగారెడ్డి, మెదక్, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో ఈ-కార్యాలయాలు పనిచేస్తాయి. కొన్నిరోజుల తర్వాత రాష్ట్రమంతటా ఇదే విధానాన్నే అవలంబిస్తామని అధికారులు చెప్పారు.

# రుణమాఫీ విధివిధానాలపై కసరత్తు!

- రూ.27 వేల కోట్లు అవసరం
- 2018 డిసెంబర్ 11 కటాఫ్
- లక్షలోపు వ్యవసాయ రుణాల మాఫీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వ్యవసాయ రుణమాఫీ విధానాల రూపకల్పనకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తుచేస్తున్నది. ఈ ప్రక్రియ పూర్తవగానే సీఎం కేసీఆర్ అనుమతితో అధికారికంగా ప్రకటించే అవకాశాలున్నాయి. లక్ష రూపాయల్లోపు పంట రుణాల మాఫీ కోసం ఇప్పటికే ప్రభుత్వం ఓటాన్‌అకౌంట్ బడ్జెట్‌లో నిధులు కేటాయించింది. రుణమాఫీ అమలుకు రూ.27 వేల కోట్లకుపైగా అవసరమవుతాయని అధికారులు అంచనావేశారు. శాసనసభ ఎన్నికల సందర్భంగా సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీల అమలుపై దృష్టిసారించిన అధికార యంత్రాంగం.. ఒక్కొక్క అంశాన్ని కొలిక్కి వస్తున్నది. జూన్ నుంచి పెరిగిన ఆసరా పింఛన్ వర్తింపజేస్తూ ప్రభుత్వం ఇప్పటికే ఉత్తర్వులు జారీచేసింది. ప్రస్తుతం రైతులకు కీలకమైన వ్యవసాయ రుణాలమాఫీ ప్రక్రియపై దృష్టి సారించింది. గురువారం జరిగిన రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశంలోనూ ఇదేఅంశం చర్చకు వచ్చింది. బ్యాంకర్ల కమిటీ ప్రాథమిక నివేదిక ప్రకారం రూ.లక్షలోపు రుణాల మొత్తం రూ.27 వేల కోట్లకు పైగా ఉన్నట్టు తెలిసింది. గత డిసెంబర్ 11 నాటికి ఉన్న లక్షలోపు వ్యవసాయ రుణాలను మాఫీచేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఈ సారి అన్ని రుణాలు విడుతలవారీగా కాకుండా తక్కువ మొత్తం ఉన్న రుణాలను ఒకేవిడుతలో మాఫీచేయాలనే ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తున్నట్టు అధికారవర్గాలు తెలిపాయి. ఇదే సమయంలో బ్యాంకర్ల ఖాతాలో నగదు జమచేయకుండా రైతుబంధు తరహాలో రైతులకే చెక్కులు ఇస్తే ఎలా ఉంటుందనే విషయంపై కూడా చర్చిస్తున్నట్టు సమాచారం. ఈ దిశలో అధికారుల కసరత్తు పూర్తిచేసి సీఎం కేసీఆర్ ఆమోదానికి నివేదిక పంపనున్నట్టు తెలిసింది. ఆ తర్వాతే రుణమాఫీకి సంబంధించిన విధివిధానాలు అధికారికంగా ప్రకటించే అవకాశాలున్నట్టు అధికారులు వెల్లడించారు.

## నేడు అందుబాటులో ఉండను

- మాజీ మంత్రి టీ హరీశ్‌రావు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తన జన్మదినం సందర్భంగా సోమవారం హైదరాబాద్‌తోపాటు సిద్దిపేటలోనూ అందుబాటులో ఉండటంలేదని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తెలిపారు. వ్యక్తిగత కార్యక్రమాల్లో భాగంగా దూరంగా ఉండాల్సి వస్తున్నదని ఆయన ట్విట్టర్‌లో పేర్కొన్నారు. సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాల చేయాలని అభిమానులకు సూచించారు. తనకు జన్మదిన శుభాకాంక్షలు చెప్పడానికి వస్తామంటూ ఫోన్లు చేస్తున్న ప్రతిఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలుపుతున్నానని పేర్కొన్నారు. అందరినీ నిరాశపరుస్తున్నందుకు మన్నించాలని కోరారు.

# రేపే పరిషత్ ఓట్ల లెక్కింపు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పరిషత్ ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధమైంది. మంగళవారం ఉదయం 8 గంటల నుంచి కౌంటింగ్ ప్రక్రియ మొదలుకానున్నది. మధ్యాహ్నం నుంచి ఫలితాల ట్రెండ్ తెలిసిపోనున్నది. సాయంత్రం 5 గంటల వరకు ఓట్ల లెక్కింపును పూర్తిచేసేలా ఈసీ చర్యలు చేపట్టింది. మొత్తం 2,426 మంది జెడ్పీటీసీ అభ్యర్థులు, 18,930 మంది ఎంపీటీసీ అభ్యర్థుల భవితవ్యం తేలిపోనున్నది. గతనెల 27న ఓట్ల లెక్కింపు చేపట్టాలని ఈసీ తొలుత నిర్ణయించింది. జెడ్పీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, మండల పరిషత్ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కోఆప్షన్ సభ్యుల ఎన్నికకు దాదాపు 42 రోజుల సమయం ఉండటం, క్యాంపులతో ప్రలోభాలకు గురిచేసే అవకాశాలు ఉన్నాయనే ఫిర్యాదులతో కౌంటింగ్‌ను వాయిదా వేశారు. పాత సభ్యుల పదవీ కాలం ఉండగానే.. కొత్త సభ్యులు, నూతన చైర్మన్లు, అధ్యక్షులను ఎన్నుకొనేందుకు ప్రభుత్వం చట్ట సవరణచేసి ఆర్డినెన్స్ తీసుకొచ్చింది.

**పోలింగ్ కేంద్రాలవారీగా లెక్కింపు**

పరిషత్ ఓట్ల లెక్కింపు కోసం రాష్ట్రవ్యాప్తంగా 123 చోట్ల కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటుచేశారు. ఈ కేంద్రాల్లో 978 కౌంటింగ్ హాళ్లు ఉంటాయి. మొత్తం 536 స్ట్రాంగ్ రూంలలో భద్రపర్చిన బ్యాలెట్‌బాక్స్‌లను లెక్కింపు కేంద్రాలకు తీసుకొచ్చి ఓట్లను లెక్కించనున్నారు. మొదటిదశలో పోలింగ్ కేంద్రాలవారీగా బ్యాలెట్ పేపర్లు, సదరు బూత్‌లో ఉన్న ఓటర్ల వివరాలతో లెక్కించనున్నారు. తర్వాత ఎంపీటీసీ, జెడ్పీటీసీలవారీగా విడదీసి ఒక్కోబండిల్‌లో 25 బ్యాలెట్ పత్రాలు చుట్టనున్నారు. రెండోదశలో ఎంపీటీసీ ఎన్నికకు కౌంటింగ్ మొదలుపెడుతారు. ఒక్కో ఎంపీటీసీ స్థానానికి రెండు టేబుళ్ల, రెండురౌండ్లు ఏర్పాటుచేశారు. ప్రతి ఎంపీటీసీ అభ్యర్థి ఇద్దరు ఏజెంట్లను నియమించుకోవాలని ఇప్పటికే అధికారులు అభ్యర్థులకు సూచించారు. ప్రతి బ్యాలెట్ పేపర్‌ను తెరిచి చెల్లుబాటు అవుతుందా లేదా అనేది ఏజెంట్ల ముందు చూడనున్నారు. చెల్లుబాటు అయితే ఎంపీటీసీ స్థానాల్లోని ట్రేలో వేయనుండగా... సందేహం వస్తే రిటర్నింగ్ అధికారుల దగ్గరకు పంపించి నిర్ణయం తీసుకుంటారు. అభ్యంతరాలున్న బ్యాలెట్లపై రిటర్నింగ్ అధికారులదే తుది నిర్ణయమని ఈసీ మార్గదర్శకాల్లో స్పష్టంచేసింది. తొలుత ఎంపీటీసీ స్థానాల్లో, తర్వాత జెడ్పీటీసీ ఓట్లను లెక్కించేలా ఏర్పాట్లు చేశారు. ఒక రౌండ్‌లో వెయ్యిఓట్లు లెక్కించనుండగా.. ఒక్కోస్థానానికి రెండు రౌండ్లు ఏర్పాటుచేశారు. 11,882 మంది సూపర్‌వైజర్లు, 23,647 మంది అసిస్టెంట్లతో కలుపుకొని మొత్తం 35,529 మంది కౌంటింగ్ సిబ్బందిని నియమించారు. లెక్కింపు సందర్భంగా భారీ భద్రత ఏర్పాటు చేయనున్నారు. మద్యం దుకాణాలు మూసివేయాలని ఇప్పటికే ఆదేశాలిచ్చారు.

# నేడే స్థానిక ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు

- మూడు ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో లెక్కింపు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో మూడు స్థానికసంస్థల ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు సోమవారం ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుంది. రెండు గంటల్లోనే ఫలితాలు వెలువడనున్నాయి. వరంగల్, నల్లగొండ, రంగారెడ్డి స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానాలకు గత నెల 31న ఎన్నికలు నిర్వహించగా.. మొత్తం 2,799 ఓట్లకుగానూ 1,958 ఓట్లు పోలయ్యాయి. వరంగల్ నియోజకవర్గం లెక్కింపు ఏనుమాముల మార్కెట్‌లో, రంగారెడ్డి జిల్లా ఓట్ల లెక్కింపు రాజేంద్రనగర్‌లోని వెటర్నరీ కాలేజీలో, నల్లగొండ ఎమ్మెల్సీ నియోజకవర్గం లెక్కింపు దుప్పలపల్లి వేర్‌హౌసింగ్ గోదాంలో నిర్వహించనున్నారు. ఈ మేరకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. ముందుగా పోలింగ్‌కేంద్రాల వారీగా ఉన్న ఓట్లు, పోలైనఓట్ల జాబితాను పరిశీలించనున్నారు. తర్వాత 25 ఓట్ల చొప్పున బండిల్స్ చుట్టి, లెక్కింపు ప్రక్రియను చేపడుతారు. రంగారెడ్డి ఎమ్మెల్సీ స్థానానికి 797 ఓట్లు మాత్రమే పోల్ కావడంతో ఫలితం త్వరగా తేలనున్నట్టు తెలుస్తున్నది. తర్వాత వరంగల్, చివరకు నల్లగొండ ఫలితాలు రానున్నాయి. ఓట్ల లెక్కింపు సందర్భంగా ఆయాజిల్లాల్లో బందోబస్తు ఏర్పాటు చేశారు.

**బరిలో 9 మంది**

మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో 9 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. టీఆర్‌ఎస్ నుంచి రంగారెడ్డి ఎమ్మెల్సీ స్థానానికి మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి.. నల్లగొండలో టీఆర్‌ఎస్ నుంచి తేరా చిన్నపరెడ్డి, కాంగ్రెస్ నుంచి కోమటిరెడ్డి లక్ష్మి పోటీచేశారు. వరంగల్ స్థానం నుంచి అయిదుగురు అభ్యర్థులు పోటీలో ఉన్నారు. టీఆర్‌ఎస్ నుంచి పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి ఇనుగాల వెంకట్రాంరెడ్డి పోటీచేస్తున్నారు.

# ఏపీ భవనాల అప్పగింత

మూడోపేజీ తరువాయి...

ఉద్దేశంతో నాటి ఏపీ సీఎం చంద్రబాబునాయుడు విభజన సమస్యలు పరిష్కారం కాకుండా అడ్డుపడుతూవచ్చారు. ప్రతి సమస్యను భూతద్దంలో పెట్టిచూశారు. సీఎం కేసీఆర్ కృషికి తోడుగా ఏపీలో కొత్తగా వైఎస్ జగన్ సారథ్యంలో ఏర్పడిన ప్రభుత్వం విభజన సమస్యల పరిష్కారానికి చొరవ చూపడంతో ముఖ్యమైన సమస్యకు పరిష్కారం లభించింది.

**సీఎం విజ్ఞప్తికి సానుకూల స్పందన**

హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆంధ్రప్రదేశ్ ఆధీనంలో ఖాళీగా ఉన్న బ్లాకులు, అసెంబ్లీ, శాఖాధిపతుల ప్రధాన కార్యాలయాల భవనాలను ఇప్పించాలని సీఎం కేసీఆర్ చంద్రశేఖర్‌రావు గవర్నర్ నరసింహన్‌ను కోరారు. ఆదివారం రాజ్‌భవన్‌లో గవర్నర్ నరసింహన్‌ను కలిసిన ఆయన ఈ మేరకు రాష్ట్ర క్యాబినెట్ తీర్మానం ప్రతిని అందజేశారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణచట్టం ప్రకారం హైదరాబాద్ పదేండ్లు ఉమ్మడి రాజధానిగా నిర్ణయించడంతో, ఏపీ ప్రభుత్వం హైదరాబాద్ నుంచి పరిపాలన సాగించడానికివీలుగా సచివాలయంలోని ఐదుబ్లాక్‌లు, అసెంబ్లీ భవనంతోపాటు అన్ని ప్రభుత్వ శాఖల ప్రధానాధిపతుల కార్యాలయాలను దామాషా ప్రకారం కేటాయించారు. ఈ మేరకు ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్ అనుమతితో 2014 మే నెలలో ఏపీకి, తెలంగాణకు బ్లాక్‌లు, కార్యాలయాలు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. కానీ, పరిపాలన దూరమవుతుందన్న కారణంతో 2016 నవంబర్‌లో ఏపీ ప్రభుత్వం అన్ని భవనాలను ఖాళీచేసి పరిపాలనను అమరావతికి తరలించింది. అప్పటి నుంచి ఏపీకి కేటాయించిన భవనాలన్నీ ఖాళీగా ఉన్నాయి. తెలంగాణకు కేటాయించిన భవనాలు సరిపోక ప్రభుత్వం ఇబ్బందులు పడుతున్నది. అన్నిశాఖలు కొద్ది స్థలంలోనే సర్దుకొనిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఏపీ ప్రభుత్వం కార్యాలయ భవనాలను ఖాళీ చేస్తే వాటిని వినియోగించుకోవడానికి వీలవుతుందని రాష్ట్ర ప్రభుత్వం భావించింది. వాళ్లు ఖాళీ చేసిన భవనాలను తిరిగి తమకు అప్పగించాలని కోరింది. కానీ ఆనాడు అధికారంలో ఉన్న చంద్రబాబు సర్కారు ఖాళీగా ఉన్న భవనాలను తెలంగాణకు ఇవ్వడానికి ససేమిరా అంగీకరించలేదు. ఖాళీభవనాలకు తాళాలు వేసుకొన్నారే తప్ప కనీసం నిర్వహణ కూడా చేయలేదు. దీంతో ఆ బంగళాలు దుమ్ముధూళితో భూత్‌బంగళాలను తలపిస్తున్నాయి. ఈ విషయాన్ని గవర్నర్‌కు, కేంద్రానికి తెలంగాణ ప్రభుత్వం తెలియజేసింది. కానీ నాటి ఏపీ ప్రభుత్వం అనుసరించిన మొండివైఖరి వల్ల ఆనాడు భవనాలను అప్పగించలేదు.

**తెలంగాణ, ఏపీ ప్రభుత్వాల స్నేహబంధం**

సాధారణ ఎన్నికల తరువాత రాజకీయపరిస్థితులు మారాయి.. తెలంగాణతో స్నేహంగా ఉండాలని భావించే జగన్ సీఎం కావడంతోనే విభజన సమస్యలను పరిష్కరించుకోవడానికి ముందుకొచ్చారు. శనివారంనాడు గవర్నర్ నరసింహన్ సమక్షంలో సీఎం కేసీఆర్, ఏపీ సీఎం జగన్ మధ్య చర్చలు జరిగాయి. ఇందులో భాగంగానే ఖాళీగా ఉన్న భవనాల అప్పగింతపై కూడా చర్చ జరిగింది. ఈ నేపథ్యంలో ఆదివారం గవర్నర్ నరసింహన్‌ను కలిసిన సీఎం కేసీఆర్ హైదరాబాద్‌లో ఏపీకి కేటాయించిన ఖాళీ భవనాలను అప్పగించాలని కోరుతూ రాష్ట్ర మంత్రివర్గం తీర్మాన పత్రాన్ని అందించారు. సర్క్యులేషన్ పద్ధతిలో క్యాబినెట్ తీర్మానం జరిగింది. వాస్తవంగా విభజన చట్టంలోని సెక్షన్ 8 ప్రకారం భవనాల కేటాయింపులపై గవర్నర్‌కు అధికారం ఉన్నది. ఇదే సమయంలో రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రుల మధ్య కూడ విభజన సమస్యలన్నీ పరిష్కరించుకోవాలనే ఏకాభిప్రాయం కుదిరింది. దీంతో విభజన సమస్యల పరిష్కారానికి తొలిఅడుగు ముందుకు పడింది.

7న వైఎస్సార్సీపీ

## ఎల్పీ సమావేశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వైఎస్సార్సీపీ ఎల్పీ సమావేశం ఈ నెల ఏడున ఖరారైంది. ఆ రోజు ఉదయం పదిగంటలకు ఏపీసీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగే శాసనసభాపక్ష సమావేశానికి పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరుకానున్నారు. అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై సమావేశంలో చర్చించనున్నట్టు తెలిసింది.

ఏపీ ఒలింపిక్ అసోసియేషన్

## చైర్మన్‌గా విజయసాయిరెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎంపికచేశారు. ఎనిమిది కమిటీలతోపాటు పలు అనుబంధ కమిటీలను ఏర్పాటుచేశారు. చైర్మన్‌గా ఎంపీ విజయసాయిరెడ్డి, అధ్యక్షుడిగా ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, ప్రధాన కార్యదర్శిగా పురుషోత్తం ఎన్నికయ్యారు.

ప్రముఖ జానపద నృత్యకళాకారుడు

# 'క్వీన్' హరీశ్ మృతి



## జోధ్‌పూర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు కళాకారుల దుర్మరణం

**జోధ్‌పూర్, జూన్ 2:** రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ సమీపంలో ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రముఖ జానపద నృత్యకళాకారుడు 'క్వీన్' హరీశ్ సహా నలుగురు కళాకారులు మృతిచెందారు. ఈఘటనలో మరో ఐదుగురు గాయపడ్డారు. ఓ కార్యక్రమంలో పాల్గొనడానికి జైసల్మేర్ నుంచి అజ్మీర్ వస్తున్న 'క్వీన్'హరీశ్ బృందం ప్రయాణిస్తున్న ఎస్‌యూవీ వాహనాన్ని కపర్దా గ్రామం వద్ద ఓ లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో 'క్వీన్' హరీశ్‌తో పాటు రవీంద్ర, భిఖే ఖాన్, లతీఫ్ ఖాన్ మరణించగా, మరో ఐదుగురు గాయపడ్డారని బిలారా పోలీసు అధికారి సీతారాం కోజా తెలిపారు. 'క్వీన్' హరీశ్ మృతి జానపద నృత్య కళారంగానికి తీరనిలోటని రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ తెలిపారు. జైసల్మేర్ వాస్తవ్యుడైన హరీశ్ జానపద నృత్యరీతుల్లో నూతన ఒరవడిని తీసుకొచ్చి 'క్వీన్' హరీశ్‌గా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందారు. ఈయన రాజస్థానీ జానపద నృత్యాలైన ఘూమార్, కల్బెలియ, చాంగ్, భావై, చారి వంటి నృత్యరీతులలో ప్రపంచవ్యాప్తంగా పేరు తెచ్చుకున్నారు.

# మహాత్ముడిపై ఐఏఎస్ వివాదాస్పద ట్వీట్

## సస్పెన్షన్‌కు పట్టుబట్టిన కాంగ్రెస్, ఎన్సీపీ



నిధి చౌదరి

**ముంబై:** మహాత్మాగాంధీపై ముంబై ఐఏఎస్ అధికారిణి చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. బీజేపీ నాయకురాలు ప్రజ్ఞాసింగ్ ఠాకూర్ ఇటీవల ఎన్నికల ప్రచారంలో గాంధీపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. మహాత్ముడి విగ్రహాలను తొలిగించాలంటూ ఐఏఎస్ అధికారిణి నిధి చౌదరి చేసిన ట్వీట్‌పై ప్రతిపక్ష కాంగ్రెస్, ఎన్సీపీలు మండిపడ్డాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న మహాత్మాగాంధీ విగ్రహాలను తొలిగించాలని, భారత కరెన్సీ నోట్లపై ఉన్న ఆయన బొమ్మను తీసేయాలంటూ ఐఏఎస్ అధికారిణి, బృహక్ ముంబై కార్పొరేషన్ డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ నిధి చౌదరి గతనెల 17న ట్వీట్ చేశారు. గాంధీని హత్యచేసిన గాడ్సేకు ఆమె ధన్యవాదాలు తెలియజేశారు. ఈ ట్వీట్‌పై విమర్శలు వెల్లువెత్తడంతో దాన్ని తొలిగించారు. ట్వీట్ వ్యగ్యంగా పెట్టానని, దీన్ని అపార్థం చేసుకున్నారని ఆమె వివరణ ఇచ్చారు. 'నేను గాంధేయవాదిని. గాంధీ లేదా ఏ ఇతర స్వాతంత్ర్య సమరయోధులను కించపరచను. ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో గాంధీజీకి వ్యతిరేకంగా నడుస్తున్న తీరుపై వ్యగ్యంగా స్పందించాను. ఇది చట్టవ్యతిరేకమైనదేమీ కాదు. ట్వీట్ మొత్తం చదివితే ఈ విషయం అర్థమవుతుంది' అని పేర్కొన్నారు. దీనిపై మహారాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు, మాజీ సీఎం అశోక్ చవాన్, ఎన్సీపీ నేత జితేంద్ర అవద్ ఆదివారం స్పందించారు. 'ఈ ట్వీట్ ఖండించదగినది. ఇది ఆమె దిగజారుడు ఆలోచనలను తెలియజేస్తున్నది. ఇలాంటి ఆలోచనలను ఇప్పటికైనా ఆపేయాలి. రాష్ట్ర ప్రభుత్వం.. గాంధీ భావజాలాన్ని సమర్థిస్తుందా లేక గాడ్సేదా అనేది స్పష్టంగా తెలియజేయాలి' అని అశోక్‌చవాన్ అన్నారు. గాంధీపై ఇష్టానుసా మాట్లాడిన ఐఏఎస్ అధికారిని సస్పెండ్ చేయాలని అవద్ డిమాండ్ చేశారు.



చురూలో ఉష్ణోగ్రత తారాస్థాయికి చేరడంతో రోడ్డుపై నీళ్లు చల్లుతున్న అగ్నిమాపక శకటం

మరో రెండు రోజులు

# తీవ్ర వడగాడ్పులు

## చురూలో అత్యధికంగా 49 డిగ్రీల ఉష్ణోగ్రతలు

## రాజస్థాన్, మధ్యప్రదేశ్‌కు వాతావరణ శాఖ రెడ్ కోడ్ వార్నింగ్

**న్యూఢిల్లీ, జూన్ 2:** దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో మరో రెండు రోజులు తీవ్ర వడగాల్పులు వీచే అవకాశముందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. ప్రధానంగా ఉత్తరాదితోపాటు మధ్య, దక్షిణ భారతావనిలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుందని పేర్కొంది. రాజస్థాన్‌లోని చురూలో ఆదివారం అత్యధికంగా 48.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు తెలిపింది. కాగా శనివారం దేశంలోనే రికార్డు స్థాయిలో చురూలో 51 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైన సంగతి తెలిసిందే. తీవ్ర ఎండలకు రాజస్థాన్‌లోని గాంధీనగర్, బికనీర్, జైసల్మేర్, కోటా, బార్మర్ వంటి ప్రాంతాల్లో 47 నుంచి 48 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి. ఆదివారం ఆ రాష్ట్రంలో వడదెబ్బకు హనుమాన్ జాట్ అనే 45 ఏండ్ల రైతు చేలో మృతిచెందాడు. కాగా సోమవారం నాటి ఎండలపై రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు వాతావరణ శాఖ రెడ్ కోడ్ వార్నింగ్ ప్రకటించింది. సాధారణంగా వడ గాల్పుల తీవ్రతను బట్టి ఎరుపు, యాంబర్, పసుపు, ఆకుపచ్చ కోడ్‌లతో హెచ్చరిస్తుంది. దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఆదివారం 42 నుంచి 45 డిగ్రీల వరకు గరిష్ఠ ఉష్ణోగ్రతలు రికార్డైనట్లు చెప్పింది.

# ఇఫ్తార్ వార్!





ఇఫ్తార్ విందులో మాట్లాడుతున్న భారత హైకమిషనర్ బిసారియా

**భారత హైకమిషన్ ఇచ్చిన విందులో.. పాక్ సిబ్బంది ఓవరాక్షన్**

## అతిథుల పట్ల దురుసు ప్రవర్తన.. తనిఖీల పేరుతో తీవ్ర వేధింపులు

## విందులో పాల్గొనకుండా బెదిరింపులు.. తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన భారత్

## వెంటనే విచారణ జరుపాలని డిమాండ్

**న్యూఢిల్లీ, జూన్ 2:** పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్‌లో భారత హై కమిషన్ శనివారం ఏర్పాటు చేసిన సంప్రదాయ ఇఫ్తార్ విందులో పాక్ భద్రతా సిబ్బంది దురుసుగా ప్రవర్తించారు. మునుపెన్నడూ లేని విధంగా తనిఖీల పేరుతో అతిథులను వేధింపులకు, బెదిరింపులకు గురిచేశారని భారత హై కమిషన్ ఆదివారం ఓ ప్రకటనలో విమర్శించింది. ఈ ఘటనపై తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. దీనిపై వెంటనే దర్యాప్తు జరుపాలని పాకిస్థాన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. భారత హై కమిషనర్ అజయ్ బిసారియా శనివారం సెరెనా హోటల్‌లో ఇఫ్తార్ విందును ఏర్పాటుచేశారు. పాక్ అధ్యక్షుడు ఆరిఫ్ అల్వి, ప్రధాని ఇమ్రాన్ ఖాన్, ఇతర రాజకీయ నేతలతోపాటు భారత దౌత్యవేత్తలను, అధికారులను విందుకు ఆహ్వానించారు. అయితే ఆరిఫ్, ఇమ్రాన్ హాజరుకాలేదు. విందుకు హాజరైన అతిథుల పట్ల పాక్ భద్రతా సిబ్బంది దురుసుగా ప్రవర్తించారు. అతిథుల్లో ఒకరైన పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ నేత ఫర్హతుల్లా బాబర్ స్పందిస్తూ.. 'ఇండియన్ హై కమిషన్ ఇస్తున్న ఇఫ్తార్ విందులో పాల్గొనేందుకు సెరెనా హోటల్‌కు వెళ్లా. హోటల్ బ్లాక్ చేసినట్లుగా ఉంది. ఇఫ్తార్ విందు రద్దు చేసినట్లుగా అక్కడి సిబ్బంది చెప్పారు. గట్టిగా అడిగితే, మరో గేటు ద్వారా వెళ్లమన్నారు. అక్కడికి వెళ్తే ఆ ద్వారం మూసివేసి ఉంది. మళ్లీ ముందరి గేటు వద్దకు వెళ్లమన్నారు. ఏం జరుగుతున్నది. ఏదో అనుమానంగా ఉన్నది' అని ఆయన ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. ప్రముఖ జర్నలిస్ట్ మెహరీన్ జెహ్రా మాలిక్ స్పందిస్తూ.. భారత హై కమిషన్ ఇఫ్తార్ విందు ఇస్తున్న సెరెనా హోటల్‌లో మునుపెన్నడూ లేని స్థాయిలో వేధింపుల పర్వం కొనసాగుతున్నది. హోటల్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న వారి పట్ల పోలీసులు, యాంటీ టెర్రరిజం సిబ్బంది దురుసుగా ప్రవరిస్తున్నారు. నా డ్రైవర్‌ను దూషించారు. ఇది నిజంగా వేధించడమే' అని ట్వీట్ చేశారు. భద్రతా సిబ్బంది ప్రశ్నలు, తనిఖీలకు భయపడి తాను విందుకు హాజరుకాలేదని మరో జర్నలిస్ట్ తెలిపారు. గుర్తు తెలియని నంబర్ల నుంచి అతిథులకు ఫోన్ చేసి, విందుకు హాజరైతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని బెదిరించినట్లు కూడా వార్తలు వచ్చాయని ఆయన చెప్పారు. గత నెల 28న ఢిల్లీలోని పాక్ హైకమిషన్‌లో ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో అతిథులను భారత పోలీసులు అడ్డుకున్నారని ఆరోపిస్తున్న పాక్.. దానికి ప్రతీకారంగానే ఈ చర్యకు పాల్పడినట్లు భావిస్తున్నారు.

### అతిథులకు హైకమిషనర్ క్షమాపణలు

భారత హైకమిషనర్ బిసారియా.. అతిథులందరికీ క్షమాపణలు చెప్పారు. 'ఇలాంటి బెదిరింపు చర్యలు నిజంగా దురదృష్టకరం. వారు ప్రాథమిక దౌత్య నిబంధనలు ఉల్లంఘించడమే కాదు.. నాగరిక ప్రవర్తననూ మరిచారు' అని పాక్‌పై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాలపై ఇది తీవ్ర ప్రభావం చూపుతుందని స్పష్టం చేశారు.

### తెలివితక్కువ దౌత్యం: ఒమర్ అబ్దుల్లా

తాజా ఘటనపై జమ్ము కశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, నేషనల్ కాన్ఫరెన్స్ ఉపాధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది దెబ్బకుదెబ్బ అనే తెలివితక్కువ దౌత్యమని మండిపడ్డారు. 'న్యూఢిల్లీలోని పాక్ హైకమిషన్ వెలుపల మనం చేసింది, ఇస్లామాబాద్‌లోని మన కమిషన్ బయట వాళ్లు చేసిందీ తెలివితక్కువ పనే. లెక్క సరిపోయింది. ఇక ఈ పనికి మాలినతనానికి ముగింపు పలకండి' అని ఆయన ట్వీట్ చేశారు.

### భారత్ తీవ్ర ఆగ్రహం..

భారత హైకమిషన్ ఇచ్చిన సంప్రదాయ ఇఫ్తార్ విందులో అతిథుల పట్ల పాక్ భద్రతా సిబ్బంది దురుసుగా ప్రవర్తించడంపై భారత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. నాగరిక ప్రవర్తనను పాక్ మరిచిందని మండిపడింది. తాజా ఘటనపై తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. 'జూన్ 1న చోటుచేసుకున్న దురదృష్ట ఘటనలు ప్రాథమిక దౌత్య నిబంధనలను ఉల్లంఘించడమే కాదు.. నాగరిక ప్రవర్తనకూ విరుద్ధం' అని భారత హైకమిషన్ ఓ ప్రకటనలో పేర్కొంది. 'పాకిస్థాన్‌లోని భారత దౌత్యవేత్తలు, అధికారులను బెదిరింపుల ద్వారా వారి విధులను నిర్వహించకుండా అడ్డుకోవడం ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలపై ప్రతికూల ప్రభావం చూపుతుంది' అని స్పష్టం చేసింది. అతిథులను ఎందుకు వేధిస్తున్నారని ప్రశ్నించిన భారత హైకమిషన్ సిబ్బంది, అధికారులను భద్రతా సిబ్బంది బెదిరించారని, దురుసుగా ప్రవర్తించారని భారత హైకమిషన్ ఆ ప్రకటనలో ఆరోపించింది. కొంతమంది అధికారులను తోసేశారని, దూషించారని, అలాగే సెల్‌ఫోన్లను లాక్కున్నారని తెలిపింది. మునుపెన్నడూ లేని రీతిలో అతిథులను బెదిరింపులకు గురిచేశారని ఆగ్రహం వ్యక్తంచేసింది. అతిథులు ఇఫ్తార్ విందులో పాల్గొనకుండా చేసేందుకు కొద్దిరోజుల ముందు నుంచే పాక్ భద్రతా సంస్థలు ప్రయత్నాలు చేసినట్లు ఆరోపించింది. లాహోర్, కరాచి నుంచి అతిథులు వచ్చారని, అయితే భద్రతా సిబ్బంది వారిని బలవంతంగా అడ్డుకున్నారని విమర్శించింది. సుమారు 300 మంది పాకిస్థానీ అతిథులను అడ్డుకున్నారని, వారిలో ఎంపీలు, ప్రభుత్వాధికారులు, మీడియా ప్రతినిధులు, రిటైర్డ్ మిలిటరీ అధికారులు, వ్యాపారవేత్తలు, విశ్రాంత దౌత్యవేత్తలు ఉన్నారని వివరించింది. అతిథులను బెదిరింపులకు గురిచేయడం పట్ల పాక్‌కు భారత్ తీవ్ర నిరసన తెలియజేసిందని హైకమిషన్ తెలిపింది. ఈ ఘటనలపై సమగ్ర దర్యాప్తు జరుపాలని పాకిస్థాన్ ప్రభుత్వాన్ని కోరింది. భారత అధికారుల విధులకు ఎలాంటి ఆటంకాలు కలిగించకుండా చర్యలు తీసుకోవాలని సూచించింది.

# యూపీలో ఆర్మీ జవాన్లపై రెస్టారెంట్ సిబ్బంది దాడి

**లక్నో, జూన్ 2:** ఉత్తరప్రదేశ్‌లో ఇద్దరు ఆర్మీ జవాన్లపై ఓ రెస్టారెంట్ సిబ్బంది దాడి చేశారు. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. శనివారం భోజనం కోసం భాగ్‌పాట్‌లోని ఓ రెస్టారెంట్‌కు ఇద్దరు ఆర్మీ జవాన్లు వెళ్లారు. ఈ సందర్భంగా ఓ వ్యక్తితో వారు ఘర్షణ పడ్డారు. దీంతో ఆ రెస్టారెంట్ సిబ్బంది ఏడుగురు కర్రలతో విచక్షణారహితంగా వారిని కొట్టారు. జవాన్లపై దాడికి సంబంధించిన వీడియోను ఓ వార్తా సంస్థ విడుదల చేయగా సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. కాగా ఈ ఘటనపై కేసు నమోదు చేయడంతోపాటు ఆ రెస్టారెంట్‌కు చెందిన ఎనిమిది మంది సిబ్బందిని అరెస్ట్ చేసి దర్యాప్తు చేస్తునట్లు భాగ్‌పాట్ సర్కిల్ పోలీస్ అధికారి రమానంద్ కుష్వా వెల్లడించారు.

# టిక్‌టాక్ తెచ్చిన తంటా..

## భార్యను కత్తితో పొడిచి చంపిన భర్త

**చెన్నై, జూన్ 2:** చైనాకు చెందిన వీడియో యాప్ టిక్‌టాక్ తెచ్చిన తంటా వల్ల ఓ వివాహిత ప్రాణాలుకోల్పోయారు. ఈ దుర్ఘటన తమిళనాడులోని కోవై సమీపంలో చోటుచేసుకుంది. అరివొలినగర్‌కు చెందిన కనకరాజ్‌కు ప్రైవేట్ కళాశాలలో పనిచేస్తున్న నందినికి కొన్నేండ్ల కిందట పెండ్లి అయ్యింది. వీరికి ఓ కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. గొడవలు జరుగడంతో రెండేండ్ల నుంచి వేర్వేరుగా ఉంటున్నారు.కొద్దిరోజులుగా టిక్‌టాక్‌లో నందిని అసభ్య హావాభావాలతో కూడిన వీడియోలను పోస్ట్ చేస్తున్నది. ఈ విషయం తెలుసుకున్న కనకరాజ్ ఆమెను మందలించాడు. ఆమె వినకపోవడంతో తీవ్ర ఆగ్రహానికి గురైన కనకరాజ్ శుక్రవారం మద్యం సేవించి కళాశాలకు వెళ్లి గొడవపడ్డాడు. వీరిద్దరి మధ్య గొడవ పెద్దదవడంతో తన వెంట తీసుకెళ్లిన కత్తితో భార్యను పొడిచి పారిపోయాడు. తీవ్రంగా గాయపడిన ఆమెను దవాఖానకు తరలిస్తుండగా ప్రాణాలు కోల్పోయారు.

# ముందస్తు వెక్కిరింపు!

మూడో పేజీ తరువాయి...

అప్లికేషన్ చీఫ్ పులక్ గుహతకుర్తా తెలిపారు. అయితే దేశవ్యాప్తంగా ఈ పరిస్థితులు లేవని చెప్పారు. వ్యవసాయానికి, భూగర్భ జలాల పెరుగుదలకు, నేలలో తేమ శాతం కొనసాగించడానికి ముందస్తు వానలు కీలకమని ఆయన పేర్కొన్నారు. 'తీవ్ర నీటి కొరత సమస్యలకు ముందస్తు వానల ద్వారా ఉపశమనం లభిస్తుంది. నేలలో తేమ శాతం వ్యవసాయానికి కీలకం. ముందస్తు సీజన్‌లో లోటు వర్షపాతం కురిసినా తేమ శాతం కొనసాగించడంలో దోహదపడుతుంది. గత 11 ఏండ్లుగా, మహారాష్ట్రలో రుతుపవనాల ద్వారా కేవలం ఒకట్రెండు నెలల్లోనే వర్షపాతం కురిసింది. కొంత సమయంలోనే భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిశాయి. దీని వల్ల వరద ముప్పు తలెత్తడమే కాకుండా, నీరు కూడా వృథా అయింది' అని ఆయన వివరించారు. దేశంలో ముందస్తు సీజన్‌లో దక్షిణ ద్వీపకల్పంలో (-48%) అత్యధిక లోటు వర్షపాతం నమోదైంది. ఆ తర్వాత వాయవ్య భారతం (-29%), మధ్యభారతం (-17%), ఈశాన్య భారతం(-12%) ఉన్నాయి. ఉత్తర రాజస్థాన్, ఉత్తర, మధ్య మధ్యప్రదేశ్, దక్షిణ ఉత్తరప్రదేశ్, దక్షిణ పంజాబ్, హర్యానాలో బాగా వర్షాలు కురిశాయని ఐఎండీకి చెందిన అనుపమ్ కశ్యప్ తెలిపారు.

**91 రిజర్వాయర్లలో 20 శాతానికి తగ్గిన నీటిమట్టం**

పశ్చిమ, దక్షిణ భారతదేశంలోని చాలా రిజర్వాయర్లలో నీటి మట్టం గత పదేండ్ల సగటు కంటే చాలా తక్కువగా ఉందని కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) వెల్లడించింది. 'మే 30తో ముగిసిన వారానికి, దేశంలోని 91 ప్రధాన రిజర్వాయర్లలో నీటి మట్టం 31.65 బిలియన్ క్యూబిక్ మీటర్లు ఉంది. ఈ రిజర్వాయర్ల మొత్తం నీటి నిల్వ సామర్థ్యంలో ఇది 20 శాతం. మే 23తో ముగిసిన వారానికి ఇది 21 శాతంగా ఉండేది' అని సీడబ్ల్యూసీ తెలిపింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కేరళ, రాజస్థాన్, జార్ఖండ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్, త్రిపుర, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌లోని రిజర్వాయర్లలో గతేడాది కంటే నీటి నిల్వలు తగ్గాయని పేర్కొంది.

**42 శాతం భారత భూభాగంలో కరువు పరిస్థితులు..**

42 శాతానికిపైగా భారత భూభాగంలో తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్నాయని డ్రాట్ ఎర్లీ వార్నింగ్ సిస్టమ్ వెల్లడించింది. గతేడాదితో పోలిస్తే ఇది 6% అధికమని తెలిపింది. మే 21 నాటికి 42.18శాతంగా ఉన్న కరువు ప్రాంతం మే 28నాటికి 42.61 శాతానికి పెరిగిందని వివరించింది. గతేడాది మే 28 నాటికి దేశంలో 36.74% భూభాగంలో కరువు పరిస్థితులు నెలకొన్నట్లు పేర్కొంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్‌లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని తెలిపింది.

# సుష్మ అడుగుజాడల్లో జైశంకర్

## ట్విట్టర్ వేదికగా ప్రజల సమస్యలను పరిష్కరిస్తున్న విదేశాంగ శాఖ మంత్రి



**న్యూఢిల్లీ, జూన్ 2:** మంచి విషయం ఏ రూపంలో ఉన్నా స్వీకరించాలన్న సూక్తిని విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ పాటించారు. తన కంటే ముందు విదేశాంగ మంత్రిగా పనిచేసిన సుష్మా స్వరాజ్ అడుగుజాడల్లో నడుస్తున్నారు. ఆమె మంత్రిగా ఉన్నప్పుడు ట్విట్టర్‌లో క్రియాశీలకంగా ఉండటమే కాకుండా ప్రజల ఫిర్యాదులపై వెంటనే స్పందించి చర్యలు తీసుకునేవారు. ఇప్పుడు జై శంకర్ కూడా అలాగే స్పందిస్తున్నారు. సౌదీ అరేబియాలో చిక్కుకుపోయిన కోల్‌కతాకు చెందిన ఓ వ్యక్తిని ఆదుకున్నందుకు రియాద్‌లోని భారత రాయబార కార్యాలయ అధికారులను ట్విట్టర్ వేదికగా అభినందించారు. అలాగే సహాయం కోరుతూ వచ్చిన మరో రెండు ట్వీట్లకు కూడా ఆయన స్పందించారు. వీరికి అండగా నిలువాలంటూ సంబంధింత రాయబార కార్యాలయ అధికారులకు సూచించారు.

# కేంద్ర క్యాబినెట్ కార్యదర్శిగా రాజీవ్‌గౌబా!

## ఈ నెల 12తో ముగియనున్న పీకే సిన్హా పదవీకాలం



రాజీవ్ గౌబా

**న్యూఢిల్లీ:** కేంద్ర క్యాబినెట్ కార్యదర్శిగా సీనియర్ ఐఏఎస్ రాజీవ్‌గౌబాను నియమించేందుకు కేంద్రం రంగం సిద్ధం చేసింది. ఆయనను క్యాబినెట్ సెక్రటరీగా నియమించేందుకు వీలుగా.. క్యాబినెట్ సెక్రటేరియట్‌లో ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్డీ)గా ఇప్పుడు కేంద్రం నియమించనున్నది. ప్రస్తుత క్యాబినెట్ కార్యదర్శి పీకే సిన్హాకు పొడిగించిన నాలుగేండ్ల పదవీకాలం ఈ నెల 12తో ముగియనుండటంతో.. ప్రభుత్వం కొత్త క్యాబినెట్ సెక్రటరీ నియామకంపై దృష్టిసారించింది. సీనియర్ ఐఏఎస్‌ల జాబితాలో గౌబా ముందువరుసలో ఉండడంతో దాదాపు ఆయన్నే నియమించనుంది.



కర్ణాటకలో ఘోర రోడ్డు ప్రమాదం

## ఏడుగురి దుర్మరణం

**బెళగావి, జూన్ 2:** కర్ణాటక రాష్ట్రంలోని బెళగావి సమీపంలో ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఐదుగురు యువకులు సంఘటన స్థలంలోనే మృతి చెందగా, మరో ఇద్దరు బెళగావి జిల్లా దవాఖానలో చికిత్స పొందుతూ చనిపోయారు. వేగంగా వెళ్తున్న కారు టైరు పేలి, లారీని ఢీకొట్టడంతో ఈ ప్రమాదం సంభవించిందని పోలీసులు తెలిపారు. చనిపోయిన మృతులు గోవా విహారానికి వెళ్తున్నట్టు సమాచారం. మృతుల స్వస్థలం ఔరంగాబాద్ అని, ప్రమాదానికి కారు వేగమే కారణమని పోలీసులు వెల్లడించారు.

# కేరళలో మళ్లీ నిఫా కలకలం

- వ్యాధి లక్షణాలతో దవాఖానలో చేరిన యువకుడు
- ఇంకా నిర్ధారణ కాలేదంటున్న అధికారులు
- సోషల్‌మీడియాలో వచ్చే పుకార్లను నమ్మొద్దని సూచన



**తిరువనంతపురం, జూన్ 2:** కేరళలో మళ్లీ నిఫా వైరస్ కలకలం రేపింది. గత ఏడాది మే నెలలో 17 మంది ప్రాణాలను హరించిన ఈ వైరస్ జాడలు మళ్లీ కనిపిస్తున్నాయి. కేరళలోని ఎర్నాకులంలో 23 ఏండ్ల యువకుడు నిఫా వైరస్ అనుమానిత లక్షణాలతో ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతున్నట్టు జిల్లా వైద్యాధికారి కుట్టప్పన్ తెలిపారు. అతడిని ప్రత్యేక వార్డులో ఉంచి చికిత్స అందిస్తున్నామని చెప్పారు. అతడి రక్త నమూనాలు సేకరించి పరీక్షల కోసం మణిపాల్ వైరాలజీ ఇన్‌స్టిట్యూట్‌కు, కేరళ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ అండ్ ఇన్ఫెక్షన్ డిసీజెస్‌కు పంపించామని చెప్పారు. నివేదికలు సోమవారం వస్తాయన్నారు. ఆ యువకుడు శిక్షణలో భాగంగా పది రోజుల కిందట పక్క జిల్లాకు వెళ్లాడని, తీవ్ర జ్వరం రావడంతో కిందపడిపోయాడని వెల్లడించారు. ఆ యువకుడికి నిఫా సోకినట్టు నిర్ధారణ అయ్యిందంటూ సోషల్ మీడియాలో వస్తున్న పుకార్లను నమ్మవద్దని, ఇప్పటివరకు వ్యాధి నిర్ధారణ కాలేదని స్పష్టం చేశారు. ఆరోగ్యశాఖ మంత్రి కేకే శైలజ, ఇతర ఉన్నతాధికారులు పరిస్థితిని సమీక్షిస్తున్నట్టు చెప్పారు. గతంలో అనేక మంది నిఫా అనుమానిత లక్షణాలతో దవాఖానల్లో చేరారని, పరీక్షల అనంతరం వైరస్ జాడ కనిపించలేదన్నారు. ఒకవేళ వ్యాధి నిర్ధారణ అయితే ప్రజలకు తెలియజేస్తామని, ఇతరులకు సోకకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటామని ఎర్నాకులం కలెక్టర్ మహ్మద్ సైపుల్లా పేర్కొన్నారు. నిరాధార వార్తలను నమ్మొద్దని ప్రజలను కోరుతూ ఓ ప్రకటన విడుదల చేశారు. ఇండియన్ జర్నల్ ఆఫ్ వైరాలజీ ప్రకారం గబ్బిలాలను తాకడం లేదా అవి కొరికిన పండ్లు తినడం ద్వారా ఈ వైరస్ మానవులకు సోకే ప్రమాదం ఉన్నది. ఈ వైరస్ గత ఏడాది మే నెలలో కేరళలో విజృంభించింది. కొన్ని రోజుల్లోనే 17 మందిని బలితీసుకున్నది. 14 మంది ఒక్క కోజికోడ్ జిల్లాలోనే మరణించగా, మిగతా ముగ్గురు పక్కనే ఉన్న మలప్పురం జిల్లావాసులు. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు అన్నిరకాల జాగ్రత్తలు తీసుకోవడంతో అదుపులోకి వచ్చింది.

# రేపటి యుగకర్తలు

**చిన్న వయసులోనే ఉద్యమాలకు నాయకత్వం ▪ విభిన్న సమస్యలపై పోరాటాలకు నేతృత్వం ▪ సమాజంలో మార్పు దిశగా ప్రయత్నాలు**

బ్రిటన్ పార్లమెంట్ సమావేశం. దాదాపు 150 మంది ప్రతినిధులు కొలువుదీరారు. హైస్కూల్ విద్యార్థిని వేదిక మీదికి అడుగుపెట్టింది. మొఖంలో ఎలాంటి బెరుకూ లేదు. పర్యావరణ మార్పుల వల్ల మానవాళికి పొంచి ఉన్న ముప్పు.. ప్రభుత్వాలు తీసుకోవాల్సిన చర్యలు.. ఇలా ప్రవాహంలా సాగింది తన ప్రసంగం. ఆమె వాగ్ధాటికి అందరూ ముగ్ధులయ్యారు. చివర్లో 'మీరు సరైన సమయంలో స్పందించకుంటే పెను ప్రమాదం తప్పదు' అని హెచ్చరించడం కొసమెరుపు. ఆ అమ్మాయే 'గ్రేటా థన్‌బర్గ్'.. పర్యావరణంపై ప్రపంచం ఆలోచనలను మార్చాలని ప్రయత్నిస్తున్నారు. ఆమె ఒక్కరే కాదు.. ప్రపంచవ్యాప్తంగా అనేక మంది యువతీయువకులు ఉద్యమకారులుగా మారుతున్నారు. ప్రజాసమస్యలపై గొంతెత్తుతున్నారు. లక్షల మందిలో స్ఫూర్తి నింపుతూ 'రేపటి యుగకర్తలు'గా నిలుస్తున్నారు. అలాంటివారిలో కొందరి గురించి..

-'టైమ్' సౌజన్యంతో

## పర్యావరణ విప్లవ నాయకి.. గ్రేటా థన్‌బర్గ్





'స్కూల్ స్ట్రైక్ ఫర్ క్లైమేట్'.. పాఠశాల విద్యార్థులు తమ తరగతులను బహిష్కరించి పర్యావరణ మార్పులపై ప్రజలకు అవగాహన కలిగేలా ప్రదర్శనలు నిర్వహించడం. ఈ ఏడాది మార్చి 15న నిర్వహించిన కార్యక్రమంలో 133 దేశాలకు చెందిన 16 లక్షల మంది పిల్లలు భాగస్వాములయ్యారు. 'ఫ్రైడే ఫర్ ఫ్యూచర్'.. విద్యార్థులు ప్రతి శుక్రవారం స్కూల్ అయిపోయిన తర్వాత సమీపంలోని చౌరస్తాలో లేదా ప్రభుత్వ కార్యాలయాల ముందు నిరసన చేపట్టడం. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో ప్రతి శుక్రవారం ఈ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఈ రెండు ఉద్యమాలను ప్రారంభించి.. నేతృత్వం వహిస్తున్నది స్వీడన్‌కు చెందిన 16 ఏండ్ల 'గ్రేటా థన్‌బర్గ్'. ఈ ఏడాది నోబెల్ శాంతి బహుమతికి నామినేట్ అయ్యి సంచలనం సృష్టించారు. గ్రేటా గత ఏడాది ఆగస్టులో ఆ దేశ పార్లమెంట్ ఎదుట కూర్చొని.. 'పర్యావరణాన్ని పరిరక్షించండి' అని రాసి ఉన్న ప్లకార్డులు ప్రదర్శించారు. స్కూల్ విద్యార్థులు కూడా భాగస్వాములవడంతో పార్లమెంట్ స్పందించింది. అలా మొదటి విజయం సాధించిన గ్రేటా.. వారితో కలిసి ప్రభుత్వాలను ప్రశ్నిస్తున్నారు. కర్బన ఉద్గారాలపై ఐక్యరాజ్యసమితి సహా పలు అంతర్జాతీయ వేదికలపై ప్రసంగిస్తున్నారు.

## ఆన్‌లైన్ సోల్జర్.. అజయ్‌నాగర్

ప్రపంచమంతా ఇంగ్లిష్ మాయలో పడిపోతూ.. మాతృభాషను విడిచిపెడుతున్న కాలమిది. అయితే మన మూలాలు మరిచిపోవద్దని, మాతృభాష సైతం తిండి పెట్టి ప్రపంచవ్యాప్త గుర్తింపు ఇవ్వగలదని నిరూపిస్తున్నాడు ఢిల్లీకి చెందిన అజయనాగర్. వయసు 22 ఏండ్లు. యూట్యూబ్ సెలబ్రిటీ. 'క్యారిమెనాటి' (carrymenati) పేరుతో ఉన్న అజయ్ యూట్యూబ్ చానల్‌కు దాదాపు 70 లక్షల మంది సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. హిందీ వీడియోలు మాత్రమే ఉంటాయి. స్వీడన్ యూట్యూబ్ స్టార్ ఫెలిక్స్ 'ప్యూ డై పై' చానల్‌కు 9.5 కోట్ల మంది సబ్‌స్క్రైబర్స్ ఉండగా.. మన దేశానికి చెందిన 'టీ-సిరీస్' మ్యూజిక్ కంపెనీ చానల్‌కు 10 కోట్ల సబ్‌స్క్రైబర్స్ ఉన్నారు. ఈ అక్కసుతో ఫెలిక్స్ భారతీయులు ఇంగ్లిష్ సరిగా మాట్లాడలేరంటూ అవహేళన చేసేలా ఉన్న వీడియోను అప్‌లోడ్ చేశాడు. కౌంటర్‌గా అజయ్ 'భారత్ త్వరలోనే ప్రపంచాన్ని శాసిస్తుంది' అంటూ ఓ హిందీ పాప్‌సాంగ్‌ను విడుదల చేశారు. 'బై ప్యూడైపై' పేరుతో విడుదలైన ఈ వీడియో వైరల్‌గా మారింది. అప్పటి నుంచి అజయ్ యూట్యూబ్ స్టార్ అయ్యారు. ఇటీవలే హాలీవుడ్ సూపర్‌స్టార్ టామ్ క్రూజ్ తన మిషన్ ఇంపాజిబుల్ సినిమా భారత్‌లో ప్రమోషన్‌లో భాగంగా అజయ్ చానల్‌కు ప్రత్యేకంగా ఇంటర్వ్యూ ఇచ్చారు.



## ఎల్జీబీటీ వర్గ నాయకుడు.. డేవిడ్ మిరండా

బ్రెజిల్‌లో స్వలింగ సంపర్కుల (ఎల్జీబీటీ) తరపున భారీ ఉద్యమానికి నేతృత్వం వహిస్తున్న రాజకీయ నాయకుడు డేవిడ్ మిరండా. వయసు 34. అతడో గే. మొదటిసారిగా 2013లో రాజకీయాల్లోకి వచ్చారు. 2015లో యూత్ క్లబ్‌లను నెలకొల్పి జాతివివక్ష, మహిళా హక్కులు వంటి అంశాలపై నిరసనలు, చర్చలు జరిపేవారు. దీంతో విపరీతమైన ప్రజాదరణ సంపాదించుకున్నాడు. 2016లో సోషలిజం అండ్ లిబర్టీ పార్టీ తరపున పోటీచేసి బ్రెజిల్ రాజధాని రియో డిజెనీరో ప్రభుత్వంలోకి ఎన్నికయ్యాడు. ఎల్జీబీటీ వర్గానికి చెందిన మొదటి కౌన్సిలర్‌గా రికార్డు సృష్టించిన మరిల్లే ఫ్రాంకోతో మెరిండాకు ఏర్పడిన పరిచయం బలపడింది. కాగా ఫ్రాంకో హత్య సంచలనంగా మారింది.విచారణ జరుపాలని మిరండా ఉద్యమం లేవనెత్తారు. దీంతో ప్రభుత్వం ఇద్దరు పోలీసు అధికారులను సస్పెండ్ చేసింది. ఫిబ్రవరిలో ఎంపీగా ఎన్నికైన మిరండా లోక్‌సభలో తన తొలి ప్రసంగంలోనే ఫ్రాంకో హత్యపై, ఎల్జీబీటీకి దక్కాల్సిన హక్కులు, సదుపాయాలపై గొంతెత్తారు. అద్భుతమైన వాక్పటిమ, ప్రజాదరణతో భవిష్యత్తులోఅధ్యక్షుడవుతారని భావిస్తున్నారు.

## కోహ్లీకి గాయం



**సౌతాంప్టన్:** భారత క్రికెట్ అభిమానులకు ఒకింత ఆందోళన కల్గించే వార్త. తమ కలల కప్‌ను ముచ్చటగా మూడోసారి ముద్దాడాలనుకుంటున్న భారత్‌ను గాయాలు నీడలా వెంటాడుతూనే ఉన్నాయి. ఇప్పటికే కేదార్ జాదవ్, ఆల్‌రౌండర్ విజయ్ శంకర్ గాయాలతో సతమతమవుతుంటే..తాజాగా కెప్టెన్ విరాట్ కోహ్లీ ఆ జాబితాలో చేరాడు. దక్షిణాఫ్రికాతో ఈనెల 5న తొలి మ్యాచ్ కోసం పూర్తి స్థాయిలో సిద్ధమవుతున్న టీమ్ఇండియా తీవ్రంగా చెమటోడుస్తున్నది. శనివారం నెట్ ప్రాక్టీస్‌లో పాల్గొన్న కోహ్లీ బ్యాటింగ్ చేస్తున్నప్పుడు కుడి చేతి బొటనవేలికి గాయమైంది. జట్టు ఫిజియో ప్యాట్రిక్ ఫర్హాత్ కోహ్లీకి ప్రథమ చికిత్స అందించాడు. గాయంపై మ్యాజిక్ స్ప్రేతో ఉపశమనం కల్గించిన ఫిజియో..టేపు చుట్టాడు. ఆ తర్వాత చల్లని నీళ్లలో తన వేలుని ఉంచి కోహ్లీ ప్రాక్టీస్ సెషన్ నుంచి వెళ్లిపోయాడు. ఇదిలా ఉంటే కోహ్లీ గాయంపై ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జట్టు వర్గాలు ఒక ప్రకటనలో పేర్కొన్నాయి.

## కరీబియన్లు కాస్కోండి


కౌల్టర్‌నైల్

**బ్రిస్టల్:** కరీబియన్ క్రికెటర్లు ఇక కాస్కోండి అంటూ మాటలతో కవ్విస్తున్నది డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియా. ఆఫ్ఘనిస్థాన్‌పై భారీ విజయంతో ఊపుమీదున్న ఆసీస్..తమ రెండో మ్యాచ్‌లో ఈనెల 6న వెస్టిండీస్‌తో తలపడబోతున్నది. ఈ నేపథ్యంలో బౌన్సర్లతో కరీబియన్లను బెంబేలెత్తిస్తామంటూ కంగారూ పేసర్ కౌల్టర్‌నైల్ సవాలు విసురుతున్నాడు. తమ గత వైభవాన్ని గుర్తుచేస్తూ విండీస్ ఫాస్ట్‌బౌలర్లు ఓషానో థామస్, కాట్రెల్, హోల్డర్, రస్సెల్..పాకిస్థాన్ బ్యాట్స్‌మెన్‌కు షార్ట్‌పిచ్ బంతులతో చుక్కలు చూపించారు. విండీస్ సీమర్ల ధాటికి పాక్ చిగురుటాకులా వణికిపోతూ స్వల్ప స్కోరుకే కుప్పకూలిన సంగతి తెలిసిందే. అయితే మాటల యుద్ధంలో ముందుండే ఆసీస్.. విండీస్‌ను లక్ష్యంగా చేసుకుంటూ కామెంట్లు గుప్పిస్తున్నది. 'పాక్‌పై విండీస్ బౌలర్లు బౌన్సర్లతో విరుచుకుపడ్డ విధంగానే మేము వారిని అదే రీతిలో కట్టడి చేసేందుకు ప్రయత్నిస్తాం. లేకపోతే భారీ హిట్టర్లతో కళకళలాడుతున్న విండీస్ ఎప్పుడైనా ప్రమాదకరమే. ఓవర్‌కు రెండు బౌన్సర్ల అవకాశాన్ని సరిగ్గా వాడుకుంటాం. ఇక్కడి మైదానాలు చాలా చిన్నవిగా ఉండటంతో పాటు వికెట్ కూడా ఫ్లాట్‌గా కనిపిస్తున్నది. అందువల్ల బౌన్సర్ల అస్త్రం బాగా పనికొస్తుంది. గేల్ లాంటి విధ్వంసకర బ్యాట్స్‌మన్‌ను నియంత్రించాలంటే ఆది నుంచే ఒత్తిడి పెంచుతూ పోవాలి' అని కౌల్టర్‌నైల్ అన్నాడు.

# సఫారీలపై బంగ్లా సవారీ

బంగ్లా పులులు.. సఫారీ సింహాల భరతం పట్టాయి. తొలుత బ్యాటింగ్‌లో.. ఆ తర్వాత బౌలింగ్‌లో బెంబేలెత్తించాయి. బౌన్సీ వికెట్‌పై మొదట స్పిన్‌తో కట్టడి చేసి.. ఆ తర్వాత పేస్ పదును చూపి మూడు రోజులుగా చప్పగా సాగుతున్న ప్రపంచకప్‌లో ఊపుతెచ్చాయి. విశ్వ వేదికపై వన్డేల్లో తమ అత్యధిక స్కోరు నమోదు చేసిన బంగ్లా.. ఇక్కడికి వచ్చింది పెద్ద జట్లకు షాక్ ఇచ్చేందుకు కాదని తమ లక్ష్యం వేరే ఉందని తొలి మ్యాచ్‌లోనే స్పష్టం చేస్తే.. వరుసగా రెండో మ్యాచ్‌లోనూ లక్ష్యఛేదనలో ఒత్తిడికి చిత్తైన దక్షిణాఫ్రికా అందుకు తగిన మూల్యం చెల్లించుకుంది.




షకీబ్ (75)


ముస్తఫిజుర్ (3/67)

## ప్రపంచకప్‌లో అదిరిపోయే బోణీ కొట్టిన బంగ్లాదేశ్

### దక్షిణాఫ్రికాపై 21 పరుగులతో విజయం ▪ రాణించిన షకీబ్, రహీమ్, ముస్తఫిజుర్

**లండన్:** ప్రపంచకప్ తొలి మ్యాచ్‌లో ఇంగ్లండ్ చేతిలో ఘోర పరాజయం మూటగట్టుకున్న దక్షిణాఫ్రికా రెండో మ్యాచ్‌లో బంగ్లా సమిష్టి పోరాటం ముందు తలవంచింది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో బంగ్లాదేశ్ 21 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాపై విజయం సాధించింది. వరల్డ్‌కప్‌లో సఫారీలపై బంగ్లాకు ఇది రెండో విజయం కావడం విశేషం. టోర్నీ ఆరంభ మ్యాచ్‌లో ఇదే పిచ్‌పై లక్ష్యఛేదనలో చతికిలబడ్డ దక్షిణాఫ్రికా.. ఈసారి అదే తడబాటు కొనసాగించింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ 50 ఓవర్లలో 6 వికెట్లకు 330 పరుగులు చేసింది. సీనియర్లు షకీబల్ హసన్ (84 బంతుల్లో 75; 8 ఫోర్లు, 1 సిక్స్), ముష్ఫికర్ రహీమ్ (80 బంతుల్లో 78; 8 ఫోర్లు)అర్ధశతకాలతో అదరగొడితే.. సఫారీ బౌలర్లలో తాహిర్, ఫెలుక్వాయో, మోరిస్ తలా 2 వికెట్లు పడగొట్టారు. లక్ష్య ఛేదనలో దక్షిణాఫ్రికా 50 ఓవర్లలో 8 వికెట్లకు 309 పరుగులకే పరిమితమైంది. కెప్టెన్ డుప్లెసిస్ (53 బంతుల్లో 62; 5 ఫోర్లు, 1 సిక్స్) అర్ధసెంచరీ చేశాడు. బంగ్లా బౌలర్లలో ముస్తఫిజుర్ 3, సైఫుద్దీన్ 2 వికెట్లు పడగొట్టారు. షకీబ్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది.

**ఆరంభాలను అందిపుచ్చుకోలేక..**

భారీ లక్ష్య ఛేదనలో దక్షిణాఫ్రికాకు మంచి ఆరంభమే దక్కింది. ఓపెనర్లు డికాక్ (23; 4 ఫోర్లు), మార్క్‌రమ్ (45; 4 ఫోర్లు) చక్కటి షాట్లు ఆడటంతో ప్రొటీస్ 9 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 48 పరుగులు చేసింది. పదో ఓవర్‌లో డికాక్ ఇచ్చిన క్యాచ్‌ను వదిలేసిన వికెట్ కీపర్ ముష్ఫికర్ రహీమ్ ఆ వెంటనే తేరుకొని రనౌట్ చేయడంతో బంగ్లాకు తొలి వికెట్ దక్కింది. కట్టుదిట్టమైన బంతులతో కట్టి పడేసిన షకీబ్ కాసేపటికే మార్క్‌రమ్‌ను పెవిలియన్ పంపాడు. ఇన్నింగ్స్‌ను నడిపించే బాధ్యత భుజాన వేసుకున్న డుప్లెసిస్ 45 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాక మెహదీ హసన్ బౌలింగ్‌లో బౌల్డయ్యాడు. ఈ దశలో జతకలిసిన డస్సెన్ (41; 2 ఫోర్లు, 1 సిక్స్), మిల్లర్ (38) ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించారు. బంగ్లా ఫీల్డర్ల తప్పిదాల కారణంగా రెండు సార్లు బతికిపోయిన మిల్లర్ దాన్ని పెద్దగా సద్వినియోగం చేసుకోలేకపోయాడు. నాలుగో వికెట్‌కు 55 పరుగులు జోడించాక మిల్లర్ పెవిలియన్ చేరగా.. సైఫ్ బౌలింగ్‌లో డస్సెన్ క్లీన్ బౌల్డయ్యాడు. ఓ వైపు జేపీ డుమినీ (45; 4 ఫోర్లు) బాధ్యతాయుతంగా ఆడుతున్నా.. మరో ఎండ్‌లో ఫెలుక్వాయో (8), మోరిస్ (10) ఆకట్టుకోలేకపోవడంతో దక్షిణాఫ్రికా పరాజయం ఖరారైంది.

**గర్జించిన బంగ్లా పులులు**

క్రీజులోకి వచ్చిన ప్రతీ బ్యాట్స్‌మెన్ బాధ్యత గుర్తెరిగి తలా కొన్ని పరుగులు చేయడంతో బంగ్లాదేశ్ భారీ స్కోరు చేసింది. పేస్, బౌన్స్‌కు వెరవకుండా మొండిగా క్రీజులో నిలిచిన ఓపెనర్లు జట్టుకు అదిరిపోయే ఆరంభాన్నిచ్చారు. ముఖ్యంగా సౌమ్యా సర్కార్ (30 బంతుల్లో 42; 9 ఫోర్లు).. ఎంగ్డీని లక్ష్యంగా చేసుకొని రెచ్చిపోయాడు. అతడు వేసిన ఐదో ఓవర్‌లో మూడు ఫోర్లు బాదిన సర్కార్.. తర్వాతి ఓవర్‌లో మరో రెండు ఫోర్లు కొట్టాడు. తమీమ్ ఇక్బాల్ (16) కూడా మంచి టచ్‌లో కనిపించడంతో బంగ్లాదేశ్ 7 ఓవర్లలోనే 50 మార్క్ దాటింది. చేంజ్ బౌలర్‌గా వచ్చిన ఫెలుక్వాయో.. తమీమ్‌ను ఔట్ చేసి సఫారీలకు బ్రేక్‌నిచ్చాడు. కాసేపటికే సర్కార్‌ను మోరిస్ పెవిలియన్ పంపాడు. ఇక అక్కడి నుంచి షకీబ్, రహీమ్ ఆట మొదలైంది. చూడచక్కని షాట్లతో అలరించిన వీరిద్దరూ అర్ధశతకాలు పూర్తి చేసుకోవడంతో.. 32 ఓవర్లలో బంగ్లా 200 పరుగుల మార్క్ దాటింది. మూడో వికెట్‌కు 142 పరుగులు జోడించాక వందో వన్డే ఆడుతున్న సీనియర్ స్పిన్నర్ ఇమ్రాన్ తాహిర్.. షకీబ్‌ను బౌల్డ్ చేశాడు. ప్రపంచ కప్‌లో మూడో వికెట్‌కు బంగ్లాదేశ్‌కు ఇదే అత్యధిక భాగస్వామ్యం. వచ్చిరావడంతోనే ఫోర్లు, సిక్సర్లు బాదిన మిథున్ (21; 2 ఫోర్లు, 1 సిక్స్) ఎక్కువ సేపు నిలువలేకపోగా.. భారీ షాట్‌కు యత్నించిన రహీమ్ డస్సెన్‌కు చిక్కాడు. చివర్లో మహ్మదుల్లా (33 బంతుల్లో 46 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్), మొసద్దిక్ హుస్సేన్ (26; 4 ఫోర్లు) వేగంగా ఆడటంతో బంగ్లా వన్డేల్లో తమ అత్యధిక స్కోరు నమోదు చేసింది. చివరి రెండు ఓవర్లలో బంగ్లా 28 పరుగులు రాబట్టడం విశేషం.

**330/6**
వన్డేల్లో బంగ్లాదేశ్‌కు ఇదే అత్యధిక స్కోరు. గతం (2014)లో పాకిస్థాన్‌పై చేసిన 326 పరుగులే ఇప్పటి వరకు అత్యధికం.

**1**
వన్డేల్లో 250 వికెట్లతో పాటు 5000 పరుగుల మైలురాయిని తక్కువ మ్యాచ్(199)ల్లో అందుకున్న తొలి క్రికెటర్‌గా షకీబల్ హసన్ నిలిచాడు. అబ్దుల్ రజాక్(258), అఫ్రిదీ(273), కలిస్(296), జయసూర్య(304) ఆ తర్వాత స్థానాల్లో ఉన్నారు.

పటిష్ఠ బౌలింగ్‌కు పెట్టింది పేరైన దక్షిణాఫ్రికా ఈ మ్యాచ్‌లో ఎక్స్‌ట్రాల రూపంలో ప్రత్యర్థికి 21 పరుగులు సమర్పించుకోగా.. చివరికి గెలుపు అంతరం కూడా సరిగ్గా 21 పరుగులే కావడం కొసమెరుపు.

**100**
సీనియర్ స్పిన్నర్ ఇమ్రాన్ తాహిర్ ఈ మ్యాచ్‌తో దక్షిణాఫ్రికా తరఫున 100 వన్డేలు పూర్తిచేసుకున్నాడు.

### పాయింట్ల పట్టిక

| నెం. | జట్టు | ఆ | గె | ఓ | నె.ర.రే | పా |
|---|---|---|---|---|---|---|
| 1 | వెస్టిండీస్ | 1 | 1 | 0 | +5.80 | 2 |
| 2 | న్యూజిలాండ్ | 1 | 1 | 0 | +5.75 | 2 |
| 3 | ఇంగ్లండ్ | 1 | 1 | 0 | +2.08 | 2 |
| 4 | ఆస్ట్రేలియా | 1 | 1 | 0 | +1.86 | 2 |
| 5 | బంగ్లాదేశ్ | 1 | 1 | 0 | +0.42 | 2 |
| 6 | భారత్ | 0 | 0 | 0 | 0.00 | 0 |
| 7 | దక్షిణాఫ్రికా | 2 | 0 | 2 | -1.25 | 0 |
| 8 | ఆఫ్ఘనిస్థాన్ | 1 | 0 | 1 | -1.86 | 0 |
| 9 | శ్రీలంక | 1 | 0 | 1 | -5.75 | 0 |
| 10 | పాకిస్థాన్ | 1 | 0 | 1 | -5.80 | 0 |

ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, నె.ర.రే - నెట్ రన్‌రేట్, పా-పాయింట్లు

అత్యధిక పరుగులు | 91 | డస్సెన్ దక్షిణాఫ్రికా

అత్యధిక వికెట్లు | 4 | థామస్ వెస్టిండీస్


డుప్లెసిస్ (62)

ఈ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా రెండు మార్పులతో బరిలోకి దిగింది. తొలి మ్యాచ్‌లో ఆర్చర్ బౌన్సర్‌తో గాయపడిన ఆమ్లా పూర్తిగా కోలుకోక పోవడంతో అతడి స్థానంలో మిల్లర్ జట్టులోకి రాగా.. ప్రిటోరియస్‌ను కాదని మోరిస్‌కు అవకాశం కల్పించింది. భుజం గాయం నుంచి పూర్తిగా కోలుకోని స్టెయిన్ బరిలో దిగకపోవడానికి తోడు.. గాయంతో ఎంగ్డీ తన కోటా పూర్తిచేయలేకపోవడం సఫారీలను దెబ్బ కొట్టింది.

### స్కోరు బోర్డు

**బంగ్లాదేశ్:** తమీమ్ (సి) డికాక్ (బి) ఫెలుక్వాయో 16, సౌమ్య (సి) డికాక్ (బి) మోరిస్ 42, షకీబ్ (బి) తాహిర్ 75, రహీమ్ (సి) డస్సెన్ (బి) ఫెలుక్వాయో 78, మిథున్ (బి) తాహిర్ 21, మహ్మదుల్లా (నాటౌట్) 46, మొసద్దిక్ (సి) ఫెలుక్వాయో (బి) మోరిస్ 26, మెహదీ హసన్ (నాటౌట్) 5, **ఎక్స్‌ట్రాలు:** 21, **మొత్తం:** 50 ఓవర్లలో 330/6. **వికెట్ల పతనం:** 1-60, 2-75, 3-217, 4-242, 5-250, 6-316, **బౌలింగ్:** ఎంగ్డీ 4-0-34-0, రబాడ 10-0-57-0, ఫెలుక్వాయో 10-1-52-2, మోరిస్ 10-0-73-2, మార్క్‌రమ్ 5-0-38-0, తాహిర్ 10-0-57-2, డుమినీ 1-0-10-0.

**దక్షిణాఫ్రికా:** డికాక్ (రనౌట్/రహీమ్) 23, మార్క్‌రమ్ (బి) షకీబ్ 45, డుప్లెసిస్ (బి) మెహదీ 62, మిల్లర్ (సి) మెహదీ (బి) ముస్తఫిజుర్ 38, డస్సెన్ (బి) సైపుద్దీన్ 41, డుమినీ (బి) ముస్తఫిజుర్ 45, ఫెలుక్వాయో (సి) షకీబ్ (బి) సైపుద్దీన్ 8, మోరిస్ (సి) సౌమ్య (బి) ముస్తఫిజుర్ 10, రబాడ (నాటౌట్) 13, తాహిర్ (నాటౌట్) 10, **ఎక్స్‌ట్రాలు:** 14, **మొత్తం:** 50 ఓవర్లలో 309/8. **వికెట్ల పతనం:** 1-49, 2-102, 3-147, 4-202, 5-228, 6-252, 7-275, 8-287, **బౌలింగ్:** ముస్తఫిజుర్ 10-0-67-3, మెహదీ 10-0-044-1, సైపుద్దీన్ 8-1-57-2, షకీబ్ 10-0-50-1, మొర్తజా 6-0-49-0, మొసద్దిక్ 6-0-38-0.

# పాక్ పోటీనిచ్చేనా..

## ఇంగ్లండ్‌తో నేడు కీలక పోరు

ట్రెంట్‌బ్రిడ్జ్... బ్యాటింగ్‌కు స్వర్గధామం. ఈ మైదానంలోనే ఇంగ్లండ్ రెండు సార్లు పరుగుల వరద పారించింది. ఆస్ట్రేలియాపై గతేడాది ఆ జట్టు బ్యాట్స్‌మెన్ విరుచుకుపడి వన్డేల్లో అత్యధిక స్కోరు(481) రికార్డును బద్దలు కొట్టిందిక్కడే. 2016లోనూ పాకిస్థాన్‌పై 444 పరుగులు చేసింది ఇంగ్లిష్ జట్టు. అంత కలిసొచ్చిన మైదానంలో నేడు పాకిస్థాన్‌తో తలపడనుంది ఇంగ్లండ్. ప్రపంచకప్ తొలిమ్యాచ్‌లో దక్షిణాఫ్రికాపై భారీ విజయం సాధించి ఆత్మ విశ్వాసంతో బరిలోకి దిగుతున్న ఆ జట్టును.. వెస్టిండీస్ చేతిలో ఘోర పరాభవాన్ని చవిచూసిన పాకిస్థాన్ ఎలా ఎదుర్కొంటుందో చూడాలిక.

**నాటింగ్‌హామ్:** ప్రపంచకప్‌లో మరో ఆసక్తికర పోరుకు రంగం సిద్ధమైంది. ట్రెంట్‌బ్రిడ్జ్ వేదికగా ఇంగ్లండ్, పాకిస్థాన్ జట్లు సోమవారం తలపడనున్నాయి. సొంతగడ్డపై తమ జైత్రయాత్రను కొనసాగించాలని ఇంగ్లండ్ భావిస్తుండగా, విండీస్‌పై ఘోర ఓటమిని మరిచిపోయి గెలుపు బాట పట్టాలని పాక్ పట్టుదలగా ఉంది. జట్టు పరంగా చూస్తే అన్ని విభాగాల్లో పాక్ కంటే ఇంగ్లండ్ చాలా బలంగా ఉంది. ముఖ్యంగా ఆ జట్టు బ్యాట్స్‌మెన్ భీకర ఫామ్‌లో ఉన్నారు.

**ఆత్మవిశ్వాసంతో ఇంగ్లండ్.. ఒత్తిడిలో పాక్**

ప్రపంచకప్ తొలిమ్యాచ్‌లో దక్షిణాఫ్రికాపై భారీ విజయం సాధించిన ఇంగ్లండ్ జట్టు పూర్తి ఆత్మవిశ్వాసంతో ఉంది. సఫారీలతో మ్యాచ్‌లో బెయిర్‌స్టో, బట్లర్ మినహా మిగతా బ్యాట్స్‌మెన్ అందరూ బ్యాట్ ఝుళిపించారు. ఓపెనర్ రాయ్ సహా రూట్, మోర్గాన్, స్టోక్స్ అర్ధ శతకాలు చేశారు. 89 పరుగులు చేసిన స్టోక్స్... బౌలింగ్‌లో రెండు వికెట్లు పడగొట్టడంతో పాటు ఓ మెరుపు క్యాచ్ పట్టాడు. బౌలర్లు కూడా సమిష్టిగా చెలరేగి సఫారీ జట్టును 207 పరుగులకే కుప్పకూల్చారు. బ్యాటింగ్‌కు సహకరించే పిచ్‌పై ఇంగ్లండ్ బ్యాట్స్‌మెన్ మరోసారి రెచ్చిపోతే పరుగుల వరద ఖాయమనే చెప్పొచ్చు. ఇక విండీస్ చేతిలో ఘోర పరాభవం తర్వాత పాక్ తీవ్ర ఒత్తిడిలో ఉంది. ఆ మ్యాచ్‌లో బ్యాట్స్‌మెన్ అంతా విఫలమవ్వడంతో 105 పరుగులకే కుప్పకూలింది. ఇంగ్లండ్‌తో మ్యాచ్‌లో ఎలాగైనా గెలిచి గాడిలో పడాలని నెట్స్‌లో చెమటోడుస్తున్నది పాక్. మంచి ఫామ్‌మీదున్న ఫకర్ జమాన్, బాబర్ ఆజం పైనే ఆశలు పెట్టుకుంది. చివర్లో కెప్టెన్ సర్ఫరాజ్, హఫీజ్ చెలరేగితే ఆ జట్టుకు తిరుగుండదు. అయితే ఘోర ఓటమి తర్వాత బలమైన ఇంగ్లండ్ పేస్ దళాన్ని పాక్ బ్యాట్స్‌మెన్ ఎంతవరకు దీటుగా ఎదుర్కొంటారన్నదే ఆసక్తికరం.

**ఓటముల భారం**

వన్డేల్లో పాకిస్థాన్ పేలవ ఫామ్‌లో ఉంది. చివరిగా ఆడిన 11 మ్యాచ్‌ల్లోనూ ఓడింది. ఇటీవల ఇంగ్లండ్‌తో జరిగిన సిరీస్‌ను 0-4 తేడాతో చేజార్చుకుంది.

### వన్డేల్లో ముఖాముఖి

| | |
|---|---|
| మ్యాచ్‌లు | :87 |
| ఇంగ్లండ్ గెలిచినవి | :53 |
| పాకిస్థాన్ గెలిచినవి | :31 |
| రద్దయినవి | :3 |

### ప్రపంచకప్‌లో..

| | |
|---|---|
| మ్యాచ్‌లు | : 9 |
| ఇంగ్లండ్ గెలిచినవి | : 4 |
| పాకిస్థాన్ గెలిచినవి | : 4 |
| రద్దయినవి | : 1 |


మోర్గాన్


సర్ఫరాజ్

# క్వార్టర్స్‌లో ఫెదరర్, నాదల్





**ప్యారిస్:** ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో డిఫెండింగ్ చాంపియన్ రఫెల్ నాదల్, స్విట్జర్లాండ్ టెన్నిస్ స్టార్ రోజర్ ఫెదరర్ క్వార్టర్స్‌లోకి దూసుకెళ్లారు. ఆదివారం జరిగిన నాలుగో రౌండ్‌లో టైటిల్ ఫేవరెట్ నాదల్ 6-2, 6-3, 6-3తో జువాన్ ఇగ్నాసియో లాండెరోపై అలవోక విజయం సాధించాడు. రెండు గంటల పాటు జరిగిన పోరులో తనకు బాగా అచ్చొచ్చిన మట్టికోర్టులో నాదల్ ఆది నుంచి ప్రత్యర్థిపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించాడు. మ్యాచ్ మొత్తమ్మీద 6 ఏస్‌లు సంధించిన ఈ స్పెయిన్ బుల్ 40 విన్నర్లతో విరుచుకుపడ్డాడు. 12వ ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్‌పై కన్నేసిన నాదల్..38 గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో క్వార్టర్స్‌కు చేరిన నాలుగో ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు. మరోవైపు స్విస్ కింగ్ రోజర్ ఫెదరర్ 6-2, 6-3, 6-3తో మేయర్(అర్జెంటీనా)పై విజయం సాధించాడు. క్వార్టర్స్‌లో స్విట్జర్లాండ్‌కే చెందిన వావ్రింకాతో ఫెదరర్ తలపడుతాడు. గత 28 ఏండ్లలో ఫ్రెంచ్ ఓపెన్‌లో క్వార్టర్స్ చేరిన అతిపెద్ద వయస్కుడి(37 ఏండ్లు) రోజర్ రికార్డు సృష్టించాడు. మహిళల సింగిల్స్‌లో జోహన్న కాంటా 6-2, 6-4తో వెకిచ్‌పై, మాట్రిచ్ 5-7, 6-2, 6-4తో కనెపీపై, వోంద్రుసోవ 6-2, 6-0తో స్వెత్సోవాపై విజయాలతో క్వార్టర్స్‌లోకి ప్రవేశించారు. పురుషుల డబుల్స్‌లో భారత ఆటగాడు రోహన్ బోపన్న, మరియస్ కోపిల్ జంట 6-1, 5-7, 6-7(8/10) తేడాతో సెర్బియా జోడీ త్రిపరెవిచ్, లజోవిచ్ చేతిలో ఓడి నిష్క్రమించింది.

## విజయం దిశగా భారత్ 'ఎ'

**హుబ్లీ (కర్ణాటక):** ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన భారత్ 'ఎ' రెండో అనధికారిక టెస్టులోనూ విజయం దిశగా సాగుతున్నది. స్పిన్నర్లు రాహుల్ చహర్ (84; 7 ఫోర్లు, 2 సిక్సర్లు), జయంత్ (53) అర్ధశతకాలు బాదడంతో భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 372 పరుగులు చేసి శ్రీలంక 'ఎ' ముందు 430 పరుగుల భారీ లక్ష్యాన్ని ఉంచింది. ఆదివారం మూడోరోజు ఆట ముగిసే సమయానికి లక్ష్యఛేదనలో లంక 51 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 210 పరుగులు చేసింది. భానుక రాజపక్సె (110; 17 ఫోర్లు, 3 సిక్సర్లు) సెంచరీతో చెలరేగగా.. రాహుల్ చహర్ (3/73) రాణించాడు. చేతిలో 3 వికెట్లు ఉన్న లంక గెలువాలంటే ఇంకా 220 పరుగులు చేయాల్సి ఉంది. 'డ్రా' చేసుకోవాలనుకున్నా రోజంతా ఆడాల్సి ఉంటుంది. మెండిస్ (33 నాటౌట్), సందకన్ (2 నాటౌట్) క్రీజులో ఉన్నారు.


ఆదివారం జిమ్ సెషన్‌లో బిజీగా గడిపిన భారత కెప్టెన్ విరాట్ కోహ్లీ, కేదార్ జాదవ్, శంకర్, రాహుల్, బుమ్రా, భువనేశ్వర్, హార్దిక్

## బీవోబీ రూ.12 వేల కోట్ల నిధుల సేకరణ

**న్యూఢిల్లీ, జూన్ 2:** ప్రభుత్వరంగ సంస్థ బ్యాంక్ ఆఫ్ బరోడా(బీవోబీ) వ్యాపార విస్తరణ అవసరాల నిమిత్తం భారీ స్థాయిలో నిధులను సేకరించడానికి సిద్ధమైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి షేర్లను విక్రయించడం ద్వారా రూ.11,900 కోట్ల నిధులను సేకరించే ఆలోచనలో ఉన్నది. వీటిలో బ్యాంక్ ఆఫ్ బరోడా ఎంప్లాయి షేర్ పర్చేస్ స్కీం(బీవోబీ-ఈఎస్‌పీఎస్) ద్వారా రూ.1,500 కోట్లు రావచ్చునని బ్యాంక్ అంచనా వేస్తున్నది. ఇందుకోసం రూ.2 ముఖ విలువ కలిగిన 15 కోట్ల విలువైన షేర్లను కేటాయించింది. జనవరి నెలలో 10 కోట్ల షేర్లను విక్రయించాలని ప్రతిపాదించినప్పటికీ..ప్రస్తుతం దీనిని భారీగా పెంచింది. ఈ నెల 21న జరుగనున్న వార్షిక సాధారణ సమావేశం (ఏజీఎం)లో ఈ నిధుల సేకరణ ప్రతిపాదనపై వాటాదారుల అనుమతి తీసుకోనున్నది. ఏప్రిల్ 1 నుంచి బీవోబీలో దేనా, విజయా బ్యాంకులు విలీనమైన విషయం తెలిసిందే. దీంతో వ్యాపారాన్ని మరింత విస్తరించడానికి, విలీనం తర్వాత తలెత్తనున్న పలు ఇబ్బందులను తప్పించుకోవాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు బ్యాంక్ వర్గాలు వెల్లడించాయి. విలీనం తర్వాత బీవోబీ రెండో అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంక్‌గా అవతరించింది. ప్రస్తుతం బ్యాంక్‌కు 9,500 శాఖలు, 13,400 ఏటీఎంలు, 85 వేల ఉద్యోగులు, 12 కోట్ల మంది వినియోగదారులు ఉన్నారు.

## 50 వేల కోట్ల టర్నోవర్ లక్ష్యం

తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో సింగరేణి సీఎండీ శ్రీధర్



ఆవిర్భావ వేడుకల సందర్భంగా ఉద్యోగులను సన్మానిస్తున్న దృశ్యం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత సింగరేణి సంస్థ అద్భుతంగా అభివృద్ధి చెందుతున్నదని సింగరేణి సీఎండీ శ్రీధర్ పేర్కొన్నారు. రూ. 26 వేల కోట్ల టర్నోవర్ నుంచి రూ. 50 వేల కోట్ల టర్నోవర్ సాధించే దిశగా సిబ్బంది కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఆదివారం సింగరేణిభవన్‌లో నిర్వహించిన రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జాతీయపతాకాన్ని ఆవిష్కరించారు. సీఎం కేసీఆర్ దిశానిర్దేశం, సంపూర్ణ సహకారం వల్లే సింగరేణి ఉన్నత లక్ష్యాలను చేరుకోగలిగిందని చెప్పారు. 2013-14లో రూ. 419 కోట్లు ఆర్జించిన కంపెనీ 2018-19 నాటికి రూ. 1, 600 కోట్ల లాభాలు సాధించిందని పేర్కొన్నారు. గత ఐదేండ్లలో సింగరేణి సాధించిన అభివృద్ధి దేశంలోని 8 మహారత్న కంపెనీలకు దీటుగా ఉండటం సిబ్బంది కృషికి నిదర్శనమన్నారు. మహారత్న కంపెనీల్లో అత్యధికంగా ఇండియన్ ఆయిల్ కంపెనీ 146 శాతం వృద్ధిని సాధించగా సింగరేణి 282 శాతం వృద్ధి సాధించిందని పేర్కొన్నారు. అమ్మకాల్లో కోలిండియా 55 శాతం వృద్ధి సాధించగా, సింగరేణి దీనికి రెట్టింపుగా 116.5శాతం వృద్ధిని నమోదు చేసిందని చెప్పారు. సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం ద్వారా 22,500 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను రాష్ట్రాభివృద్ధికి అందించామని చెప్పారు. త్వరలో 300 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తిని చేసేందుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. ఈ ఏడాది 700 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకోవాలని పిలుపునిచ్చారు. సీనియర్ కమ్యూనికేషన్ ఆఫీసర్ గణాశంకర్ పూజారి, మార్కెటింగ్ విభాగంలో పనిచేస్తున్న ఎల్ రేవతి, డిప్యూటీ సూపరింటెండెంట్లు బీ లచ్చయ్య, ఎస్ రాజేందర్, సెక్యూరిటీ గార్డు వెంకటేశ్వర్లును సీఎండీ శ్రీధర్ సన్మానించారు.

## కొనసాగుతున్న ఎఫ్‌పీఐల పెట్టుబడులు

**న్యూఢిల్లీ, జూన్ 2:** దేశీయ ఈక్విటీ మార్కెట్లలోకి విదేశీ పెట్టుబడుల హవా కొనసాగుతున్నది. సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్‌డీఏ సర్కార్..వ్యాపార సానుకూల నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉన్నదన్న అంచనాతో గడిచిన నెలలో ఎఫ్‌పీఐలు రూ.9,031 కోట్ల నిధులను కుమ్మరించారు. మే నెల తొలి మూడు వారాల్లో అమ్మకాలకు మొగ్గుచూపిన ఎఫ్‌పీఐలు.. చివరి రెండువారాల్లో భారీగా పెట్టుబడులు పెట్టారు. తాజా డిపాజిటరీ నివేదిక ప్రకారం..మే 2 నుంచి 31 మధ్యకాలంలో ఈక్విటీ మార్కెట్లోకి రూ.7,919.73 కోట్ల పెట్టుబడులు పెట్టిన ఎఫ్‌పీఐలు..డెబిట్ మార్కెట్లోకి రూ.1,111.42 కోట్ల నిధులను చొప్పించారు. మొత్తంమీద రూ. 9,031.15 కోట్ల పెట్టుబడులు పెట్టినట్లు అయింది. ఏప్రిల్‌లో రూ.16,093 కోట్ల పెట్టుబడులు పెట్టిన ఎఫ్‌పీఐలు..మార్చిలో రూ.45,981 కోట్లు, ఫిబ్రవరిలో రూ. 11,182 కోట్ల నిధులను చొప్పించారు. నిలకడైన ప్రభుత్వం ఏర్పాటు అయ్యే అవకాశాలు లేవన్న అంచనాతో మే 2 నుంచి 17 మధ్యకాలంలో రూ.6,399 కోట్ల పెట్టుబడులను తరలించుకుపోయిన ఎఫ్‌పీఐలు.. ఆ తర్వాతి రెండు వారాల్లోనే ఏకంగా రూ.9 వేల కోట్లకు పైగా నిధులను కుమ్మరించినట్లు మార్నింగ్‌స్టార్ సీనియర్ రీసర్చ్ హిమాన్షు శ్రీవాత్సవ తెలిపారు.

# స్విస్‌లో తెలుగింటి ఖాతా!

పొట్లూరి రాజామోహన్ రావు పేరు బయటకు ■ భారతీయులకు కొనసాగుతున్న నోటీసులు

**న్యూఢిల్లీ/బెర్న్, జూన్ 2:** స్విస్ బ్యాంకుల్లో అక్రమ సంపదను దాచుకున్న భారతీయులకు అక్కడి ప్రభుత్వం నుంచి నోటీసులు కొనసాగుతున్నాయి. తాజాగా ఓ తెలుగు వ్యక్తికి ఈ నోటీసు అందడం ఇప్పుడు సంచలనం సృష్టిస్తున్నది. స్విస్ బ్యాంక్‌లో ఖాతా ఉన్న పొట్లూరి రాజామోహన్ రావు పేరు బయటకు రాగా, ఆయనకు ఈ నోటీసు గత నెల 28న జారీ అయ్యింది. స్విట్జర్లాండ్ ఫెడరల్ ట్యాక్స్ అడ్మినిస్ట్రేషన్ జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం రావు పుట్టినతేదీ 1951, జూలై 15గా ఉన్నది. మరే ఇతర వ్యక్తిగత వివరాలు తెలియకపోయినప్పటికీ.. టెలికం వ్యాపారంతోపాటు దక్షిణాది రాష్ర్టాల్లో పలు వ్యాపారాలను రావు నిర్వర్తిస్తున్నట్లు స్విస్ అధికారులు చెబుతున్నారు. దీంతో రెండు తెలుగు రాష్ర్టాలతోపాటు పొరుగున ఉన్న కర్నాటక, తమిళనాడు రాష్ర్టాల్లో ఎవరా? అన్న ఆరా మొదలైంది.

### రాబోయే రోజుల్లో మరిన్ని..

గత నెల 21న ఏకంగా 11 మంది భారతీయులకు ఈ నోటీసులను స్విస్ పంపించిన విషయం తెలిసిందే. ఇప్పటిదాకా 14 మంది భారతీయ స్విస్ ఖాతాదారులకి ఈ నోటీసులు అందగా, రాబోయే రోజుల్లో చాలా మందికి నోటీసులు వస్తాయని అధికారులు చెబుతుండటం గమనార్హం. వ్యక్తిగత ఖాతాలతోపాటు సంస్థాగత ఖాతాలకూ ఈ నోటీసులు పెద్ద ఎత్తున అందుతున్నాయి. మార్చి, ఏప్రిల్ నెలల్లో ముంబైకి చెందిన జియోడెసిక్ లిమిటెడ్, దాని ముగ్గురు డైరెక్టర్లు ప్రశాంత్ శరద్ ములేకర్, పంకజ్‌కుమార్ ఓంకార్ శ్రీవాత్సవ, కిరణ్ కులకర్ణిలకు నోటీసులు అందాయి. అలాగే చెన్నైకి చెందిన ఆది ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్ కూడా ఈ జాబితాలో ఉన్నది. ఇప్పటికే ఈ సంస్థపై ఆర్థిక అక్రమ లావాదేవీలు, మనీ లాండరింగ్ కేసు విచారణలు జరుగుతున్నాయి.

### నోటీసుల అంతరార్థం..

తమ దేశ బ్యాంకుల్లో ఖాతాలున్న భారతీయుల సమాచారాన్ని కేంద్ర ప్రభుత్వంతో పంచుకుంటున్న స్విట్జర్లాండ్ సర్కారు.. ఆ సమాచారం రహస్యంగానే ఉండాలంటే దాన్ని సమర్థించే వివరాలతో అర్జీ పెట్టుకోవాలని ఖాతాదారులకు ఈ నోటీసులను పంపుతున్నది. ఇలా మార్చి నుంచి కనీసం 28 నోటీసులను పంపింది. ఇటీవలికాలంలో వీటి పంపిణీని పెంచేసింది కూడా. ఈ క్రమంలోనే మే నెలలో ఒక్కరోజే 11 మందికి ఇచ్చింది. సదరు నోటీసుల్లో వీరి పేర్లను సూక్ష్మ రూపంలో పేర్కొంటూ వివరాలను కోరుతున్నది. పుట్టిన తేదీలనూ పెడుతుండగా, ఇప్పటిదాకా ఆరుగురికి మాత్రం పేర్లతో నోటీసులనిచ్చింది. వారిలో 1949 మేలో జన్మించిన కృష్ణ భగవాన్ రాంచంద్, 1972 సెప్టెంబర్‌లో పుట్టిన కల్పేశ్ హర్షద్ కినారివాలా ఉన్నారు. అలాగే రతన్ సింగ్ చౌధరి, కుల్దీప్ సింగ్ ధింగ్రా, అనిల్ భరద్వాజ్‌లున్నారు. కాగా,




30 రోజుల్లోగా సమాధానం ఇవ్వాలని, లేనిపక్షంలో ఖాతాల వివరాలు భారత ప్రభుత్వానికి ఇచ్చేస్తామని స్విస్ ప్రభుత్వం ఆ నోటీసుల్లో హెచ్చరించింది. అయితే రావుకి 10 రోజుల సమయమే ఇవ్వడం గమనార్హం. నల్లధనం వెలికితీతలో భాగంగా పన్ను ఎగవేతదారులకు స్వర్గధామాలైన దేశాలతో కేంద్రంలోని మోదీ సర్కారు సమాచార మార్పిడి ఒప్పందాలను చేసుకున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే స్విస్ ప్రభుత్వం నుంచి సమాచారాన్ని పొందుతున్నది. అయితే తమ బ్యాంకింగ్ వ్యవస్థ రక్షణార్థం ఖాతాదారుల సమ్మతితోనే ఈ సమాచార మార్పిడికి స్విస్ సర్కారు సిద్ధపడుతున్నది.

# సుజనా చౌదరి ఆఫీస్ సీజ్

శని, ఆదివారాల్లో ముమ్మర సోదాలు చేపట్టిన సీబీఐ





**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** కేంద్ర మాజీ మంత్రి సుజనా చౌదరి సంస్థల్లో ఆదివారం కూడా సీబీఐ, ఈడీ అధికారులు సోదాలు కొనసాగించారు. దాదాపు 25 మంది సభ్యుల బృందం హైదరాబాద్‌లోని సోమాజీగూడ సుజనా యూనివర్సల్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ కార్యాలయంలో తనిఖీలు చేపట్టారు. శనివారం ఉదయం 8 గంటలకు ప్రారంభమైన సోదాలు.. రాత్రి 11 గంటల వరకు కొనసాగాయి. తనిఖీలు పూర్తి చేసిన అనంతరం ఆ కార్యాలయాన్ని సీజ్ చేసి నోటీసు అంటించారు. ఈ కార్యాలయంలోకి ఎవరూ ప్రవేశించవద్దని, కార్యాలయంలోని ఏ వస్తువును కూడా బయటకు తీసుకు వెళ్లొద్దని సదరు నోటీసులో స్పష్టంగా పేర్కొన్నారు. తిరిగి ఆదివారం ఉదయం 7.30 గంటల నుంచే మళ్లీ సోదాలు మొదలైయ్యాయి. కాగా, కార్యాలయంలోని ఒక్కో పత్రాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన అధికారులు.. పలు కీలక పత్రాలను స్వాధీనం చేసుకోవడం గమనార్హం. సుజనా గ్రూప్ ఆఫ్ కంపెనీస్‌లోని పలు సంస్థలు గతంలో కార్పొరేషన్ బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆంధ్రా బ్యాంక్ నుంచి దాదాపు రూ.364 కోట్ల రుణం తీసుకుని తిరిగి చెల్లించడంలో విఫలమైనట్టు ఆరోపణలున్నాయి. సుజనా సంస్థల వ్యవహారాలతో నష్టపోయిన బ్యాంకులు.. ఉమ్మడిగా బెంగళూరులోని సీబీఐ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. దీనిపై మూడు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసిన సీబీఐ.. ఆంధ్రా బ్యాంక్ ఇచ్చిన రూ.71 కోట్ల ఫిర్యాదుపై ప్రస్తుతం దర్యాప్తు చేపట్టింది. ఈ నేపథ్యంలోనే శనివారం హైదరాబాద్, బెంగళూరు, చెన్నైతోపాటు 12 ప్రదేశాల్లో సోదాలు నిర్వహించారు. ఈ ఎఫ్ఐఆర్‌లకు సంబంధించి 2018 అక్టోబర్, నవంబర్ నెలల్లో కూడా సీబీఐ, ఈడీ అధికారులు సోదాలు జరుపడంతోపాటు సుజనా చౌదరికి నోటీసులు కూడా జారీ చేసిన విషయం తెలిసిందే. తాజా సోదాల్లో సుజనా చౌదరి సంస్థలకు చెందిన పలువురు కీలక డైరెక్టర్లు, ఉన్నతాధికారులను ప్రశ్నించినట్టు తెలిసింది. అరెస్టులు, అదుపులోకి తీసుకునే అంశాలను వెల్లడించేందుకు సీబీఐ, ఈడీ అధికారులు అందుబాటులోకి రాలేదు.

## ఏసీ కోచ్‌లను పెంచనున్న రైల్వే



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సౌకర్యవంతమైన ప్రయాణం కోసం డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో రైళ్లలో ఏసీ కోచ్‌లను పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు దక్షిణ మధ్య రైల్వే ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. రెండేండ్లలో 30 సాధారణ రైళ్లకు 46 ఏసీ కోచ్‌లను జతచేయగా, అందులో ఏసీ 2 టయర్ 2 కోచ్‌లు, ఏసీ 3 టయర్ 29 కోచ్‌లు, 15 ఏసీ చైర్‌కార్ కోచ్‌లు ఏర్పాటుచేసినట్టు పేర్కొన్నది. దీంతో బెర్తులు, సీట్ల మొత్తం సంఖ్య 3,150కి పెరిగిందని, సగటున ప్రతి రైలులో 4 ఏసీ కోచ్‌లు ఉండేలా ఏర్పాట్లుచేస్తున్నట్టు, ఇదే సమయంలో నాన్ ఏసీ బెర్తుల సంఖ్యలో తేడా లేదని తెలిపింది. సాధారణ రైళ్లలో ఏసీ సౌకర్యాలు పెంచుతున్నందుకు ప్రయాణికుల నుంచి సానుకూల స్పందన వస్తున్నదని పేర్కొన్నది.

# అందరు కలిసి ముంచేశారు

ఐఎల్‌అండ్‌ఎఫ్‌ఎస్ మోసంలో ఆడిటర్లు, స్వతంత్ర డైరెక్టర్లు, ఉన్నతాధికారుల పాత్ర

సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్ విచారణలో వెల్లడి



**న్యూఢిల్లీ, జూన్ 2:** దేశ ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేసిన ఐఎల్‌అండ్‌ఎఫ్‌ఎస్ సంక్షోభానికి కారణం ఇంటిదొంగల పనేనని తేటతెల్లమైంది. ఈ సంక్షోభానికి కంపెనీ టాప్ మేనేజ్‌మెంట్, ఆడిటర్లు, ఇండిపెండెంట్ డైరెక్టర్లేనని సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్(ఎస్‌ఎఫ్ఐవో) గుర్తించింది. వీరందరు ఒక్క కోటరిగా ఏర్పడి సంస్థను ఆర్థికంగా దివాలా తీశారని, వ్యక్తిగత స్వేచ్ఛతో ఇష్టం వచ్చినట్లు వ్యవహరించారని, ముఖ్యంగా ఎవరికి పడితే వారికి రుణాలు ఇచ్చి అవి వసూలు కాకపోవడంతో సంస్థ ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోవడానికి ప్రధాన కారణం వీరేనని ఎస్ఎఫ్ఐవో అధికారి ఒకరు తెలిపారు. రూ.90 వేల కోట్ల మోసానికి కారణమైన ఈ కేసులో ఎస్ఎఫ్ఐవో తన తొలి చార్జిషీట్‌ను దాఖలు చేసింది. ఈ చార్జిషీట్‌లో ఐఎల్‌అండ్‌ఎఫ్‌ఎస్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్(ఐఎఫ్ఐఎన్), ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లీజింగ్ అండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్(ఐఎల్‌అండ్‌ఎఫ్‌ఎస్)కు చెందిన అనుబంధ సంస్థలపై దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన చెప్పారు. వీరితోపాటు ఐఎఫ్ఐఎన్‌కు చెందిన మాజీ ఎగ్జిక్యూటివ్స్, ఇండిపెండెంట్ డైరెక్టర్ల చేతివాటంపై కూడా ప్రధానంగా దృష్టి సారించింది. ఇప్పటికే వీరందరి ఆస్తులను జప్తు చేసిన ఎస్ఎఫ్ఐవో..ఆడిటర్లకు చెందిన స్థిర, చర ఆస్తులతోపాటు లాకర్లు, బ్యాంక్ ఖాతాలు, సంయుక్తంగా నిర్వహిస్తున్న ఆస్తులను జప్తు చేసేయోచనలో ఎస్ఎఫ్ఐవో ఉన్నది. వీటితోపాటు బ్యాంకులు, మార్కెట్ వర్గాల నుంచి ఐఎఫ్ఐఎన్ ఎంత మేర రుణాలను తీసుకున్నదానిపై సమాచారాన్ని పూర్తి స్థాయిలో సేకరిస్తున్నది. ఈ రుణాలు ఇవ్వడంలో బ్యాంకుల పాత్ర, కంపెనీ వర్గాలు, క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీలకు చెందిన ఉన్నతాధికారుల పాత్రపై కూడా హారా తీస్తున్నది. వైట్-కాలర్ మోసాలను అరికట్టాలనే ఉద్దేశంతో ఈ ఏజెన్సీ తన తొలి చార్జిషీట్‌ను దాఖలు చేసింది.

### 400 సంస్థల ఖాతాల తనిఖీ

ఈ కేసులో ఐఎల్‌అండ్‌ఎఫ్‌ఎస్‌కు సంబంధించి 400 సంస్థలకు చెందిన ఖాతాలను తనిఖీ చేసిన ఎస్ఎఫ్ఐవో..ముఖ్యంగా ఫోరెన్సిక్ ఆడిట్, కంప్యూటర్ల నుంచి డాటాను స్వాధీనం చేసుకోగా, ఐఎల్‌అండ్‌ఎఫ్‌ఎస్‌లకు చెందిన ఉన్నతాధికారుల ల్యాప్‌టాప్‌లను జప్తు చేశారు కూడా. పలు సంస్థల వద్ద తీసుకున్న రుణాలు తిరిగి చెల్లింపులు జరుపడంలో విఫలం కావడంతో గతేడాది ఐఎల్‌అండ్‌ఎఫ్‌ఎస్ సంక్షోభం తెరపైకి వచ్చింది. దీంతో రంగంలోకి దిగిన కేంద్ర ప్రభుత్వం..ప్రముఖ బ్యాంకర్ ఉదయ్ కొటక్ నేతృత్వంలోని ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. గతశుక్రవారం ముంబైలోని ప్రత్యేక కోర్టును ఆశ్రయించడానికి కంటే ముందుగానే ఎస్ఎఫ్ఐవో..తన తొలి చార్జిషీట్‌ను సమర్పించింది. రిజర్వుబ్యాంక్ మార్గదర్శకాలకు పాతరేసి చట్టానికి వ్యతిరేకంగా వ్యవహరించారు. 2013-14 నుంచి 2017-18 వరకు మధ్యకాలంలో సంస్థ ఆర్థిక స్థితిగతులను సమీక్షిస్తే చాలా అవకతవకలు జరిగినట్లు గుర్తించినట్లు తెలిపారు.

# ఆర్బీఐ పాలసీయే కీలకం

స్టాక్ మార్కెట్లకు దిశానిర్దేశం చేయనున్న పరపతి సమీక్ష ■ రంజాన్ సందర్భంగా బుధవారం మార్కెట్లకు సెలవు




**న్యూఢిల్లీ, జూన్ 2:** గడిచిన వారం తీవ్ర ఆటుపోటులకు గురైన స్టాక్ మార్కెట్లకు ఈ వారంలో రిజర్వు బ్యాంక్ తీసుకోనున్న నిర్ణయం కీలకంగా మారనున్నది. వడ్డీరేట్లపై ఈ గురువారం ఆర్‌బీఐ తన తదుపరి సమీక్షను ప్రకటించబోతున్నది. వీటికితోడు దేశీయ స్థూల ఆర్థికాంశాలు, అంతర్జాతీయ మార్కెట్ల ట్రెండ్ కూడా సూచీల గమనాన్ని నిర్దేశించనున్నాయని మార్కెట్ పండితులు వెల్లడించారు. బుధవారం ఇద్-ఉల్-ఫితర్ సందర్భంగా స్టాక్ మార్కెట్లు సెలవు పాటించనున్నాయి. దీంతో ట్రేడింగ్ నాలుగు రోజులకు పరిమితం కానున్నది. గత శుక్రవారం స్టాక్ మార్కెట్ ముగిసిన తర్వాత విడుదలైన దేశ వృద్ధిరేటు ఐదేండ్ల కనిష్ఠ స్థాయికి జారుకోవడంతో ఈ వారం ప్రారంభంలో సూచీలు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొనే అవకాశాలున్నాయని తెలిపాయి. కీలక రంగాలు మందగించినప్పటికీ.. గడిచిన ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యలోటు తగ్గుముఖం పట్టడం కొంతమేర ఊరట కల్పించే అంశం. నెమ్మదించిన వృద్ధిరేటు మళ్లీ పుంజుకోవాలంటే ఆర్బీఐ తన తదుపరి పరపతి సమీక్షలో వడ్డీరేట్లను తగ్గించాల్సిన అవసరం ఉన్నదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు అమెరికా-చైనా దేశాల మధ్య వాణిజ్య యుద్ధం మరింత ముదరడం, క్రూడాయిల్ ధరలు భగ్గుమనడం కూడా మార్కెట్లను ప్రభావితం చేయనున్నది. సార్వత్రిక ఎన్నికల్లో బంపర్ మెజార్టీతో విజయం సాధించిన ఎన్‌డీఏ సర్కార్.. ఆర్థిక సంస్కరణలు, పాలసీలపై దృష్టి సారించే అవకాశం ఉందంటున్నారు. గడిచిన నెలకుగాను ఆటోమొబైల్ సంస్థల విక్రయ గణాంకాలు, సేవల రంగ సూచీ కూడా ప్రభావితం చేసే అంశాల్లో కీలకమని తెలిపారు. గత వారం సెన్సెక్స్ 279.40 పాయింట్లు పెరిగి 39,714.20 వద్ద ముగిసింది. మరోవైపు గడిచిన వారం సెన్సెక్స్ టాప్-10 సంస్థల్లో ఆరు భారీగా లాభపడ్డాయి. వీటి మార్కెట్ విలువ రూ.99,994 కోట్లు పెరిగింది. అత్యధికంగా టీసీఎస్ లాభపడగా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, హెచ్‌యూఎల్, హెచ్‌డీఎఫ్‌సీ, ఇన్ఫోసిస్, కొటక్ మహీంద్రా బ్యాంకులు లాభపడిన వాటిలో ఉన్నాయి. కానీ, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐటీసీ, ఎస్‌బీఐ, ఐసీఐసీఐ బ్యాంక్‌లు నష్టపోయాయి.

## పావు శాతం తగ్గొచ్చు?

ఆర్బీఐ ద్రవ్యసమీక్షపై నిపుణులు

రాబోయే ద్రవ్యసమీక్షలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) మరో పావు శాతం వడ్డీరేట్లను తగ్గించే వీలుందన్న అంచనాలు విస్తృతంగా వినిపిస్తున్నాయి. గడిచిన రెండు ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షల్లో కీలక వడ్డీరేట్లను తగ్గించిన ఆర్బీఐ.. ఈసారి సమీక్షలోనూ రెపో, రివర్స్ రెపో వడ్డీరేట్లను కనీసం 25 బేసిస్ పాయింట్ల మేర కోత పెట్టవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. గత ఆర్థిక సంవత్సరం (2018-19) చివరి త్రైమాసికం (జనవరి-మార్చి)లో జీడీపీ ఐదేండ్ల కనిష్ఠానికి పతనమైన నేపథ్యంలో వృద్ధిరేటుకు ఊతమిచ్చే చర్యలకే ఆర్బీఐ ప్రాధాన్యతనిస్తుందని చెబుతున్నారు. పైగా కేంద్రంలో నరేంద్ర మోదీ సర్కారు రెండోసారి కొలువుదీరిన వేళ తొలిసారి జరుగుతున్న ఈ సమీక్షలో ఏరికోరి తెచ్చుకున్న ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్.. ప్రభుత్వం అభీష్టం మేరకే నిర్ణయం తీసుకోవచ్చని అంటున్నారు. దీంతో రెపో, రివర్స్ రెపోలు వరుసగా మూడో సమీక్షలోనూ తగ్గడం ఖాయమన్న ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి. గవర్నర్ దాస్ నేతృత్వంలో ఆర్బీఐ మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ).. మూడు రోజులు సమావేశం కానుండగా, గురువారం ఫలితం వెలువడనున్నది.

# అవకాశాల్ని మింగేసిన జెట్

దేశీయ విమానయాన మార్కెట్‌పై స్టార్ అలయెన్స్ సీఈవో ఆందోళన

కనెక్టింగ్ సర్వీసులపై ప్రభావం



**సియోల్, జూన్ 2:** జెట్ ఎయిర్‌వేస్ సంక్షోభంతో భారతీయ విమానయాన మార్కెట్‌లో అవకాశాలు సన్నగిల్లాయని స్టార్ అలయెన్స్ సీఈవో జెఫ్రీ గో ఆందోళన వ్యక్తం చేశారు. అలయెన్స్‌లోని ఎయిర్ ఇండియా ప్రభావశీలంగా పనిచేస్తున్నా.. జెట్ సేవలు నిలిచిపోవడం.. అతిపెద్ద ఏవియేషన్ మార్కెటైన భారత్‌లో అవకాశాలను మృగ్యం చేసిందని వ్యాఖ్యానించారు. స్టార్ అలయెన్స్‌లో ఎయిర్ ఇండియాసహా మొత్తం 28 సభ్య దేశాలున్నాయి. 2014 జూలైలో ఎయిర్ ఇండియా చేరింది. భారత ఉప ఖండంలో అలయెన్స్‌కు ప్రాతినిథ్యం వహిస్తున్న ఎయిర్ ఇండియా కీలక భూమిక పోషిస్తున్నదన్న ఆయన సహచర సంస్థల కనెక్టింగ్‌కు ఎంతో దోహదం చేస్తున్నదన్నారు. ఇక్కడ జరుగుతున్న అంతర్జాతీయ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ (ఐఏటీఏ) వార్షిక సాధారణ సమావేశానికి ఆదివారం హాజరైన ఆయన మాట్లాడుతూ 'భారతీయ మార్కెట్.. పెద్ద మార్కెట్. చాలా వేగంగా వృద్ధి చెందుతున్న మార్కెట్. అంతర్జాతీయ విమాన సర్వీసులను అధికంగా నడిపే జెట్ ఎయిర్‌వేస్ సేవలు నిలిచిపోవడం.. ఇక్కడి మార్కెట్‌పై చెప్పుకోదగ్గ ప్రభావాన్నే చూపుతున్నది. ఎయిర్ ఇండియా సేవలు బలంగానే ఉన్నా.. ఆ ప్రభావం కనెక్టింగ్ ఎయిర్‌లైన్స్‌పై కనిపిస్తూనే ఉన్నది' అని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా 192 దేశాల్లోని 1,330కిపైగా ఎయిర్‌పోర్టుల్లో దాదాపు 4,657 విమానాలను స్టార్ అలయెన్స్ సంస్థలు నడుపుతున్నాయి. రోజూ 18,500లకుపైగా విమానాల రాకపోకలు జరుగుతున్నాయి. స్టార్ అలయెన్స్ ఎయిర్‌లైన్స్.. ఎయిర్‌పోర్టు టర్మినల్స్‌ను పంచుకుని, ప్రయాణీకులకు అంతర్జాతీయ సేవలను అందిస్తున్నాయి. 728 మిలియన్ల ప్రయాణీకులతో రెండో అతిపెద్ద ఎయిర్‌లైన్స్ కూటమిగా స్టార్ అలయెన్స్ ఉన్నది. 1997లో స్టార్ అలయెన్స్‌ను స్థాపించారు.

### 28 బిలియన్ డాలర్లే

అంతర్జాతీయ విమానయాన పరిశ్రమ లాభం ఈ ఏడాది 28 బిలియన్ డాలర్లుగానే ఉండొచ్చని ఐఏటీఏ అంచనా వేసింది. గతేడాది అంచనా కంటే ఇది తక్కువే. ఇంతకుముందు డిసెంబర్‌లో 35.5 బిలియన్ డాలర్లుగా ఉండొచ్చని అంచనా వేసింది. ఇంధన ధరల పెరుగుదల, బలహీనపడ్డ ప్రపంచ వాణిజ్యం.. పరిశ్రమ వ్యాపారావకాశాలను దెబ్బతీస్తున్నాయని ఆందోళన వెలిబుచ్చింది. అమెరికా-చైనా వాణిజ్య యుద్ధం ప్రభావం కూడా గ్లోబల్ ఎయిర్‌లైన్ ఇండస్ట్రీని కుదిపేస్తున్నదని పేర్కొన్నది. కాగా, రాబోయే రెండు దశాబ్దాలకుపైగా కాలంలో ప్రపంచవ్యాప్తంగా నమోదయ్యే విమాన ప్రయాణీకుల వృద్ధిరేటులో సగభాగం భారత్, చైనాలదేనని ఐఏటీఏ ముఖ్య ఆర్థికవేత్త బ్రియాన్ పీర్స్ చెప్పారు. కాగా, ఎయిర్‌పోర్ట్ స్లాట్ కేటాయింపుల్లో ప్రభుత్వాలు సామరస్యపూర్వక ధోరణిని కలిగి ఉండాల్సిన అవసరం ఉందని, పారదర్శకత కావాలని ఐఏటీఏ డైరెక్టర్ జనరల్, సీఈవో అలెగ్జాండర్ ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. ఐఏటీఏలో దాదాపు 290 ఎయిర్‌లైన్స్‌కు సభ్యత్వం ఉన్నది.

## ఐఏటీఏ బోర్డులోకి స్పైస్‌జెట్ సీఎండీ అజయ్ సింగ్

దేశీయ చౌక ధరల విమానయాన సంస్థ స్పైస్‌జెట్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అజయ్ సింగ్.. ఆదివారం ఐఏటీఏ బోర్డు సభ్యుడిగా నియమితులయ్యారు. ఐఏటీఏలో స్పైస్‌జెట్ చేరి మూడు నెలలైనా గడువక ముందే సింగ్‌కు బోర్డు సభ్యత్వం లభించడం గమనార్హం. జెట్ ఎయిర్‌వేస్ మాజీ చైర్మన్ నరేశ్ గోయల్.. చాలాకాలంపాటు ఐఏటీఏ బోర్డులో సభ్యుడిగా కొనసాగారు. అయితే ఆ బోర్డు స్థానంలో కొత్త బోర్డు రాగా, లుఫ్తాన్సా గ్రూప్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కర్‌స్టెన్ స్పోర్ అధ్యక్షతన ఇది కొలువుదీరింది. ఈ క్రమంలోనే మూడేండ్లకుగాను సింగ్.. ఐఏటీఏ బోర్డులో సభ్యుడిగా నియమితులయ్యారు. తనకు వచ్చిన ఈ అవకాశంపట్ల ఆనందం వ్యక్తం చేసిన సింగ్.. విమానయాన పరిశ్రమ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని చెప్పారు. మరోవైపు జెట్ ఎయిర్‌వేస్‌కు చెందిన 2,000 మందిని ఉద్యోగాల్లోకి తీసుకునే యోచనలో స్పైస్‌జెట్ ఉన్నది. పైలెట్లు, క్యాబిన్ సిబ్బంది కూడా ఇందులో ఉన్నారు. 'ఇప్పటికే జెట్ సిబ్బందిని తీసుకున్నాం. మరికొంత మందినీ నియమించుకోవాలనిస్తున్నాం. జెట్ విమానాలనూ తీసుకున్న విషయం తెలిసిందే' అని అజయ్ సింగ్ ఈ సందర్భంగా అన్నారు.

## చైనా మార్కెట్‌పై రెడ్డీస్ ఆశలు

70 ఔషధాలను అక్కడి మార్కెట్లో ప్రవేశపెట్టనున్న సంస్థ




**హైదరాబాద్, జూన్ 2:** చైనా ఫార్మా మార్కెట్‌పై డాక్టర్ రెడ్డీస్ గంపెడు ఆశలు పెట్టుకున్నది. అమెరికా నియంత్రణ మండలి కట్టుదిట్టమైన చర్యలు, యూరప్ మార్కెట్లో పోటీ తీవ్రతరమవుతుండటంతో రాష్ర్టానికి చెందిన ఫార్మా సంస్థ రెడ్డీస్..పొరుగు దేశమైన చైనాపై దృష్టి సారించింది. అక్కడి మార్కెట్లోకి 70 రకాల మందులను విడుదల చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించింది. చైనా ఫార్మా రంగంలో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవడానికి గతేడాది నుంచి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్న సంస్థ.. అక్కడే నూతన ప్లాంట్‌ను ఏర్పాటు చేయడానికి ఆసక్తి చూపుతున్నది. నూతన ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం లేదా..అక్కడే ఉన్న పాత యూనిట్‌ను కొనుగోలు చేసేదానిపై త్వరలో స్పష్టత రానున్నట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. ఆర్థిక ఫలితాల విడుదల సందర్భంగా వాటాదారులతో జరిగిన సమావేశంలో డాక్టర్ రెడ్డీస్ చీఫ్ ఆపరేటింగ్ అధికారి ఎరేజ్ ఇజ్రాలిన్ మాట్లాడుతూ..అక్కడి మార్కెట్లో ఔషధాలను విడుదల చేయడానికి చైనా నియంత్రణ మండలి అనుమతి కోసం వేచి చూస్తున్నట్లు, తొలి దశలో ఆంకాలజీకి సంబంధించిన మందులను ప్రవేశపెట్టనున్నట్లు ప్రకటించారు. ఔషధాల దిగుమతిపై గతంలో ఉన్న నిబంధనలను అక్కడి ప్రభుత్వం మార్చివేసిందని, దీంతో నాణ్యమైన, చౌక ధర కలిగిన ఔషధాలను విక్రయించడానికి లైన్ క్లియర్ అయినట్లు ఆయన చెప్పారు. ఇప్పటికే అమెరికా మార్కెట్లో విక్రయిస్తున్న 70 రకాల మందులను ఇందుకు గుర్తించడం జరిగిందని, వీటికి అక్కడి మార్కెట్లో డిమాండ్ ఉంటుందని ఆయన అంచనావేస్తున్నారు. చైనా మార్కెట్లో పాగవేయడానికి ఇప్పటికే కున్షన్ రోటమ్ రెడ్డి ఫార్మాస్యూటికల్స్ కంపెనీ లిమిటెడ్‌తో డీఆర్‌ఎల్ ఒప్పందాన్ని కుదుర్చుకున్నది. అక్కడే ఔషధాలను తయారు చేయడం, విక్రయించడం ఇరు సంస్థలు కలిసిచేస్తున్నాయి.

# కరంట్ స్తంభాన్ని ఢీకొట్టిన ఆటో.. ఐదుగురు గిరిజనుల దుర్మరణం

- షార్ట్‌సర్క్యూట్‌తో ఘటనాస్థలిలోనే ఇద్దరు సజీవదహనం
- మార్గమధ్యంలో ఇద్దరు, చికిత్సపొందుతూ మరొకరు మృతి
- విశాఖ జిల్లా చింతపల్లి మండలంలో ఘటన
- ప్రమాద ఘటనపై ఏపీ సీఎం వైఎస్ జగన్ దిగ్భ్రాంతి

**చింతపల్లి:** విద్యుత్ స్తంభాన్ని ఆటో ఢీకొట్టిన ఘటనలో ఐదుగురు గిరిజనులు దుర్మరణం చెందారు. ఏపీలోని విశాఖ జిల్లా చింతపల్లి మండలం ఒడిశా సరిహద్దులోని బలపం గ్రామ పంచాయతీ పరిధి చెరువూరులో ఆదివారం ఈ విషాదం చోటుచేసుకుంది. చింతపల్లి మండలం కోరుకొండలోజరిగే వారసంతకు వెళ్లి ఆటోలో తిరుగుపయనమయ్యారు. ఆటో అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొట్టగా షార్ట్‌సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగాయి. సంఘటనాస్థలంలోనే ఇద్దరు సజీవ దహనమయ్యారు. మరో ముగ్గురిని లోతుగడ్డ దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యంలో ఇద్దరు, చికిత్స పొందుతూ ఒకరు మృతిచెందారు. గాయపడిన ఆరుగురిని చింతపల్లి సామాజిక ఆరోగ్యకేంద్రానికి తరలించారు. ప్రమాద ఘటనపై ఏపీ సీఎం జగన్మోహన్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు.



అదుపుతప్పి స్తంభాన్ని ఢీకొని ఐదుగురి మృతికి కారణమైన ఆటో













నమస్తే తెలంగాణ
# జిందగీ
సోమవారం 3 జూన్ 2019 WWW.NTNEWS.COM /nt.zindagi

**అమె లక్షల్లో వేతనం వచ్చే ఉద్యోగం చేశారు. కానీ సంతృప్తినివ్వలేదు. ఫ్యాషన్ రంగంలోకి అడుగుపెట్టాలనుకున్నారు. ఇటలీలో ఫ్యాషన్ స్కూలులో చేరి కోర్సు పూర్తి చేశారు. అది అయ్యాక మళ్లీ ఉద్యోగం వచ్చింది కానీ చేయలేదు. తరువాత పెళ్లి చేసుకున్నాక స్టార్టప్ ప్రారంభించి మూడున్నర లక్షల పెట్టుబడితో ప్రారంభించిన తొలి ఏడాదే 1.6 కోట్ల ఆదాయాన్ని ఆర్జించారు. తను చూసిన సినిమా ఆలోచనల నుండి పుట్టిందే తన స్టార్టప్ అంటున్న ఏకేఎస్ క్లాతింగ్స్ సంస్థ యాజమాని నిధియాదవ్ సక్సెస్‌మంత్ర.**

## ఒక సినిమా జీవితాన్నే మార్చేసిందంటున్న
# నిధియాదవ్




**నిజంగా** మూడు గంటల సినిమా జీవితాలను మారుస్తుందా.. అలా అయితే ఇప్పటికి చాలామంది మారిపోయి ఉండాలే అని వెక్కిరించకండి. నిజానికి మారాలంటే ఓ నిమిషం పట్టదు. ఓ మంచి మాట కూడా మనిషిని మార్చేస్తుంది. అలాగే తన జీవితాన్ని ఓ సినిమా మార్చేసిందని 25 ఏళ్ల నిధి యాదవ్ ఆనందంగా చెబుతున్నారు. అందుకే అందరిలో ఒకరిగా మిగిలిపోకుండా.. నలుగురికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. అవును మరి ఎవరి జీవితం ఎప్పుడు ఎలా ఏ టర్న్ తీసుకుంటుందో ఎవరికీ తెలియదు. నిధి కూడా అంతే ఉద్యోగాన్ని వదిలేసి వస్త్ర పరిశ్రమను ప్రారంభించి విజయం సాధించారు. ఇంతకీ ఆమె వయసు ంతో తెలుసా? కేవలం 25 ఏళ్లు. అయితేనేం సంచలనం సృష్టించారు.

### ఉద్యోగం మానేసి..

నిధి యాదవ్ మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో ఒక మధ్యతరగతి కుటుంబంలో పుట్టి పెరిగారు. కంప్యూటర్ గ్రాడ్యుయేట్. డెలాయిట్‌లో ఏడాదికిపైగా ఉద్యోగం చేశారు. ఓ రోజు స్నేహితులతో కలిసి 'ద డెవిల్ వియర్స్ ప్రాడా'అనే సినిమా చూశారు. అందరిలా ఆమె సినిమాని చూడలేదు. తనలో స్ఫూర్తిని నింపేదిగా అనిపించింది ఆ చిత్రం. ఆమె ఆలోచనలను పూర్తిగా మార్చేసింది. చేస్తున్న ఉద్యోగానికి రిజైన్ చేసి ఫ్యాషన్ రంగంలోకి ప్రవేశించి తనేంటో నిరూపించుకోవాలనుకున్నారు. ఇటలీలోని ఫ్లోరెన్స్‌లో ఉన్న పోలిమోడా ఫ్యాషన్ స్కూల్లో చేరారు. కోర్సు ముగిసిన తర్వాత నిధికి ఇటాలియన్ ఫ్యాషన్ బ్రాండ్ అయిన ఎమిలియో పుక్కీలో ఉద్యోగం కూడా వచ్చి ంది. కానీ సంతృప్తి లేదు. మళ్లీ భారత్‌కు తిరిగి వచ్చేశారు.

### బ్రాండ్స్‌పై రీసెర్చ్

ఇండియాకు తిరిగి వచ్చాక గురుగ్రామ్‌లో ఒక ఫ్యాషన్ బ్రాండ్‌లో పనిచేశారు. అక్కడ కొంతకాలం చేశాక మానేసి ఇండోరుకు వచ్చి, పెళ్లి చేసుకున్నారు. ఖాళీగా ఉండకుండా ఏదో ఒకటి చేయాలి అని అనుకున్నారు. అప్పుడే స్టార్టప్ ఆలోచన వచ్చింది. కానీ కుటుంబసభ్యులు కొంత నిరాశ పరిచారు. అది నీవల్ల సాధ్యం కాదని అన్నారు. కానీ, తనేంటో తనకు తెలుసు. అందుకే వెనుకడుగు వేయదలుచుకోలేదు నిధి. ముందుగా దానికోసం చాలా వర్కవుటే చేశారు. తర్వాత స్టార్టప్ మొదలెట్టాలని నిర్ణయించుకున్నారు. కొత్త స్టార్టప్ ఏర్పాటు చేయడం, దాన్ని విజయవంతంగా నడపడం అంత సులభమైన పనికాదు. అందుకే ఆమె ముందుగానే వివిధ ఇంటర్నేషనల్ ఫ్యాషన్ బ్రాండ్స్‌పై రీసెర్చ్ చేశారు. 'నేను ఫ్యాషన్ డిజైనర్ని కాదు. కానీ, వేటిని విక్రయించాలో నాకు తెలుసు. నేను స్టార్టప్‌ను ప్రారంభిస్తానని చెప్పినప్పుడు నా కుటుంబం కూడా ఆశ్చర్యానికి గురైంది. కానీ, వారు ఇచ్చిన మద్దతు ఎప్పటికీ మరువలేను' అని తెలిపారు నిధి.

### క్లాతింగ్స్ ప్రారంభించి..

తనమీద తనకు పూర్తి నమ్మకం కలిగాక మే 2014లో నిధి ఏకేఎస్ క్లాతింగ్స్ సంస్థను ఏర్పాటు చేశారు. కేవలం రూ. 3.5 లక్షలతో దీన్ని ప్రారంభించారు. అయితే నిధి సంస్థను ప్రారంభించేటప్పటికీ ఆమెకు నెలల పాప ఉంది. అది కొంత ఇబ్బంది అనిపించిందట. ఏకేఎస్ ప్రారంభించేపుడు ప్రతి వీకెండ్‌కు గురుగ్రామ్ నుండి జైపూర్‌కు రావాల్సి వచ్చేది. అందుకే 'బిజినెస్ ప్రారంభించాలనుకునే వారు పిల్లలు కొంత పెరిగాక ప్రారంభిస్తే ఇబ్బందులు ఉండవని సలహా ఇస్తున్నది. ప్రతి వారం 15 నుంచి 20 కొత్త స్టయిల్స్‌ను తీసుకువచ్చేశారు. ఇప్పుడు నెలకు 150 స్టయిల్స్‌ను కలిగి ఉన్నారు. కస్టమర్స్ రిపీట్ రేటు 35 శాతంగా ఉంది. 2014లో ఏకేఎస్ రూ.1.6 కోట్ల ఆదాయాన్ని అర్జించింది. వ్యాపారంతో పాటు ఆదాయమూ పెరిగింది. ఇప్పుడు ఈ ఆదాయం రూ.8.5 కోట్లకు చేరింది. ఈ ఏడాది ఏకేఎస్ వార్షిక రన్ రేటు (ఏఆర్ఆర్) రూ.100 కోట్లుగా ఉంది. ఈ బ్రాండ్ దుస్తులు ఫ్లిప్‌కార్ట్, జబాంగ్, మింత్ర వంటి ప్లాట్‌ఫామ్‌ల పై అందుబాటులో ఉన్నాయి. ఏకేఎస్ క్లాతింగ్స్‌కు సొంత పోర్టల్ కూడా ఉంది.

### ఇంద్రనూయి రోల్ మోడల్

తనకు ఇంద్రనూయి రోల్‌మోడల్ అంటారు నిధి. 'ఆమె తన కుటుంబాన్ని, ఇటు వ్యాపారాన్ని రెండింటిని కూడా మేనేజ్ చేస్తారు. నాలా వర్కింగ్ మదర్స్‌కు ఆమె విజయగాథే మైల్‌స్టోన్. నేను కూడా ప్రతి వారాంతంలో నా కుటుంబంతో గడపడానికే ఆసక్తి చూపుతాను. ఎప్పుడైనా అలసిపోయినట్టు అనిపిస్తే మ్యూజిక్ వింటాను' అంటారు నిధి. ప్రభుత్వాలు ప్రోత్సహిస్తే మరింత మంది మహిళలు వ్యాపారరంగంలో రాణించి పారిశ్రామికవేత్తలుగా ఎదుగుతారని ఆమె అంటారు. జీవితం చాలా విలువైనది, దాన్ని మనం ఎలా మలుచుకుంటే విజయం సాధిస్తామో సరైన సమయంలో తీసుకునే నిర్ణయాన్ని బట్టి ఉంటుందని నిధి అంటారు.

ఇదే నిధి యాదవ్ ప్రయాణం. పారిశ్రామికవేత్తగా తానేంటో నిరూపించుకున్నారు. ఇతరుల జీవితంపై ప్రభావం చూపుతున్నారు. ఎవరైతే బిజినెస్‌లో విజయవంతం కావాలనుకుంటున్నారో వారికి ఆమె జీవితం ఆదర్శం.



### ఎన్నో ఇబ్బందులు

'ఏకేఎస్‌ను ప్రారంభించినపుడు అనేక సవాళ్లు ఎదురయ్యాయి. ముఖ్యంగా మా ఇల్లు చిన్నది కావడం, పెద్ద మొత్తంలో పెట్టుబడి లేకపోవడం. దీనికి తోడు బట్టలు తయారు చేసేవారితో ఒప్పందాలు. నేను కేవలం ప్రతి బ్రాండ్‌కు 25 పీసులకు మాత్రమే ఆర్డర్ ఇచ్చేదాన్ని. కానీ వారు 200 అయితే తప్ప ఆర్డర్ తీసుకోలేం అని చెప్పేవారు. వారిని ఒప్పించడానికి చాలా సమయం పట్టేది.

**-నిధి యాదవ్**

## ముఖాకృతికి అనుగుణంగా పాపిట!



**గుండ్రటి ముఖాకృతి:** గుండ్రటి ముఖం కలిగిన వారు మధ్య పాపిటను అనుసరించి జుట్టును వదిలేస్తే బాగుంటుంది. రెండు వైపులా ముఖాన్ని కొద్దిగా కప్పి ఉంచేలా కూడా ఈ విధానం పనిచేస్తుంది. ఇది పాటించడం వల్ల ముఖం స్లిమ్‌గా పొడవుగా కనిపిస్తుంది.

**దీర్ఘవృత్తాకార ముఖాకృతి(ఓవెల్ షేప్):** ఈ ముఖాకృతి ఉన్న వారు ఎలాంటి పాపిట తీసినా అందంగానే కనిపిస్తారు. కాకపోతే జుట్టు పొడవుగా ఉండకుండా కాస్తంత నుదుటిపై పడేట్టుగా ముందువైపు దువ్వుకుని ఎడమ వైపు పాపిట తీసుకుంటే స్టైలిష్‌గా ఉంటుంది.

**చతురసాకారపు ముఖాకృతి:** ఈ ముఖాకృతి ఉన్న వారికి సాధారణంగా విశాలమైన నుదురు ఉంటుంది. ఇలాంటి వారికి పక్క పాపిట బాగుంటుంది. నుదురును కప్పి ఉంచేందుకు కొంత జుట్టును ముందువైపు దువ్వుకోవడం మంచిది.

**డైమండ్ ఫేస్:** ఈ ముఖాకృతి వారు సైడ్ పార్టెడ్ చేస్తూ, భుజాల మీదుగా జుట్టును జారవిడిస్తే అందంగా కనిపిస్తారు. వీరు మధ్య పాపిట కూడా ఎంచుకోవచ్చు. అయితే రెండు వైపుల నుంచి నుదుటిని కప్పి ఉంచితే అదనపు అందం మీ సొంతమవుతుంది.

**పియర్ ఫేస్ షేప్:** బల్బు ఆకారంలో ముఖాకృతి ఉన్న వారు కుడివైపు పాపిట తీస్తే అందంగా కనిపిస్తారు. దీంతో పాటు వెంట్రుకలను పైకి రెండు మూడు మడతలుగా మలిచి పైకి దువ్వి సైడ్ పిన్స్ పెడితే చక్కగా కనిపిస్తారు.

## నొప్పులు తగ్గేందుకు ఏ జాగ్రత్తలు తీసుకోవాలి?




మీరు చెప్పిన లక్షణాలను బట్టి చూస్తే నడుం, మెడ, కీళ్ల నొప్పులు ప్రాథమిక దశలో ఉన్నట్లు తెలుస్తున్నది. దీనిని ప్రత్యేకంగా ఫలానా వ్యాధి అని చెప్పలేం. ఇది పూర్తిగా జీవనశైలి సంబంధిత సమస్యల సమ్మేళనం. కాబట్టి మీరు నొప్పి రాకుండా.. వచ్చిన నొప్పి తీవ్రమవకుండా జాగ్రత్త తీసుకోవడమే పరిష్కారంగా భావించవచ్చు. కంప్యూటర్స్ దగ్గర ఎక్కువ సమయం పనిచేసేవారు సరైన భంగిమలో కూర్చోవాలి. స్క్రీన్, కుర్చీ శాస్త్రీయంగా కళ్లకు, నడుముకు, వెన్నుకు అనుకూలంగా అమర్చుకోవాలి. కంప్యూటర్ ముందు కూర్చున్నప్పుడు మీ వీపు మొత్తం కుర్చీకి ఆనుకునేట్లు ఉండాలి. అవసరమైతే లంబార్ పిల్లోను అమర్చుకోవాలి. పాదాలు నేలపైపూర్తిగా ఆని ఉండేట్లు కుర్చీ ఎత్తును సరిచేసుకోవాలి. అవసరాన్ని బట్టి ఫుట్ స్టూల్‌ను అమర్చుకొని పాదాలు దానిపైన పూర్తిగా మోపి ఉంచండి. కీబోర్డ్ పై టైప్ చేసేటపుడు మణికట్టు దానిపై వాలిపోయి ఉండకుండా గాలిలో ఉండేట్లు మీ చేతికంటే తక్కువ ఎత్తులో ఉండేట్లు చూసుకోవాలి. పనిచేస్తున్నప్పుడు మొబైల్ కాల్స్ స్వీకరించాల్సి ఉంటే హాండ్‌సెట్‌ను భుజంపైన పెట్టి మెడవాల్చి మాట్లాడకండి. హెడ్ సెట్ లేదా ఇయర్ ఫోన్స్ ఉపయోగించాలి. ప్రతీ 20 –30 నిమిషాలకు ఓసారి దృష్టిని మానిటర్ పై నుంచి దూరంగా ఉన్న వస్తువులు, వీలైతే ఆకుపచ్చని చెట్లు–మొక్కలు–పెయింటింగ్ పైకి మార్చండి. ఇది మీ కళ్లకు విశ్రాంతిని ఇవ్వటమే కాకుండా మెడ ఒక్క దిశలో నిలిచి ఉండకుండా సున్నితంగా మరోవైపు తిప్పి మార్పును కల్పించటానికి సాయపడుతుంది. కంప్యూటర్ ముందు కుర్చీకే పూర్తిగా అతుక్కుని ఉండకుండా ప్రతీ అర గంటకు ఓసారి లేచి కొద్ది సెకండ్లు నిలబడండి. ప్రతీ గంటకు ఓసారి లేచి నాలుగడుగులు వేయండి. దీనివల్ల తొడల్లో కండరాలకు కాస్త మార్పు లభిస్తుంది. ఒత్తిడి తగ్గుతుంది. శరీరపు కదలిక మొత్తం దేహంలో రక్తప్రసరణ సహజంగా, సజావుగా సాగేట్లు చేస్తుంది. వీలును బట్టి ఉదయమో.. సాయంత్రమో రాత్రి పడుకోవటానికి ముందో ఓ అరగంట పాటు నడవండి. పోషకపదార్థాలతో కూడిన సమతుల ఆహారం తీసుకుంటూ ఈ విధంగా వారానికి అయిదు రోజుల పాటు మొత్తం మీద కనీసం 150 నిమిషాల నడక కంప్యూటర్ ముందు కూర్చుని పనిచేయం వల్లనే కాకుండా ఇతర కారణాల వల్ల వచ్చే పలు వ్యాధుల నుంచి కాపాడుతుంది. ఈ జాగ్రత్తలు తీసుకున్న తర్వాత కూడా మీరు ఇంకా నొప్పులతో బాధ పడుతుంటే మీ దగ్గర్లోని ఆర్థోపెడిక్ లేదా స్టయిన్ సర్జన్‌ను కలువండి.



**డాక్టర్ సునీల్ దాచేపల్లి**
సీనియర్ ఆర్థోపెడిక్
యశోద హాస్పిటల్స్
సోమాజిగూడ

### వంట చిట్కాలు



- ఆమ్లెట్ చక్కని షేప్‌లో రావాలంటే.. గుడ్డుపానలో పావు చెంచా శనగపిండి గిలకొట్టి ఆమ్లెట్ వేయాలి.
- నిమ్మకాయలు ఎక్కువరోజులు తాజాగా ఉండాలంటే ఫ్రిజ్‌లో పెట్టేకంటే నీటిలో ఉంచాలి. ఆ నీటిని అప్పుడప్పుడూ మార్చుతూ ఉండాలి.
- వంకాయలు, అరటికాయలు కట్ చేసిన తర్వాత రంగు మారకుండా ఉండాలంటే కొంచెం మజ్జిగ కలిపిన ఉప్పు నీటిలో ఉంచాలి.
- చికెన్, రొయ్యలు వండేముందు పసుపు పట్టించి 20 నిమిషాల తర్వాత ఉప్పుతో కడిగి వండితే నీచు వాసన రాదు.
- తొడిమలు తీసిన మిరపకాయలను ఎక్కువ రోజులు ఫ్రిజ్‌లో ఉంచితే కుళ్లిపోతాయి.
- ఫ్రిజ్‌లో ఐస్‌ట్రేలు పెట్టేటప్పుడు ఆవనూనె రాస్తే ట్రేలు అతుక్కోకుండా ఉంటాయి.

## వీధిపక్షులకు నెలవు





**సుమారు అరవై యేండ్ల క్రితం ఇద్దరు దంపతులు తీసుకున్న చొరవ ఇప్పుడు ఎన్నో పక్షులకు ఆసరా అవుతున్నది. ఆ కుటుంబం వారసత్వంగా పక్షుల సంరక్షణకు పాటు పడుతున్నది.**

ఇంద్రపాల్ సింగ్, బాత్రా ఇద్దరు దంపతులు అరవై యేండ్ల క్రితం నుంచి కాశీ శివారులోని శ్రీనగర్ సిటీలో నివాసం ఉంటున్నారు. అదంతా ఆధ్యాత్మికతకు నెలవు. ఎన్నో ప్రాంతాల నుంచి సందర్శకుల తాకిడి ఉంటుంది. రోజురోజుకు పట్టణీకరణలో భాగంగా అభివృద్ధి చెందుతున్నది. అయితే ఇక్కడ పర్యావరణానికి కూడా హాని కలుగుతున్నది. ఎప్పుడు కిలకిలలాడే పిచ్చుకలు తగ్గిపోవడం ఈ దంపతులు గమనించారు. వెంటనే పరిష్కారం ఆలోచించారు. మొదట్లో వాటి కోసం టెర్రస్ మీద చెట్లు, నీటి తొట్టెలు, ధాన్యపు గింజలు వేశారు. అలా ప్రారంభమైన వారి ఆలోచన ఇప్పుడు ఈ కాలనీ పిచ్చుకలకు నెలవుగా మారింది. ప్రత్యేకంగా పిచ్చుకలను చూడడానికి, ఆ శబ్దాలను వినడానికి సందర్శకులు ఈ కాలనీకి వస్తుంటారు. దంపతులిద్దరితో పాటు కూతుర్లు కూడా చొరవ తీసుకొని పిచ్చుకల సంరక్షణకు కృషి చేస్తున్నారు. వీధిలో చెట్లు నాటడం, వాటిని పెంచడం చేశారు. ఈ కుటుంబం చొరవను గమనించిన స్థానికులు కూడా ముందుకు వచ్చి చెట్లు నాటి, పిచ్చుకలను ఆహ్వానించారు. ప్రస్తుతం ఈ దంపతుల ఇంట్లో 2500 పిచ్చుకలు కనిపిస్తాయి. ఈ వీధిలో ఎన్నో రకాల పక్షులు సేదతీరుతాయి. వీటి కోసం ఈ దంపతులు 800 పైగా చెట్లు నాటారు.

## నిద్రలేపే చిట్కాలు



**పిల్లలకు నిద్ర చాలా ముఖ్యం. ఇది పిల్లల మానసిక, శారీరక, సామర్థ్యాన్ని నిర్ణయిస్తుంది. దీని కోసం, పిల్లలు బాగా నిద్రపోయేట్లు, ఉదయాన్నే త్వరగా నిద్రలేచేట్లు చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే.**

- పిల్లలు ఉదయాన్నే నిద్రలేస్తే చాలా ఉత్సాహంగా, ఆరోగ్యంగా ఉంటారు. ఉదయాన్నే నిద్రలేవాలంటే రాత్రిళ్లు త్వరగా నిద్రపోవాలి. రాత్రిళ్లు త్వరగా నిద్రపోయేట్లుగా పిల్లలకు ముందు నుంచే అలవాటు చేయాలి.
- రాత్రిళ్లు పడుకునే ముందే ఒకటికి పదిసార్లు గుర్తు చేయాలి. ఉదయం నిద్రలేచి 'కాసేపు నీకిష్టమైన పనిచెయ్' ఆ తర్వాత చదువుకో.. ఇలా రాత్రి నిద్రపోయే ముందే చెబితే ఉదయం ఆటోమేటిక్‌గా సమయానికి మెలకువ వస్తుంది.
- కొందరు పిల్లలు 'పది నిమిషాలు అమ్మా.. పదినిమిషాలు' అంటూ గంటలు గడిచినా నిద్రలోంచి బయటికి రారు. పిల్లలకు సమయం విలువ చెప్పి, వారు చేయాల్సిన పనులు వివరిస్తే బాధ్యతగా తమ పనుల్ని తాము నిర్వర్తించే అవకాశం ఉన్నది.
- ఉదయాన్నే పిల్లల్ని తిట్టవద్దు. వారిని ప్రోత్సహిస్తూ ఆనందంగా ఉంచితే రోజంతా ఆనందంగా గడుపుతారు. ఉదయాన్నే నిద్రలేపేందుకు చిన్న చిన్న బహుమతులు ఇస్తే కొన్ని రోజులకు వారికే సమయానికి మెలకువ వస్తుంది.

## అమ్మ కవిత్వానికి స్పందన!




అమ్మ గురించి ఆమె వినిపించిన కవిత్వం అక్కడున్న వారందరినీ కన్నీళ్లు పెట్టించింది. 'అమ్మా నా స్నేహితులు వచ్చారు.. నన్ను ఇబ్బంది పెట్టకు సరేనా?' 'నా స్నేహితుల ముందు నువ్ ఇంగ్లీష్‌లో మాట్లాడు నా పరువు పోతుంది. అదే పాత చీర ఎందుకు కట్టుకున్నావు. మంచిది కట్టుకోవచ్చు కదా? నువ్ స్కూలుకు వచ్చే ముందు బాగా రెడీ అయి రా'. ఇలాంటి సంభాషణలు మన నిత్య జీవితంలో ఏదో ఒక సందర్భంలో అమ్మతో అనే ఉంటాం. కానీ అమ్మ కష్టాన్ని గుర్తించం. మనకు అండగా నిలబడే అమ్మకు మనం అండగా నిలబడాలి అంటున్నారు రాజస్థాన్‌కు చెందిన అనామిక. ఇటీవల జైపూర్‌లో 'సాహిత్య' సంస్థ ఆధ్వర్యంలో మదర్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించింది. నిర్వాహకులు ఈ కార్యక్రమానికి స్థానికంగా ఉండే మాతృమూర్తులను, స్థానిక కవులను ఆహ్వానించారు. ఈ కార్యక్రమానికి హాజరైన యువ కవయిత్రి అనామికకు నిర్వాహకులు 'అమ్మ' గురించి కవిత్వం రాయమని సూచించారు. పది నిమిషాల్లో అనామిక కవితను రాసేసింది. స్టేజీ పైకి ఎక్కి 'ఎప్పుడూ వంటింట్లో బిజీ బిజీగా గడిపే నువ్వు.. మా అందరి యోగక్షేమాలు చూస్తున్నావు. నీ యోగక్షేమాలు అడిగేదెవ్వరు?' అంటూ 2 నిమిషాల పాటు కవిత్వం సాగించింది. 'ఇకపై నీకు మేం అండగా నిలబడతాం' అని ముగించింది. ఒక్కసారిగా అక్కడున్న వారంతా అనామిక కవిత్వం విని భావోద్వేగానికి గురయ్యారు. ప్రతి ఒక్కరి ఇంట్లో ఎదురయ్యే సంఘటనలను కవిత్వీకరించిన అనామికను అక్కడికి వచ్చిన వారంతా ప్రశంసించారు. ప్రస్తుతం ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నది.

II.

నమస్తే తెలంగాణ

నిపుణ

[ కరీంనగర్ ]

సోమవారం 3 జూన్ 2019



# తక్కువ చదువుతో చక్కని కొలువులు

**ఇంటర్, డిగ్రీ అయిపోయింది. ఈ అర్హతతోనే ఏదో ఒక ఉద్యోగం చూసుకోవాలనుకునేవారు చాలామంది ఉంటారు. అందులోనూ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం అంటే అందరికీ మక్కువే. అలాంటి అవకాశాలు చాలానే ఉన్నాయి. ఇంటర్, డిగ్రీలతో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు ఏమేమి ఉన్నాయి, వాటి తీరుతెన్నులు నిపుణ పాఠకుల కోసం..**

## ఇంటర్‌తో

### ఎన్‌డీఏ అండ్ ఎన్‌ఏ

- యూపీఎస్సీ నిర్వహించే ఎన్‌డీఏ అండ్ ఎన్‌ఏ (నేషనల్ డిఫెన్స్ అకాడమీ అండ్ నేవల్ అకాడమీ) ఎగ్జామినేషన్ ఇంటర్ అర్హతతో త్రివిధ దళాల్లో అడుగుపెట్టే అవకాశం కల్పిస్తుంది. యూపీఎస్సీ ఏటా రెండుసార్లు ఈ పరీక్షను నిర్వహిస్తుంది.
- ఆర్మీ వింగ్ పోస్టులకు ఏదైనా గ్రూపుతో ఇంటర్ పూర్తిచేసిన పెండ్లికాని (అవివాహిత) పురుష అభ్యర్థులు అర్హులు. అలాగే ఎయిర్‌ఫోర్స్, నేవల్ వింగ్స్‌లోని పోస్టులకు ఇంటర్‌లో ఫిజిక్స్, మ్యాథమెటిక్స్ చదివిన అభ్యర్థులు అర్హులు.
- అభ్యర్థుల వయస్సు పదహారున్నరేండ్ల నుంచి పంతొమ్మిదిన్నరేండ్ల మధ్య ఉండాలి.
- ఎంపిక ప్రక్రియ రెండంచెలుగా ఉంటుంది. రాతపరీక్షలో ప్రతిభ ఆధారంగా ఎస్ఎస్‌బీ (సర్వీసెస్ సెలక్షన్ బోర్డు) ఇంటెలిజెన్స్, పర్సనాలిటీ టెస్టులను నిర్వహించి ఎంపిక చేస్తుంది.
- ఎంపికైన అభ్యర్థులకు శిక్షణ ఇస్తారు. ఈ శిక్షణ సమయంలో సుమారు రూ.50,000కు పైగా స్టయిఫండ్ లభిస్తుంది.
- శిక్షణ అనంతరం ఇండియన్ ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్, నేవీ విభాగాల్లో లెఫ్టినెంట్, సబ్ లెఫ్టినెంట్, ఫ్లయింగ్ ఆఫీసర్, సెయిలర్ ఉద్యోగాలు లభిస్తాయి.
- శిక్షణ పూర్తిచేసుకున్న ఆర్మీ కేడెట్లకు బీఏ/బీఎస్సీ (కంప్యూటర్స్)/బీటెక్, ఎయిర్‌ఫోర్స్/నేవీ కేడెట్లకు బీటెక్ డిగ్రీ అందజేస్తారు.
- నోటిఫికేషన్ జనవరి/ఫిబ్రవరి, జూన్/జూలైలలో ఏడాదికి రెండుసార్లు విడుదలవుతుంది.
- ఇతర వివరాలు తెలుసుకోవాలంటే https://upsc.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు.

### ఎస్ఎస్‌సీ సీహెచ్ఎస్ఎల్

- స్టాఫ్ సెలక్షన్ కమిషన్ నిర్వహించే కంబైన్డ్ హయ్యర్ సెకండరీ లెవల్ ఎగ్జామ్‌నే ఎస్ఎస్‌సీ సీహెచ్ఎస్ఎల్ అంటారు.
- ఇది లోయర్ డివిజన్ క్లర్క్స్ (ఎల్‌డీసీ), అప్పర్ డివిజన్ క్లర్క్స్ (యూడీసీ), డాటా ఎంట్రీ ఆపరేటర్స్ (డీఈఓ), పోస్టల్ అసిస్టెంట్/సార్టింగ్ అసిస్టెంట్స్, జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్ (జేఎస్ఏ) వంటి పోస్టులను భర్తీ చేస్తుంది.
- వీటికి ఇంటర్ ఉత్తీర్ణులై, 18 నుంచి 27 ఏండ్లలోపు ఉన్నవారు అర్హులు. డాటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టులకు ఎంపీసీ సబ్జెక్టులతో ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి.
- మూడు దశలుగా ఎంపిక ఉంటుంది. టైర్-1, టైర్-2 రాతపరీక్షలు కాగా, టైర్-3 స్కిల్‌టెస్ట్. టైర్-1లో జనరల్ ఇంటెలిజెన్స్, ఇంగ్లిష్ లాంగ్వేజ్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, జనరల్ అవేర్‌నెస్ నుంచి ప్రశ్నలు వస్తాయి. టైర్-2 డిస్క్రిప్టివ్ పరీక్ష. టైర్-3 అర్హత పరీక్ష మాత్రమే. ఇందులో వచ్చిన మార్కులను మెరిట్ లిస్ట్‌లోకి తీసుకోరు.
- డీఈవో పోస్టులకు అభ్యర్థుల డాటా ఎంట్రీ స్పీడ్‌ను పరీక్షిస్తారు. ఇందులో అభ్యర్థి 2000 నుంచి 2200 కీ డిప్రెషన్స్‌గల ఇంగ్లిష్ కంటెంట్‌ను 15 నిమిషాల్లో కంప్యూటర్‌లో ఎంటర్ చేయాలి.
- పోస్టల్ అసిస్టెంట్, ఎల్‌డీసీ, కోర్టు క్లర్క్ పోస్టులకు టైపింగ్ స్పీడ్‌ను పరీక్షిస్తారు. ఇంగ్లిష్ టైపింగ్ స్పీడ్ నిమిషానికి 35 పదాలు, హిందీ టైపింగ్ స్పీడ్ నిమిషానికి 30 పదాలు ఉండాలి.
- ఈ పోస్టులకు ఎంపికైనవారికి రూ.5200-20,200 (గ్రేడ్ పే రూ.2400) వరకు వేతనం ఉంటుంది.
- 2019, డిసెంబర్ 12న రెండో నోటిఫికేషన్ వెలువడనుంది. 2020, జనవరి 10 వరకు దరఖాస్తుల స్వీకరణ ఉంటుంది.

### ఆర్మీ టెక్నికల్ ఎంట్రీ స్కీమ్

- టెక్నికల్ ఎంట్రీ స్కీమ్ ద్వారా ఆర్మీలో ఉద్యోగావకాశం లభిస్తుంది. దీనిద్వారా ఉద్యోగంతోపాటు డిగ్రీ పట్టా కూడా పొందవచ్చు.
- 70 శాతం మార్కులతో మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులతో ఇంటర్ పాసై ఉండాలి.
- అవివాహిత పురుషులు మాత్రమే అర్హులు. పదహారున్నరేండ్ల నుంచి పంతొమ్మిదిన్నరేండ్ల మధ్య వయస్సు ఉండాలి.
- ఇంటర్‌లో సాధించిన మార్కుల ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేస్తారు. వారికి సర్వీస్ సెలక్షన్ బోర్డు (ఎస్ఎస్‌బీ) ఇంటర్వ్యూ నిర్వహిస్తుంది.
- సోల్జర్ టెక్నికల్, టెక్నికల్ ఆర్మ్స్, ఆర్టిలరీ, ఆర్మీ ఎయిర్ డిఫెన్స్, ఏవియేషన్ అండ్ అమ్యునిషన్ ఎగ్జామినర్ వంటి ఉద్యోగాల్లో భర్తీ చేస్తుంది.
- **సోల్జర్ క్లర్క్, స్టోర్‌కీపర్:** ఇంటర్ ఆర్ట్స్, సైన్స్, కామర్స్ విభాగాల్లో 60 శాతం మార్కులతో (ఒక్కో సబ్జెక్టులో కచ్చితంగా 50 శాతం మార్కులు రావాలి) ఉత్తీర్ణత సాధించాలి.
- పదిహేడున్నరేండ్ల నుంచి 23 ఏండ్ల మధ్య ఉన్న అభ్యర్థులను ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్, రాత పరీక్ష, మెడికల్ టెస్ట్‌ల ద్వారా ఎంపిక చేస్తారు.
- **సోల్జర్ నర్సింగ్ అసిస్టెంట్:** దీనికి బైపీసీతో ఇంటర్ పాసై ఉండాలి.
- **జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్:** దీనికి ఇంటర్‌తోపాటు హోటల్ మేనేజ్‌మెంట్‌లో డిప్లొమా చేసి ఉండాలి.
- వెబ్‌సైట్ http://joinindanarmy.nic.in/

### ఇండియన్ ఎయిర్‌ఫోర్స్

- దీనిలో ఎయిర్‌మెన్ గ్రూప్-ఎక్స్, వై ట్రేడ్స్ పోస్టులు ఉన్నాయి.
- మ్యాథ్స్, ఫిజిక్స్, ఇంగ్లిష్ సబ్జెక్టులతో ఇంటర్ పాసై, 17 నుంచి 21 ఏండ్లలోపు ఉండాలి.
- ఎయిర్‌మెన్ గ్రూప్-వై మెడికల్ అసిస్టెంట్ ట్రేడ్స్ పోస్టులకు బైపీసీతో ఇంటర్ పాస్ కావాలి.
- రాతపరీక్ష, మెడికల్ టెస్ట్ ఆధారంగా ఎంపిక ఉంటుంది.
- **వెబ్‌సైట్:** http://airmenselection.cdac.in



### ఇండియన్ పోస్టల్

- పోస్టల్ అసిస్టెంట్, సార్టింగ్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేస్తుంది.
- ఇంటర్ పాసై, 18 నుంచి 27 ఏండ్లలోపు ఉండాలి.
- వీటికి నిర్వహించే రాతపరీక్ష పేపర్-1, పేపర్-2గా ఉంటుంది. పేపర్-1లో జనరల్ నాలెడ్జ్, మ్యాథమెటిక్స్, మెంటల్ ఎబిలిటీ, రీజనింగ్, ఇంగ్లిష్ లాంగ్వేజ్‌ల నుంచి ప్రశ్నలు వస్తాయి. పేపర్-2లో కంప్యూటర్/టైపింగ్ టెస్ట్ ఉంటుంది.
- వెబ్‌సైట్ www.indiapost.gov.in

### 10+2 క్యాడెట్ ఎంట్రీ స్కీమ్

- భారత నౌకాదళం ఇంటర్ విద్యార్థులకు ఇంజినీరింగ్‌తోపాటు ఉద్యోగం కూడా ఇస్తుంది.
- ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్ సబ్జెక్టులతో 70 శాతం మార్కులతో ఇంటర్ పాసై, జేఈఈ మెయిన్‌లో క్వాలిఫై అయినవారు అర్హులు.
- జేఈఈ-2019 మెయిన్‌లో సాధించిన ర్యాంకు ఆధారంగా దరఖాస్తును షార్ట్‌లిస్ట్ చేస్తారు. వీరికి సర్వీసెస్ సెలక్షన్ బోర్డు (ఎస్ఎస్‌బీ) ఆగస్టు-అక్టోబర్‌ల మధ్య బెంగళూరు, భోపాల్, కోయంబత్తూరు, విశాఖపట్నంలలో ఏదో ఒక చోట ఇంటర్వ్యూలు నిర్వహిస్తుంది.
- ఇవి ఐదురోజులపాటు రెండుదశల్లో జరుగుతాయి. మొదటి రోజు స్టేజ్-1 పరీక్షలో ఇంటెలిజెన్స్ టెస్ట్, పిక్చర్ పర్సెప్షన్ టెస్ట్, గ్రూప్ డిస్కషన్ ఉంటాయి.
- ఇందులో అర్హత సాధించినవారికి మిగిలిన నాలుగు రోజులపాటు స్టేజ్-2లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. దీనిలో సైకలాజికల్, గ్రూప్ పరీక్షలు, ముఖాముఖి ఉంటాయి. వీటిలో పాసైతే మెడికల్ టెస్టులు నిర్వహించి నియామకాలు చేపడుతారు.
- దీనికి మే 31 నుంచి జూన్ 17లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **వెబ్‌సైట్:** http://www.joinindiannavy.gov.in/

### ఎస్ఎస్‌సీ స్టెనోగ్రాఫర్ గ్రేడ్-సీ, డీ

- స్టాఫ్ సెలక్షన్ కమిషన్ స్కిల్ టెస్టు ద్వారా ఈ పోస్టులను భర్తీచేస్తుంది.
- అభ్యర్థులు ఇంటర్ ఉత్తీర్ణులై, 18 నుంచి 27 ఏండ్లలోపు ఉండాలి.
- ఎంపిక విధానం రెండు దశలుగా ఉంటుంది. మొదటి దశలో రాత పరీక్ష, రెండో దశలో స్టెనోగ్రఫీలో స్కిల్ టెస్ట్ ఉంటుంది.
- రాత పరీక్షలో రీజనింగ్ (వెర్బల్, నాన్ వెర్బల్), ఇంగ్లిష్ లాంగ్వేజ్, జనరల్ ఇంటెలిజెన్స్, జనరల్ అవేర్‌నెస్, కాంప్రహెన్షన్ సబ్జెక్టులు ఉంటాయి.
- గ్రేడ్ సీకి రూ.9300-34,800 (గ్రేడ్ పే రూ.4200) వరకు, గ్రూప్-డీకి రూ.5200-20,200 (గ్రేడ్ పే రూ.2400) వరకు వేతనం ఉంటుంది.
- 2019కి సంబంధించిన నోటిఫికేషన్ సెప్టెంబర్ 17న వెలువడుతుంది. అక్టోబర్ 15 వరకు దరఖాస్తులను స్వీకరిస్తారు.
- వెబ్‌సైట్ www.ssc.nic.in

- ఇవేకాకుండా రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు జూనియర్ క్లర్క్ కమ్ టైపిస్ట్, అకౌంట్స్ క్లర్క్ కమ్ టైపిస్ట్, జూనియర్ టైమ్ కీపర్, ట్రైన్స్ క్లర్క్స్, కమర్షియల్ కమ్ టికెట్ క్లర్క్స్ వంటి ఉద్యోగాలను ఇంటర్ అర్హతతో భర్తీచేస్తుంది.

## డిగ్రీతో

- స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ) పలు కేంద్రప్రభుత్వ ఉద్యోగాలకు వేర్వేరుగా నోటిఫికేషన్లను విడుదల చేస్తుంది. ఎస్ఎస్‌సీ 2019 ఉద్యోగాల క్యాలెండర్‌ను ఇటీవల విడుదల చేసింది.

### కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్ (సీజీఎల్)

- ఎస్ఎస్‌సీ ప్రతి ఏడాది నోటిఫికేషన్‌ను విడుదల చేస్తుంది.
- దీనిద్వారా అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ పోస్టులతో పాటు పలు మంత్రిత్వ శాఖల్లో అసిస్టెంట్లు, ఇన్‌స్పెక్టర్, సబ్‌ఇన్‌స్పెక్టర్, అసిస్టెంట్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్, డివిజినల్ అకౌంటెంట్, స్టాటిస్టికల్ ఇన్వెస్టిగేటర్స్, ఆడిటర్స్, జూనియర్ అకౌంటెంట్, సీనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్, ట్యాక్స్ అసిస్టెంట్ వంటి కీలక పోస్టులను భర్తీచేస్తారు.
- ఈ పోస్టులకు ఎంపిక మూడంచెలుగా ఉంటుంది. మొదటగా టైర్-1లో కమిషన్ నిర్ణయించిన మార్కులు సాధించినవారు టైర్-2కు అర్హత సాధిస్తారు. టైర్-2లో కూడా నిర్ణయించిన మార్కులు సాధిస్తే టైర్-3 రాయాలి.
- పోస్టులను బట్టి టైర్-2లో నాలుగు పేపర్ల వరకు ఉంటాయి. పేపర్-1, పేపర్-2లు ఉమ్మడిగా అందరూ రాయాలి. పేపర్-3 స్టాటిస్టిక్స్ సబ్జెక్టుపై నిర్వహిస్తారు. జూనియర్ స్టాటిస్టికల్ ఆఫీసర్‌కు దరఖాస్తు చేసుకుంటే వారు పేపర్-3 రాయాలి. అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్ పోస్టులకు దరఖాస్తు చేసుకుంటే పేపర్-4 (ఫైనాన్స్ అండ్ ఎకనామిక్స్) రాయాలి. పేపర్-1, 2లు క్వాంటిటేటివ్ ఎబిలిటీస్, ఇంగ్లిష్ లాంగ్వేజ్ అండ్ కాంప్రహెన్షన్‌పై పరీక్ష ఉంటుంది.
- టైర్-1, 2లలో సాధించిన మార్కుల ఆధారంగా తర్వాతి టెస్టుకు అర్హత లభిస్తుంది. టైర్-3ను పెన్ అండ్ పేపర్ విధానంలో ఉంటుంది. దీన్ని హిందీ లేదా ఇంగ్లిష్ మీడియంలో రాయవచ్చు. ఇందులో లెటర్ రైటింగ్, ప్రిసైజ్ రైటింగ్, ఎస్సే రైటింగ్, అప్లికేషన్ రైటింగ్ మొదలైనవి ఉంటాయి.
- అక్టోబర్ 31న ఈ సీజీఎల్‌ఈ నోటిఫికేషన్ వెలువడనుంది. నవంబర్ 28 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు.
- **వెబ్‌సైట్:** www://ssc.nic.in/

### కేంద్ర బలగాలు

- కేంద్రంలోని కీలక పోలీసు కొలువులను కూడా ఎస్ఎస్‌సీ భర్తీచేస్తుంది. ఇందులో సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్ (గ్రూప్-బి నాన్ మినిస్టీరియల్, నాన్ గెజిటెడ్)లో ఎస్ఐ, సీఐఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్, ఐటీబీపీఎఫ్, ఎస్ఎస్‌బీ, బీఎస్ఎఫ్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులు, అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఇన్ సీఐఎస్ఎఫ్ పోస్టులు, సబ్ ఇన్‌స్పెక్టర్ ఇన్ ఢిల్లీ పోలీస్ (గ్రూప్-సి) పోస్టులు ఉన్నాయి.
- డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు 25 ఏండ్లలోపు ఉన్నవారు అర్హులు. వీటి ఎంపికకు నిర్వహించే పరీక్షలో రెండు పేపర్లు ఉంటాయి. వీటిలో సాధించిన మార్కుల ఆధారంగా ఎంపిక ఉంటుంది. ఈ పరీక్షలు ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటాయి.
- పేపర్-1లో జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్, జీకే అండ్ జనరల్ అవేర్‌నెస్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, ఇంగ్లిష్ కాంప్రహెన్షన్ సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు ఉంటాయి. ఇందులో అర్హత సాధించినవారికి ఫిజికల్ ఎండ్యూరెన్స్ టెస్ట్/ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్ (పీఈటీ/పీఎస్‌టీ) నిర్వహిస్తారు. ఇందులో అర్హత సాధిస్తేనే పేపర్-2కు అనుమతి లభిస్తుంది.
- పేపర్-2 ఇంగ్లిష్ లాంగ్వేజ్ అండ్ కాంప్రహెన్షన్‌పై 200 ప్రశ్నలతో 200 మార్కులకు జరుగుతుంది. పరీక్షలో నెగెటివ్ మార్కింగ్ విధానం ఉంది. ప్రతి తప్పు సమాధానానికి 0.25 మార్కులు కోత విధిస్తారు.
- 2019, సెప్టెంబర్ 17న నోటిఫికేషన్ వెలువడనుంది. అక్టోబర్ 15 వరకు దరఖాస్తులను స్వీకరిస్తారు.

### జూనియర్ ఇంజినీరింగ్ ఎగ్జామినేషన్

- ఇంజినీరింగ్ విద్యార్థులకు మాత్రమే ఉద్దేశించిన పరీక్ష ఇది. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని పలు సంస్థలు లేదా ప్రాజెక్టుల్లోని వివిధ విభాగాల్లో జూనియర్ ఇంజినీరింగ్ పోస్టులను భర్తీచేస్తుంది.
- పోస్టులను బట్టి సివిల్/ఎలక్ట్రికల్ లేదా మెకానికల్ ఇంజినీరింగ్‌లో డిగ్రీ/మూడేండ్ల వ్యవధిగల డిప్లొమాతోపాటు ఆయా విభాగాల్లో ఉత్తీర్ణులై ఉండాలి.
- రాతపరీక్ష రెండు దశల్లో (పేపర్-1, పేపర్-2) ఉంటుంది. ఇది మొత్తం 500 మార్కులకు నిర్వహిస్తారు. పేపర్-1 ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటే, పేపర్-2 డిస్క్రిప్టివ్ పద్ధతిలో జరుగుతుంది. పేపర్-1లో ఉత్తీర్ణత సాధిస్తే పేపర్-2 పరీక్షకు అనుమతిస్తారు.
- పేపర్-1 కంప్యూటర్ ఆధారిత పరీక్ష. ఇది మొత్తం 200 మార్కులకు ఉంటుంది. దీనిలో జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్, జనరల్ అవేర్‌నెస్, సంబంధిత ఇంజినీరింగ్ అంశాలు అడుగుతారు. నెగెటివ్ మార్కింగ్‌లో భాగంగా ప్రతి తప్పు సమాధానానికి 0.25 మార్కుల కోత విధిస్తారు.
- పేపర్-2 డిస్క్రిప్టివ్ పరీక్ష 300 మార్కులకు ఉంటుంది.
- జూనియర్ ఇంజినీరింగ్-2019 నోటిఫికేషన్ ఆగస్టులో వెలువడుతుంది. ఆగస్టు 28 వరకు దరఖాస్తులను స్వీకరిస్తారు.

### అసిస్టెంట్ కమాండెంట్స్

- ఏసీపీ/డీఎస్పీలతో సమాన హోదా ఉండే ఈ అసిస్టెంట్ కమాండెంట్ పోస్టుల భర్తీకి యూపీఎస్సీ ఏటా ప్రకటన విడుదల చేస్తుంది. సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్ (సీఏపీఎఫ్) పేరుతో యూపీఎస్సీ పరీక్ష నిర్వహిస్తుంది.
- డిగ్రీ ఉతీర్ణులై, 25 ఏండ్లలోపు ఉన్నవారు అర్హులు.
- రాతపరీక్ష, ఫిజికల్ టెస్ట్, ఇంటర్వ్యూల్లో చూపిన ప్రతిభ ఆధారంగా నియామకాలు చేపడుతారు.
- రాతపరీక్షలో పేపర్-1, పేపర్-2 ఉంటాయి. పేపర్-1 జనరల్ ఎబిలిటీ అండ్ ఇంటెలిజెన్స్ నుంచి 250 మార్కులకు, పేపర్-2 ఎస్సే రైటింగ్ విభాగంలో 200 మార్కులకు ఉంటాయి. వీటిలో అర్హత సాధించినవారికి ఇంటర్వ్యూ నిర్వహిస్తారు.
- ఈ పరీక్ష ద్వారా ఎంపికయినవారు బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్), సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్), సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్), ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్ (ఐటీబీపీ), సశస్త్ర సీమాబల్ (ఎస్ఎస్‌బీ)లలో వేటిలోనైనా అసిస్టెంట్ కమాండెంట్‌గా విధులు నిర్వర్తిస్తారు.
- వీరికి ఏడాది శిక్షణ అనంతరం నెలకు సుమారు రూ.56,100 వేతనం లభిస్తుంది.
- **వెబ్‌సైట్:** https://ssc.nic.in, www.upsc.gov.in

### సివిల్స్

- ఇండియన్ అడ్మినిస్ట్రేషన్ సర్వీస్ (ఐఏఎస్), ఇండియన్ పోలీస్ సర్వీస్ (ఐపీఎస్), ఇండియన్ ఫారెన్ సర్వీస్ (ఐఎఫ్ఎస్), ఇండియన్ రెవెన్యూ సర్వీస్ (ఐఆర్ఎస్) వంటి 24 అఖిల భారత సర్వీసులకు అభ్యర్థులను యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ ద్వారా ప్రతి ఏటా భర్తీచేస్తుంది.
- ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులై, 32 ఏండ్లలోపు ఉన్నవారు అర్హులు. దీని నోటిఫికేషన్ ప్రతి ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలల్లో వెలువడుతుంది.
- ఓసీలు 32 ఏండ్లలోపు ఉన్నవారు ఆరుసార్లు, ఓబీసీలు 35 ఏండ్లలోపు తొమ్మిదిసార్లు, ఎస్సీ, ఎస్టీలు 37 ఏండ్లలోపు ఎన్నిసార్లయినా రాసుకోవచ్చు.
- మూడు దశల ద్వారా సివిల్స్‌కు ఎంపిక చేస్తారు. అవి.. ప్రిలిమినరీ, మెయిన్, ఇంటర్వ్యూ. ప్రిలిమినరీ రెండు పేపర్లుగా 400 మార్కులకు ఉంటుంది.
- **మెయిన్:** ఇది పూర్తిగా డిస్క్రిప్టివ్ విధానంలో ఉంటుంది. దీనిలో 250 మార్కుల చొప్పున ఏడు పేపర్లు ఉంటాయి. వీటితోపాటు మరో రెండు అర్హత పేపర్లు ఉంటాయి. వీటిలో భారత రాజ్యాంగం గుర్తించిన ఏదైనా భాషా పేపర్, ఇంకోటి ఇంగ్లిష్.
- మెయిన్‌లో పేపర్-1 జనరల్ ఎస్సే, పేపర్-2 జనరల్ స్టడీస్-1, పేపర్-3 జనరల్ స్టడీస్-2, పేపర్-4 జనరల్ స్టడీస్-3, పేపర్-5 జనరల్ స్టడీస్-4, పేపర్-6 ఆప్షనల్ సబ్జెక్ట్-1, పేపర్-7 ఆప్షనల్ సబ్జెక్ట్ పేపర్-2 ఉంటాయి. మొత్తం 1750 మార్కులు. ఇంటర్వ్యూ 275 మార్కులకు ఉంటుంది.
- ఇంకా ఇవేకాకుండా రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు ట్రాఫిక్ అసిస్టెంట్, గూడ్స్ గార్డ్స్, సీనియర్ కమర్షియల్ కమ్ టికెట్ క్లర్క్, సీనియర్ క్లర్క్ కమ్ టైపిస్ట్, జూనియర్ అకౌంట్స్ అసిస్టెంట్ కమ్ టైపిస్ట్, సీనియర్ టైమ్ కీపర్, కమర్షియల్ అప్రెంటిస్, అసిస్టెంట్ స్టేషన్ మాస్టర్ వంటి పోస్టులను డిగ్రీ అర్హతతో భర్తీచేస్తుంది.

**నోట్:** ప్రైవేటికి సంబంధించి ఏ నోటిఫికేషన్ సమాచారం కావాలన్నా 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో ప్రతిరోజూ వచ్చే విద్య ఉద్యోగ సమాచారం పేజీ చూడవచ్చు.

... సత్యం చాపల

## సుడోకు

డైలీ సుడోకు 51 సమాధానం

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 5 | 1 | 2 | 8 | 4 | 7 | 9 | 3 | 6 |
| 8 | 7 | 9 | 3 | 2 | 6 | 1 | 5 | 4 |
| 4 | 3 | 6 | 1 | 9 | 5 | 2 | 8 | 7 |
| 2 | 8 | 7 | 5 | 1 | 3 | 6 | 4 | 9 |
| 9 | 6 | 1 | 7 | 8 | 4 | 5 | 2 | 3 |
| 3 | 4 | 5 | 9 | 6 | 2 | 8 | 7 | 1 |
| 1 | 9 | 3 | 2 | 7 | 8 | 4 | 6 | 5 |
| 7 | 2 | 4 | 6 | 5 | 1 | 3 | 9 | 8 |
| 6 | 5 | 8 | 4 | 3 | 9 | 7 | 1 | 2 |

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

డైలీ సుడోకు -52

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | | 5 | | | | 1 | 4 | |
| 2 | | | 8 | 6 | | | | 3 |
| | 8 | | 5 | | | | | |
| | | | | | 3 | | 7 | |
| | 5 | | 6 | 2 | 1 | | 8 | |
| | 3 | | 9 | | | | | |
| | | | | | 9 | | 3 | |
| 4 | | | | 8 | 5 | | | 6 |
| | 1 | 7 | | | | 4 | | |

III.
నమస్తే తెలంగాణ
నిపుణ
కరీంనగర్
సోమవారం 3 జూన్ 2019

# ఆల్‌రౌండ్ డెవలప్‌మెంటే బీసీ గురుకులాల లక్ష్యం

**పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లలకు కార్పొరేట్ స్థాయి విద్య కల్ల ఒకనాడు. కానీ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత విద్యావ్యవస్థలో అనూహ్య మార్పులు వస్తున్నాయి. పటిష్ఠ వ్యూహంతో ఏటేటా పాఠశాలల సంఖ్య పెంచుకుంటూ, వసతి సౌకర్యాలు కల్పిస్తుంది ప్రభుత్వం. అంతేకాకుండా ఆధునిక బోధనా పద్ధతులలో విద్యను అందిస్తుంది. ఆల్ రౌండ్ డెవలప్‌మెంటే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్నాయి బీసీ గురుకులాలు. నూతన విద్యాసంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో గురుకుల పాఠశాలలపై ఎంజేపీటీఎస్ బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీ మల్లయ్య భట్టుతో 'నిపుణ' ప్రత్యేక ఇంటర్వ్యూ విశేషాలు...**



**నిపుణ:** బీసీ గురుకుల విద్యా సొసైటీ పరిధిలోని పాఠశాలలు, ఇంటర్, డిగ్రీ కాలేజీలు, వాటిలో చదువుకునే విద్యార్థుల గురించిన వివరాలు తెలపండి?

**సెక్రటరీ:** మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ (ఎంజేపీటీఎస్)ని 2012-13లో ప్రారంభించారు. రాష్ట్రం విడిపోయిన తర్వాత టీఎస్ ఎంజేపీటీబీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ సొసైటీ ఏర్పాటైంది. 2014 జూన్ 2 నాటికి రాష్ట్రంలో 19 గురుకుల పాఠశాలలు మాత్రమే ఉన్నాయి. అనంతరం 2016-17 విద్యాసంవత్సరంలో 4, 2017-18లో 119, 2019-20లో మరో 119 పాఠశాలలను ప్రభుత్వం ప్రారంభించింది. ప్రస్తుత విద్యాసంవత్సరం నుంచి 261 పాఠశాలలు అందుబాటులో ఉన్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో గురుకుల జూనియర్ కాలేజీలు, డిగ్రీ కాలేజీలు లేవు. 2016-17 విద్యాసంవత్సరం నుంచి రాష్ట్రంలో 19 బీసీ గురుకుల జూనియర్ కాలేజీలు, 1 డిగ్రీ కాలేజీని బీసీ గురుకులాల సొసైటీ ప్రారంభించింది.

- ఉమ్మడి రాష్ట్రంలో బీసీ గురుకుల సొసైటీ పరిధిలో 19 పాఠశాలలు ఉండగా ప్రస్తుత విద్యాసంవత్సరంలో మొత్తం 281 విద్యాసంస్థలు ఉన్నాయి.
- 2019-20 విద్యాసంవత్సరంలో 92,000 వేల మంది విద్యార్థులు బీసీ గురుకుల విద్యాసంస్థల్లో చదువుకోనున్నారు.

**నిపుణ:** కొత్తగా ఈ విద్యాసంవత్సరంలో ప్రారంభం కానున్న పాఠశాలలకు స్టాఫ్ కొరత ఉందా?

**సెక్రటరీ:** గతేడాది రెండువేల మంది రెగ్యులర్ ఉపాధ్యాయులను కొత్తగా నియమించుకున్నాం. ఈ ఏడాది ప్రారంభమైన పాఠశాలల కోసం 1698 పోస్టుల భర్తీకి ప్రభుత్వానికి నివేదికను పంపాం. వీటికి సంబంధించిన ఆమోదం లభించగానే రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా నియామకాలు చేపడుతాం. అవసరమైనచోట ఉపాధ్యాయులను గెస్ట్ టీచర్స్ విధానంలో తీసుకుంటున్నాం. ప్రతి పాఠశాలలో సరైనంత మంది ఉపాధ్యాయులు ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. విద్యా బోధనకు ఎటువంటి ఇబ్బందులు లేవు.

**నిపుణ:** ప్రతి ఏటా ప్రవేశాల ప్రక్రియ ముగిసిన తర్వాత మిగిలిన సీట్లను ఏం చేస్తారు? బీసీ గురుకులాలకు ఏ ప్రాంతాల నుంచి విద్యార్థులు ఎక్కువగా వస్తున్నారు?

**సెక్రటరీ:** తెలంగాణ ఏర్పాటైన దగ్గర నుంచి విద్యా ప్రమాణాల్లో పెను మార్పులు వచ్చాయి. దీంతో ఒక్క సీటుకు ఐదుగురు విద్యార్థులు పోటీ పడుతున్నారు. ఖాళీ అనే ప్రసక్తే ఏర్పడటంలేదు. అయితే ఇతర కారణాల వల్ల ఎక్కడైన విద్యార్థులు మానేస్తే ఆ సీట్లను తర్వాతి విద్యాసంవత్సరంలో అర్హులైన విద్యార్థులతో భర్తీ చేస్తున్నాం. రెండేండ్ల కింది వరకు గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఎక్కువగా చేరేవారు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల వల్ల నాణ్యమైన విద్య, వసతి సౌకర్యాలతో రెండేండ్ల నుంచి పట్టణ విద్యార్థులు కూడా బీసీ గురుకులాల్లో చేరుతున్నారు.

**నిపుణ:** కార్పొరేట్ కాలేజీల్లో పాఠశాల స్థాయి నుంచే ఐఐటీ, నీట్ వంటి జాతీయ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు, మరి గురుకులాల్లో దీనికోసం ఏదైనా చేస్తున్నారా?

**సెక్రటరీ:** ఈ ఏడాది నుంచి గురుకుల పాఠశాలల్లో ఎనిమిదో తరగతి నుంచి జాతీయస్థాయి పరీక్షలైన ఐఐటీ, నీట్‌తోపాటు సివిల్స్ ఫౌండేషన్ కోసం ప్రత్యేక తరగతులను ఏర్పాటు చేస్తున్నాం. గతేడాది 10 కేంద్రాల్లో ఈ శిక్షణ తరగతులను నిర్వహించాం. ఈ ఏడాది నుంచి 20 కేంద్రాల్లో (10 బాలురు, 10 బాలికలకు) కోచింగ్‌కు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం. ఇంటర్ విద్యార్థులకు ఐఐటీ, నీట్, సీఏ-సీపీటీ కోసం ప్రత్యేకంగా వేసవి శిబిరాలను నిర్వహిస్తున్నాం.

**నిపుణ:** ఈసారి మార్చిలో పదోతరగతి, ఇంటర్ ఫలితాలు ఎలా వచ్చాయి?

**సెక్రటరీ:** పదోతరగతిలో 98.78 శాతం, ఇంటర్‌లో 90.20 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులు అయ్యారు.

**నిపుణ:** ఐఐటీ, నీట్‌లలో ఎన్ని సీట్లు సాధించారు?

**సెక్రటరీ:** సూపర్-100 బ్యాచ్‌లో 47 మంది విద్యార్థులు జేఈఈ మెయిన్స్‌లో అర్హత సాధించారు. అందరూ జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష రాశారు. ఫలితాలు వెలువడాల్సి ఉంది.

**నిపుణ:** విద్యతోపాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలలో శిక్షణ ఇస్తున్నారా?

**సెక్రటరీ:** కేవలం విద్యనే కాకుండా విద్యార్థులకు క్రీడలు, లీడర్‌షిప్ స్కిల్స్, సాఫ్ట్‌స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లిష్, డ్యాన్స్, డ్రామా, ఫొటోగ్రఫీ, మ్యూజిక్, క్రాఫ్ట్స్ వంటి పలు అంశాల్లో శిక్షణ ఇస్తున్నాం. ఇంటర్ సొసైటీ స్పోర్ట్స్ మీట్‌లో బీసీ గురుకుల విద్యార్థులు ప్రతిభ చాటుతున్నారు. అంతేకాకుండా జాతీయస్థాయిలో 30 మంది, అంతర్జాతీయస్థాయిలో 10 మంది పతకాలను సాధించారు. సెయిలింగ్, యాచింగ్‌లలో బీసీ గురుకుల విద్యార్థులు పతకాలను సాధించారు.



**నిపుణ:** గురుకుల పాఠశాలల్లో విద్యా బోధన గురించి వివరిస్తారా?

**సెక్రటరీ:** ఐదో తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యను బీసీ గురుకుల విద్యా సొసైటీ పరిధిలోని విద్యాసంస్థలు అందిస్తున్నాయి. అన్ని పాఠశాలల్లో శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ఉన్నారు. అన్ని తరగతుల్లో డిజిటల్ క్లాస్‌రూమ్స్‌ను ఏర్పాటు చేశాం. ఈ లెర్నింగ్ క్లాసెస్ ద్వారా ప్రత్యేకమైన ప్రణాళికతో నాణ్యమైన విద్యను అందిస్తున్నాం.

**నిపుణ:** డిగ్రీ కాలేజీల వివరాలు చెప్తారా?

**సెక్రటరీ:** బీసీ గురుకుల సొసైటీ పరిధిలో ఒక మహిళా డిగ్రీ కళాశాల ఉంది. దీనిలో మొదటి బ్యాచ్ (2015-16)లో 141 మంది విద్యార్థినులు చదువుకున్నారు. 99.3 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. 24 మంది విద్యార్థినులు 100కు 100 మార్కులను ఆయా సబ్జెక్టుల్లో సాధించారు. ఈ కాలేజీల్లో బీఏ, బీకాం, బీకాం కంప్యూటర్స్, బీఎస్సీ (ఎంపీసీ,బీజెడ్‌సీ, ఎంఎస్‌సీఎస్) కోర్సులను అందిస్తున్నాం. రెండో బ్యాచ్‌లో 175 మంది డిగ్రీ చదువుతున్నారు.

**నిపుణ:** కొత్త కోర్సులు ఏవైనా ప్రారంభిస్తున్నారా?

**సెక్రటరీ:** ఈ ఏడాది నుంచి డిగ్రీలో మూడు కొత్త కోర్సులను ప్రారంభిస్తున్నాం. అవి బీఏ ఇంగ్లిష్ లిటరేచర్, బీఎస్సీ ఎంపీసీఎస్, బీఎస్సీ (బీబీసీ- బయోటెక్నాలజీ, బయోకెమిస్ట్రీ, కెమిస్ట్రీ). ఈ కోర్సులను ప్రవేశపెట్టడంతో విద్యార్థినుల సంఖ్య 360కి చేరుకోనున్నది.

**నిపుణ:** డిగ్రీ విద్యార్థులకు ఏదైనా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారా?

**సెక్రటరీ:** డిగ్రీ పూర్తికాగానే సివిల్స్ రాయడానికి అవసరమైన శిక్షణ,జాబ్ స్కిల్స్‌ను నేర్పిస్తున్నాం.

**నిపుణ:** విద్యార్థులకు కల్పించే సౌకర్యాలు వివరిస్తారా?

**సెక్రటరీ:** గురుకుల పాఠశాలలో ఉచితంగా విద్యను అందించడమే కాకుండా వారికి కావాల్సిన సకల సౌకర్యాలను ప్రభుత్వం తరపున బీసీ గురుకుల సొసైటీ అందిస్తుంది. వసతి, భోజనం, దుస్తులు, పుస్తకాలు, నోట్‌బుక్స్ దగ్గర నుంచి ప్రతి ఒక్కటి అందిస్తున్నాం. నిపుణులైన వైద్యుల ద్వారా వైద్య సౌకర్యాలను కల్పించాం. ఇక్కడ విద్యార్థులు సొంత ఇంట్లో ఉన్నట్లే ఉండేందుకు కావాల్సిన వాతావరణాన్ని అందిస్తున్నాం. ఉపాధ్యాయులు, స్టాఫ్ అందరూ నిరంతం దీనికోసం శ్రమిస్తున్నారు.

**నిపుణ:** ప్రత్యేకంగా బీసీ విద్యార్థులకు మీరిచ్చే సందేశం?

**సెక్రటరీ:** విద్యార్థులు పట్టుదల ఉంటే చాలు బీసీ గురుకులాల్లో సకల సౌకర్యాలతో అన్ని రకాలుగా చేయూతనిస్తాం. పేదరికం ఉందని బాధపడవద్దు. ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఈ గురుకులాలు కార్పొరేట్‌స్థాయిలో విద్య, సౌకర్యాలు కల్పిస్తున్నాయి. అందరూ వీటిని ఉపయోగించుకుని ప్రగతి పథంలో నడవాలని ఆకాంక్షిస్తున్నాం.

... కేశవపంతుల వేంకటేశ్వరశర్మ



# ఇది విద్యార్థుల దోస్త్

## - దోస్త్ కన్వీనర్ ప్రొఫెసర్ లింబాద్రి

**'దోస్త్' రాష్ట్రంలోని డిగ్రీ కళాశాలల్లో ప్రవేశానికి డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (DOST) దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది. మే 23 నుంచి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభం కాగా.. మూడు విడతల్లో కళాశాలల్లో ప్రవేశాలు జరుగనున్నాయి. మే 23తో ప్రారంభమైన ప్రవేశ ప్రక్రియ జూన్ 29తో ముగియనుంది. జూలై 1 నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి. దోస్త్‌ను ప్రతిఏటా పలు మార్పులు చేసుకుంటూ విద్యార్థులకు సౌకర్యంగా ఉండేలా తీర్చిదిద్దుతున్నారు. దోస్త్ ప్రవేశాలకు సంబంధించి దోస్త్ కన్వీనర్ ప్రొఫెసర్ లింబాద్రి మరిన్ని విషయాలు 'నిపుణ'తో పంచుకున్నారు.**

- ఈ సంవత్సరం దోస్త్ ద్వారా ఎన్ని కాలేజీల్లో సీట్లు నింపబోతున్నారు? ఎన్ని సీట్లు అందుబాటులో ఉన్నాయి.
- ఈ సారి రాష్ట్రవ్యాప్తంగా 1049 కాలేజీలు ఉండగా వాటిలో వెయ్యి కళాశాలల్లో దోస్త్ ద్వారా సీట్లు నింపబోతున్నాం. బీ.ఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీసీఏ, బీఎస్‌డబ్ల్యూ తోపాటు ఈ ఏడాది నూతనంగా ప్రవేశపెట్టిన బీ.వొకేషనల్ గ్రూప్‌లలో సుమారు 4లక్షల వరకు సీట్లు అందుబాటులో ఉండనున్నాయి. మీ సేవ, ఈసేవ, ఆధార్ ఫోన్ లింక్ అయిన మొబైల్, హెల్ప్‌లైన్ కేంద్రాల్లో http://dost.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అటు దోస్త్ ద్వారా కామన్ ఎకనామిక్ క్యాలెండర్ అంటే అన్ని యూనివర్సిటీల పరిధిలోని విద్యార్థులందరికీ ఒకే విధానం ఉంటుంది.
- **కొన్ని గ్రూపుల్లో సీట్లు పూర్తి స్థాయిలో నిండడం లేదు. వాటిని భర్తీ చేసేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?**
- దీని కోసం ప్రత్యేక చర్యలు తీసుకున్నాం. విద్యార్థులు తక్కువగా చేరుతున్న కోర్సులను బలోపేతం చేయడానికి సిలబస్‌ను బాగా సింప్లిఫైజ్ చేసి మార్పులు తీసుకువస్తున్నాం. క్వాలిటీ ఎడ్యుకేషన్ ఇవ్వడానికి ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా తీర్చిదిద్దుతున్నాం. దీంతో పాటు విద్యార్థులకు జాబ్ మార్కెట్‌ను ఇవ్వడం కోసం, ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం కరికులమ్‌ను మార్పు చేస్తున్నాం. రకరకాల కాంబినేషన్స్‌తో కోర్సులు ప్రవేశపెడుతున్నాం.
- **ఈ ఏడాది తామే సొంతంగా అడ్మిషన్లు నిర్వహించుకుంటామని కొన్ని ప్రైవేటు కళాశాలలు అడుగుతున్నట్లు తెలుస్తోంది. దీనిపై ఏమైనా నిర్ణయం తీసుకున్నారా?**
- వాస్తవమే. కొన్ని కళాశాలలు ప్రయత్నం చేస్తున్నాయి. తామే అడ్మిషన్లు నిర్వహించుకుంటామని రాష్ట్రంలోని 20 నుంచి 25 కళాశాలలు నిర్ణయం తీసుకున్నాయి. దీనిపై కోర్టును కూడా ఆశ్రయించాయి. కోర్టు కూడా ఆ కళాశాలలకు కొన్ని సూచనలు చేసింది. దీనిపై తుదినిర్ణయం తీసుకోవాల్సి ఉంది. తాము కూడా ఆ కళాశాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం. ఎవరైతే దోస్త్‌లో అడ్మిషన్లు తీసుకుంటారో వారికి మాత్రమే ఫీజురీయింబర్స్‌మెంట్ ఉంటుందని ఇప్పటికే ప్రభుత్వం తెలియజేసింది. అటు ప్రైవేట్‌పరంగా అడ్మిషన్లు తీసుకుంటున్న కళాశాలలు కూడా నిబంధనల ప్రకారమే అడ్మిషన్ ప్రక్రియ చేయాలి. అయితే నిబంధనలు పాటించడంలేదని తెలుస్తోంది. కోర్టు తుది తీర్పు తర్వాత తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది.
- **ఆన్‌లైన్ అడ్మిషన్లవల్ల కాలేజీల గురించి పూర్తి సమాచారం అంటే.. కాలేజీల్లో వసతులు, అకడమిక్ క్వాలిటీ వంటి అంశాలను తెలుసుకోలేకపోతున్నామని విద్యార్థులు అంటున్నారు. దీనికి సంబంధించి కాలేజీల పూర్తి సమాచారం విద్యార్థులకు అందుబాటులో ఉండేలా ఏమైనా చర్యలు తీసుకుంటున్నారా?**
- అలాంటిదేమి లేదు. కాలేజీల పూర్తి సమాచారం, అడ్రస్ దోస్త్ వెబ్‌సైట్‌లో పొందుపరిచాం. కొత్తగా మరో ఫెసిలిటీని కూడా తీసుకువచ్చాం. కాలేజీ లొకేషన్ కోసం కూడా ప్రత్యేకంగా ఒక యాప్ తీసుకువచ్చాం. జాగ్రఫికల్‌గా కళాశాల ఎక్కడ ఉందో మొత్తం ఆ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. దీంతో పాటు ఆయా జిల్లా కేంద్రాల్లో, అన్ని యూనివర్సిటీల పరిధిలో అవగాహన సదస్సులు నిర్వహించాం. అన్ని కాలేజీలకు సంబంధించిన అప్లికేషన్లు ఆర్డర్స్ అన్నింటిని కూడా తాము పరిశీలించాం.
- **ఈ మధ్య సంప్రదాయ కోర్సులపై విద్యార్థులు పెద్దగా ఆసక్తి చూపడంలేదు. ఈ సమస్యను అధిగమించేందుకు నూతన కాంబినేషన్లతో ఏమైనా చర్యలు తీసుకుంటున్నారా?**
- అవును. కొత్త కాంబినేషన్లతో కోర్సులు తీసుకువచ్చాం. గతంలో కోర్సులలో ఫిక్స్‌డ్ కాంబినేషన్ ఉండేది. అంటే బీఏ అనగానే ఈపీపీ, ఈహెచ్‌పీ ఉండేది. కానీ ఇప్పుడు కొన్ని కొత్తవి తీసుకువచ్చాం. బీఎస్సీలో ఎకనామిక్స్ కూడా చదవొచ్చు. మ్యాథ్స్, ఎకనామిక్స్, స్టాటిస్టిక్స్‌తో కొత్తగా కాంబినేషన్స్ తీసుకు వచ్చాం.
- **దోస్త్‌ను తీసుకురావడానికి ప్రధాన కారణం? దీని వలన విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందా?**
- దోస్త్ ద్వారా విద్యార్థులకు నూటికి నూరు శాతం మేలు జరుగుతుంది. దేశవ్యాప్తంగా తెలంగాణలోనే మొదటగా దీన్ని అమల్లోకి తీసుకువచ్చాం. దేశంలో మొట్టమొదటి సారి ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు కళాశాలలన్నింటికి దోస్త్ ద్వారా అడ్మిషన్లు తీసుకోవడం గొప్ప నిర్ణయం. డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ పద్ధతిలో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించడంవల్ల ఒకే దగ్గర ఉండి.. డిగ్రీ ప్రవేశ ప్రక్రియకు సంబంధించి ఆన్‌లైన్ ద్వారా చేసిన ఒకే ఒక్క దరఖాస్తుకు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీలకు దరఖాస్తు చేసుకున్నట్లు ఉంటుంది. శారీరక పరమైన శ్రమ తగ్గుతుంది. కచ్చితంగా ప్రతిభ ఆధారంగా, సోషల్ కేటగిరీ రిజర్వేషన్ ప్రకారం అడ్మిషన్ల ప్రక్రియ జరుగుతుంది. కోరిన కాలేజీలో ఫస్ట్ సీటు రాకుంటే స్లైడింగ్ విధానంలో కోరుకున్న కాలేజీలోనే సీటు వచ్చే అవకాశముంటుంది. ఆన్‌లైన్ ద్వారా ప్రవేశ ప్రక్రియ ఉండటంతో పలు కాలేజీలకు వెళ్లి దరఖాస్తు చేసుకునే విధానానికి స్వస్తి పలకడంతో పాటు.. స్టూడెంట్స్‌కు ఆర్థిక భారం తగ్గుతుంది. ఎలాంటి ఒత్తిడి గాని, ప్రలోభాలకు ఏ కాలేజీ మేనేజ్‌మెంట్ చేయడానికి వీలుండదు.
- **దోస్త్ ప్రవేశాలకు సంబంధించి విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా ఎలాంటి చర్యలు తీసుకున్నారు? సాంకేతిక సమస్యలు కానివ్వండి మరే ఇతర కారణాలైనా కావచ్చు.**
- విద్యార్థులకు చిన్న ఇబ్బంది కూడా తలెత్తకుండా పటిష్టచర్యలు తీసుకున్నాం. అసలు సాఫ్ట్‌వేర్‌నే స్టూడెంట్ ఫ్రెండ్లీ సాఫ్ట్‌వేర్‌ను తీసుకువచ్చాం. ఎందుకుంటే ఇది దోస్త్ కాబట్టి. దోస్తులాగానే వ్యవహరించాలనే ఉద్దేశంతో రాష్ట్రవ్యాప్తంగా 92 హెల్ప్‌లైన్ సెంటర్స్ నెలకొల్పాం. ఇందులో 75 హెల్ప్‌లైన్ కేంద్రాలను ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో ఏర్పాటు చేయగా.. మరో 7 కేంద్రాలను యూనివర్సిటీల్లో ఏర్పాటు చేశాం. వీటితో పాటు దోస్త్ కార్యాలయం, విద్యాశాఖ కమిషనర్ కార్యాలయంలోనూ కోఆర్డినేటర్‌ను నియమించాం. పాత 10 జిల్లాల్లో స్పెషల్ హెల్ప్‌లైన్ సెంటర్లను కూడా ఏర్పాటు చేశాం. టెక్నికల్, నాన్ టెక్నికల్, మార్క్స్, ఆధార్ నంబర్, మొబైల్ నెంబర్ ఇలా అన్ని సమస్యల పరిష్కారానికి హెల్ప్‌లైన్ సెంటర్స్ ఉపయోగపడతాయి. ఇంకా విద్యార్థులు కాలేజీకి వెళ్లకుండానే ఆన్‌లైన్‌లోనే కన్ఫర్మేషన్ చేస్తారు. ఎండలో తిరిగి కాలేజీకి వెళ్లి రిపోర్టు చేయాల్సిన అవసరం ఉండదు. అంతా ఆన్‌లైన్‌లోనే రిపోర్టు చేసుకోవచ్చు. సీటు కన్ఫర్మేషన్ ఇంట్లో ఉండి ఓకే చేసుకోవచ్చు. చివరగా అలాట్ అయినట్లు ఫైనల్ లిస్ట్ మెసేజ్ వెళ్లినప్పుడు ఆ రోజు వెళ్లి సర్టిఫికెట్స్ ఇచ్చి జాయిన్ అవ్వొచ్చు. జూలై 1న ఫైనల్ జాయినింగ్ ఉంటుంది. ముఖ్యంగా ప్రత్యేక హెల్ప్‌లైన్ కేంద్రాల్లో అడ్మిషన్లకు సంబంధించి వినతుల స్వీకరణతో పాటు అప్పటికప్పుడు పరిష్కరించే అవకాశం కూడా ఉంటుంది. ఇంకా బయోమెట్రిక్ అథెంటికేషన్ సమస్య ఉంటే ఇక్కడ ఐరీస్ పద్ధతిలో రిజిస్ట్రేషన్ చేసుకునే వెసులుబాటు కల్పించాం.
- **ప్రైవేటు కళాశాలలు విద్యార్థులను తమ కాలేజీలోనే చేరాలని ఒత్తిడి తీసుకురావడంతో పాటు ప్రలోభాలకు కూడా తెరలేపుతున్నట్లు గతేడాది పెద్దసంఖ్యలో ఫిర్యాదులు వచ్చాయి. ఇది వాస్తవమేనా? దీనిని అరికట్టడానికి ఏమైనా చర్యలు తీసుకుంటున్నారా?**
- అలాంటివాటిని అస్సలు ఉపేక్షించం. కఠిన చర్యలు తీసుకుంటాం. ఇందుకు సంబంధించి ఫిర్యాదు వస్తే వెంటనే ఆ కళాశాలను దోస్త్ నుంచి తొలగిస్తాం. అవసరమైతే గుర్తింపును కూడా రద్దు చేస్తాం. ఏ కళాశాలైనా అలాంటి పద్ధతులు పాటిస్తే విద్యార్థులను మభ్యపెట్టో, ప్రలోభపెట్టో మిస్‌గైడ్ చేస్తే..మళ్లీ విద్యార్థులకు అవకాశం కల్పిస్తున్నాం. వేరే కాలేజీలో చేరేవిధంగా వెబ్ ఆప్షన్స్ ఇస్తున్నాం. ఎట్టి పరిస్థితుల్లో ఇలాంటి వాటిని ఉపేక్షించం.

- **విద్యార్థులు డిగ్రీ చదువుతున్నప్పుడే సంబంధిత సెక్టార్‌లోని సంస్థల అప్రెంటిస్ లాగా పనిచేసే విధానం అభివృద్ధి చెందిన దేశాల్లో ఉంది. అలాంటి విధానాన్ని మన రాష్ట్రంలో అమలుచేసే యోచన ఉందా?**
- అవును. ఈ ఏడాది మనం తీసుకున్న స్కిల్ ఎన్‌హాన్స్‌మెంట్, ఎబిలిటీ ఎన్‌హాన్స్‌మెంట్ మార్పులతో పాటు రెండు కొత్త పద్ధతులు ప్రవేశపెట్టాం. ఒకటి ప్రాజెక్ట్ ప్రిపరేషన్. స్టూడెంట్ ఏదైనా ఒక టాపిక్ మీద ప్రాజెక్ట్ తయారుచేస్తాడు. దీనిద్వారా ఒక అవగాహన, నాలెడ్జ్ పెరిగే అవకాశం ఉంటుంది. రెండోది ఇంటర్న్‌షిప్ పద్ధతి.. ఉదాహరణకు జర్నలిజం కోర్స్ చేస్తున్నాడని అనుకుందాం. మీడి యా దగ్గరికి పంపించడం అక్కడ జరిగే పద్ధతుల గురించి తెలుసుకోవడం. కోర్స్ పూర్తయిన తర్వా త దాన్ని పూర్తిగా తెలుసుకునే అవకాశం ఉంటుం ది. అలాంటి ఇంటర్న్‌షిప్స్, ప్రాజెక్టు పద్ధతి అనేది ఈ ఏడాది ప్రవేశపెట్టాం. ఇవి కాకుండా నాన్‌క్రియేట్ కోర్సు కూడా తీసుకువచ్చాం. సమ్మర్ క్యాంపెయిన్స్, సమ్మర్ ఇంటెర్న్‌షిప్స్ కరికులమ్‌కు సంబంధం లేకుండా ఎవరైనా స్టూడెంట్ మమల్ని అప్రోచ్ అయి.. ఫలానా కంపెనీలో చేస్తం అంటే మేము అక్కడికి పంపిస్తాం.



- **చాలా మంది విద్యార్థులు తాము నివాసం ఉంటున్న దగ్గర్లోని కాలేజీల్లో చేరాలని కోరుకుంటారు. కాని దోస్త్ ద్వారా అడ్మిషన్లు కోరుకున్న చోట రావడంలేదని కొందరు విద్యార్థులు అంటున్నారు. దీనికి ఏమైనా పరిష్కారం చూస్తున్నారా?**
- అస్సలు కాదు. దోస్త్ ద్వారా ఈ ఇబ్బందులు ఎదురుకానేకావు. ఎందుకంటే విద్యార్థి కోరుకున్న కళాశాలలోనే సీటు ఇస్తున్నాం. తాము ఏ జిల్లాలో ఉంటే, ఆయా జిల్లాల పరిధి కావచ్చు, పట్టణమైతే పట్టణంలోని కాలేజీలోనే సీటు అలాట్ చేస్తున్నాం. ఎలాంటి సమస్యారాదు. వాస్తవానికి గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పుడున్న ట్రెండ్ ప్రకారం చాలామంది విద్యార్థులు పట్టణ ప్రాంతానికి మైగ్రేట్ అవుతున్నారు. పట్టణంలోనే విద్యనభ్యసించడానికి ఇష్టపడుతున్నారు. విద్యార్థులు ఎక్కడ సీటు కావాలంటే అక్కడే వంద శాతం సీటు అలాట్ చేస్తున్నాం. తమ ప్రాంతంలో సీటు ఇవ్వడం లేదన్నదే సరికాదు. డిగ్రీ చేయాలనుకునే ప్రతి విద్యార్థికి సీటు ఇచ్చే అవకాశం ఉంది. ఎందుకంటే రాష్ట్రంలోని అన్ని డిగ్రీ కళాశాలల్లో సీట్ల సంఖ్య ఇంటర్ పాసైన విద్యార్థుల సంఖ్య కంటే ఎక్కువ గా ఉంది. కాబట్టి డిగ్రీ చేయాలనుకునే ప్రతి విద్యార్థి తమ మెరిట్ ప్రకారం ఎక్కడైతే సీటు కావాలో అక్కడ తాము కోరుకున్న చోటే దోస్త్ ద్వారా సీటు పొందుతున్నారు.

- **ప్రస్తుతం ఎంసెట్ కౌన్సెలింగ్ మొదలు కాకముందే దోస్త్ అడ్మిషన్లు ముగుస్తున్నాయి. మరి ఎంసెట్‌లో సీటురాని విద్యార్థులు డిగ్రీలో చేరాలనుకుంటే ఎలా? వారికి అవకాశం ఉంటుందా?**
- తప్పకుండా ఉంటుంది. 'నిపుణ' ద్వారా కూడా మరోసారి విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు తెలియజేస్తున్నాం. ఎంసెట్ ప్రక్రియ పూర్తయ్యేవరకు దోస్త్ అడ్మిషన్స్ జరుగుతాయి. అసలు ఎంసెట్ అనే కాదు.. ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు వచ్చిన తరువాత కూడా అందరికి స్పెషల్ డ్రైవ్ చేసి అడ్మిషన్స్ ఇచ్చే ప్రయత్నం చేస్తాం. ఈ విషయంలో విద్యార్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. దోస్త్‌లో, ఎంసెట్‌లో సిస్టమ్ రిలేషన్స్ ఉంటాయి కాబట్టి.. ఎంసెట్‌లో సీటు వస్తే దోస్త్‌లో క్యాన్సిల్ అవుతుంది. దోస్త్‌లో సీటు వస్తే ఎంసెట్‌లో క్యాన్సిల్ అవుతుంది. కాబట్టి విద్యార్థులు భయపడాల్సిన అవసరం లేదు. మనం సిస్టమ్‌లోనే దేనిలో సీటు కావాలో కన్ఫమ్ చేసుకోవచ్చు. ఇంటర్ పాసైన ప్రతి విద్యార్థికి తెలంగాణలో చదువుకునే అవకాశం కల్పించాలనేది ప్రభుత్వ ప్రయత్నం.

- **ఇక ఈ ఏడాది నుంచి డిగ్రీలో చేరేందుకు పాలిటెక్నిక్ విద్యార్థులకు కూడా అవకాశం కల్పించారు. వారు ఏయే కోర్సుల్లో చేరడానికి అర్హులు?**
- అవును. కొత్తకోర్సులు తీసుకువచ్చాం. పాలిటెక్నిక్ విద్యార్థులకు రెండురకాల అవకాశాలు ఉన్నాయి. వారు కమర్షియల్‌కు సంబంధించిన బీకాం రిలేటెడ్ కోర్సు చేస్తే వారు డైరెక్టుగా బీకాం కోర్సు చేసే అవకాశం ఉంటుంది. లేదా నార్మల్ కోర్సులు చేసిన విద్యార్థులకు బీఏలో చేరే అవకాశం ఉంటుంది. సైన్స్‌లో చేరే అవకాశం చాలా తక్కువగా ఉంటుంది. కాని ఒక్క కాంబినేషన్‌కే అవకాశం ఉంటుంది. ఎలక్ట్రానిక్స్ చేసినవారికి అవకాశం కల్పిస్తాం. ఎక్కువ అవకాశాలు మాత్రం బీఏలోనే కల్పిస్తున్నాం. ఏ కోర్సుకు ఏది మ్యాచ్ అవుతుందో గైడ్‌లైన్స్ కూడా ఇచ్చాం.

... సూదగాని సత్యం

నమస్తే తెలంగాణ
# చిత్రం
[ కరీంనగర్ ]
సోమవారం 3 జూన్ 2019


సమంత

# ఓ బేబీ హంగామా!

సమంత ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'ఓ బేబీ'. నందినిరెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. సురేష్ ప్రొడక్షన్స్, గురు ఫిలింస్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, క్రాస్ పిక్చర్ పతాకంపై డి.సురేష్ బాబు, సునీత తాటి, టి.జి. విశ్వప్రసాద్, హ్యూన్ ఓ థామస్ కిమ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. చిత్రీకరణ పూర్తయింది. నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. నందినిరెడ్డి మాట్లాడుతూ 'ఇటీవల విడుదల చేసిన టీజర్, ఫస్ట్‌లుక్‌లకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించింది. ఓ యువతికి ఎదురైన చిత్రమైన సంఘటనల సమాహారమే ఈ చిత్రం. జీవితాన్ని ఎలా గడపాలని ఆలోచింపజేసే చిత్రమిది. బంధాలు, బంధుత్వాలు ఓ యువతి జీవితాన్ని ఎలాంటి మలుపు తిప్పాయి? ఆ తరువాత ఆమె జీవితంలో ఎలాంటి సంఘటనలు చోటు చేసుకున్నాయి? అన్నదే ఈ చిత్ర ప్రధాన ఇతివృత్తం. బేబీ చేసే హంగామా చూడాలంటే సినిమా చూడాల్సిందే. సమంత పాత్ర చిత్రణ గత చిత్రాలకు పూర్తి భిన్నంగా ఎంటర్‌టైన్‌మెంట్‌తో పాటు సున్నితమైన భావోద్వేగాల సమాహారంగా సాగుతుంది. తెలుగు ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచే చిత్రమిది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి చిత్రాన్ని జూలై 5న ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని సన్నాహాలు చేస్తున్నాం' అన్నారు. లక్ష్మి, నాగశౌర్య, రాజేంద్రప్రసాద్, తేజ సజ్జ, ప్రగతి తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: మిక్కి జె.మేయర్, మాటలు: లక్ష్మీ భూపాల్, కెమెరా: రిచర్డ్ ప్రసాద్, ఎడిటింగ్: జునైద్ సిద్ధిఖి, సహనిర్మాతలు : వివేక్ కూచీభొట్ల, యువరాజ్ కార్తికేయన్, వంశీ బంగారు, ఎగ్జిక్యూటివ్ నిర్మాతలు: విజయ్ డొంకాడ, దివ్యా విజయ్.


శృతిహాసన్

# తెలుగులో రీఎంట్రీ

దాదాపు రెండేళ్లుగా తెలుగు చిత్రసీమకు దూరంగా ఉంటున్నది తమిళ సోయగం శృతిహాసన్. 'కాటమరాయుడు' తర్వాత ఆమె మరే తెలుగు చిత్రంలోనూ నటించ లేదు. లండన్‌కు చెందిన థియేటర్ ఆర్టిస్టు మైఖేల్ కోర్సేల్‌తో ప్రేమాయణం కారణంగా ఈ సొగసరి సినిమాలకు విరామాన్ని ప్రకటించింది. ఇటీవలే ఈ జంట విడిపోయారు. అనుకోని మన స్పర్థల వల్ల తాను శృతిహాసన్ ప్రేమకు వీడ్కోలు చెప్పానని సోషల్ మీడియా ద్వారా ప్రకటించాడు మైఖేల్ కోర్సేల్. విఫల ప్రేమ బంధం నుంచి తేరుకుంటున్న శృతిహాసన్ ఇక సినిమాలపై దృష్టిపెట్టాలని నిర్ణయించుకుందట. రవితేజ సరసన ఈ అమ్మడు ఓ చిత్రంలో నటించబోతున్నదని వార్తలు వినిపిస్తున్నాయి. వివరాల్లోకి వెళితే..గతంలో రవితేజతో 'డాన్‌శీను' 'బలుపు' చిత్రాల్ని రూపొందించారు దర్శకుడు గోపీచంద్ మలినేని. వీరిద్దరి కలయిలో మరో చిత్రం తెరకెక్కనుంది. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన పూర్వ నిర్మాణ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ సినిమాలో శృతిహాసన్‌ను కథానాయికగా ఖరారు చేశారని తెలిసింది. సెప్టెంబర్‌లో ఈ సినిమా సెట్స్‌మీదకు వెళ్లనుంది.

# కిల్లర్ ప్రేమాయణం


విజయ్ ఆంటోనీ

'ప్రేమ కోసం హంతకుడిగా మారిన ఓ యువకుడి కథ ఇది. ఆ సీరియల్ కిల్లర్ జాడను ఓ నిజాయితీపరుడైన పోలీస్ అధికారి ఎలా కనిపెట్టాడు? ఈ కిల్లర్ కథేమిటి? అన్నది తెలియాలంటే మా సినిమా చూడాల్సిందే అంటున్నారు విజయ్ ఆంటోనీ. ఆయన హీరోగా నటిస్తున్న తమిళ చిత్రం 'కొలైగారన్'. ఈ సినిమాను 'కిల్లర్' పేరుతో పారిజాత మూవీ క్రియేషన్స్ సంస్థ తెలుగులో అనువదిస్తున్నది. టి.నరేష్‌కుమార్, టి.శ్రీధర్ నిర్మాతలు. ఆండ్రూ లూయిస్ దర్శకుడు. అర్జున్ కీలక పాత్రధారి. ఆషిమా నర్వాల్ కథానాయిక. ఈ నెల 7న ఈ చిత్రం విడుదలకానుంది. నిర్మాతలు మాట్లాడుతూ 'మర్డర్ మిస్టరీ కథాంశంతో తెరకెక్కుతున్న యాక్షన్ థ్రిల్లర్ చిత్రమిది. ప్రారంభం నుంచి ముగింపు వరకు ప్రతి సన్నివేశం థ్రిల్‌ను పంచుతుంది. అర్జున్, విజయ్ ఆంటోనీ పాత్రలు వినూత్న పంథాలో సాగుతాయి. సెన్సార్ పూర్తయింది. 'యు.ఏ' సర్టిఫికెట్ లభించింది. ఇటీవల విడుదలైన ట్రైలర్, పాటలకు మంచి స్పందన లభిస్తున్నది' అని తెలిపారు. నాజర్, సీత, భగవతి పెరుమాల్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: సైమన్.కె.కింగ్.


నవీన్, శృతిశర్మ

# ఆత్రేయ గూఢచార్యం

నవీన్ పొలిశెట్టి, శృతిశర్మ జంటగా నటిస్తున్న చిత్రం 'ఏజెంట్ సాయిశ్రీనివాస ఆత్రేయ'. స్వధర్మ్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై రాహుల్ యాదవ్ నక్కా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. స్వరూప్ ఆర్.ఎస్.జె దర్శకత్వం వహిస్తున్నారు. సెన్సార్ పూర్తయింది. 'యు.ఏ' సర్టిఫికెట్ లభించింది. ఈ నెల 21న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది. నిర్మాత మాట్లాడుతూ 'సాయి శ్రీనివాస ఆత్రేయ అనే డిటెక్టివ్ కథ ఇది. అతడి పరిశోధన ఎందుకోసం? చిన్న కేసులను చేపట్టే అతడు ఓ పెద్ద లక్ష్యాన్ని ఎలా పూర్తిచేశాడన్నది ఉత్కంఠభరితంగా ఉంటుంది. స్క్రీన్‌ప్లే ప్రధానంగా సాగే కాన్సెప్ట్ ఓరియెంటెడ్ సినిమా ఇది. టేకింగ్ భిన్నంగా ఉంటుంది. ఆద్యంతం నవ్విస్తూనే థ్రిల్‌కు గురిచేస్తుంది. ఫస్ట్ లుక్, టీజర్‌కు చక్కటి స్పందన లభిస్తున్నది. కొత్తదనాన్ని కోరుకునే ప్రతి ఒక్కరిని ఈ సినిమా మెప్పిస్తుంది' అని తెలిపారు.

**''వేర్ ఈజ్ ద వెంకటలక్ష్మి' చిత్రంలో నటించాల్సింది కాదు. నాకు ముందు చెప్పిన కథ ఒకటి. ఆ తరువాత క్రమ క్రమంగా తీసింది మరొకటి. రొమాంటిక్ సన్నివేశం అని చెప్పి నాతో లిప్‌లాక్ చేయించారు. ఈ సినిమా అనుభవంతో ఎలాంటి చిత్రాలు చేయాలి? ఎలాంటివి చేయకూడదన్న స్పష్టమైన అవగాహన ఏర్పడింది' అన్నారు పూజితా పొన్నాడ. ఆమె నటిస్తున్న తాజా చిత్రం 'సెవెన్'. హవీష్ కథానాయకుడు. నిజార్ షఫీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం ఈ నెల 5న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో పూజితా పొన్నాడ పాత్రికేయులతో ముచ్చటించారు.**

# లిప్‌లాక్ చేయని ఏకైక హీరోయిన్ నేనే!


పూజిత పొన్నాడ

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఓ సంస్థలో పనిచేస్తున్న నాకు ఎలాంటి సినిమా నేపథ్యం లేదు. స్నేహితుల ప్రోత్సాహంతో పలు లఘు చిత్రాల్లో నటించాను. ఈ విషయం తెలిసి మా కుటుంబ సభ్యులు తొలుత షాక్‌కు గురయ్యారు. ఆ తరువాత షార్ట్ ఫిల్మ్స్‌లో నా నటన చూసి ప్రోత్సహించడం మొదలుపెట్టారు. నేను నటించిన ఓ షార్ట్ ఫిల్మ్ చూసిన దర్శకుడు సుకుమార్ తను నిర్మిస్తున్న 'దర్శకుడు' చిత్రంలో నటించే అవకాశం ఇచ్చారు. ఆ సినిమాతో నా సినీ ప్రయాణం మొదలైంది. ఆ తరువాత సుకుమార్ దర్శకత్వం వహించిన 'రంగస్థలం'లో ప్రకాష్‌రాజ్ కూతురిగా, హీరో ఆది పినిశెట్టికి జోడీగా నటించాను.

**'సెవెన్' ఒక రొమాంటిక్ థ్రిల్లర్..**

ఇదొక రొమాంటిక్ క్రైమ్ థ్రిల్లర్. సినిమాలో నా పాత్ర చాలా సస్పెన్స్. దాన్ని ఇప్పుడే రివీల్ చేయలేను. ఇప్పటి వరకు వచ్చిన థ్రిల్లర్ చిత్రాలకు భిన్నంగా సాగుతుంది. సమాధానం దొరకని కొన్ని ప్రశ్నలకు నాకు సంబంధించిన కథలో కొన్ని సమాధానాలుంటాయి. అవేంటనేది తెరపైన చూడాల్సిందే. సినిమాలో నా పాత్ర బోల్డ్‌గా వుండదు కానీ కొత్తగా మాత్రం వుంటుంది. సినిమాలో నాది ఓ ప్రేమ కథ. ఇందులో ఎక్కువ మంది హీరోయిన్‌లు వున్నా ఎవరి కథ వారిదే. ఒకరి కథతో మరొకరికి సంబంధం వుండదు. అయితే నాకు రెజీనాతో కొన్ని సన్నివేశాలుంటాయి. క్రైమ్ థ్రిల్లర్ చిత్రాలు సాధారణంగా వుంటాయి. కానీ ఇది రొమాంటిక్ క్రైమ్ థ్రిల్లర్. స్క్రీన్‌ప్లే ప్రధానంగా సాగుతుంది. కథ కొత్తగా అనిపించింది. అందుకే అంగీకరించాను. ఈ సినిమాలో లిప్‌లాక్ లేని ఏకైక హీరోయిన్ నేనే.

**హీరోయిన్ కావాలని అనుకోలేదు..**

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూనే సరదాగా లఘు చిత్రాల్లో నటించాను. 'దర్శకుడు' తరువాత చేసిన 'రంగస్థలం' సినిమాతో హీరోయిన్ని కావాలి అని బలంగా అనుకున్నాను. సోలో హీరోయిన్‌గా మంచి చిత్రాల్లో నటించాలని నిర్ణయించుకున్నాను. ప్రతి జోనర్‌లోనూ ఓ సినిమా ప్రయత్నించాలి. నటిగా నా ప్రతిభను నిరూపించుకోవాలనుకున్నాను. నటన నేర్చుకుని సినిమాల్లోకి రాలేదు. ఎంత శ్రమించినా అదృష్టం కలిసిరావాలి.

**తదుపరి చిత్రాలు..**

రాజశేఖర్ హీరోగా నటిస్తున్న 'కల్కి' చిత్రంలో నటిస్తున్నాను. ఇందులో నా పాత్ర చాలా కొత్తగా వుంటుంది. గిరిజన యువతిగా కనిపిస్తాను. నా పాత్ర చాలా ట్విస్ట్‌లతో సాగుతుంది. దీనితో పాటు తెలుగులో మరో సినిమా అంగీకరించాను. దానికి సంబంధించిన వివరాల్ని త్వరలో వెల్లడిస్తాను.


జేడీ చక్రవర్తి

**'గత కొంత కాలంగా తెలుగు చిత్రాలకు దూరంగా వుండటానికి ప్రధాన కారణం నన్ను ఆశ్చర్యానికి, ఉత్సుకతకు గురిచేసిన కథ నా వద్దకు రాలేదు. అదీ కాకుండా తమిళ, కన్నడ, మలయాళ చిత్రాల్లో బిజీగా వుండటం వల్ల తెలుగు చిత్రాలపై దృష్టిపెట్టలేకపోయాను' అన్నారు జేడీ చక్రవర్తి. కొంత విరామం తరువాత ఆయన కీలక పాత్రలో నటిస్తున్న చిత్రం 'హిప్పీ'. టీఎన్ కృష్ణ దర్శకుడు. కార్తికేయ కథానాయకుడు. కలైపులి ఎస్. థాను నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ నెల 6న విడుదల కానుంది. ఈ సందర్భంగా జేడీ చక్రవర్తి ఆదివారం హైదరాబాద్‌లో పాత్రికేయులతో ముచ్చటించారు.**

# ఆ సన్నివేశాలతో సినిమాలు ఆడవు!

'హిప్పీ' స్క్రిప్ట్ నాకెంతగానో నచ్చింది. మలయాళంలో చేసిన 'మిఘాయిల్', తమిళంలో 'పట్టరై', ఇరువర్, కన్నడంలో గాంధీగిరి ఈ చిత్ర కథలు నన్నెంతగానే ఉత్సుకతకు గురిచేశాయి. అందుకే ఈ చిత్రాల్లో నటించాను. 'హిప్పీ' కథ చెప్పినప్పుడే నాలో ఉత్సుకతను రేకెత్తించింది. అందుకే ఈ చిత్రంలో నటించాను. సాధారణంగా ఎవరు కథ చెప్పినా పాత్రని వినడానికి ప్రయత్నిస్తారు కానీ నేను మాత్రం కథ వినడానికే ప్రాధాన్యతనిస్తాను. 'హిప్పీ' కథ విన్నప్పుడు ఈ కథకు బాగా కనెక్ట్ అయిపోయాను. నా పాత్ర కూడా కొత్తగా వుండటంతో వెంటనే అంగీకరించాను. నేటి యువత ఎలా ఆలోచిస్తున్నారో దాన్నే ఈ చిత్రంలో చూపించే ప్రయత్నం చేశారు దర్శకుడు టీఎన్ కృష్ణ. సినిమాలో ప్లేబాయ్‌గా కనిపిస్తాను. ఇది నా నిజజీవితానికి దగ్గరగా వుంటుందని అంతా అనుకుంటారు. ఆ స్థాయిలో నా పాత్ర చిత్రణ వుంటుంది. పెళ్లి చాలా మంచిది. మంచి వాళ్లు మాత్రమే చేసుకోవాలి అని చెబుతుంటాను.

**తెలుగులో అన్నీ హీరో సెంట్రిక్ చిత్రాలే..**

బాలీవుడ్‌లో పాత్రల ప్రధానంగా సాగే చిత్రాలే ఎక్కువగా వస్తుంటాయి. అక్కడ స్టార్స్, సపోర్టింగ్ క్యారెక్టర్స్ అన్న తేడా కనిపించదు. ఆ సినిమాల్లో ప్రతీ పాత్రకూ ప్రాధాన్యత వుంటుంది. కానీ మన దగ్గర అలా కాదు. అది తప్పని నేను చెప్పను. మనదగ్గర అన్నీ హీరో ప్రధాన చిత్రాలే. అందులో క్యారెక్టర్ ఆర్టిస్ట్‌లకు ప్రాధాన్యత ఇవ్వలేం. అలా అని అది తప్పని చెప్పడం లేదు. అయితే ఈ పంథాలో మార్పు కనిపిస్తోంది. ఇప్పుడిప్పుడే తెలుగు సినిమా అటువైపుగా అడుగులు వేస్తోంది.

**అర్జున్‌రెడ్డి, ఆర్ఎక్స్ 100..**

శృంగార సన్నివేశాల వల్లే సినిమాలు ఆడవు. ఒక సినిమా విజయం సాధిస్తే తరువాత చాలా మంది వాళ్లకు అర్థమైనదాన్ని ప్రధానంగా తీసుకుని మితిమీరిన శృంగార అంశాలతో సినిమాలు తీస్తున్నారు. అలా తీసిన ఏ సినిమా ఆడటం లేదు. అర్జున్‌రెడ్డి, ఆర్ఎక్స్ 100 చిత్రాలు బాక్సాఫీస్ వద్ద భారీ విజయాల్ని సొంతం చేసుకున్నాయంటే ఆ చిత్రాల్లో వున్న బలమైన భావోద్వేగాలే. ఈ చిత్రాల్లో లస్ట్ అనేది చిన్న అంశం మాత్రమే. 'హిప్పీ' కూడా అలాంటి చిత్రమే. ఇదొక రొమాంటిక్ ఎంటర్‌టైనర్. కార్తికేయ, ఇద్దరమ్మాయిల పాత్రలే ఈ సినిమాకు కీలకం. నాకు బాగా నచ్చింది. నాలాగే రేపు ప్రేక్షకులకు కూడా నచ్చుతుంది. ఈ సినిమా చూస్తున్నపుడు చాలా మందికి ఇలా జరిగి వుంటుంది కదా. కొంత మంది ఇలా జరిగితే బాగుంటుంది కదా అనుకుంటారు. దర్శకుడు తను చెప్పాలనుకున్న అంశాన్ని చాలా బోల్డ్‌గా చెప్పే ప్రయత్నం చేశారు.

**రామ్‌గోపాల్ వర్మ నిర్మాణంలో..**

చాలా రోజుల తరువాత మా గురువు రామ్ గోపాల్‌వర్మ నిర్మాణంలో ఓ సినిమా చేయబోతున్నాను. ఈ చిత్రానికి వర్మ నిర్మాత మాత్రమే. ఓ కొత్త దర్శకుడు ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తారు. అతను ఎవరనేది త్వరలో తెలియజేస్తాను. తమిళ, కన్నడ, మలయాళ చిత్రాల్లో బిజీగా వుండటం వల్ల దర్శకత్వం వహించాలనే ఆలోచనను పక్కన పెట్టాను. అయితే అక్టోబర్‌లో మాత్రం తెలుగు, హిందీ భాషల్లో ఓ ద్విభాషా చిత్రాన్ని తెరకెక్కించబోతున్నాను. చాలా ఆసక్తికరమైన ప్రాజెక్ట్ ఇది. దీనికి సంబంధించిన పూర్తి వివరాల్ని త్వరలో వెల్లడిస్తాను.

# హారర్ థ్రిల్లర్ 'కెవ‌స్ 100'


శైలజ, సమీర్‌ఖాన్

సమీర్‌ఖాన్, శైలజ నాయకానాయికలుగా నటిస్తున్న చిత్రం 'కెవ‌స్ 100'. షేర్ దర్శకుడు. వెంకట్‌రెడ్డి నిర్మాత. సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. 'ఏ' సర్టిఫికెట్ లభించింది. దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'రొమాంటిక్ హారర్ థ్రిల్లర్ చిత్రమిది. హారర్ సన్నివేశాలు ఎక్కువగా ఉండటంతో 'ఏ' సర్టిఫికెట్ ఇచ్చారు. ఆద్యంతం ఉత్కంఠభరిత కథ, కథనాలతో అలరించే చిత్రమిది' అన్నారు. 'హారర్ చిత్రాల్లో పూర్తిగా కొత్త పంథాలో తెరకెక్కించాం. ఈ నెల 21న విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం' అని నిర్మాత తెలిపారు. అక్షిత, అషి, పూర్వి సునీత, శ్రద్ధా, నందని, కల్పన అజీమ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: వంశీ, సంగీతం: నవనీత్‌చారి, సాహిత్యం: భాష్యశ్రీ.

# సూపర్ థర్టీ ప్రయాణం



హృతిక్‌రోషన్ ప్రేక్షకుల ముందుకొచ్చి రెండేళ్లు దాటిపోయింది. 2017లో విడుదలైన 'కాబిల్' తర్వాత ఆయన నటించిన చిత్రమేదీ విడుదలకాలేదు. ప్రస్తుతం హృతిక్‌రోషన్ 'సూపర్ 30' సినిమాలో నటిస్తున్నారు. బీహార్‌కు చెందిన సూపర్ థర్టీ సంస్థ వ్యవస్థాపకుడు ఆనంద్‌కుమార్ జీవితం ఆధారంగా దర్శకుడు వికాస్ భల్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ప్రతిభావంతులైన నిరుపేద విద్యార్థులు ముప్పై మందికి ఐఐటీ ప్రవేశపరీక్ష కోసం ప్రతి ఏడాది ఉచితంగా శిక్షణను ఇస్తుంటారు ఆనంద్‌కుమార్. ఆయన స్ఫూర్తిదాయక ప్రయాణంతో పాటు సూపర్ థర్టీ స్థాపనలో అతడికి ఎదురైనా సవాళ్లను ఈ సినిమాలో చూపించబోతున్నారు. ఈ చిత్రంలోని తన లుక్‌కు సంబంధించిన పోస్టర్‌ను ట్విట్టర్ ద్వారా అభిమానులతో పంచుకున్నారు హృతిక్‌రోషన్. ఇందులో సాధారణ దుస్తుల్లో గడ్డంతో వర్షంలో చిరునవ్వులు చిందిస్తూ కనిపిస్తున్నారు హృతిక్. జూలై 12న ఈ చిత్రం విడుదలకానుంది.




# త్రీడీలో లయన్‌కింగ్

క్రూర మృగాలు మనుషుల వలే మాట్లాడుతాయి. మిగతా జంతువులతో కలిసి స్నేహం చేయడమే కాకుండా కలిసిమెలిసి జీవిస్తాయి. సింహం తన రాజ్యంలోని జంతువుల్ని రక్షిస్తూ ఉంటుంది. ఈ జంతువుల కథతో తెరకెక్కిన చిత్రమే 'లయన్‌కింగ్'. డిస్నీ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మించింది. జాన్ ఫవేర్ దర్శకత్వం వహిస్తున్నారు. జూలై 19న ఈ చిత్రం విడుదలకానుంది. సింబ అనే సింహం, టిమోన్ అనే ముంగిస, పుంబా అనే అడివి పంది చుట్టూ తిరిగే కథ ఇది. 1990 దశకంలో 2డీలో అభిమానుల్ని అలరించిన ఈ చిత్రాన్ని సరికొత్త హంగులతో డిస్నీ సంస్థ పునర్నిర్మించింది. 'త్రీడీ యానిమేటెడ్ సాంకేతికతతో రూపొందించిన ఈ చిత్రం కొత్త అనుభూతిని పంచుతుంది. ప్రపంచవ్యాప్తంగా అన్ని భాషల్లో ఈసినిమా విడుదలకానుంది. తెలుగు ప్రేక్షకుల్ని అలరిస్తుందనే నమ్మకం ఉంది' అని డిస్నీ ప్రతినిధులు తెలిపారు.

